UNIVERSAL
LIBRARY
OU_204089
UNIVERSAL
LIBRARY

81—5-8-74—15,000

OSMANIA UNIVERSITY LIBRARY

T923.154 Accession No. T

k should be returned on or before the date last marked below.

శ్రీ

శివాజీ చరిత్రము

★

ఇయ్యది

విజ్ఞాన చంద్రికా గ్రంథమాల సంపాదకులును

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ ముఖ్యసంపాదకులును

హిందూదేశ చరిత్ర కారులును

అగు

శ్రీ కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు, ఎం. ఏ. గారిచే

రచియింప బడినది.

★

పునర్ముద్రణము 1000 కాపీలు   మూల్యము 3—0—0

బెజవాడ

అభ్యుదయ ప్రెస్‌లో ముద్రింప బడినది.

ప్రకాశకుడు: కొమర్రాజు వినాయకరావు.

[సర్వస్వామ్యములు ప్రకాశకునివి.]

ప్రతులు దొరకుచోటు:—

కొమర్రాజు వినాయకరావు,
అభ్యుదయ ప్రెస్,
గవర్నరుపేట - బెజవాడ.

మొదటి కూర్పు పీఠిక

ఆంధ్రభాషయందు చరిత్రగ్రంథంబు లత్యల్పంబుగ నున్నవి. కాన, జేతనైనంతవరకు మాతృభాషాసేవ చేయవలయు ననిన యిచ్ఛతో నీ చరిత్రగ్రంథంబు వ్రాసినాడ. శక్తివాచనలేక యికముందును నిటులనే భాషాసేవ చేయవలయు ననిన యిచ్ఛగలవాడను.

ఈ చరిత్రకు ముఖ్యాధారములు మహారాష్ట్ర చరిత్ర గ్రంథములైనందున నిందు విస్వాసపాత్ర మగు సంగతులే వర్ణింపబడినవి. పరదేశస్థులచే వ్రాయబడిన యింగ్లీషుగ్రంథాదులలో బక్షపాతాదులుండవచ్చును. చరిత్రభాగములు కొన్ని తిన్నగా దెలియనందున జరిత్రలో గొరత యుండవచ్చును. కాన, మూల మహారాష్ట్రగ్రంథముల ననుసరించి యీ చరిత్ర వ్రాయబడినది.

(1) చిటుసీసు కృతమయిన బఖరు,

(2) శివ దిగ్విజయము.

(3) మహారాష్ట్రాచా ఇతిహాస్.

అను మూడు మహారాష్ట్ర చరిత్ర గ్రంథములు నాకు ముఖ్యాధారములైయుండె.

దేశాంతర ప్రయాణము వలనను, దేహానారోగ్యత వలనను నీ చరిత్రంబు నేను బూర్తిచేయవలయుననినంత శీఘ్రముగా బూర్తిచేయ లేకపోయితినని యొంతయు జింతిల్లెద. ఇట్టి యాలస్యమున కోర్చియు, నన్ను గ్రంథము పూరించుటకు బురికొల్పుచు నీ గ్రంథమును సంపూర్ణముగా నచ్చొత్తించినందులకు 'సరస్వతీ' పత్రికాధిపతులకు గృతజ్ఞతా పూర్వకముగ వందన మొనర్చుచున్న వాడను.

ఇట్లు
ఆంధ్రభాషా సేవకుడు,
గ్రంథకర్త.

విషయసూచిక

	పేజీలు.
దేశస్థితియు, శివాజీ పూర్వుల వృత్తాంతము.	2—13
శివాజీ జన్మమును, బాల్యదశయు.	14—26
యుద్ధసన్నాహము, ప్రథమ పరాక్రమము	27—47
పునాదిని బలపరచుకొనుట.	48—65
గురూపదేశము.	66—82
అఫజుల్ ఖానుని వధ.	83—101
దండయాత్రలు.	102—118
మొగలులతో యుద్ధము.	119—136
ఢిల్లీ ప్రయాణము.	137—146
రాజ్యవ్యవస్థ.	147—163
మొగలులతో మరల యుద్ధము.	164—184
రాజ్యాభిషేక మహోత్సవము.	185—190
కర్నాట ద్రావిడ దేశములపై దండి వెడలుట.	191—204
శివాజీ అస్తమయము.	205—220

మూడవ కూర్పు పీఠిక

శ్రీ కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు పంతులుగారు శ్రీ శివాజీ చరిత్రను ఇప్పటికి రమారమి ముప్పదియైదేండ్ల క్రిందట రచించిరి. అప్పటికి తెలుగులోనేగాక ఇంగ్లీషులో కూడా శివాజీని గూర్చిన యిట్టియుద్గ్రంథము వెలువడి యుండలేదు.

భారతీయులు బ్రిటిష్ రాజ్యతంత్రమునకు జిక్కి పారతంత్ర్యమున బడియుండినందువలన చాలకాలమువరకు బ్రిటీషు ప్రభుభక్తి పాఠములు బోధించు పక్షపాతపు చరిత్రలే రచింపబడుచుండెను గాని, స్వదేశ స్వధర్మములపై నభిమానమును బురికొల్పగల జాతీయచరిత్రలుగాని, మహాపురుషుల జీవిత చరిత్రలు కాని వెలువడకుండెను.

క్రీ. శ. 1905 సం॥ ప్రాంతమున మహారాష్ట్ర వంగ దేశములందు ప్రజలలో విజ్ఞాన వికాసమును, జాతీయ చైతన్యమును కలిగెను. అక్కడ దేశాభిమాన పూరితములైన జాతీయ వాఙ్మయము బయలుదేరెను. దీనినిజూచి శ్రీ లక్ష్మణరావుగారాంధ్ర భాషలోకూడా అట్టి వాఙ్మయ రచనను ప్రోత్సహింప దలచి విజ్ఞాన చంద్రికామండలిని స్థాపించి అనేక గ్రంథములు ప్రకటించి గొప్పభాషా సేవచేసినారు.

శ్రీ లక్ష్మణరావుగారనేక శాస్త్ర గ్రంథములను, చరిత్ర గ్రంథములను ఇతరులచేత రచియింపించుటయేగాక, తాము

కూడా బహుగ్రంథావలోకనము గావించి చరిత్ర పరిశోధనము చేసి అనేక వ్యాసములను, గ్రంథములను రచించినారు. వారు రచించిన హిందూదేశ కథాసంగ్రహమును భారత జాతీయ చరిత్రలోని హిందూమహమ్మదీయ మహాయుగములు ఇప్పటి కని తెలుగులో సుప్రసిద్ధ జీవచరిత్రలుగా నున్నవి. వారు మహారాష్ట్ర యుగమును కూడ రచింపదలచి ముందుగానే శివాజీ చరిత్రను రచించిరి.

ఐకమత్యము లేక బాదుషాలలో పోరాడుకొను వివిధ మహారాష్ట్ర తెగలను ఏకత్రిగా జేసి బలవంతమైన మొగలాయి సామ్రాజ్యముయొక్క నిరంకుశ ప్రభుత్వమును ధిక్కరించి స్వధర్మము నుద్ధరించి స్వరాజ్యమును స్థాపించిన మహానుభావుడైన శివాజీయొక్క దివ్యచరిత్ర, పారతంత్ర్యము, పాశ్చాత్యవ్యామోహమున బడియున్న భారతీయులను మేల్కొలిపి వారికి స్వధర్మ స్వదేశాభిమానములను గలిగించి స్వరాజ్యకాంక్షనుకలిగింపగల జాతీయ ఇతిహాసము. భారతీయ గౌరవమన్న గిట్టని ఆంగ్ల చరిత్రకారులు శివాజీనిగూర్చి తెలిసి తెలియని వ్రాతలు వ్రాసి ఆయన గుణశీలములను విమర్శించు చుండిరి; కాని మహారాష్ట్ర దేశమునందా మహాపురుషుని జీవితవిశేషములను గూర్చియు, గుణశీలములను గూర్చియు కవులు గాయకులు చరిత్రకారులు బహుచక్కగా వర్ణించి దేశీయులలో శివాజీ భక్తిని కలిగించిరి. దీని ఫలితముగా మహారాష్ట్రులలో జాతీయ చైతన్యమును, స్వరాజ్యకాంక్షయు కలిగెను.

శ్రీ లక్ష్మణరావు పంతులుగారు సంస్కృతాంధ్రము లందు మాత్రమేగాక, మహారాష్ట్రమునందుకూడ అసమాన పాండిత్యముగలవారగుటచే వారా భాషలోని గ్రంథములన్ని పరిశీలించి శివాజీ చరిత్రను రచించిరి. శివాజీయొక్క గుణ శీలములను గూర్చి యాంగ్ల గ్రంథకారులు చేయు విమర్శ నములెల్ల ఖండించి ఆతడు స్వధర్మరక్షణము చేసి స్వరాజ్యము స్థాపించి, దేశము నుద్ధరించిన మహానుభావుడను విషయమును సక్రమముగా నిరూపించిరి. శ్రీ లక్ష్మణరావుగారు సమగ్రమైన మహారాష్ట్ర దేశచరిత్రనుగూడ రచింపదలచిరి గాని మహా దురదృష్టవశమున వారికి యేబది యేండ్లైన నిండక పూర్వమే 1923 లో స్వర్గస్థులైరి.

శ్రీ లక్ష్మణరావుగారు చనిపోయినపిదప మహారాష్ట్ర దేశమున జరిగిన చరిత్ర పరిశోధనలను పరిశీలించి, తెలుగున మరల నట్టి యుద్గ్రంథమును రచించినవారు లేకపోయిరి. తెలుగులోనే కాదు— ఇంగ్లీషులో సైతము మొన్న మొన్నటి వరకు నట్టి గ్రంథము వెలువడ లేదనియే చెప్పవచ్చును. ఇటీవల శ్రీ గోవిందసఖారాం సర్దేశాయి గారట్టి చరిత్ర నొక దాని నింగ్లీషులో రచించినారు. కేవలము మహారాష్ట్ర భాష లోనేగాక - పారసీ పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి భాషలలోగూడా మహారాష్ట్రచరిత్రకు పనికివచ్చు విషయము లున్నవి. వాని నెల్ల తరచి యొక సమగ్ర గ్రంథము వెలువడ వలసి యున్నది. ఇటీవల ప్రకటింపబడిన చరిత్రలలో శివాజీ జీవితమును గూర్చి కొన్ని విశేషములును, నూతనాంశములును కనబడుచున్నను

శ్రీ లక్ష్మణరావుగారు శివాజీ జీవితమును గూర్చి వ్రాసిన ప్రధానాంశములందు గాని, శివాజీ గుణ శీలములను గూర్చి చేసిన విమర్శలయందు గాని, వారు గావించిన సిద్ధాంతములందు గాని, ఎట్టి మార్పులను చేయవలసిన యాగత్యము కలుగుటలేదు. అందువలన శ్రీ లక్ష్మణరావు పంతులుగారి చరిత్ర యిప్పటికిని ప్రమాణ గ్రంథముగానే ఎంచ వలసియున్నది.

శివాజీ తన జీవితమెల్ల స్వధర్మ స్వదేశముల నుద్ధరించుటకే ధారపోసెను. ఆతడెన్ని దిగ్విజయములను చేసినను అవి కేవలము పరరాజ్యముల నాక్రమించి సామ్రాజ్యమును స్థాపించుకొనుటకుగాక, స్వదేశమునుండి మ్లేచ్ఛులను వెడలించి స్వధర్మమును స్థాపించుటకే యత్నము చేసెనని తెలియగలదు. ఆతడు బాలాజీ నరసప్రభువునకు 1645 లో వ్రాసిన లేఖయందు "హైందవీ స్వరాజ్య"మను పదమును పలుమారు వాడియుండుట వలన దానిని స్థాపించుటయే యతని యుద్దేశమను సంగతి వెల్లడి యగుచున్నది. శివాజీయందు ఆధ్యాత్మిక చింత మెండుగా నుండెను. ఆతడే దిగ్విజయమునకేగినను ఆ యా ప్రాంతములందలి దివ్యస్థలముల నెల్ల దర్శించి, అచ్చటి దైవముల నారాధించుచుండెను. శ్రీశైలమునందతడు కొంతకాలముండి మల్లిఖార్జును నర్చించెను. అప్పుడతడు ధ్యాన నిష్ఠుడుగా మునిగి యుండగా నా సమాధినుండి యాతనిని మేలుకొలుపుటయే దుస్తరమయ్యెను. శివాజీ రామదాస స్వామికి శిష్యుడై తన రాజ్యమునెల్ల ఆయనకు ధారపోసినాడు. ఆయన యాజ్ఞలనెల్ల శిరసావహించి హిందూమత ధర్మములను రక్షింపసాగెను. హిందూమత ధర్మములకు ముసల్మానులవలన నెట్టిఇక్కట్టులు

కలుగుటకును శివాజీ సహింపకుండెను. అయితే మహమ్మదీయులు తమ మతధర్మముల ప్రకారము జీవించుట కతడెట్టి యాటంకములను గలిగింపలేదు. మహమ్మదీయ మతమును గాని, మహమ్మదీయులనుగాని అతడు ద్వేషించి యెరుగడు. శివాజీకి హిందూ మహమ్మదీయ మహాత్ములయందును, దివ్యస్థలములందును సమానగౌరవముండెను. రాయగడమున నతడు జగదీశ్వరాలయమును నిర్మించుటయె గాక, ముసల్మానుల కొరకొక మశీదును గూడ నిర్మించెను. కెల్సీ కాపురస్తుడైన బావాయాకత్ అను ముసల్మాను మహాత్ముని దివ్యస్థలమునకు శివాజీ యిచ్చిన జాగీరు లిప్పటికినిడున్నవి. శివాజీరాజ్యమునందు చాలమంది మహమ్మదీయు లుండిరి. ఆతనిపరిపాలనమున వారు సుఖముగా జీవించుచుండిరి. చాలమందిమహమ్మదీయుల కతడుద్యోగము లిచ్చెను. వారును ఆతనియందు భక్తివిశ్వాసములు కలిగి యుండిరి. ఆతని యాంతరంగిక కార్యదర్శి(మున్షి) యైన ముల్లా హైదరు ఆతని కెంతో విశ్వాసపాత్రుడుగనుండెను. ఇట్లే ఆతని యాంతరంగిక భృత్యుడైన మదారీ మెహతర్ అను మహమ్మదీయుడు శివాజీ ఆగ్రాకోటనుంచి తప్పించుకొని వచ్చుటలో. సహాయముచేసెను. శివాజీకొలువునందు దౌలతు ఖాను సిద్దీలను మహమ్మదీయులు నావికాదళాధిపతులుగా నుండిరి.

శివాజీ స్థాపించిన ప్రభుత్వవిధానము అష్టప్రధానుల ప్రభుత్వమని చరిత్ర ప్రసిద్ధమైనది. అతడు రాజ్యవ్యవహారములనెల్ల ఎనిమిది శాఖలుగాజేసి ప్రతిశాఖను నిర్వహించుటలో తనకు సహాయముచేయుట కొకొక్కమంత్రి నేర్పర

చెను. న్యాయాధీశుడు తప్ప,తక్కిన మంత్రులందరును యుద్ధ సమయములందు సేనాధిపతులుగాకూడ నుండిరి. ఈ మంత్రులలో ముఖ్యునికి పేష్వాయని పేరు. శివాజీ కాలములో వీరందరును భయభక్తులతో మెలగుచుండిరిగాని, ఆయన అనంతరము పేష్వా బలవంతుడై తానే దేశపరిపాలకుడయ్యెను. తరువాత చాల కాలమువరకును మహారాష్ట్ర రాజ్యములందెల్ల ఈ అష్టప్రధానుల పద్ధతి ప్రకారమే ప్రభుత్వ వ్యవహారములు జరుగుచుండెను.

తుంగభద్రానదీతీరమున విజయనగరమును రాజధానిగా దక్షిణ హిందూదేశమునెల్ల ఏకచ్ఛత్రముగాబరిపాలించిన ఆంధ్ర చక్రవర్తులు స్థాపించిన ప్రభుత్వవిధానమునే శివాజీ గ్రహించి దానిని కొన్ని మార్పులతో అష్టప్రధానుల ప్రభుత్వపద్ధతిగా జేసెనని శ్రీ లోకమాన్య బాలగంగాధరతిలకు మహాశయుడు 31-3-1918 వ తేదీన చెన్నపట్టణమున గోఖలే హాలులో నుపన్యసించుచు స్పష్టముగా చెప్పియున్నాడు.

విజయనగర చక్రవర్తుల ప్రభుత్వ పద్ధతులు వారు క్రొత్తగా నిర్మించినట్టివి కావు. అవి చాలవరకు పూర్వకాలము నాటిహిందూ రాజనీతి శాస్త్రములందు వివరింపబడిన రాజధర్మముల ననుసరించి నిర్మింపబడినవే. ఈ ప్రభుత్వపద్ధతి శ్రీకృష్ణదేవరాయలవారు తమ ఆముక్తమాల్యదలో వర్ణించియున్నారు. ఈ పరిపాలనావిధానమునందు విజయనగర చక్రవర్తులకు గూడా ఐదారుగురు మంత్రులుండిరి. అందులో ముఖ్యుని సర్వశిరః ప్రధాని యనుచుండిరి. ప్రభుత్వము వివిధ శాఖ

లుగా విభజింపబడి చక్కగా నిర్వహింపబడు చుండెను. అయితే ఇందులో కొన్ని లోపములుండెను. విజయనగర సామ్రాజ్యమునందలి యుద్యోగులకు గొప్పగొప్ప మాన్య ములు జాగీరు నిచ్చుచుండిరి. వారు వివిధ రాజ్యభాగములకు ప్రభువులై కోటలు గట్టుకొని బలవంతులై తుదకు చక్రవర్తి యధికారమునే ధిక్కరించి స్వతంత్రులైరి. శివాజీ తన యుద్యోగులకు రొక్కపు జీతములనే ఇచ్చుచుండెనుగాని జాగీరులు రాజ్యములు నివ్వలేదు. మొగలాయి రాజ్యము నందువలె భూములను గుత్తకిచ్చు పద్ధతి, పన్నులు ఇజారా కిచ్చు పద్ధతి అవలంబింపక ప్రభుత్వాదాయమును వసూలు చేయు జమీందారులను అదుపు ఆజ్ఞలలో నుంచెను.

శివాజీ కాలమున ఉద్యోగములు వంశపారంపర్యంగా గాక, వారి శక్తి సామర్థ్యములనుబట్టి యొసగబడుచుండెను. దేశములో శాంతి భద్రతలను గాపాడు కార్యమును, న్యాయపరిపాలనా వ్యవహారములను, గ్రామ పంచాయతుల వశము చేయబడెను. దేశరక్షణము కొరకు స్థలదుర్గములును జలదుర్గములును నిర్మింపబడెను. అందుకొరకు గొప్ప కట్టు బాటులకు లోబరుపబడిన గొప్ప సైనికదళమును, నౌకాదళ మును గూడ నిర్మింపబడెను. సముద్ర వ్యాపారమునకు వీలు కలిగింపబడెను.

శివాజీకి ధర్మశాస్త్రములందు, మత ధర్మములందు గౌరవ మున్నను పూర్వాచారములు గాని, మత విశ్వాస ములుగాని, రాజ్యపరిపాలనకుగాని, దేశక్షేమమునకుగాని అడ్డు వచ్చుట కిష్టపడక అవసరమైనప్పుడు వానిని నిర్భయముగా

తృణీకరించి సంస్కరించుచుండెను. దేశరక్షణమునకు, వాణిజ్య మునకు నౌకాదళ మావశ్యకమై నందువలన సముద్ర యానము చేయగూడదని పూర్వాచారపరాయణులు చేయు నిషేధము నతడు తృణీకరించెను. దేశము మ్లేచ్ఛాక్రాంత మైన స్థితిలో బలవంతముగా నితర మతములందు గలుపు కొనబడిన హిందువులు వర్ణభ్రష్టులుగ పరిగణింప బడుట యన్యాయమని యెంచి, శివాజీ వారికి ప్రాయశ్చిత్తములు జేయించి, మరల హిందూ ధర్మమునందు గలుపుకొనునట్లు చేసెను.

మొగలాయి సామ్రాజ్యమునందు పారసీభాష రాజ భాషగా నున్నందువలన, హిందువులాభాషనభ్యసించి స్వదేశ వేష భాషలందభిమానమును విడనాడి మొగలాయి నాగరి కతకు దాసు లగుచున్నారని శివాజీ గ్రహించి, తన రాజ్యము నందు పారసీభాషకు బదులుగా దేశభాషయైన మహారాష్ట్ర భాషను రాజభాషగా జేసెను. అంతేగాక- దేశభాషలకెల్ల జననియైన సంస్కృతమునకు విశేషగౌరవము నిచ్చి రాజ్యవ్యవహారమునందుపయోగించు పరిభాషనెల్ల సంస్కృత పదములతోనే నిర్మించి, అట్టి పారిభాషిక పదములుగల రాజ వ్యవహారకోశమను నొక సంస్కృత నిఘంటువును నిర్మించెను.

శివాజీ యొక్క సైనికవ్యవస్థయు, యుద్ధపద్ధతియు చాల కట్టుదిట్టములకు లోబడినదై భారత దేశచరిత్రలో ప్రసిద్ధి కెక్కినది. శివాజీసైనికులెల్లరు క్రమశిక్షణలనంది గొప్ప సేనాధిపతులచే నడపబడుచుండిరి. వారి శక్తిసామర్థ్యములను

బట్టి వారికి ప్రోత్సాహ మొసగబడుచుండెను. ప్రతిసంవత్స రము నవరాత్రి యుత్సవములందు రాజసభలో వారివారి యోగ్యతలను బట్టి సమ్మానములు జరుగుచుండును. శివాజీ సైనికులును, సేనాధిపతులును యుద్ధమునందు శౌర్యధైర్యము లను జూపుటయేగాక, నీతి మత ధర్మములందు నిరతిని కలిగి ప్రవర్తింపవలసి యుండిరి. యుద్ధములందుగాని, దండయాత్ర లందుగాని స్త్రీలకు, పిల్లలకు బ్రాహ్మణులకు గోవులకును వ్యవసాయకులకును ఎట్టి హానియు చేయరాదని శివాజీ శాసించెను.

శివాజీ కాలమున యుద్ధానంతరము జయింపబడిన శత్రు సైన్యముల, వసువాహనములను విజేతలు తీసికొను నాచార ముండుటయేగాక, శత్రుదుర్గములపైన, నగరములపైన దండ యాత్రలుచేసి, కొల్లగొను నాచారముకూడ ఉండెను. ఈ విషయమున శివాజీని నిందించిన ఆంగ్లేయ చరిత్రకారులు తమ జాతీయులు చేసిన దండయాత్రల సంగతిని, దోపిళ్ల సంగ తిని, పక్షపాత బుద్ధితో కప్పిపుచ్చినారు. టిప్పుసుల్తాను యుద్ధ మున మరణింపగా నింగ్లీషువారిచేతబడిన శ్రీరంగపట్టణము నాంగ్ల సైనికులు కొన్నాళ్లపాటు విచ్చలవిడిగా దోచుకొనిరి. దానివలన నా నగరవాసుల కపారమైన నష్టము కలిగెను. దోపిడి సొమ్ములో నాంగ్లేయ సేనాధిపతుల వంతునకు కొన్ని లక్షల రూపాయలు వచ్చెను. శివాజీ చేసిన దండయాత్రల యందాతని సైనికు లిట్టి అన్యాయములు చేయ వీలులేకుండ వివిధములైన కట్టుబాట్లు చేయబడెను. యుద్ధానంతరముగాని,

దండయాత్రల యందుగాని శివాజీ ముందుగా నగరములోని ధనికులైన వర్తకులను పిలిచి కొంత సొమ్ము నష్టపరిహారముగా నివ్వవలసినదని కోరును. అట్లు చేయనిరాకరించినప్పుడే అతడు నగరములను కొల్లగొనును. అప్పుడుకూడా రైతుల యిండ్లు వాకిండ్లుగాని, పంటలుగాని నష్టపరచుట కతడిష్టపడడు. యుద్ధములందును, దండయాత్రలయందును కొల్లగొనినప్పుడు సైనికు లెవరిచేతికి దొరికినది వారు దోచుకొని హరించుటకు వీలులేదు. వారికి దొరికినదెల్ల పై యధికారులకు వశపరుపవలసియుండిరి. దండయాత్రలకు బోవు ప్రతి సైనికునికిని అతని స్వంత వస్తువులపట్టిక యొకటి ఇవ్వబడుచుండును. యుద్ధానంతరముగాని, దండయాత్రా నంతరముగాని ఆ పట్టికలోని వస్తువులుగాక, అతని దగ్గరనున్న తక్కిన వస్తువులెల్ల నతడు సర్కారునకు వశపరుప వలసినదే. అట్లు చేయక మోసగించినవారు శిక్షింపబడుచుండిరి.

శివాజీ తన సైనికులను తన బిడ్డలవలె జూచుకొనుచు వారి కష్టసుఖములను కనిపెట్టి వారిని కాపాడుచుండెను. యుద్ధములందు మరణించినవారి కుటుంబముల కుపకార వేతనముల నిచ్చి పోషించుచుండెను. గాయపడి పట్టుబడిన శత్రు సైనికులపట్లకూడా అతడు దయగలిగి వారికి చికిత్సచేయించి తరువాత విడిచిపుచ్చును.

శివాజీ ఏ యుద్ధముచేసినను, ఏకార్య మొనరించినను ఆతని ప్రధానలక్ష్యము స్వధర్మ, స్వరాజ్య సంస్థాపనమే. అతడందుకొరకు దీక్షవహించి, స్వార్థమును త్యజించి, కష్టసుఖములను లెక్కసేయక అహోరాత్రములు పాటుపడుచుండెను.

ఆహారవిహారము లందతడు పాటించు కఠిన నియమములనుజూచి విదేశీయు లాశ్చర్యపడుచుండిరేగాని, అవియెల్ల ఆయన కార్య దీక్షలోని భాగమని గుర్తింపరైరి. ఇట్లే శివాజీ జీవితమును, చర్యలను విమర్శించిన ఆంగ్లేయ చరిత్రకారులును, ఆయా కార్యములను కేవలము తన స్వార్థముకొరకు గాక తాను పరమార్థమని ఎంచిన లక్ష్యములను సాధించుటకొరకే అతడా యా కార్యములను చేసియుండెనను విషయమును గమనింప లేదు.

ఆంగ్లేయచరిత్రకారులవలెను, వారి ఈ యభిప్రాయము లను అనుకరించు ఇతర చరిత్రకారులవలె గాక, శ్రీ లక్ష్మణ రావు పంతులుగారు శివాజీ జీవితమును స్వభావమును శీల మును పైచెప్పిన దృష్టితో పరిశీలించి వాని మంచి చెడుగు లను నిష్పక్షపాతముగా చర్చించి యున్నారు.

బెజవాడ,
11—9—47.

ఇట్లు,
దిగవల్లి వేంకట శివరావు

* * *

శ్రీ శివాజీ చరిత్రము

మొదటి ప్రకరణము

౧

దేశస్థితియు, శివాజీపూర్వుల వృత్తాంతమును

శివాజీ యను బాలుఁడేడవ శతాబ్దంబున నుదయించి తనమాతృభూమియైన మరాటదేశంబునకు నదివరకు తురుష్కులచే గలుగుచుండిన తాపంబు నివారించి మహారాష్ట్రులకు స్వాతంత్ర్యం బొసంగి స్వరాజ్యసంస్థాపకుం డనుబిరుదు వహించిన మహానుభావుఁడు! ఆంధ్రులచే గర్ణాటదేశంబున స్థాపింపబడి, మహావైభవశిఖరమునందు నెక్కి బుక్కరాయకృష్ణరాయలను ప్రచండకిరణంబులచే గొంతకాలమువరకు యవనపారసీకులను గ్రుడ్డిగూబల జేసిన విజయనగరసామ్రాజ్యమార్తాండుఁడు, సృష్టినియమంబు ననుసరించి తాలికోటలో క్రీ. శ. ౧౫౬౫ వ సంవత్సరమున నస్తమింప యవనరాజ్యమను చిమ్మచీకటిలో మునింగియున్న దాక్షిణాత్యులకు దిరిగి స్వరాజ్యకిరణంబుల జూపిన బాలార్కుఁడితండె! ఉత్తరదేశమునుండి దక్షిణదేశ మంతయు మునుంగునటుల వరదలుగా వచ్చెడి మొగలుల

ప్రవాహమునకు నడ్డముగ తగిలి దానిని వెనుకకు మరలించిన దీర్ఘోన్నతపర్వతస్వామీ వింధ్యా! ఆంధ్ర మహారాష్ట్రదేశములనుండి హిందూస్థానంబును ఉత్తరదాక్షిణాత్యంబుల వేరుబడి సుందరంబు లయిన పుష్పఫలవృక్షములకు బాధచేయుచుండిన బహమనీ తురుష్క-రాజ ధూమంబు లగు మహమ్మదీయుల తోట యుడం చిన మాగనిరాగా బీశుపు! ఇల్లు హిందువుల యొక్క హిందూత్వము నిలుపుటకై గావించిన మహానుభావుని చరిత్రం బాదరమును ననుకరణీయంబు గాకపోయినను, నాదరణీయంబును, నాహ్లాదకరంబునునగునని తలంచి తచ్చరిత్రరత్నం బాంధ్రంబున వ్రాయ బూనుచున్నాడను.

శివాజి జీవితమంతయు తురుష్క-రాజులతో బోరాటమున యుండె కడచియుండినందున నాతని జన్మసమయమునకుఁ గొంతకాలము తత్పూర్వమునను నేమో తురుష్క-రాజ్యము లెక్క-డెక్క-డ నుండెనో, తురకరాజులకు హిందువులయెడ నెట్టిభావముండెనో స్పష్టముగా దెలిసినగాని శివాజిచరిత్రము చదువరులకు దిన్నగా బోధపడదని యెంచి యప్పటి రాజకీయస్థితిసంగ్రహముగా నిచ్చుట జూపెద.

శివాజీజన్మమున కెన్నియోదినములు పూర్వమే, దక్షిణములోని బహమని యనుయవనరాజ్యం బంతరించి, యందు నుండి యైదుస్వతంత్రరాజ్యంబులు పుట్టెను. వానిలో రెండంతరించి మన చరిత్రనాయకుని కాలమువరకు మూడు రాజ్యంబులు మాత్రము శేషించి యుండెను. అవి యేవియన :—

౧. అహమ్మదునగర రాజ్యము—దీనికినిజాముశాహియని పేరు. క్రీ. శ. ౧౬౦౦ వ సంవత్సరమున మొగలులచే నీపట్టణము జయింపబడి యచటిరాజు చెఱపట్టబడెను. కాని మాలికాంబరను వాఁడు రాజవంశములోని యొక కుర్రవానిని సింహాసనముపైఁగూర్చుండబెట్టి, మరల రాజ్యమును స్థాపించి కొన్ని సంవత్సరములవరకు మొగలుల ధిక్కరించుచుండెను. శివాజీ పెద్దవాఁడై, స్వరాజ్యము స్థాపింప యత్నము చేయువరకు నీ రాజ్యము పూర్ణముగా మొగలులచేతబడి నాశమొందినది. కాన మనకీ చరిత్రంబులో నీ రాజ్యంబుతో నంతగా బనిలేదు. అయినను శివాజీ తండ్రియగు శహాజీ తనజీవితకాలములో జాలభాగ మీరాజుల సేవలోనే కడపియుండెను. శహాజీ చరిత్రము తిన్నగా బోధపడినగాని శివాజీచర్యలు చక్కగా బోధపడనేరవు గనుకను నీసంస్థానంబు ప్రస్తుతచరిత్రంబులోని సంస్మరణీయ రాజ్యంబులలో నొక్కటి యనందగు.

౨. గోలకొండరాజ్యము—దీనిని కుతుబ్‌శాహి యని యెదరు. రామదాసుకీర్తనలచే నాంధ్రదేశంబున నజరామరంబులయిన 'తానీష' 'గోలకొండ కోట' 'చెరసాల' మొదలయిన నామంబులు తెలుగువారికి క్రొత్తలుగాక సుదీర్ఘకాలపరిచితంబులే. ఈ రాజ్య మాంధ్రదేశంబునం దుండినందున నిది శివాజీ త్రోవలోనికి నంతగా వచ్చినదికాదు. కాని యీరాజులకును శివాజీకిని నొకటిరెండుపర్యాయంబులు పోరాటముకల్గగా అక్కన్న మాదన్నలను పింగలివంశస్థులయిన మంత్రిపుంగవుల

చాతుర్యప్రభావంబున 'తానీషా' యనబడు అబూహుసేను నకును శివాజీకిని స్నేహంబు కలిగెను.

3. బీజాపూరురాజ్యము — దీనికి ఆదిల్ శాహి యను నామాంతరము కలదు. మన చరిత్రనాయకుడు ముఖ్యముగా బోరాడినదియు గొన్నిసమయములయందు మైత్రి చేసినదియు నీ సంస్థానంబుతోడనే. ఈ యాదిల్ శాహి రాజులు మిక్కిలి మదోన్మత్తులై యెల్లప్పుడును నైజాముశాహి వారితోను, విజయనగర సంస్థానముతోను నిరర్థకముగా బోరాడుచుండిరి. అహమదునగరము రాజ్యము బాడుచేయుటలో నీరాజులే మొగలులకు ముఖ్యముగా సాయముచేసి, తుదకు దామును మొగలు లను సగ్నికి నాహుతులైరి.

ఇట్లు దక్షిణాపథములో బహుసేడవత్సరాబ్దమధ్యమున మూడు తురక రాజ్యములుండెను * ఈ మువ్వురు రాజులును బరస్పర ద్వేషము గలవారలయి యెప్పుడును యుద్ధములు జరుపుచు ప్రజలకును, దమకును నపరిమితములయిన బాధలు కలుగ జేసికొనుచుండిరి. వీరిలో వీరికిగల వైరము లట్లుండ వీరందరకు సామాన్య శత్రువొకడుత్తరదేశమునుండి వచ్చుచుండెను. ఆతడెవ్వడన:—

* ఈ మూడు తురుష్క రాజ్యములను మనయాంధ్రరాజులు గెలిచియుండిరి. కృష్ణదేవరాయలు లీ రాజ్యములన్నింటిని గెలిచినమాట జగత్ప్రసిద్ధంబె, తాళికోటలో గాసపరంబున బడిన రామరాజుతండ్రి యగు రంగరాజునకుండ రాజ్యప్రేరణంబుగల్గె ననుటకు నాధారంబున్నది. ఈయనను గురించి రామరాజీయములో నిట్లు వ్రాసియున్నది:

ఢిల్లీ పాదుషహా:—అక్బరు బాదుషహా కాలమునుండియు దక్షిణదేశములోని పైజెప్పిన తురుష్క-రాజ్యములను గెల్చుటకు ఢిల్లీశ్వరులు యత్నించుచుండిరి. బిజాపూరు మొదలగు రాజ్యములకు గూటస్థుడైన మొదటి బహమనీరాజు ఢిల్లీశ్వరుని దండనాయకుడు. అతడు దక్షిణమున స్వతంత్రుడై ఢిల్లీశ్వరుని బాటింపక యుండెను గాన నట్టి రాజద్రోహుల గెలిచి సేతుపర్యంతము ఢిల్లీప్రభుత్వము జేయవలయునని యక్బరు, జహాంగీరు, తత్పుత్రుడైన షహాజహాను, వాని కుమారుడగు ఔరంగజేబు దాక్షిణాత్యతురుష్కులతో ఘోరముగా బోరుచుండిరి. శివాజీజన్మ సమయమున షహాజహాను ఢిల్లీపీఠము నలంకరించి యుండెను. ఔరంగజేబు రారాజుగా నున్నప్పుడు శివాజీ ప్రబలెను.

ఇట్లు మహమ్మదీయరాజులకు బరస్పర కలహములు సంభవించి దేశమంతయు నల్లకల్లోలముగా నున్న సమయమున

సీ. కదనబిజాపుర నగరకామినీగర్భముల్ భేదించునెవ్వని భేరిరవము
దామిడిబోయి నిజాముపట్టణములు గూలిగా జేయు నే దొరబలంబు
గోలకొండవజీర్ల కోటులకాముకుల్ చించు నేరాజేంద్రు చేతికత్తి
సకలఘూర్జరాలకాన్తా సమున్నతిగాంచి వెలయు నేరాజుని విజయలక్ష్మి
యతడు కేవలప్రతిమేయుడు సుమ్మా, పర్వ ద్వారశిరక్షావిచక్షణుండు
జీర్ణకర్ణాటభూపాలవినాశనుండు, కవ్యకుంజరాజి శ్రీరంగరాయమౌళి.

ఆంధ్రకవుల యీ వ్రాతలన్నియు నసత్యములని కొందరాధునిక నాగరకులు చెప్పెదరు. కాని తురుష్కులు వ్రాసిన గ్రంథములను మాత్రము నమ్మి యాంధ్రులువ్రాసిన గ్రంథములను నమ్మకపోవుటకు స్వదేశాభిమానశూన్యత తప్ప వేరుకారణము లేదు.

అహమద్‌నగరమురాజునొద్ద నిద్దఱు మహారాష్ట్రవీరులు గొప్ప యుద్యోగములపై నుండిరి. ఒకఁడు శివాజీ తల్లితండ్రి యైన లుకజీజాధవ్రుఁడు; రెండవవాఁడు శివాజీ తండ్రితండ్రియైన మాలోజీ. వీరిద్దరును మరాఠాజాతివారు. ఈ మరాఠాజాతివారందరును దాము రాజపుత్రస్థానములోని క్షత్రియులమని చెప్పుకొనియెదరు. కాని యీ జాతివారనగా రాజపుత్రులకును మహారాష్ట్రదేశములోని కాపుపూబోండ్లకును గలిగినసంతతి యని సామాన్యవదంతి కలదు. మరాఠావారితల్లు లెవరయినను దండ్రులు రాజపుత్రస్థానములోని క్షత్రియులే యనుటకు సందేహంబు లేదు. శౌర్యధైర్యసాహసములను రాజపుత్ర గుణములును, పాటుబడుట, కష్టమునకోర్చుట, దంభరాహిత్యము, కుయుక్తిచేతనైన శత్రువును బరిమార్జించుట యను మహారాష్ట్ర దేశీయగుణంబులును నీ మరాఠాజాతియందు గలవు. కనుక నిది మిశ్రజాతి యనియే తోచుచున్నది. ఇట్టి మరాఠాజాతి వీరులనేకులు నిజామాది తురకరాజులయొద్ద నుద్యోగములలో నుండిరి. వారియందరిలోఁ బై బేర్కొనిన యిద్దరువీరులు ప్రముఖు లనుటకు సందేహము లేదు.

లుకజీజాధవ్రుఁడు దేవగిరి (యిప్పటి దౌలతాబాదు) యాదవరాజుల వంశజుఁడు. అప్పటిమరాట*వీరులలో నింతబలాఢ్యుఁడును, అధికారసంపన్నుఁడును మఱియొకఁడు లేఁడయ్యె. ఇతఁడు విదర్భదేశము(Berar)లోని శిందఖేడుపరగణాకు దేశ

* మహారాష్ట్రులు 'మరాఠా' యనియు, నాంధ్రులు 'మరాట' యని యు వ్రాసెదరు గాన నేనుభయరూపంబుల నుపయోగించెద.

ముఖున్ను (దేశముఖ్య)గానుండ బదివేలగుఱ్ఱపురౌతులకు నధికారియై యుండెను క్రీ.శ. ౧౬౨౦ సంవత్సరమున నీతడుమాలికాంబరునకు సహాయుడై మొగలులను నర్మదానది యవతలి తీరమునకు బారద్రోలెను.

లుకజీతరువాత లుకజీ యల్లుడు మాలోజీ. ఇతని యింటిపేరు † భోసలా. మాలోజి స్వపరాక్రమముచే కొలది స్థితినుండి గొప్పదశకు వచ్చెను. ఇతనితండ్రి యగు బాబాజి కొన్ని గ్రామములకు బటేలుగా నుండెను. పటే లనగా బ్రస్తుతపు గ్రామ మునసఫువంటి యొకచిన్నయధికారము. ప్రథమమున మాలోజి, లుకజీయొద్దనే యుద్యోగము సేయుచుండెను. ఆతని తెలివితేటలజూచి లుకజీజాధవుడు సంతసించి అహమదునగరము రాజయిన మొదటిమూర్తిజానిజాముశహాయొద్దకు నతనిని దీసికొనిపోయి, క్రీ. శ. ౧౫౭౭ వ సంవత్సరమున నతనికి 'శిలేదారి' యను నొకయధికార మిప్పించెను. శిలేదారు డన నశ్వసైనికులలోని యొకచిన్న యధికారి. మాలోజి తిన్నతిన్నగా దనయశ్వసైనికులసంఖ్య హెచ్చించి ఘనమైన రాజకార్యముల నిర్వహించుచు దన గౌరవమును వృద్ధిపరుచుకొనుచుండెను. ఇంతలో వెంకోజి నింబాళకరు డను బిజాపురరాజ్యములోని సంస్థానికు డొకడు దీపాబాయి యను తనచెలియలి నిచ్చిమాలోజికి వివాహము చేసెను. ఈ

† ఇంగ్లీషు పుస్తకముల జూచి మనవారు శ్రీశబ్దమును భోన్సలా యని యుచ్చరించెదరు కాని యది తప్పు. ఇందలి ద్రుతంబు పూర్తిగా నుచ్చరింపక ముక్కుతో నసగా ననునాసికము నుచ్చరింపవలయును.

దంపతుల కనేకదినములవరకు సంతానము కలుగకుండెను. పుత్రసంతానార్థ మీదంపతులహమదనగరములో నిశాహాషరీఫను పీరునకు మ్రొక్కుకొనిరి. అంతట క్రీ. శ. ౧౫౯౪ వ సంవత్సరములో వారికి నొకకుమారుడు గలిగెను. శహాశరీఫను తురకపీరుకృపచే నీపుత్రుడు గలిగెనని యాపిల్లవానికి "శహాజీ" యను పేరుపెట్టిరి. మాలోజికి క్రీ. శ. ౧౫౯౭ వ సంవత్సరమున నింకొక కుమారుడు గలిగెను వానికి 'శరఫజీ' యని నామకరణము చేసిరి.

మాలోజి జ్యేష్ఠపుత్రుడగు శహాజి చిన్ననాటినుండియు స్వరూపమందు జక్కనివాడుగను, స్వభావమునందు బుద్ధిమంతుడుగను, ప్రజ్ఞాతిశయములు గలవాడుగనునుండెను. అందుచే లుకజీజాధవుడు గూడ నీకుర్రవానిని మిక్కిలి ప్రేమించుచుండెను. క్రీ. శ. ౧౫౯౯లో ననగా శహాజి యైదు సంవత్సరములవాడయి నప్పుడతనిని వెంటబెట్టుకొని మాలోజి * 'రంగపంచమి' యను పండుగరోజున, లుకజీజాధవుని యింటికి వెళ్ళెను. అక్కడికప్పుడు లుకజి యొక్క బంధువులును, యితర సరదారులును వచ్చియుండిరి. లుకజి శహాజిని తనయొద్దకు బిలిచి, ముద్దుపెట్టుకొని, తన తొడమీద గూర్చుండిన జిజాయను తనకూతునొద్ద గూర్చుండబెట్టుకొనెను. లుకజి కుమార్తెయగు జిజయు మిక్కిలి చక్కనిది. ఆ యిద్దరుపిల్లల చక్కదనమును, సమవయస్కతయు జూచి మనంబున సంతసించి 'వీ రిరువురు దంపతు లగు

* ఈ పండుగ ఫాల్గుణ బ ౫ నాడు వచ్చును.

టకు దగుదురు. జిజా! నీ కీమగడు కావలయునా?' యని నవ్వుల కనెను. ఇంతలో నాపిల్లలిద్దరును గులాలు బుక్క-యాడజొచ్చిరి! ఈ బాలక్రీడలకు సభాసదు లందరు మిగుల సంతసించిరి. ఇంతలో మాలోజి యచ్చటివారి నందరను జూచి "చూడుడి మీయందరముందటనే లుకజీ నేటినుండి మా వియ్యంకు డయ్యెను. ఈమాట తప్పరాదు సుడీ" యని యొత్తిపలికెను. తరువాత నెవరియింటికి వారు వెళ్లిరి.

రెండవనాడు మాలోజీని జాధవరావు (లుకజీ) భోజనమునకు బిలువగా 'నిన్నటిమాట మీరు నిశ్చయపరచి నట్లయిన నేను భోజనమునకు వచ్చెదనని యాతడు చెప్పి పంపెను. లుకజీ జాధవున కంతగా నసమ్మతంబు గాకపోయినను నీసంబంధం బెంతమాత్రమును నతని భార్యకు సమ్మతంబు గాదయ్యె. జాధవరావు శ్రీమంతుడు, మనసబదారుడు, దేశముఖుడు. మాలోజీయో, యీయధికారము లేమియు లేని చిన్న శిలేదారుడు. అంత గొప్పవంశములోని తన కూతును నింత కొలదివంశములోని కుర్రవాని కిచ్చుటకు జాధవుని భార్య యిష్టపడదయ్యె గాని, ఈ సంబంధము వలననే జాధవునివంటి యసంఖ్య దేశముఖులకు యజమానుడై, ఢిల్లీశ్వరుండగు రారాజునుగూడ దిద్దిమ్మని నాట్యమాడించు మహాప్రతాపశాలియైన శకకర్త యుద్భవింపగలడని యాయమ్మ కప్పుడేమి యెరుక?

జాధవునితో సమానమైన స్థితి మనకు లేనందున నతడు మనకు బిల్లనియ్య సంశయించుచున్నాడని యెరింగి, యతనితో సమముగా దూగునంత యైశ్వర్యమును, నధికారమును

సంపాదించి యతనికూతునే, నా కుమారునకు జేసికొనియెద
నని మాలోజి పట్టుపట్టెను. తనమిత్రుడగు వెంకోజినింబాళ
కరుని సహాయమువలనను, తనబుద్ధివిశేషముచేతను ద్వర
లోనే మాలోజి యహమదనగరము రాజునొద్ద నైదువేల
గుఱ్ఱపు రౌతులకునాధిపత్యమును,'రాజా,యనుపదవియు శివ
నేరుచాకణులను రెండు దుర్గముల యాధిపత్యమును, ఆ దుర్గ
ములకు సమీపమందున్న ప్రాంతమునకు దేశముఖియు,
పూనా సుపా యను పరగణాల జహాగీరును సంపాదించెను!
ఇదియు గాక యిల్లుకట్టుటకుబునాది త్రవ్వుచుండగనో, లేక
మరి యే హేతువుచేతనో భూమి త్రవ్వుచుండగా నతనికి నమిత
మైన ధనము దొరకెను. అప్పటి నమ్మికలను బట్టి వా రాధనము
తమకు భవానిదేవియే యొసగెనని నమ్మిరి; ఆ నమ్మికయే
ప్రకటించి నిజస్థితి యిట్లుండగా గ్రాంటుడఫ్‌దొరవారు తమ
"మరాఠాల యితిహాసము" లో (History of Mahrathas)
మాలోజి కుయుక్తులచే ధనముసంపాదించె నని వ్రాసిరి. ఈ
మాట నిరాధార మైనది.

ఇట్లు మాలోజి లఖూజితో సమానముగా మనసబు
దారుడును, దేశముఖుడును, ధనవంతుడును నై నందున శహాజికి
జిజా నిచ్చుటకు లఖూజి యొప్పెను. ఇదియుగాక అహమద
నగరము నవాబు లఖూజితో శహాజని నల్లుని జేసికొను మని,
బోధించెను. క్రీ. శ. ౧౬౦౪ వ సంవత్సరములో శహాజికిని
జిజాబాయికిని, అమితమహోత్సవముతో వివాహము జరిగెను.
ఆవివాహమునకు స్వయముగా నహమదునగరము సుల

తాను వచ్చి యుండెను ఈ దంపతులే మనచరిత్రనాయకుని తల్లియు దండ్రియు.

కొన్నిరోజులకు మాలోజి స్వర్గస్థుడు కాగా, సర్వాధికారంబు శహాజికి ప్రాప్తమయ్యెను. జాధవుడును, శహాజియు నహామదునగరము రాజులకు ముఖ్యాధారులుగా నుండిరి. క్రీ. శ. ౧౬౨౦వ సంవత్సరమున మోగలులు అహామదునగర రాజ్యముపై దండెత్తివచ్చిరి. అప్పుడారాజ్యమునకు మాలికాంబ రనువాఁడు మంత్రిగా నుండెను. వాఁడు లుకజీ శహాజీల సహాయమున మొగలులను బూర్ణముగా నోడించెను. మాలికాంబరుడు క్రీ. శ. ౧౬౨౬ లో గతించెను. ఇతని మరణానంతర మహామదునగరరాజ్య మంతయు నరాజకమై, రాజునకును, మంత్రులకును మంత్రులలో మంత్రులకును కలహములుగలిగి, యంతఃకలహములకు నాపట్టణము పుట్టినిల్లయి యుండెను. ఈ కలహముల నన్నిటిని అడచి యారాజ్యమును మోగలుల చేతినుండి రక్షించుటకు శహాజీరాజు చాల ప్రయాసపడెను. లుకజీజాధవుడు తనరాజును వదలి మోగలులలో గలసి నప్పటికిని శహాజి యహామదునగరపురాజునే పట్టుకొని యుండెను. క్రీ. శ. ౧౬౩౬ లో నిక మోగలులతో బోరాడుట యసాధ్యమని తలంచి శహాజి ఢిల్లీశ్వరునితో సంధిచేసికొనెను. అప్పుడు ఢిల్లీబాదుషహా యగు షహజహాను శహాజికి నాఱువేల మనసబును, నైగువేల గుఱ్ఱపు రౌతులపై నధికారమును నొసంగెను. ఇట్లు ఢిల్లీశ్వరునితో నిరుపాయం బయినపుడు సంధి చేసికొనినను, శహాజలక్ష్యమంతయు నైజాముశాహినిలు

పుటయందే యుండెను. క్రీ. శ. ౧౬౩౪ లో శహాజి, యిది మంచిసమయముగదా యని తలంచి యహామదునగరరాజ్యము మీాద నొకపిల్లవానిని గూర్చుండబెట్టి నిజాముశాహికి జీవము పోయ యత్నించెను, ఈకాలముల నతడు ఢిల్లీశ్వరుని మొగలు సైన్యముల నెన్నిమోపర్యాయము లోడించెను. బ్రాహ్మణాధికారుల గొందరను నియమించి, కొంతరాజ్యము జయించి, బాలరాజుపేరట దాను రాజ్యముచేయ నారంభించెను. మీారు, మేము గూడి మొగలుల గెలిచెదమని చెప్పి, బిజాపూరు నవాబులను గలపుకొని మొగలులతో సంధి చేసికొనినందున క్రీ. శ. ౧౬౩౭ వ సంవత్సరమున అహామదునగర రాజ్యము పూర్తిగా వినాశ మొందెను. తరువాత శహాజి రాజు బిజాపురరాజునొద్ద నుద్యోగమున నుండెను.

బిజాపురము రాజగు మహామ్మదు ఆదిల్‌శహా శహాజిని నాదరించి, యతని నైజాముశాహిలోని జాగీరులన్నియు నతని కిచ్చి, యతనిని భీమా, నీరా యను నదులనడుమ నున్న ప్రాంతమునకు నధికారిగా నేర్పరిచెను. అత డాపనిలో గీర్తిచెందినపిదప నతనిని రెండవ దండనాయకునిగాను, రణదుల్లాఖానను వానిని మొదటి దండనాయకునిగాను నేర్పరిచి వారిని నవాబు కర్ణాటవిజయయాత్రకుబంపెను. ఈదండయాత్ర లోవిజయశ్రీ నైకొని వచ్చినందునకు మెచ్చి, నవాబు శహాజికి కర్ణాటకములోని కోలారు, బంగలూారు, బారాకోట, బాలా

పూరు, శిరకట మను ప్రాంతములు జాగీరుగా నిచ్చెను. అటు పిమ్మట శహాజిజన్మమంతయు నీరాజులకొలువులోనే యుండెను.

ఇట్లిరువది సంవత్సరంబులవరకును రారాజులైన ఢిల్లీశ్వరులతో ఘోరముగా బోరాడి నైజాముశాహి పడకుండ నిలుపుటకై యమితప్రయత్నము చేసి, బీజాపురరాజులచే నప్రతిమ గౌరవము చెందిన శూరాగ్రేసరుండు చరిత్రనాయకుండగు శివాజికి జనకుండు. అలగ్జాండరుయొక్క విశ్వవిఖ్యాతమైన కీర్తికి నతనితండ్రి యైన పిలిపరాజుయొక్క పూర్వప్రయత్నంబు లెట్లు సోపానప్రాయంబు లయ్యెనో, యటులనే శివాజియొక్క స్వరాజ్యస్థాపనంబునకు శహాజియొక్క శౌర్యంబును నతడు సంపాదించిన జాగీరులును మూలాధారంబు లయ్యెను.

రెండవ ప్రకరణము

★ ★ ★

శివాజీజన్మమును, బాల్యదశయు

శహాజీమహారాజుయొక్క యుద్యోగసంబంధమైన రమ్య చరిత్ర క్రిందటిప్రకరణములో వర్ణింపబడెను. కాని శహాజి యొక్క కుటుంబసంబంధమైన చరిత్ర యంత రమ్యమైనది కాదు. క్రీ. శ. ౧౬౦౪ వ సంవత్సరములో శహాజీ జిజాబాయిలకు బహుడంబముతో వివాహముజరిగెనని వెనుక వ్రాసియుంటిమి. కాని యీ వివాహబంధనము వధూవరుల కిరువురకును సౌఖ్యప్రదంబు గాదయ్యె. దంపతులకుస్నేహంబు గలుగుటకు మారుగా వైరంబు గలిగె. ఈవైరమునకు గారణమేమో చరిత్రకారులు స్పష్టముగా వ్రాయలేదు. ఐన నిందులకుజిజాబాయి యొక్క స్వాభిమాన (Self-Respect) ప్రధానం బయిన స్వభావంబే కారణం బయి యుండు నని కొందరు చరిత్రకారులు వ్రాసియున్నారు. గొప్పవంశంబున బుట్టినదియైనందున దన్నొక రనుమాట లామెసహింపదయ్యె. శహాజి తురుష్కులయొద్ద నుద్యోగము చేయుచు వారిని భూషించుచుండెను. జిజాబాయియో, తురుష్కులను సదా ద్వేషించుచుండెను. ఇట్టిదంపతులకు బరస్పరవిరుద్ధములయిన స్వభావ

ములు గలిగియుండి నంగాన వారి యంతఃకరణములు కలియ వయ్యె. ఇట్లు వారి మనస్తాపంబు దినదినంబు వృద్ధి యైనందున క్రీ. శ. ౧౬౩౦ వ సంవత్సరమున శహాజి, తుకాబాయి యను రెండవస్త్రీని వివాహమాడెను. శహాజి చేసికొనిన యీ పునర్వివాహమువలన జిజాబాయి మరి సయలిగి తనపుట్టినింటి బంధువులయొద్దకు బోయెను. ఇట్లీసతీపతులకు వియోగము సంభవించుటకు పూర్వమే వారికిరువురు పుత్రులు గలిగిరి. పెద్దకుమారునిపేరు సంభాజి. తండ్రికి నీపుత్రునియం దత్యంత ప్రేమయున్నందున నతడెప్పుడును దండ్రియొద్దనే యుండెను.

శహాజి మహారాజుయొక్క రెండవకుమారుడు మహారాష్ట్ర రాజ్యసంస్థాపకుండును, మహాభాగ్యనాయకుండును నగు శ్రీశివాజీమహారాజు. ఈమహాపురుషుని జన్మంబు శివనేరి యను పర్వతదుర్గమునందు క్రీ. శ. ౧౬౨౭ వ సంవత్సరమున నయ్యెను. ఈ సంవత్సరరాజంబు హిందూదేశ చరిత్రమునందు సువర్ణాక్షరంబులతో వ్రాసి యుంచునంత యోగ్యత గలది యని చెప్పుటకు సందేహముగలదా? శివాజీ మహారాజు ముందు చూపిన యపరమిత పరాక్రమమునకు శుభసూచనలేమియు నతని జన్మకాలమునందు గానిపించినవి కావు. ఇందులకు విరుద్ధముగా నతనిజన్మకాలమందేమి, శైశవదశయందేమి యతనిని నిరుత్సాహకరంబు లగు నిబ్బందులే చుట్టుకొనియుండెను. తల్లిదండ్రులకు సానుకూల్యము లేకపోవుటయే మొదటి యిబ్బంది, ఇదియుగాక యప్పుడు శహాజిమహారాజు మొగలులతోయుద్ధము చేయుచుండెను. శివాజీకి మాతామహుండగు జాధవరావు

మొగలులవైపున నున్నందున నతనికిని, శహాజీకిని ఘోరమైన వైరంబుసంభవించె. ఇట్లు మాతామహునికిని, దండ్రికిని వైరంబు గలుగుటరెండవయిబ్బంది. తండ్రిమొగలులతో యుద్ధముచేయు నపుడు నీబాలుఁడును, నతనితల్లియు ననేకపర్యాయములు శత్రువులచేత జిక్కవారైరి. కాని యాసమయములయందు, వీరిపత్నియు, వీరిమాతయు నగు జిజాబాయియొక్క బుద్ధిప్రభావంబుచే నాబాలుఁడు సంరక్షింపబడియె. నేఁడు కోండాణాదుర్గములో నుండిన, రేపు శివనేరుకోటలో నెల్లుండి కొంకణదేశములోని మాహూలికిల్లాలోను నుండి యల్పకాలములో స్థలాంతరంబులు చేయుచు, మగడొల్లని యాసాధ్వి ముందు శకకర్తగానున్న తనకుమారుని సంరక్షించెను. ఇట్లు మహాదక్షతతో సంరక్షించుచున్నను, క్రీ. శ. ౧౬33 వ సంవత్సరమున జిజాబాయి తనయారేండ్ల కుమారునితో వైజాపురంబున నుండ, నక్కడిదుర్గాధిపతికి లంచమిచ్చి, మోసముచేసి మొగలులు జిజాబాయిని, ముందు మొగలులగండఁడుగానున్న బాలశివాజిని జెరబట్టిరి. కాని మొగలులసైన్యములోనున్న కొందరు మరాఠాసరదారులు మధ్యస్థులయి, "శహాజి రెండవపెండ్లి చేసికొని జిజాబాయిని వదలివేసినందున నీమెను, నీమెపుత్రుని జెరబట్టుట న్యాయము కా" దని చెప్పి యామెను విడిపించిరి. ఇట్లు కుటుంబకలహములవలనను, శహాజికిని మొగలులకును యుద్ధము జరుగుచున్నందువలనను, బదిసంవత్సరములవయస్సు గలవాఁడగువరకు శివాజీ తనతండ్రిని జూడ గలుగకపోయెను. విజాపూరునవాబులు మొగలులతో సంధి చేసికొనిన పిదప

క్రీ. శ. ౧౬౩౬ వ సంవత్సరమునందు శహాజి విజాపురమునకు నుద్యోగార్థము వచ్చినప్పుడు నాతడు తన పెద్దభార్య యగు జిజాబాయిని, గుమారుడగు శివాజీని దనయొద్దకు బిలిపించుకొనెను. శహాజి క్రీ. శ. ౧౬౩౬ వ సంవత్సరమున సయీబాయీ యనిన పిల్లను దెచ్చి శివాజీకి వివాహము చేసెను.

ప్రప్రథమమందు శివాజీకి దురకలయందుద్వేషముగలుగుటకు గారణము, మొగలులయుద్ధములవలన నాతనికి, నాతనితల్లికి గలిగిన యపరిమితకష్టమే. ఇట్లతనిమనంబున జిన్నతనములోనే యవనద్వేష మంకురింప, దానిని వృద్ధిపరిచినది యతనితల్లి యగు జిజాబాయి. చిన్నప్పటినుండియు దల్లియొద్దనే యున్నందున శివాజీకి దల్లిచనవధికముగా నుండెను. ఆమె యతనికి దమపూర్వులపరాక్రమచరిత్రంబులును, వైభవకథలును జెప్పి, ధైర్యోత్సాహంబులు గలుగజేయుచుండెను. యవనులు మనదేశ మంతయు నాక్రమించి యున్నారు; ధర్మమును బాడుచేసినారు, దేవాలయముల బడగొట్టుచున్నారు; గోబ్రాహ్మణసంహారము విధివిరుగడ లేకుండ జేయుచున్నారు. ఇట్టి దుష్టులభీతిచేతనే కదా మన మీ కష్టముల ననుభవించుచున్నాము. వీరి నోడించు శకకర్త మనకులంబున నుద్భవింప నున్నాడని యనేకదృష్టాంతము లదివరకయియున్నవి. ఆ మహాపురుషుడెప్పుడు జన్మించునో! మన మెప్పుడు సుఖముగ నుందుమో.*” ఇట్లనేకపర్యాయములు దనకుమారునకు బోధించి యామె, శౌర్యము, ధైర్యము, యవనద్వేషము, స్వదేశ

* చిపళూనుకరకృతమైన మహారాష్ట్రుల చరిత్రము । అభ్యుదయము

స్వమతాభిమానంబు లను గుణంబు లాతనికి నుగ్గుపాలతో దరపెను. శివాజీబాలుడుగానున్నప్పుడును, విజాపురరాజులతో బోరాడునప్పుడును, ఢిల్లీశ్వరునియొద్దకు బోవునప్పుడు, నావీరమాత యావీరున కిట్టియుపదేశమే చేసెను ! "భర్తయనుమతి లేక యుండినను జిజాబాయి తనకొమారుడగు శివాజీయొక్క తెలివితేటల కానందించుచు! నతనికి స్వదేశస్వమతములయందలియభిమానమును వృద్ధిపరచుచు నుండెను. ఆమెభర్త తురుష్కప్రభువులయొద్ద సరదారుగా నుండినను నామెకామ్లేచ్ఛప్రభుత్వమునం దధికద్వేషము కలిగియుండెను. ఆమెసద్బోధవలననే శివాజీ మిగుల శూరుడయి తమదేశమునందలి తురకప్రభుత్వమును రూపుమాపి మరాఠీరాజ్యమును స్థాపించెను. ఆయన చేసినపరాక్రమమున కంతకును జిజాబాయియే మూల మనుటకు సందియము లేదని న్యాయమూర్తులగు మహాదేవ గోవింద రానడేగారు వ్రాసి యున్నారు. శివాజీ తానేపనిని జేసినను దల్లియనుజ్ఞవడయక చేసెడివాడు కాడు. శివాజీ మ్లేచ్ఛులతో వైరముచేయుట యతనితండ్రి కెంతమాత్రమును సమ్మతిలేదు. కాని తల్లిసహాయమువలననే మిగులవిఖ్యాతిగాంచెను. జిజాబాయి తానేమి మహాకార్యము చేయజాలకున్నను దనకు గలస్వదేశస్వమతాభిమానములను గొడుకునకు బోధించి తనకు గలయుద్దేశముల నతనిచే నెరవేరజేసెను. *" ఇట్టితల్లి పవిత్రోపదేశంబువలన

* అస్మజ్జ్యేష్ఠసహోదరి యగు సౌ॥ భండారు అచ్చమాంబగారిచే రచయింపబడిన " అబలాసచ్చరిత్రరత్నమాల"-ప్రథమభాగము.

కుమారుండు రాజ్యసంస్థాపకుండయి ఘనతను వహించిన యుదాహరణ మిద్ది యొకటితప్ప వేరొకటి మరి యేదేశచరిత్రమునందైనను గానిపించుట దుర్లభంబని నాయభిప్రాయము. తల్లుల గుణావగుణముల ననుసరించి పిల్లల గుణావగుణములుండును గాన, మనసంఘమునందలి స్త్రీలకుస్థితిని సంస్కరింపవలయునని ప్రతిపాదించెడి నవనాగరకవీరులకు నీశివాజీ జిజాబాయులచరిత్ర మొకయత్యంతోపయోగకరంబగుశస్త్రంబే యని చెప్పవలయును.

శివాజీకి జిన్ననాటినుండియు శౌర్యోత్సాహంబులు వృద్ధియగుటకు రెండవకారణము పురాణశ్రవణము. అయిదారు సంవత్సరములవయసువాఁ డయినప్పటినుండియు భారతరామాయణములలోనికథల నాతఁడు మిక్కిలి శ్రద్ధతో వినుచుండెను. ఋషులను బాధపెట్టురాక్షసులను రాముఁడు వధించినకథయు, భీమార్జునాదు లద్భుతపరాక్రమము జూపి కర్ణ దుర్యోధన దుశ్శాసనాదుల వధించినప్రకారంబులును వినునప్పుడు బాల శివాజీ శరీర ముప్పొంగి, గోబ్రాహ్మణనాశ మొనరించు యవనుల దానును నట్టులనే సంహరింపవలయుననిన యోచన లాతని మనస్సునందుద్భవింప దొడగెను. శివాజీ యనేక రాత్రులు కేవలము భారతరామాయణములలోనియుద్ధప్రకరణములు వినుటయందే గడపుచుండె నట !

ఇట్లు క్రీ. శ. ౧౬౩౬ వ సంవత్సరమున శివాజీ తండ్రి యొద్దకు వచ్చినప్పు డాతనిచిత్తంబంతయు యవనద్వేషముచే నిండి యుండెను. అతనితండ్రియగు శహాజి చిన్న నాటనుం

డియు యవనుల సేవలోనే యుండి గొప్పయుద్యోగములు చేసి జహాగీరు సంపాదించినవాడయినందున నాతడు తనకుమారుని రాజద్వేషమున కెంతయు జింతిల్లుచుండె. ఒకనాడు తనకుమారుని బిలిచి యాతడు "నాయనా! నీవు పదియండ్రెండు సంవత్సరములవాడవయితివి; ఇక దిన దినము నావెంట నవాబుపేరోలగమునకు (దరబారునకు) వచ్చి నవాబునకు సలాము చేసి తన్నుతిన్నగా నతనియనుగ్రహము సంపాదించిన నీకు మేలు కలుగగల"దని యుపదేశించెను. అందునకు శివాజీ యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను :— "యవనులత్యంత నీచులు; వారి నాశ్రయించుటకును, వారికి సలాము చేయుటకును నా కెంతమాత్రమిష్టము లేదు. రాజవీధులలో జరుగుచున్న గోవుల వధ జూచి, వధచేయుయవనులను వెంటనే చంపవలయు ననిన యిచ్ఛ నాకు గలుగును గాని, యటులజేసిన మీరేమని యెదరో యనినభీతిచేత గోపము నచటనే యడచుచున్నాడను. గొప్పగొప్ప తురకయధికారులయింటికి బోయి వారి నాశ్రయింప నేనొల్ల. ఒకానొకప్పుడు యవనస్పర్శ సంభవించెనేని, నే నావస్త్రముల బరిత్యజించెదను." ఈవచనంబులు విని శహాజి మిగుల నచ్చెరువొంది పుత్రునితో నిట్లనియె:—"నీవు చెప్పినమాటలన్నియు సత్యంబులే. కాని ప్రస్తుతము పృథివి కంతటికి యవనులు రాజులయి యున్నారు. వారిసేవ చేసి, మనము మనమతమును రక్షించుకొనుచునుండుటయే యీశ్వర సంకల్పమని తోచుచున్నది. అటుల గానియెడల మన స్వరాజ్యమేలపోయి యుండును? నేను మీకొరకత్యంత శ్రమ

చేసి వైభవమును సంపాదించినాడను. నేను సంపాదించిన దానిని రక్షించుకొనుచు మీరు నవాబు దయకు పాత్రులగుటయే మీకు ధర్మము." అందుపై శివాజీ యుత్సాహము లేని ముఖముతో నిట్లనియె:—"మీయాజ్ఞ శిరమున వహించుటకు సందేహము లేదు. కాని గోబ్రాహ్మణపీడకు లగు యవనులను జూచుటకంటె ప్రాణంబుల బరిత్యజించుట మేలని నాయభిప్రాయము."*

ఇట్లుతండ్రి కొడుకులకు నప్పుడప్పుడు సంభాషణజరగుచుండ నొకనాడు బలవంతముగా శహాజి, శివాజీని నవాబు పేరోలగమునకు బంపెను. అంతకంటె బూర్వము నవాబు మంత్రియగు మురారరావు, నవాబుతో శివాజీయొక్క శౌర్యాది సుగుణసంపదను గొనియాడి యుండెను. కాని శివాజీ రాజసభకు బోయి నవాబునకు సలాముచేయకయే దూరముగా గూరుచుండెను. అందుపై, నవాబితడేనా శహాజిరాజుకొమారు" డని యడుగగా మురారరా "వితనిది చిన్నవయసు; ఇదివర కెన్నడును రాజసభ చూచినవాడు కాడు" అని చెప్పి యా నవాబు నెటులనో సమాధాన పరిచెను. ఇంటికి బోవు నపుడు బాలశివాజీకి నవాబు వస్త్రాద్యలంకారము లిప్పించి పంపెను. కాని యింటికి బోయినతోడనే యావస్త్రములు తీసివేసి శివాజీ సచేలస్నానము చేసెను.

శివాజీయొక్క యీప్రవర్తనయంతయు జూచి మురారరావును, శహాజియు, శివాజీని రాజధానియైన బిజాపురములో

---

* చిటనీసుకృతమైన బఖరు.

నుంచుట మంచిదికాదని తలచిరి. ఇంతలో శహాజి మహా రాజునకు, నవాబుయొక్క యాజ్ఞవలన కర్ణాటకద్రవిడదేశము లపై దండువెడలవలసి వచ్చెను. కాన నాతడు జిజాబాయిని, శివాజీని, శివాజీభార్య యగు సయీాబాయిని దనజహాగీరులో నున్న పూనా*పట్టణమునకు బంపెను. పూనా మొదలయిన జాగీరులపని చూచుటకును, భార్యాపుత్రాదులను గాపాడుట కును శివాజీవెంట శహాజి, దాదోజి కొండదేవుడను బ్రాహ్మణు డగు గుమాస్తా నొకనిని బంపెను. తనవెంట పెద్దకుమారుడగు సంభాజిని, చిన్నభార్యయగు తుకాబాయిని దీసికొని శహాజి క్రీ. శ. ౧౬౩౬వ సంవత్సరములో కర్ణాటకమునకు బోయెను. అక్కడ బరాక్రమముచే బ్రసిద్ధి చెందినందున నవాబతనికి నచ్చుటచే కొన్ని జాగీరు లిచ్చెనని వెనుకటి ప్రకరణములో వ్రాసియుంటిని. ఈ జహాగీరును జక్కబరుచుచు, జిన్నచిన్న సంస్థానముల జయించుచు శహాజి తరలిరాక, ద్రవిడ కర్ణాటక దేశములలోనే యుండ నిశ్చయించెను. తంజావూరు (Tanjore) సంస్థానాధిపుండగు విజయరాఘవుని గెలిచి శహాజి యాగ్రామమే తనకు రాజధానిగా నేర్పరుచుకొనెను. ఇంతలోనతనికి ద్వితీయభార్యయగు తుకాబాయివలన వెంకోజీ యను పుత్రుడు గలిగెను. ఆ పుత్రునియందు విశేషమమత గలవాడయి, యతనికి తంజావూరు రాజ్యమీాయదలచి శహాజి

* ఇంగ్లీషువారు "పూనా" యనియు, నాంధ్రులు "పునహా" యనియు వాడుకొను పట్టణముయొక్క నిజమయిన మహారాష్ట్రనామము "పుణే." ఇప్పటికి మరాటీవారిచే నీపేరే వాడబడును.

మహారాష్ట్రమునకు దిరిగి వచ్చుటమాని, పూనా జాగీరుపని దాదోజి కొండదేవుడు చూచునట్లును, వచ్చిన పైకముతో జిజాబాయి శివాజీ మొదలయినవారిఖర్చు జరుపునట్లును, మిగిలిన పైకము తనకు బంపునట్లును నేర్పాటుచేసెను.

ఇట్లు తండ్రిచే బూర్ణముగా విడువబడిన శివాజీని దాదోజి కొండదేవుడు తండ్రికంటె నధిక ప్రేమతో బెంచెను. జిజాబాయి యుపదేశమువలన యవనుల జయించునిచ్ఛ శివాజికి గలిగినట్లుల నతనికి యవనుల జయించు సామర్థ్య మీ దాదోజికొండదేవునియొక్క సుశిక్షవలననే గలిగిన దనుటకు సందేహములేదు. ఈయన అనేకసంవత్సరములనుండి శహాజి యొద్ద రాజకీయోద్యోగములో నున్న బ్రాహ్మణశూరుడు. ముస్సద్దీపనిలో నితనితో సమాను లాకాలమున నెవ్వరును లేకుండి రనుటకు సందేహము లేదు. పూనా జాగీ రీతనిచేతికి వచ్చువరకు బహుదుర్దశలో నుండెను. దొంగలవలనను దోడేళ్లవలనను లోకులు బహుబాధితులయి జాగీరువదలిపారిపోయిరి. దాదోజి లోకులకు బహుమానము లిచ్చి తోడేళ్లన్నిటిని జంపించి యుగ్రశాసనమున దొంగల రూపుమాపి కొంచెపాటిశిస్తులకు భూములు రయితుల కిచ్చి జాగీరంతయు శీఘ్రకాలములోనే పొందుపరిచెను. ఇట్లు రాజ్యకార్యనిపుణుడగు దాదోజికొండదేవుడు పదిసంవత్సరములలో జాల ధనము మిగిలిచి, యనేకబటులను దనసేవకులుగా నేర్పరించి, పడిపోయినకోట లెన్నియో మరల గట్టించి, శత్రుభీతి లేకుండ జాగీరును రక్షించుచుండెను. బ్రాహ్మణక్షత్రియకార్యము

లందు ప్రవీణుడగు నీబ్రాహ్మణుడు శివాజీకి నావశ్యకము లయిన సకలవిద్యలు నేర్పెను. శివాజీకి నక్షరజ్ఞానములే కుండె ననియు, నతడు దస్కతుగూడ జేయలే కుండెననియు గొంద రింగ్లీషుచరిత్రకారులు వ్రాసియున్నారు! ఇందులకు విరుద్ధముగ మహారాష్ట్ర గ్రంథకారులు కొందరు శివాజీ సకలశాస్త్రము లందును, సకలకళలయందును ప్రవీణు డయియుండెనని వ్రాసి యున్నారు! ఈ రెండు సంగతులును నతిశయోక్తు లని నా యభిప్రాయము. శివాజీ దాదోజివంటి ముత్సద్దియొద్ద నున్నందునను, నతడు దనతమ్ముడును దంజావూరురాజును నగు వెంకోజికి వ్రాసిన యుత్తరమువలనను నతనికి మాతృభాష వ్రాసి చదువుసంతజ్ఞాన ముండె ననుటకు సందేహము లేదు. ఆకాలమున మరాటావారి పిల్లవాండ్ర కింతకంటె నధికవిద్యతో బనియు లేక యుండెను. యుద్ధముచేయుట వారిపనిగాని గుమస్తాలవలె జాబితాలు వ్రాయుట వారిపని కాదు. అందుచే నితరవిద్యలకంటె ధనుర్విద్యయందే వారి కత్యాదర ముండెను. కాన, దాదోజికొండదేవుడు శివాజీకి ముఖ్యముగా గుఱ్ఱము పై నెక్కి సవారి చేయుట, ఖడ్గముతో సాముచేయుట, గుఱ్ఱము పైనుండి బల్లెముతో బోరాడుట, మొదలయిన యుద్ధవిద్య లన్నియు నేర్పెను. తరువాత జమాబంది చేయుపద్ధతి న్యాయ విచారణ చేయు పని, తమకు బ్రతికూలముగా నుండుసంగ తుల నన్నిటిని యుక్తిచే దమకు ననుకూలము లగునట్లు మార్చుకొను నుపాయము, మొదలయిన లౌకికవ్యవహారములన్ని యునేర్పెను. ఇట్లు క్రొత్తరాజ్యమును సంపాదించుట కావ

శ్యకమైనవిద్యలను, రాజ్యము సంపాదించిన తరువాత దానిని స్థిరపరుచుట కావశ్యకమైన విద్యలను, నానాపరాక్రమములను సంపాదించెను.

దాదోజీ కొండదేవుఁడు విద్యలన్నియు శివాజీకి నేర్పునపు డాతఁడు తురకలతో బోరాడవలయునని నేర్పినవాఁడు కాఁడు. మరాటీవారి పిల్లలకీవిద్య లావశ్యకము లనియు, శివాజీ పెద్దవాఁడయి శహాజీవలెనే తురకరాజుల మెప్పించి జాగీరులు పొందవలయు ననియే నేర్పెను. శివాజీ పెద్దవాఁడయినకొలఁది దాదోజీ యతనిని జాగీరుపనిలోనికి జొరబెట్టసాగెను. జమాబందీ పద్ధతి బాగుగా తెలియవలయునని యతనిని వెంటబెట్టుకొని ప్రతి గ్రామమునకు బోవుచుండెను. కాని చిన్నజాగీరు రక్షించుకొనుచు గూర్చుండుటకంటె గొప్పదియగు స్వరాజ్య సంస్థాపనంబను వేరొక మహాకార్యంబు చేయవలయునని నిశ్చయించినవాఁడగుటచే శివాజీ జాగీరుపనియందంత లక్ష్యముంపక యుద్దిష్టమహాకార్యమెట్లు నెరవేరునాయని యోచించుచుండెను. దాదోజీ చేతిక్రింద బనిచేయుచున్న కొందరు ముస్సద్దీలకు దనయాలోచన తెలిపి వారిని దన కనుకూలముగా జేసికొనెను. వారును నవయౌవనములో నున్నందున శివాజీయొక్క సాహసకార్యము వారికి సమ్మతంబయ్యెను.

ఇట్లు శివాజీ తురకలతో బోరాడి స్వరాజ్యము స్థాపించు ప్రయత్నము చేయుచున్నందుల కెంతయో చింతిల్లి దాదోజీ యొకనాఁడు శివాజీని దనయొద్దకు బిలిచి యిట్లు బోధించెను:—“మీరు స్వరాజ్యము స్థాపించుటకు జేయుచున్న

యత్న మత్యంత స్తుత్యమనుటకు సందేహము లేదు. కాని ప్రస్తుతకాల మిందుల కనుకూలముగా లేదు. పృథ్వి యంతయు యవనులు జయించినారు. కోటలు సైన్యములు మొదలయిన వన్నియు వారికి స్వాధీనములై యున్నవి. హిందూరాజులు గూడ వారికే సహాయులుగానున్నారు. మీరారంభించిన పనికి హిందూరాజులందరు సహాయముగానుండి, హిందూ సైన్యము లంతటను వ్యాపించి యుండవలయును. ఈశ్వరానుకూలతయు సిద్ధుల యాశీర్వాదములును గావలయును. కాని ప్రస్తుతము కాలదేశ వర్తమానములు మన కననుకూలముగా నున్నందున మీరారంభించినపని నాకు సమ్మతముకాదు. దీనిపర్యవసానము శుభప్రదము కాజాలదు. మీ తండ్రిగారు మహాపరిశ్రమచేసి ధనమును, కీర్తియు సంపాదించినారు. వానిని బోగొట్టి లోకనింద వడయవలదని మా అభిప్రాయము."

ఇట్లుపదేశించినందువలన నతనితో "మీ యనుజ్ఞ ప్రకారమే వర్తించెద" నని చెప్పి శివాజీ యతనికి దెలియకుండ దన కార్యసిద్ధికొరకు సాధనంబులు సేకరించుచుండెను.

మూడవ ప్రకరణము

యుద్ధసన్నాహము—ప్రథమపరాక్రమము

తురుష్కరాజుల నోడించి స్వతంత్రరాజ్యము స్థాపింప వలయు నని నిశ్చయించి, శివాజీ యుద్ధములకు దగిన సన్నాహంబును జేయ దొడగె నని రెండవప్రకరణమునందు వ్రాసి యుంటిని. తనమహోద్దేశము సాధించుటకై యతడు చేసిన మొదటిపని కొండలలో స్వయముగా దిరిగి యాపర్వత ప్రదేశము లన్నిటిని బూర్ణముగా నెరుగుట. ఏలయన నప్పుడు శత్రులపై నొక్కసారిపడి వారిని జెల్లాచెదరు చేయుటకును, వీలు లేనప్పు డెవరికి దెలియకుండ దాగి యుండి స్వరక్షణము చేసికొని సురక్షితముగా నుండుటకును, క్షణములో శత్రువులకు నెదుట ప్రత్యక్షమై, మెరుపువలె క్షణములో నదృశ్యమగుటకును బర్వతప్రదేశంబు లత్యంతసాహాయ్యకరంబు లని తన చిన్ననాటియనుభవమువలన నెరింగినవాడు గాన, శివాజీ కొంకణము, మావళా, యనుప్రదేశములందలి భయంకర మైన కొండలలో నెల్లపుడు దిరుగుచు, పచ్చటిగుట్టలు, గుహాలు గుప్తమార్గములు, జలాశయములు దుర్గనిర్మాణయోగ్యస్థలంబులు మొదలగు వానికన్నిటికిని దృఢపరిచితుడయ్యెను!

స్వకార్యసిద్ధికొరకయి శివాజీ యవలంబించిన రెండవ మార్గము కొండతావులలోనున్న లోకులతో స్నేహముచేయుట. మావళా యనుప్రాంతము శివాజీయొక్క జాగీరులోనిది. అది పర్వతప్రదేశము. అచ్చటిమావళే యనబడు జనులు కడుబీదలు. దినమంతయు బాటుపడిన గాని వారికి దినుటకు నొక జొన్నరొట్టెదొరకక యుండెను. వారిమేనికొకగోచి తప్ప మరి యేమియు వస్త్రముండదు. ఇట్లువారుజూచుటకు కడు బీదలుగను, మూఢులుగను నుండినను దీర్ఘకాయులుగను, ఆజానుబాహులుగను, అమితబలవంతులుగను నుండిరి. ఇంతియ కాదు. అనుపమస్వామిభక్తి యను సద్గుణరత్నంబుచే నాజాతి యంతయు విభూషితంబై యుండె. తమకు గట్టుకొనుటకయి యొకకౌపీనమును, నోటబెట్టుకొనుట కొకరొట్టెయును ఇచ్చిన వానికొరకు వారు ప్రాణములు నైన నిత్తురు. చూచుటకు బిచ్చివారివలె నుండినను నెన్నికష్టములకైన నోర్చి భగీరథప్రయత్నముచేసి స్వామికార్యము నెట్టులైన సాధించునట్టి యద్భుతప్రజ్ఞ యీ మావళే యనబడు అరచెంచుల కుండెను. వీరుకొండలలో నుండువారగుటచే నచ్చటి త్రోవలన్నియు వారికి గరతలామలకము లయియుండెను. అరణ్యప్రదేశములలో నుండువా రగుటచే హింస్రపశువులవలన దమకు హాని కలుగకుండ వారు వివిధప్రకారంబులయిన ధనుర్విద్య లభ్యసించియుండిరి. ఏవంగుణవిశిష్టు లయిన మావళేవాండ్రు తనకు ననుకూలు రయిన దనకార్యంబు సులభంబుగా సిద్ధించు నని యెరింగినవాడయి శివాజీ యీపర్వతవాసులతో మైత్రి

చేసెను. వారియొద్దనుండి రావలసిన పన్నులు వదలివేసియు, వారిద్రకు సన్నవస్త్రంబు లిచ్చి సంరక్షించియు, గొందరను జాగీరులోని యుద్యోగములలో నియమించియు, దాను నెల్లప్పుడును వారిలో గలసి మెలసి యుండియు వివిధోపాయములచే శివాజీ మావళేవారి యంతఃకరణములను వశపరచుకొనెను. వారికి శస్త్రాస్త్రంబుల నొసగి వ్యూహక్రమంబుల నెరింగి యుద్ధపద్ధతుల నన్నింటిని గరపి సాగరమోగ్యుల జేసెను. ఇట్లు శివాజీకి దోడ్పడిన మావళేవారికి నధిపతులును, దళముఖులును అయిన ముగ్గురుమహారధులు ప్రారంభమునుండి శివాజీకి గుడిభుజములుగా నుండిరి. వా రెవ్వ రనిన:—

౧ తానాజీమాలసురే;—ఈమావళే వీరుని నామము మహారాష్ట్రదేశపుచరిత్రములలోనేమి, చరిత్రగీతములలో నేమి (Ballads) యజరామరమై యున్నది. ఇతడును, ఇతనితమ్ముడగు సూర్యాజియు శివాజీమహారాజునకు బహిఃప్రాణములయి యుండిరి. ఈ వీరుడు తనప్రాణముల సమర్పించి శివాజీకి సింహగడ మనుపర్వతదుర్గమును సాధించి యిచ్చెను.

౨ ఏసాజీకంక్:— ఈతడు మావళే పదాతముయొక్క ముఖ్యసేనాని. శివాజీయొక్క ప్రథమవిజయములలో నితని శౌర్యసాహసములే మిక్కిలి యక్కరకు వచ్చెను. అఫజుల్ ఖానుని వధసమయమునను, షాహిస్తేఖానుని భంగపరిచినప్పుడును నితడు శివాజీకి దోడుగానుండెను. ఇతడును తానాజియు శివాజీవెంట ఢిల్లీకి వెళ్ళియుండిరి.

3 బాజీసల్కర్:—పై నుదహరించిన యిద్దర శూరులవలెనే యీతడు శివాజీసేవయందుండి ప్రాణసమర్పణ మునకైన వెనుదివియక స్వామికార్యములనిర్వహించుచు నెను కొంకణప్రాంతములో యుద్ధము చేయుచు నీతడు కీర్తిశేష డయ్యెను.

ఈముగ్గురు మావళేవీరులు శివాజీయొక్క ప్రథమపరిచయులు. ప్రాణస్నేహితులు. వీరుగాక శివాజీకి సాయముచేసిన మావళే మహారథు లనేకులుండిరి. వారిలో ముఖ్యులీక్రింద వర్ణింపబడినవారు.

నేతాజీపాల్కర్:—ఈతడశ్వసైనికులకు నధిపతియై యుండెను. తనపేరిట రెండుశతాబ్దములవరకు దేశంబులన్నింటి గజగజవడకజేసిన మరాఠాగుర్రమునకు నీతడు కూటస్థుండని చెప్పవచ్చును. ఇతడసామాన్య సాహసము కలవాడయి అహమదనగరమువరకును, అవరంగాబాదువరకును దండు వెడలుచుండెను. ఎక్కడజూచిన దానైయె రాజ్యమునకు వచ్చు నాపద లన్నింటిని నిర్భయముగా నెదుర్కొనుచుండెను.

ప్రతాపరావుగుజర్:—ఈతడుగుర్రపురౌతులకు మరి యొక మొనగాడుగా నుండెను. శివాజీ కితనియందత్యంత విశ్వాసము కలిగి యుండెను. ఈతడు మొగలులసైన్యమును బీజాపూరుసైన్యము నోడించెను. ఢిల్లీబాదుషాకును, శివాజీ కిని సంధి గలిగిన రెండుసంవత్సరము లీయన ఔరంగ బాదులో సైన్యసమేతుడై యుండెను. ఒకసారి బీజపూరు సైన్యములను నీతడు తగిన రీతిని వెంబడింపనందున నీతనిపై

శివాజీకి కొంచెము కోపమువచ్చెను. కాని యాకోపమును దీసి వేసి మరల శివాజీయనుగ్రహమును సంపాదింపవలయు నని తలచి యాతడు మరియొకసారి తురకసైన్యము నోడించి యా యుద్ధమునందు దానును గూలి జయమును సంపాదించెను. ఆహా! ఇట్టిసేవకు లుండినందుననే గదా శివాజీ స్వరాజ్యమును స్థాపింపగల్గుట!

ఇట్లు శివాజీయొక్క స్ఫూర్తి, తేజము, స్వదేశస్వమతాభిమానములు, సాహసము మొదలయిన సద్గుణముల జూచి యనేకమహారాష్ట్రవీరు లీతని చుట్టు బ్రోగైరి. శివాజీయొక్క స్వాభావికమధురసంభాషణకు వశులై యాశూరులందరును నతనితో స్వదేశమునకై ప్రాణములను గూడ నర్పించెద మని కృతనిశ్చయులై కార్యమును బ్రారంభించిరి.

స్వరాజ్యము స్థాపించు నిమిత్తము ప్రప్రథమమున గొన్ని పర్వతదుర్గములను స్వాధీనపరుచుకొనినగాని, మనమందరము సురక్షితుల మై, స్వకార్యము నిర్వహింపజాల మని వారందరు నిశ్చయించిరి.. ఏల యన నిప్పటికి రాజ్యముచేయుచున్న నవాబుల ప్రచండసైన్యములతో రణరంగమునందు హోరాహోరిగా బోరాడునంతశక్తి తమకు ప్రారంభమున నేగలుగుట యసంభవ మనియు, గొన్ని దినములవరకును దామిష్టము వచ్చినప్పుడు పోరి యిష్టములేనప్పుడు దాగియుండుటకుబర్వత దుర్గము లుండుట యావశ్యక మనియు నావీరులందరకు దెలిసి యుండెను. ఇట్లు యోజించి వారు ప్రథమమందు తోరణా యను దుర్గమును సాధింప దలచిరి. శివాజీ తోరణాకిల్లాపైకి

దండెత్తి పోయి కొంతభయము చూపియు, కొంతయాశ చూపియు నాదుర్గాధిపతిని వశపరచుకొని దుర్గము నాక్రమించుకొనెను. ఇట్లు క్రీ. శ. ౧౬౪౬ వ సంవత్సరమున ననగా శివాజీ పందొమ్మిదిసంవత్సరములవాడయి యుండగా నతడు తోరణా యను దుర్గమును సంపాదించి తాను ముందు స్థాపించునట్టి స్వరాజ్యమునకు దోరణము గట్టెను.

తోరణాకిల్లా బీజాపూరు (విజాపురము) సంస్థానములోనిది. అందువలన బీజాపూరునవాబు కోపించి తనమీదికి పెద్దసైన్యము పంపునేమో యనియు, వారినందరిని మొట్టమొదటనే యెదురించుట దుర్లభమనియు దలచి శివాజీ బీజాపూరు నవాబున కిట్లు వర్తమాన మంపెను. "తోరణాకిల్లా నేను దీసికొనుట మీకొరకె. ఇంతకు బూర్వ మున్న కిల్లేదారు (దుర్గాధిపతు) లందరును రావలసినపైక మేమియు దేవర వారికి జెల్లించినవారుకారు. ఈదుర్గము మాచేతిలోనే యుంచిన యెడల మేము పూర్వపు దుర్గాధిపతులకంటె నధికధనము చెల్లించెదము. ఇదియుగాక యీ దుర్గప్రాంత మొకమూల నున్నందున నిట్టిచోట మావంటి విశ్వాసస్థులైన సేవకులుండుట మీకు మేలు." ఇట్లు సులతానునకు దియ్యని మాటలతో వార్తనంపి తాను స్వాధీనపరచుకొనిన తోరణాదుర్గము పరుల కభేద్య మగునటుల దృఢముగా గట్టించి సైన్యమును వృద్ధి పరుపసాగెను. కోటపని జరుగుచున్నప్పుడొక ప్రాత గోడసందున శివాజీకి నమితధనసంచయము దొరకెను, తాను ప్రారంభించిన మహాకార్యమునకు మెచ్చి తనకులస్వామిని యగు

భవానీయే యాధన మిచ్చెనని తలచి శివాజీ తోరణాకిల్లాకు సమీపముననేయున్న కొండపై మరియొక దుర్గము నిర్మించెను. ఈక్రొత్త దుర్గమొక సంవత్సరములో గట్టించి యది యత్యంతా భేద్య మైనందున దానికి రాజగడమను నామమిడి దానినే తన రాజధానిని జేసికొనెను.

ఇట్లు శివాజీ నవీనదుర్గములను నిర్మించుచుండగా నీసంగతి యంతయు బీజాపూరు నవాబునకు దెలిసెను. కాని యీ కోటలే ముందు దన రాజ్యమునకు నాశహేతువులగునని యా నవాబునకు దెలియనందున నాతండు విశేషము భయపడ డయ్యె. కాని యొద్దనుండు ముసలిసరదారులు వెంటవెంట హెచ్చరికచేయ దుదకాతడు నీవు దుర్గములనుగట్టుట మానుమని శివాజీకిని, నీకొడుకిట్లు కోటలనేల కట్టుచున్నాడని ద్రవిడ దేశమందున్న శహాజీకిని వార్తపంపెను. శహాజికి నంతకు బూర్వము తన కొడుకిట్లు క్రొత్తదుర్గముల నిర్మించుచున్నా డన్న వార్తయే తెలియదు. కాన నవాబునొద్దనుండి వచ్చిన వార్త విని యతనికి తనకొమారునిపై గోపమువచ్చెను గాని, నవాబునకు గోపము రాకుండ నతడిట్లు వార్త పంపెను. 'నాకుమారుడు నన్నడుగకయేక్రొత్తకోటలను గట్టుచున్నాడు. అయినను నేనును వాడును మీ సేవకులమే. నాకొడుకు చేయుచున్నపని మీరిచ్చిన జాగీరును రక్షించుకొనుటకయి కాని, మరియొక దురిచ్ఛచే గాదనుటకు సందేహములేదు. ఇట్లు నవాబును సమాధానపరిచి శహాజీ దాదోజీకొండదేవునకును, శివాజీకిని గోపముతో నుత్తరములువ్రాసి కోటపని'

వెంటనే యాపివేయవలసినదియని యాజ్ఞాపించెను. ఈయుత్తరము చూచుకొని దాదోజికొండదేవుడు ఇన్నిరోజులు పేరు ప్రతిష్టలతో గడచినను నికమీద శివాజీవలన దనకు నపకీర్తి రాగలదని యోచించి శివాజీని దనగొద్దకు బిలిచి యిట్లనియె 'నేను మొదటినుండి చెప్పుచుడినను మీరు వినకపోయితిరి. మీయవిచారకృత్యములను విని శహాజీరాజుగారికి మిగుల కోపమువచ్చినది. మీరుచేయు దుష్టకృత్యములవలన మీగొప్ప కుటుంబమునకు హాని కలుగగలదు; మీరీ పిచ్చిపనులను జేయక మీతండ్రివలెనే నవాబులసేవ చేసి కీర్తిని బడయుడి' అందుపై శివాజీ సరియే యని తలయూపి తాను జేయదలచినపనుల నన్నిటిని నిరాటంకముగా జేయుచుండెను. ఇట్లు శివాజీ తనమాటవినక కులనాశనముగుపనులనే చేయుచున్నాడని చూచి దాదోజికొండదేవుడు చింతచే క్షీణింపసాగెను. కొన్నిదినములు గడచినపిదప నతడు మరణోన్ముఖుడైనప్పుడతడిట్లు యోచింపసాగెను. 'శివాజీ సామాన్యమానవుడుగా గానిపింపడు. అతడుచేయుచున్న పని మేమనుకొనినటుల నింద్యమయినది కాదు. అతనిమనసు త్రిప్పుటకై నేను జేసినయత్నము లన్నియు నిష్ఫలములైనవి, ఇందుచే నీతడు జేయుపని యీశ్వరునకు సమ్మతంబే యని యేల తలంపగూడదు? ఇతనిబుద్ధియు బరాక్రమమునను జూడగా నితడు నద్వితీయుడని తోచుచున్నది. ఈ వంశమున యవనులను సంహారించు శకకర్తయొకడు పుట్టగలడని యొకప్రసిద్ధి కలదు, ఆతడే యీతడేల కాగూడదు? ఇట్లు చింతించి

యాతడు మరణసమయమున శివాజీ నొద్దకు బిలిచి జాగీరు పని యంతయు నతనికినప్పజెప్పియిట్లనియె. 'నాయంత్యకాలము సమీపించినది. ఇంతవరకు మీరారంభించిన పని వలదని నివారించుచుంటినిగాని, మీబుద్ధియు, బరాక్రమమును జూచి మీరాపనిని నిర్వహింపగల రనిన నమ్మిక నాకు గలిగెను. కాన మీరిక బై ననుమానింపక. హిందూస్వరాజ్యముస్థాపింప యత్నము చేయుడి. మీకు నీశ్వరుడు నిశ్చయముగాయశము నియ్యగలడు. మీరు గోబ్రాహ్మణులను రక్షించి దేవాలయములను పాడుజేయుచున్న యవనులను సంహరింపుడి. ఇన్ని దినములు మీతండ్రిగారు నన్ను బోషించినటుల నిక బై మీరు నాకుటుంబమును బోషింపుడి-ఇంతియె నాప్రార్థన." ఇట్లుపదేశించి యావృద్ధబ్రాహ్మణుడు ప్రాణములు విడిచెను.

దాదోజికొండదేవుడు గతించినపిదప జహాగీరిసంబంధమైన సర్వస్వాతంత్ర్యంబులును శివాజీకి బ్రాప్తమయ్యెను. అప్పుడు వెనుకటివసూలుబాకీ యనుగుటకయి కర్ణాటకమునుండి శహాజీయొక్క మనుష్యులు వచ్చియుండిరి. కాని తాను ప్రారంభించిన మహాకార్యమునకు ధనమధికముగా గావలయునని యెంచి శివాజీ తనతండ్రి కిట్లు వ్రాసెను, 'వృద్ధుడయినదాదోజికొండదేవుడు మృతుడయ్యెను. ఇప్పుడుమీరు వసూ లిమ్మనిన నేనెట్లియ్య గలను ? ఇక్కడ బ్రతిదినము నాఖర్చునకె పైకము చాలకున్నది. నావ్యవహారము, సిబ్బంది యభివృద్ధిమీద నున్నది. ఇక మీదగర్ణాటకములోని యాదా

యమువలననే మీరు మీవ్యవహారములను జరుపుకొనుట మంచిది.

శివాజీ పాలింపదొడగిన జహాగీరిలో నదివరకు శహాజిచే నియమింపబడిన పురాతనాధికారులు కొందరుండిరి. వారు శివాజీ యనుజ్ఞను మించజొచ్చిరి. ఇట్లు శివాజీయొక్క యాజ్ఞను నతిక్రమించిన వారిలో చాకణ్ అను కిల్లాకు నధిపతియైన ఫిరంగాజీ నరసాళా యను వాడొకడు. వీనితో బోరాట పెట్టుకొనినయెడల నంతఃకలహములకు ప్రారంభమై తన మహోద్దేశమునకు విఘ్నము కలుగునని తలంచి శివాజీ తియ్యనిమాటలచే వాని వశపరచుకొని వాని యుద్యోగమునందే వాని నుంచెను. శివాజీకి లోబడని రెండవయధికారి సహాజీయొక్క ద్వితీయభార్యయైన తుకాబాయికి దోబుట్టువగు బాజీమోహితే. సుపాయను పరగణా ఇతనిచేతిలో నుండుటయేకాక, యితనియొద్ద మూడువందల గుఱ్ఱపురౌతులుండిరి. శివాజీ యెన్నిసారులు పిలిపించిన, నీతడతనిదర్శనమునకు వెళ్లినవాడు కాడు. శహాజీయొద్దనుండి శివాజీకి నీ స్వాధీనములో నున్న పరగణా యిమ్మని నాకు నాజ్ఞవచ్చినగాని, ఈ పరగణా మీకు స్వాధీనపరచుటకు వీలులేదు. అని శివాజీకి వార్తలంపుచుండెను. వీడు మంచిమాటలచే స్వాధీనపడడని తెలిసికొని శివాజీ యొకనాడు తన మావళాసైన్యంబును వెంటబెట్టుకొని మధ్యరాత్రి బాజీమోహితే యింటిని ముట్టడించి యతని నతనిపక్షమువారి నందరను జెరబట్టి పరగణా

యంతయు స్వాధీనపరచుకొని కర్ణాటకములో శహాజియొద్దకు బొమ్మని యతనిని వదలివేసెను.

శివాజీయొక్క జహగీరులో కొండాణా యనియు, పురందర మనియు రెండు గొప్ప దుర్గంబులుండెను. ఈ దుర్గములకు నధిపతులు బీజాపూరునవాబుచే నియమింపబడినవారు. వారు శివాజీకి బ్రథమమునుండి మిత్రులయియుండిరి. కొండాణా యను దుర్గాధిపతియగు తురుష్కునికి ధనమిచ్చి శివాజీ యా దుర్గమును స్వాధీనపరచుకొనెను. ఇంతలో బురందర దుర్గాధిపతియగు నీలకంఠీ హైబతరావు మృతిజెందెను. వానికి ముగ్గురు పుత్రులుండిరి. అందు పెద్దవాడు బీజాపూరు సుల తాను యొక్క యనుజ్ఞ లేకయే దుర్గమును స్వాధీనపరచుకొనెను. అందుకు నతనికి నతని యిద్దరుతమ్ములతో వైరము సంభవించెను! ఈతగవుతీర్పవలయునని వారుముగ్గురును శివాజీ యొద్దకు వచ్చిరి. వారి తగవుతీర్ప శివాజీ తన సైన్యముతో బురందరదుర్గముక్రింద దిగెను. శివాజీ చిన్నతమ్ముల పక్షపాతియై యుండెను. దుర్గాధిపతి కుమారులిద్దరును న్యాయనిర్ణ యమునకు నతనిని దుర్గముపైకి దీసికొనిపోయిరి. దుర్గాధిపతి పెద్దకుమారుడు నిద్రించుచున్న సమయమున జిన్నకుమారులచే నతనిని కైదుచేయించి శివాజీ తన సైన్యమును దుర్గముపైకి రప్పించి దుర్గము తన స్వాధీనపరుచుకొనెను. తరువాత శివాజీ ముగ్గురుతమ్ములను గలపి వారి పరస్పరద్వేషంబుల రూపుమాపి వారికి గొన్ని జాగీరులిచ్చి తనయొద్ద గొన్ని యధికారంబు లొసగెను. వారును శివాజీయెడ భయ

భక్తులు కలవారయి యేకనిష్ఠతో శివాజీని భజించి ఖ్యాతి వహించిరి.

ఇట్లొక సంవత్సరములోపల శివాజీ రక్తపాత మెంత మాత్రమును జేయకయే, యభేద్యములయిన మూడు ప్రచండ దుర్గములను సంపాదించి వానికంటె నధిక ప్రచండమైన యొక దుర్గమును నిర్మించెను. ఇట్లు మహారాష్ట్ర స్వరాజ్యంబునకు మూలాధారంబేర్పరచుకొని శివాజీ యింతకంటె నధిక సాహసకృత్యంబుల జేయ నుద్యమించె,

కొంకణప్రాంతము ప్రథమమున అహమదునగర రాజ్యము లోనిది యైనను క్రీ. శ. ౧౬౩౬ లో * విజాపూరు నవాబుల స్వాధీన మయ్యెను. అందలి కొంతభాగమునకు ముల్లానా అహమ్మద్ అనువాడు సుబేదారుగానుండెను. ఆప్రాంతమందు స్థలదుర్గములును పర్వతదుర్గములును ననేకము లుండెను. కాని యీ సుబేదారు డసమర్థు డగుటచే నా దుర్గంబు లన్నియు సులభసాధ్యంబులుగా నుండెను. తనచారులను బంపి శివాజీ యీ ప్రాంతములోని దుర్గరహస్యంబు లన్నియు గను గొనుచుండెను.

ఒకపర్యాయము సుబేదారునొద్దనుండి విజాపురమునకు నగదు ఖజానా పోవుచున్నదని చారుల వలన శివాజీకి దెలి సెను. ఈసంగతి తెలిసినతోడనే మూడువందల గుర్రపుసిబ్బంది తో బయలుదేరి శివాజీ యాఖజానాను నడ్డగించి దోచు

* మహారాష్ట్రులు విజాపూరు అనియు దురకలు బీజాపూరు అనియు వాడెదరు.

కొనెను. ఆ ధనమంతయు రాయగడకు దెచ్చి సురక్షితముగా నుంచెను. ఇట్లమితధనార్జనము చేసి శివాజీ వెంటనే కాంగారీ తికోనా లోహగడ్ భోరప్ కేలనా మొదలయిన దుర్గముల నన్నింటిని గెలిచి మావళా ప్రాంతము నంతయు స్వాధీనపరుచు కొనెను. తరువాత కొంతకాలములోనే శివాజీ తళే ఘోసాళే రాయరీ మొదలయిన కిల్లాలను సాధించి కొన్ని శత్రు గ్రామముల దోచికొనెను. ఇట్లు కొలదికాలములోనే శివాజీ యనేక దుర్గములను యసంఖ్యధనమును సంపాదించెను. ఈ సమాచారము లన్నియు రమారమి క్రీ శ ౧౬౪౮-వ సంవత్సర ప్రాంతమున జరిగెను.

కాని కేవలము ధనము సంపాదించుటయే శివాజీపని కాకయుండెను. ధనము సంపాదించుట యతడు తలపెట్టికొనిన మహాకార్యమున కొకసాధనము మాత్రమయియుండెను. గాన ధనము దొరకినవెంటనే శివాజీ ఆబాజిసోనదేవుడనువానిని మహారాష్ట్రములోని కల్యాణపురమువైపునకు యుద్ధమునకు బంపెను. అతడు నాకస్మికముగా ముల్లానాఅహమ్మదను ప్రాంతాధిపతిని నెదుర్కొని చెరబట్టి యా ప్రాంతములోని కోటల నన్నింటిని స్వాధీనపరచుకొనెను. ఈ వృత్తాంతము తెలిసినతోడనే శివాజీ కల్యాణమునకు బోయి యాబాజీ సోనదేవుని నాతని శౌర్యసాహసములకునై మెంతయు మెచ్చి యాతడు గెల్చిన ప్రాంతమునకు నాతనిని సుబేదారు (ప్రాంతాధిపతి)గా నేర్పరిచెను. చెరలో నున్న ముల్లానా సుబేదారుని జెర విడిపించి గౌరవించి విజాపురమునకు బోవ

సెలవిచ్చెను. చేతజిక్కిన శత్రుని నిట్లు సన్మానించి పంపుట శూరలక్షణమే కదా !

ముల్లానా సుబేదారుడు చెరజిక్కినప్పుడు వానికోడలును మరాఠావారిచేతిలో జిక్కెను. ఈ యువనస్త్రీ యతిరూపవతియైయుండెను. ఈ రూపలావణ్యవతిని మీరుంచుకొనుడియని ఆబాజీసోనదేవుడు శివాజీకి సూచింపగా నాపురుషపుంగవుడా సూచనను ధిక్కరించి యతినీతివిశారదత శోభిల్లునట్లుగా నిట్లనియె.

*" ఈ స్త్రీ నాకు తల్లితో సమానమైనది. యశస్సు కోరువారు పరస్త్రీని నభిలషింపగూడదు. పరదారాభిలాషచే రావణాదులు నశించిరి."

ఇట్లు చేతజిక్కిన సుందర యువనస్త్రీని దల్లిగా నెంచి బాధావిముక్తనుజేసి స్వజనమునొద్దికి బంపిన మహామహుని యింద్రియనిగ్రహమును, పాపభీరుతను, ఉదాత్తనీతి ప్రవర్తనమును(High moral conduct)వేయినోళ్ళ గొనియాడినను దనివితీరునా! ఇట్టి యాత్మనిగ్రహముగల రాజులరుదు కాన, నట్టి రాజశిఖామణిని లోకులు దేవతాంశ సంభూతునిగా నెంచుట యాశ్చర్యము గాదు. మహారాష్ట్రులందరును శివాజీని శివుని యవతారముగా నెంచెదరు. ఇట్లెంచుటకు గారణ మాతని యందలి యుత్తమసద్గుణములే. హిందూస్త్రీలను జెరబెట్టి భంగపరచుచున్న తురుష్కులస్త్రీ యోర్తు చేత జిక్క-

* చిటనవీసుకృతమైన బఖరు.

నామెను సత్కరించి పంపినాడన్న మాట యొక్కటియే శివాజీ యందు దేవగుణము లున్నవనుటకు జాలును.

కల్యాణప్రాంతమును గెలిచినతోడనే శివాజీ యాప్రాంతముయొక్క జమాబందిపనికి బ్రారంభించెను. లోకుల మిరాసులు మాన్యములు హక్కులు స్థిరపరిచెను. దేవస్థానములయొక్కయు, బ్రాహ్మణులయొక్కయు, నాదాయములు స్థిరపరిచి కొన్నింటిని నధికముచేసి ప్రజలకు నెల్లవిధముల సుఖముకలుగునటుల జేసి యీరాజు మాకు నెల్లప్పుడునుగాక యని వారు దేవుని బ్రార్థించునటుల బ్రశంసలుచేసెను. కల్యాణప్రాంతమునకు దక్షిణమున జింజిరాయను సిద్దీల (Negro) రాజ్యముండెను. ఆ రాజ్యములోనివియగు తళే, ఘోసాళే, రాయరీ మొదలయిన దుర్గములను శివాజి యిదివరకే సంపాదించియుండెను. ఈ సిద్దీలరాజ్యము తనకు భయపడునటుల జేయవలయునని తలచి శివాజీ రాయరిదుర్గమునకు సమీపముగా లింగాణాయను దుర్గమును ఘోసాళాదుర్గమునకు సమీపమున చిరవడీయను దుర్గమును గ్రొత్తగా నిర్మించెను.

శివాజి ఖజానాదోచుకొనెను; దుర్గములను సాధించెను. సుబేదారుని జెరబెట్టి ప్రాంతమంతయు స్వాధీనపరచుకొనెను; నూతనదుర్గములను నిర్మించెనను మొదలయిన వార్తలొకదాని వెనుకనొకటి వెంటవెంట విజాపురమునకు రాగా, నచ్చటి జనులలో సంక్షోభము పుట్టెను. గాని యిందువలన సులతానునకు మాత్ర మెంతమాత్రము భయము కలిగినదికాదు. శివాజీ చేయుసంగతు లన్నియు నీతనితండ్రి యగు శహాజియే చేయించు

చున్నాడని యతని యభిప్రాయమై యుండెను. కర్ణాటమునుండి రణదుల్లాఖానుండు తిరిగివచ్చినతర్వాత నచ్చట శహాజీయొకడే యుండుటవలన నాతనియధికారము నానాటికి నధిక మగుచుండెను. ఇదియుగాక శివాజీ చేయుచున్న యుద్ధాదు లన్నియు శహాజీయొక్క జహాగీరు సమీపమునను అతడు అధికారిగాను జేసిన ప్రాంతములలోను జరుగుచున్నందున నతనిని బట్టి కైదుచేసినయెడల శివాజీ చేయు [illegible] మంతయు నాగిపోవు నని యాతడు తలచుచుండెను. ఇట్లు తలచుచున్నవాడు గనుక సులతాను శివాజీతో బోరాడ నేమియు సైన్యములు పంపక శహాజీయొద్ద నున్న దేశముఖు బాజీఘోరపడే యనువానికి శహాజిని నాకస్మికముగా జెరబట్టి తనయొద్దకు బంపుమని గుప్తముగా వార్తపంపెను. ఇట్లు సులతాన్ మహమ్మద్ ఆదిల్ శాహా యొద్దనుండి వర్తమానము రాగా బాజీఘోరపడే యొకనాడు శహాజీని దనయింటికి భోజనమునకు బిలచి నమ్మించి క్రీ. శ. ౧౬౪౯ లో చెరబట్టెను. అతడు శహాజిని వెంటనే విజాపురమునకు నవాబునొద్దకు బంపెను.

విజాపురమునకు వచ్చిన తరువాత శహాజినిజూచి నవాబు మిగుల నాగ్రహపడి నీపుత్రుడు చేయు రాజద్రోహకార్యముల నన్నింటికిని నీవే ప్రేరకుడ వని నాకు నిశ్చయముగా దెలిసినది. నీవు నీకుమారునకు నుత్తరము వ్రాసి యతడు రాజద్రోహము మానునట్లుగా జేసిన గాని, నిన్ను జెరనుండి విడువను అని పలికెను. అందులకు శహాజి వినయముతో నిట్లనియె. నాకుమారుని రాజద్రోహమునకు నేనెంతమాత్ర

మును నుత్తరవాదిని గాజాలను. వాడు నన్నెంతమాత్రమును లక్ష్యపెట్టడు. వాడు మీయెడల రాజద్రోహముచేసినట్టులనే నాయెడలను బితృద్రోహము చేసినాడు. మీకిష్టమున్న యెడల సైన్యమునంపి వానిని శిక్షింపవచ్చును. వాని దండించుట నాకును సమ్మతమే. ఇట్లు శహాజి తన కుమారుడు ప్రారంభించిన కార్యములో దాను లేనని సులతానుతో నెంత చెప్పినను నాతడామాటలు నమ్మినవాడు కాడు. శహాజి తాను నిరపరాధినని చెప్పినకొలదిని ఆదిలషహాకు గోప మధికమయ్యెను. ఆతడు శహాజిని నొకచీకటినేలగదిలో బంధించియుంచి 'కొలది రోజులలో నీకొమారుడు మాకు శరణుచొరనియెడల ఈ గదియొక్క ద్వారము మట్టితో మూసివేసెదము,' అనిభయపెట్టెను.

తండ్రికి సంభవించిన యాపద నిమిత్తముగనే శివాజీ మిగుల చింతాక్రాంతు డయ్యెను. తాను తలపెట్టిన స్వరాజ్యసంస్థాపనంబను మహాకార్యమైన వదలివేయవలయు, లేక పరమపూజ్యుండయిన తనతండ్రియొక్క ప్రాణంబులయిన తురుష్కునిచేతిలో వదలి వేయవలయు. మూడవమార్గము లేదు. ఈ రెండుకార్యంబులును శివాజీకి దన ప్రాణములకంటె నధికప్రియంబులు. వీనిలో నొకటి వదలుటకును నిష్టములేక శివాజీ యేమిచేయుదునా యని చింతించుచుండెను. ఘనుల బుద్ధిబలంబుల బరీక్షించు ప్రసంగంబు లిట్టివియే; పామర సామాన్యుండిట్టి సమయమున నంగీకృత కార్యంబు మానుకొనును. ఘనుండు తన యమితబుద్ధిబలముచే నంగీకృతకార్యంబు పరిత్య

జింపకయే యాపదల గెలుచును. గాన నాపత్సమయముననే పండిత పామరభేదంబు తెల్లంబగు గనుక ప్రస్తుత సంకట సమయమున శివాజీ యేమిచేసెనో చూచెదము.

ఆదిల్ షహానవాబునకు శరణుచొచ్చి తండ్రిని విడిపించుకొనుటయే మేలని కొందరు శివాజీకి సలహాచెప్పిరి. కాని యా సలహా యతనికిని, నతని భార్యయగు సయీబాయికిని రుచింపదయ్యె. ఆ భార్యామణి భర్తకిట్లనియె "నవాబునకు శరణుచొచ్చి యతనిచేతిలోఁ జిక్కినయెడల మన యిష్టకార్యము (స్వరాజ్య సంస్థాపనము) సిద్ధింపదు. నవాబు మనమాట వినునటుల జేసిన మేలుకాని, యతనికి మనము లోబడుట మంచిది కాదు" ఆహా! వీరపత్నికీ మాటలు తగినవే గదా!

అందర యుపదేశము విని శివాజీ యొకయుక్తి యోచించెను. ఈ యుక్తివలన శివాజీయొక్క బృహస్పతి సమాన బుద్ధికుశలత వ్యక్తమగును. ఇన్ని రోజులవరకు శివాజీ విజాపుర రాజ్యములోనే యుద్ధములుచేయుచుండెను. ఢిల్లీరాజ్యమునకు నేంతమాత్రమును బాధ కలిగించినవాడు కాడు. ఢిల్లీశ్వరులగు మోగలు లధిక బలవంతులనియు, వారితో నిప్పుడే పోరాటపెట్టుకొనుట క్షేమకరము కాదనియు, వారితో స్నేహభావముతో నుండినయెడల విజాపూరునవాబుతో బోరాడుటకు దనకు వారెప్పుడైన సాయము చేయగలరనియు దలచి శివాజీ ఢిల్లీరాజ్యముజోలికి బోయినవాఁడు కాడు. ఈ స్నేహభావ మప్పుడు శివాజీకి నుపయోగించెను. శివాజీ తన తండ్రికి విజాపురపు నవాబువలన గలిగిన యాపద ఢిల్లీశ్వ

రుండగు శహాజిహానునకు దెలిపి యాతనిని విడిపింపుమని వేడుకొనెను. ఢిల్లీశ్వరునకు శహాజి పరాక్రమమును శివాజీ పరాక్రమమును దెలిసియున్నందున నట్టి పరాక్రమవంతుల నుపకారముచే స్వాధీనపరచుకొనినయెడల వారు తనకు దక్షిణరాజ్యములు (గోలకొండ మొదలగునవి) గెలుచుటలో సహాయము చేయగలరని యెంచి శహాజిహాను శివాజీ మహారాజునకిట్లు ప్రత్యుత్తరమంపెను. శహాజీనివిడువ వలసినదని మేము విజాపూరు సులతానునకు వ్రాయగలము మీ తండ్రి మాకు బూర్వము (అహమదనగర రాజ్యములో మన్సబ్దారు) చేసిన యుపకారము మరచి యతనిని మన్నించెదము. అతనిని మానౌకరీలో నుంచుకొనియెదము. ఇదియుగాక మీకు విశిగానైనవేల గుర్రపురౌతుల మనసబుదారియిచ్చెదము. ఇట్లు శివాజీకి వ్రాసి ఢిల్లీశ్వరుండు విజాపూరునవాబునకు శహాజీని చీకటిగదినుండి తీయునటులను, ఇతర బాధలు పెట్టకుండునటులను నాజ్ఞాపత్రిక వ్రాసిపంపెను. అందుపై శహాజికి జీగటికొట్టునుండి మోక్షము గలిగెను. ఉండి లేనటుల గొంచెము రాచచెర మాత్ర ముండెను. ఇట్లు శివాజీ తన బార్హస్పత్యబుద్ధికౌశలమువలన దన స్వాతంత్ర్యంబునకు హాని కలుగకుండ దండ్రిచెర విడిపించెను. ఈ యుక్తిని నింగ్లీషు చరిత్రకారులు రాజతంత్ర శిఖామణి (master stroke of policy) యని యభినందించియున్నారు.

తరువాత శహాజి నాలుగుసంవత్సరములవరకు విజాపురములోనే యుండెను. అంతవరకు శివాజీ విజాపురరాజ్యము నెంతమాత్రమును బాధపెట్టినవాడు కాడు. ఈ నాలుగు

సంవత్సరములును విజాపూరునవాబు శివాజీపైకి దండు పంపిన వాడు కాడు. ఇట్లు చేయుటకు వీరిద్దరకును నొకొక్కకారణ ముండెను. విజాపూరురాజ్యములో యుద్ధములు జరిపినయెడల మరల దనతండ్రిని నేలగదిలో వేయునేమో యని శివాజీకి భయముండెను. శివాజీతో యుద్ధము పెట్టుకొనినయెడల నతడు డిల్లీశ్వరునితో గలిసి తాను విజాపురరాజ్యములోనుండి సంపాదించిన స్థలము లన్నియు డిల్లీశ్వరున కిచ్చివేయునని విజాపురనవాబునకు భీతి కలిగి యుండెను. తాను డిల్లీశ్వరునకు గట్టవలసిన కప్పము కట్టనందున నతడు తనపై వెడలివచ్చునేమో యనియు, వచ్చిన వానికి శివాజీ సహాయము చేయుననియు నతనికి జంకుగలిగియుండెను. ఇట్లు ఒకరికొకరు భయపడు చున్నందున నాలుగు సంవత్సరములవరకు వారిరువురు (ఆదిల్‌షహా శివాజీ) ఒకరిజోలి కొకరు పోయినవారు కారు.

ప్రత్యక్షముగా యుద్ధమునకు రాకపోయినను విజాపూరు నవాబగు ఆదిల్‌షహా శివాజీని దొంగతనముగా జంపించుటకు యుత్నము చేసెను. కొందరు మహారాష్ట్రులను గుప్తముగా శివాజీయొద్దకు బంపెను గాని వారి దురుద్దేశము దూరదృష్టి గల శివాజీ కనుగొని వారినే బాధించెను. శివాజీ మోసగాడనియు, మోసముచే నెందరనో చంపె ననియు నింగ్లీషుచరిత్రకారులు వ్రాసియున్నారు. కాని చరిత్రమువలన, శివాజీకి మోసము నేర్పినవారు తురుష్కులే యనియు, నతని ప్రాణములు దీయవలయునని యెందరో తురుష్కులు ఎందరో తురుష్కులలో గలసిన మహారాష్ట్రులు మాయోపాయము

లచే యత్నింపగా తుదకు శివాజీ యాత్మరక్షణార్థమై మాయోపాయములు పన్నవలసినవా డాయెననియు చరిత్రము వలన స్పష్టపడ గలదు.

క్రీ. శ. ౧౬౫౭ వ సంవత్సరమున ఆదిల్‌షహా శహాజిని కర్ణాటకములోని యతని జాగిరునకు బంపెను. కర్ణాటకమునకు బోవుచు శహాజీ తనకొమారుడగు శివాజీ కిట్లు వార్త పంపెను. 'నీవు నా నిజమైన కుమారుడవైన నన్ను నమ్మించి భంగపరచి చెరబట్టిన బాజీఘోరపడేను భంగపరచి నా పగ తీర్చుము.'

శహాజీ కర్ణాటకమునకు బోయిన తరువాత కనకగిరిలో గొప్పయుద్ధములు జరిగెను. ఆ యుద్ధములో అఫ్‌జల్‌ఖాన్ అనువాని మోసమువలన శహాజీ పెద్దకుమారుడును శివాజీ యన్నయు నగు సంభాజి మృతుడయ్యెను

నాల్గవ ప్రకరణము

పునాదిని బలపరచుకొనుట

శివాజీమహారాజుయొక్క తండ్రియైన శహాజీని కైదు లేకుండజేసి యతనిని బీజాపూరు సులతాను కర్ణాట (ద్రవిడ) దేశములోని యతని సొంతజాగీరునకు బంపెనని వెనుకటి ప్రకరణములో వ్రాసియుంటిని. ఇట్లుతనతండ్రి బంధవిముక్తుడై *నవాబు చేతిలో లేకుండ బీజాపూరు వదలి కర్ణాటకమునకు బోయెనని తెలిసికొని శివాజీ తన యవనవిదారణమను నంగీకృతకార్యమును మరల ప్రారంభించెను. బీజాపురరాజ్యములో మరల మహారాష్ట్రవీరులు తమ శౌర్యమును జూపసాగిరి. శహాజీకొరకు నాలుగు సంవత్సరములవరకు బయటబడక లోలోపల రవులుకొనుచున్న శివాజీ శౌర్యాగ్ని తండ్రి బంధవిముక్తతతో బ్రజ్వలించెను. ఇటుల నేసమయమునందేపని మానవలయునో యేకాలమున నేకార్యము ప్రారంభింపవలయునో తెలిసి ప్రవర్తించుటయే సారాసార విచారము.

---

* నవాబు శబ్దమును సులతాను గించిద్భిన్నార్థకము లయినను జనసామాన్య వ్యవహారము ననుసరించి యీ శబ్దములు పర్యాయపదములుగా వాడబడును. సులతాను పదమునకు నాంధ్రంబున సురతాను అనియు సంస్కృతమున సురత్రాణ అనియు రూపాంతరములు గలవు.

శివాజీ యేఁడు సంవత్సరముల క్రిందట సంపాదించిన రాజ్యమునకు సమీపముగా జంద్రరావుమోరే యను మరాటీ జాగీరుదారుఁ డుండెను. అతఁడు జావళియను గ్రామము తన రాజధానిగా నేర్పరచుకొనెను. అతఁడు శివాజీకులస్థుఁడే. సమానజాతివాఁడయినందున నతనిని తనపక్షమునకు ద్రిప్పుటకు శివాజీ యెంతయో ప్రయత్నించెను కాని చంద్రరావు శివాజీ ప్రారంభించిన క్రొత్త యుద్యోగమునకు ననుకూలుఁడు కాకపోయెను. నీపక్షము నేనవలంబింపనని స్పష్టముగా శివాజీతో జెప్పక సగమనుకూలముగాను, సగము ప్రతికూలముగాను ప్రవర్తించుచుండెను. ఇంతియె కాదు. పైకి మీఁదు పెద్దలన మీఁదు పెద్దలని సృగాలవినయములు బలుకుచు గపటోపాయములచే * శివరా యని జంప యత్నించుచుండెను. బాజిశ్యామరాజను వాఁడు మోసముచే శివాజీని జంప యత్నించి భంగపడెనని క్రిందటి ప్రకరణములో వ్రాసియుంటిమి. ఆమోసమునకు చంద్రరావుమోరే యను జాగీరుదారుఁడును సహాయుఁడుగా నుండెను. ఇట్లు చంద్రరావు గొప్ప మోసగాఁడనియు, నతఁడెప్పుడే యుపాయముచే దనప్రాణమునకు మోసము దెచ్చి తనయంగీకృత కార్యంబయిన స్వరాజ్యస్థాపనమునకు భంగము కలిగించునో యనియు దలంచి యుక్తుల పుట్టినిల్లయిన శివాజీ యతనిని యుక్తిచే దొలగింప నిశ్చయించెను.

* శివాజీ శివునియవతారమని మహారాష్ట్రుల యభిప్రాయమైనందున శివాజీకి శివరాయ శివరాజ శివఛత్రపతి యను పదము లన్నియు బర్యాయ శబ్దములుగా వాడఁబడును.

చంద్రరావు బలవంతుడును గాయుక్తిపారీణుడు నయి నందున ప్రత్యక్షముగా యుద్ధముచేసి యతనిని గెలుచుట దుర్ఘటమని తలంచి యతనిమోసమునకు ప్రతియగు మరియొక మోసము శివాజీ కల్పించెను. చంద్రరావు కుమార్తెను దన కిమ్మని శివాజీ చంద్రరావునకు వర్తమాన ముంపి యావివాహ మును గురించి రాయబారము చేయుటకు రాఘోబల్లాలు సభాజీకావజి యను తన సరదారుల జంద్రరావునొద్దకు బంపెను. ఆ మాయురాయబారులు తాము పిల్లను గురుగ్చు టకు వచ్చినారమని పైకి జెప్పుచు జంద్రరావునొద్దకు మాటి మాటికి వెళ్ళుచు దాము గుదర్చ వచ్చినారమనిన చుట్టరికము గురించి మాటలాడుచు దాము వచ్చినకార్యమెట్లుల నెర వేర్పవలయునో యోజింపుచుండిరి. అక్కడి లోకులలో గలసి మెలసి వర్తించుచు వారి గుట్టంతయు, గనుగొని యచటివారిలో బరస్పర కలహములు గలవనియు, యుక్తిచే జంద్రరావును జంపిన రాజ్యమంతయు శ్రమ లేకయే మనస్వాధీన మగుననియు శివాజీకి దెలిపిరి. అందుపై శివాజీ వారిసాహాయ్యమునకు గుప్తముగా సైన్యమంపి వెనుకనుండి తానును రాయగడము వదలి యెవరికి దెలియకుండుటకై రాత్రిప్రయాణము చేసి మహాబళేశ్వరమునకు వచ్చెను. చంద్రరావుమోరేయొక్క జావళీ గ్రామము మహాబళేశ్వరమునొద్ద నుండెను.

ఇట్లు చేయవలసిన పూర్వప్రయత్నము లన్నియు సిద్ధ ముగా నుంచుకొని రాఘోబల్లాళుడు (శివాజీ జావళికి బంపిన రాయబారులలో నొకడు) ఒకనాడు చంద్రరావును నతని

తమ్ముఁడగు సూర్యారావును రహస్యము మాటలాడుట కయి యేకాంతమునకు బిలుచుకొనిపోయి విశ్వాసఘాత మొనరించి వారిని జంపెను. ఈసంగతి తెలిసి చంద్రరావు సైన్యము వారి పైకి రాగా, నా రాయబారు లిద్దరు నరణ్యములోనికి బారి పోయిరి. అక్కడ శివసైన్యములు వారికి సాయము చేయుటకు సిద్ధముగా నుండెను. వా రొక్కపట్టున నలుప్రక్కలనుండి జావళీ గ్రామమును ముట్టడించిరి. చంద్రరావు మంత్రియగు హిమ్మతరావును, జంద్రరావుయొక్క యిద్దరు పుత్రులును, శివాజీ సైన్యమును మిగుల శౌర్యముతో నెదిరించిరి. కాని తుదకు కృతజ్ఞతావిభూషితుండగు మంత్రిపుంగవుండా యుద్ధములో దెగెను. చంద్రరావుపుత్రులు చెరబట్టబడిరి. ఒక నిముసమైనను వ్యర్థపుచ్చక శివాజీ యా ప్రాంతము నతిశీఘ్రకాలములో స్వాధీన పరచుకొనెను. ఈ రాజ్యములోని వాసోటా సావతరేభోరే యను దుర్గములు శివాజీకి విశేష లాభప్రదములయ్యెను. ఈ సమాచారము లన్నియు క్రీ. శ. ౧౬౫౫ వ సంవత్సరములో జరగెను. శివాజీయొద్ద చెరలో నుండియు జంద్రరావు కుమారులు బీజాపూరు నవాబునకు వార్తలంపుచు నతని సాయముచే శివాజీని నడచుటకు యత్నించుచున్నందున శివాజీ వారినిగూడ వధింపవలసిన వాడాయెను. గాని వారి భార్యాపుత్ర సేవకాదుల నందరును వదలిపెట్టెను.

పైని వర్ణింపబడిన చంద్రరావుఘాతవృత్తాంత మంతయు శివాజీచరితములో నొక గొప్ప కళంకమనియు, నతను నీతివిహీను డనిచూపుటకు గొప్ప నిదర్శన మనియు గొందరు

నవనీతివిశారదులగు చరిత్రకారుల యభిప్రాయమైయున్నది. ఈయభిప్రాయము బొత్తిగా ననాదరణీయ మని చెప్పుటకు వీలులేదు. కాని యీనవనీతివిశారదు లారోపించునంతదోషము నకు శివాజీ పాత్రుడు కాడని మరికొందరభిప్రాయ పడు చున్నారు. చంద్రరావు శివాజీనినాకస్మికముగాజంపయత్నించిన వాడును, సమయముదొరకినప్పు డెల్లయిన జంపయత్నిం చుచుండినవాడును నయి యుండె నని యీమాట జ్ఞప్తినుంచు కొనినయెడల నతని జంపినందునకు శివాజీయం దారోపింప బడిన దోషములో ముప్పాతిక మూడువీసములదోషము తగ్గును. కథాసందర్భమంతయు జూడగా రాజ్యలోభము చేత గాక తనప్రాణరక్షణార్థమె శివాజీ చంద్రరావును జంపవలసిన వాడాయె నని తోచుచున్నది. తన్ను మోసపుచ్చినవానిని, మోసపుచ్చ నున్నవానిని మోసపుచ్చిన నెంతదోష ముండునో యంతదోషముకంటె నధికదోషము శివాజీపై నారోపింపరా దనుటకు సందేహము లేదు.

చంద్రరావుని జంపి జావళీగ్రామము సంపాదించినతరు వాత కొలదిరోజులకు శివాజీ రోహిడా యనుదుర్గమును నెకా యకి రాత్రిముట్టడించెను. ఆ కిల్లామీదనున్న దేశముఖు మిగుల శౌర్యముతో బోరాడెనుగాని, శివాజీసైన్య మధికమగుటచే నత డోడిపోయి వీరశయనము నొందెను. అతని దివాన్ అగు బాజీపరభూ అనువాడాయుద్ధములో నత్యద్భుతముగా యుద్ధముచేసి తనయమితస్వామిభక్తిని వెలిపరచెను. యుద్ధము సమాప్తమయి దుర్గము జేత జిక్కిన పిదప శివాజీ యాబాజి

పరభూను మిగుల నాదరించి యతని పూర్వాధికారము, పూర్వపుజాగీరును నతనికిచ్చి యతనినిదనయొద్దనుంచుకొనెను. అతని చేతిక్రింద గొంత సైన్యము నుంచెను. ఈబాజీపరభు * తుదవరకు నద్వితీయస్వామి భక్తితో శివాజీకార్యముల నిర్వహించుచుండెను. ఈదుర్గముక్రింద నున్న ప్రాంతమునకు హిరడస యనిపేరు.

ఇట్లు జావళీప్రాంతము, హిరడసప్రాంతము సంపాదించిన పిదప నాప్రాంతములను గాపాడుటకై శివాజీ కృష్ణానది యొక్క యుగమమునొద్ద (మహాబళేశ్వరసమీపమున) నొక నూతనదుర్గము నిర్మాణింప నెంచెను. ఈదుర్గనిర్మాణకార్యము నిర్వహించుటకు మోరోత్రిమలపింగళెయను బ్రాహ్మణసరదారుని నియమించెను. ఈతడు నా నూతన దుర్గమును శత్రువులకు నభేద్యముగా క్రీ. శ. ౧౬౫౬ వ సంవత్సరములో గట్టించెను. అప్పటినుండి మోరోత్రిమలపింగళేపై శివాజీకరుణ శుక్లపక్ష చంద్రునివలె నభివృద్ధి జెందెను. ఆ దుర్గమునకు ప్రతాపగడ్ అని నామమిడిరి.

ఇట్లింతవరకు శివాజీ బీజాపూరు నవాబుయొక్క రాజ్యములోను, నా రాజ్యములోనున్న యితర సంస్థానపతుల సంస్థానములలోను, అల్లకల్లోలము చేయుచుండెనే కాని, ఢిల్లీశ్వరుని రాజ్యములోనికి గాలుపెట్టలేదు. ఢిల్లీశ్వరుడు సార్వభౌముడు. అమితబలమును అమితధనమును గలవాడు. ఆత

* పరభు అనినశబ్దము ప్రభు అనుసంస్కృతశబ్దమునకు మహారాష్ట్రి తద్భవము. ఈపదము మహారాష్ట్రములోని యొకజాతిని దెలియజేయును.

నితో మొట్టమొదటనే పోరాటపెట్టుకొనిన నిలుచుట దుస్తరమని యెంచి, శివాజీ యింతవరకు ఢిల్లీశ్వరునిజోలికి బోయినవాడు కాడు. ఇప్పుడు కొంతధనము సంపాదించి, కొన్ని సంస్థానములగెలిచి యనేకదుర్గముల నాక్రమించి ప్రబలినపిదప శివాజీ ఢిల్లీశ్వరుని ప్రాంతంబులపై దండువెడలుటకు ప్రారంభించెను. ఈసమయమున * ఢిల్లీశ్వరుని స్థితియు దక్షిణములో నతని క్రిందనున్న రాజ్యముయొక్క స్థితియు జక్కగ దెలిసినగాని, తత్సంబంధమైన శివచరిత్రము బోధపడజాలదు, గాన దానిని గురించి యిక్కడ సంక్షేపముగా వ్రాసెద.

అప్పటి ఢిల్లీబాదుషహా నామము షహాజహాన్ * దక్షిణములోని రాజులందరు వేరికైనను నతనికి సామంతులుగా నుండిరి. అయినను వీరందరు మనసువచ్చినప్పుడు ఢిల్లీశ్వరుని మాట వినుచు మనసురానప్పుడతనిని ధిక్కరించుచునుండిరి. గాన వీరి నందరను దండించుటకును, వీలయినయెడల వారిని రాజ్యమునుండి తొలగించుటకును ఢిల్లీశ్వరుడు యత్నించుచుండెను. ఢిల్లీశ్వరుడు శివాజీ తండ్రియగు శహాజీచే రక్షింపబడుచుండిన యహమదనగర రాజ్యమును బాదుచేసెననియు

---

* దిల్లీ ఢిల్లీ యుభయ రూపంబులును వాడుకలో నున్నవి.

* దక్షిణమనగా నర్మదానదికి దక్షిణమునున్న హిందూదేశమంతయు నని యర్థము. వింధ్యపర్వతమునకు నుత్తరమున నున్నదంతయు నుత్తరమనియు, దక్షిణమున నున్నదంతయు దక్షిణమనియు గొందరు చెప్పెదరు. దక్షిణమునకే తురకమున 'దక్కన్'. దానిననుసరించియే ఇంగ్లీషులో 'Deccan' అనియెదరు.

నంములో కొంచెముభాగము బీజాపూరు నవాబునకిచ్చి కడమ భాగ మంతయు దనక్రింద నుంచుకొనెననియు వెనుక (ప్రథమ భాగములో) వ్రాసియున్నాను. దక్షిణములోని తన రాజ్యము నకు సుబేదారుగా దన నుమూడవకుమారుడగు ఔరంగ జేబును నియమించి యతనిని క్రీ శ. ౧ ౫౦ సంవత్సరములో దక్షిణమునకు బంపెను. ఔరంగజేబు విద్యావంతుడును, బుద్ధి కుశలత గలవాడును నగుటచే నతడు సహాయమునకు వచ్చి ప్రాంత మంతయు నతడు సుభిక్షముగా (ఆబాద్) జేసెను. కొంచె పాటి పన్ను లేర్పరిచి భూమియంతయు బాగుపరిచెను. ఖడకీ యనుగ్రామమును రాజధానిగా నేర్పరిచి దానికి దననామము ననుసరించి ఔరంగాబా దని పేరుపెట్టెను.

ఔరంగజేబుయొక్క గొప్పగుణము రాజ్యతృష్ణ. దక్షిణమునకు వచ్చినప్పటినుండియు గోలకొండ నెట్లు కూల్ప వలయును, బీజపూరు నెట్లు పెల్లవలయు ననిన యాలోచనలే చేయుచుండెను. క్రీ. శ. ౧౬౫౫ వ సంవత్సరములో గోల కొండ నవాబులకు, నతనిమంత్రి యగు మిర్ జుమ్లా యను వానికిని వైరము సంభవింపగా నౌరంగజేబు మంత్రిపక్షమవ లంబించి గోలకొండమీదికి దండెత్తిపోయి నవాబు నోడించి యతనియొద్దనుండి కోట్లకొలది ధనము పుచ్చుకొని యతని కూతును దనకుమారుడగు సులతానుమహామ్మ దనువానికి బెండ్లి చేసెను,

ఇట్లొక రాజ్యమునొంచి బీజాపూరు రాజ్యముపైకి నేదియో కారణముచే దండువెడల యోజించుచుండెను.

ఇంతలో విజాపూరునవాబగు మహమ్మదు ఆదిల్ షహా క్రీ. శ. ౧౬౫౬ లో మృతిజెందెను. వాని కుమారుడగు రెండవ అల్లీ ఆదిల్ షహా రాజ్యాసనారూఢు డయ్యెను. అప్పు డాతని వయస్సు పందొమ్మిది సంవత్సరములు. అప్పు డాతని రాజ్యము సుస్థితిలో నుండి బొక్కసములో జాల ధన ముండెను. ఇవి యన్నియు జూచి ఔరంగజేబు దురాశ యధిక మయ్యెను. ఢిల్లీశ్వరుని యనుజ్ఞ వడయకయే రాజ్యారూఢు డయినా డనినయపరాధ మొకటి క్రొత్త నవాబుపై మోపి ఔరంగజేబు బీజాపురముపై దాడిని వెడల నిశ్చయించెను. తాను సాయముచేసిన గోలకొండమంత్రి గొప్ప సైన్యముతో వచ్చి తన్ను గలిసికొనగా నాతడు దండయాత్ర వెడలెను. అప్పు డనగా క్రీ. శ. ౧౬౫౭ వ మార్చినెలలో శివాజీ ఔరంగజేబు కిటుల వ్రాసపంపెను. 'మేము మొదటినుండియు ఢిల్లీశ్వరునిసేవకులము. ఇక ముందును నటులనే యుండెదము. మేము విజాపుర రాజ్యములో గెలిచిన రాజ్యమంతయు మాక్రిందనే యుంపవలసినది. అటులనే కొంకణప్రాంతములోని దాభూల్ మొదలయిన ఠాణాలన్నియు మా యధికారములోనే యుండునది.' ఔరంగజేబు మహాసంతోషముతో నీ యుత్తరమును స్వీకరించినవాని వలె నటించి యందులోని యంశములన్నియు దనకుసమ్మతములని సూచించెను. ఇంతియకాదు. శివాజీని జూడ దనకు జాల నభిలాష మున్నదనియు, నొకరినొకరు కలిసినయెడల ననేక రహస్యములు మాటలాడవలసి యున్నవనియు బీజాపూరిరాజు నోడించుట యిద్దరకు నావశ్యకమే గనుక శివాజీ హితమే తన

హితమనియు, దనహితమే శివాజీ హితమనియు బహునీతులుపన్యసించెను. కాని ఔరంగజేబుకంటె, జిత్తులలో శివాజీ రెండు కమ్ము లధికము చదివినవాడయినందున ఔరంగజేబు మాటలు నమ్మి యతనియొద్దకు బోక "మేము మీకు సామంతులము. మీ యాజ్ఞ మాకు శిరమున వంద్యము" అని శుష్క సమాచారములు పంపుచు గాలము గడపెను.

ఔరంగజేబు బీజాపురముపై కత్తికట్టుకొని పోగా నచ్చటివారును జేతనయినంతవరకు బోరాడిరి. కాని నవాబు చిన్నవాడయినందునను, సరదారు లందరును నొక్కచోట లేనందునను, నొక్క మనసుగలవారు కానందునను వజీరు స్వామిద్రోహియై ఔరంగజేబుతో గలసినందునను, నవాబు జర్జరుడై కోటిరూపాయలును మరియేపదార్థము లడిగిన నా పదార్థములు నిచ్చి సంధిచేసికొన సిద్ధుడయ్యెను గాని, వీలయిన యెడల విజాపూరు రాజ్యమంతయు ఢిల్లీరాజ్యములో గలిపి నవాబును జెరబెట్టవలయునని ఔరంగజేబు చూచుచుండెను.

ఇచ్చట శివాజీ తియ్యనిమాటలతో నౌరంగజేబును విజాపురముపైకి బంపి తాను నతనిరాజ్యములోనికి జొరబడెను. ఢిల్లీవారికిని, విజాపూరువారికిని యుద్ధము జరుగుచున్నందున నదిబహుదినములవరకు జరుగుననియు, వారిరువురును బోరాటలో మునింగియుందురు గాన, వారి రాజ్యములలో యథేచ్ఛముగా విహరించి స్వరాజ్యాభివృద్ధియు, ధనాది సంగ్రహమును జేయవచ్చునని తలచి శివాజీ యా కార్యమునకు బ్రారంభించెను. మొగలులు (ఔరంగజేబు మొదలయినవారు) విజా

పురమునకు వెళ్ళగానే శివాజీ ఢిల్లీశుని జున్నరను గ్రామము దోచుకొనెను. ఈదోపిడిలో నతనికి మూడులక్షల మొహరీలు, రెండువందల గుఱ్ఱములు మరికొంత ధనము దొరకెను. ఈ ధన మంతయు స్వయముగా పూనా పట్టణమునకు దీసికొని పోయి యచ్చటినుండి యాశ్వికులచేత రాయగడమునకు బంపి అహమదనగరపట్టణము దోచుటకు వెడలెను. శివాజీ దొంగత్రోవ నెకాయకి అహమదనగరముపైకి వచ్చినను గోటలోనివారికా వృత్తాంతము త్వరగా దెలిసినందున, వారు గుఱ్ఱపురౌతుల బంపిరి. అందువలన శివాజీకి విశేషధనము దొరకలేదు. అక్కడ ౨౦౦ గుఱ్ఱములు ౪ ఏనుగులు మాత్రము దొరకెను. శివాజీ భయము విడిచి స్వతంత్రరాజువలె నిట్లు ఢిల్లీ రాజ్యములోను దన మహారాష్ట్ర సాహసమును జూపసాగెను.

పూనాకు వచ్చిన తరువాత శివాజీ యొకగొప్ప యాశ్విక సైన్యమును నిర్మించుటకు బ్రారంభించెను. ఇదియె విఖ్యాతి వడసిన మరాటగుఱ్ఱమునకు మూటస్థము. జున్నురు, అహమద నగరములనుండి తెచ్చిన గుఱ్ఱములను మూలాధారముగా నేర్పరుచుకొని అశ్వసైన్యము నిర్మింపసాగెను. అన్నిదిశలకును మనుష్యుల బంపి సైన్యమునకు నుపయోగకరము లగు నుత్తమాశ్వముల ననేకముల గొని తెప్పించెను. సైనికుల కందరకు నశ్వారోహణముచేసి యుద్ధముచేయుపద్ధతి నేర్పెను. శిలేదారులను, చిన్నచిన్న యశ్వసేనాధిపుల నియమించెను. ఇంతకుబూర్వ మతనియొద్ద మాణకొజీదు తొండే యను తండ్రికాలమువాడగు నొక విశ్వాస పాత్రుడయిన హావలదారు డుండెను. అతని

యొద్ద గుఱ్ఱపురౌతుల యొక చిన్న గుంపుమాత్ర ముండెను. అతనికి శివాజీ 'సర్ నౌబత్' అను బిరుదు నొసంగియుండెను. ఆతడు మృతిచెందగా నతనిపనిమీద శివాజీ గొప్పవంశస్థుడును, తెలివిగల శిలేదారును నయిన నేతాజీపాల్కర్ అనువానిని నియమించెను. అటులనే బహుదినములనుండి తన దివాన్‌గా నున్న శామరావుపంతునకు 'పేషవా'*యను పదవి యొసంగెను. అతనికి రాజ్యకార్యసంబంధ మైనట్టియు Administrative కొంత యుద్ధసంబంధ మైనట్టియు (Military) రెండు అధికారములుండెను. బాలాజి విశ్వనాథుడు మొదటి పేషవా యని అన్ని ఇంగ్లీషు చరిత్ర గ్రంథములలోను, కొన్ని మహారాష్ట్రచరిత్ర గ్రంథములలోను వ్రాయబడి యున్నది. కాని యీలాగు వ్రాయుట న్యాయముకాదు. బాలాజివిశ్వనాథుని కాలమునుండి పేష్వాలు ఇతరదేశములలో విశేషవిఖ్యాతు లయిరి. ఇంతయే. కాన శ్రీశివాజీచే 'పేషవా' పదవి ప్రప్రథమమున నెవ్వరికీయబడెనో, యీ శామరావుపంతులే † మొదటి పేషవా యనుటకు సందేహము లేదు. GSN Reddy

ఈ ప్రకారముగా ఔరంగజేబు విజాపూరుపట్టణముతో ఘోరముగా బోరి దానిని మ్రింగుదునా యని తలంచుచున్న

---

*'పేషవా' యనగా ప్రధాని యని యర్థము 'ప్రధానః పేష నామకః' అని రాజవ్యవహారకోశము. ఈకోశము శివాజీ కాలములోనే నిర్మింపబడిది.

† మహారాష్ట్రమున ఆదరార్థమున వాడబడు 'పంత' శబ్దమును తదర్థముననే తెలుగు లుప్రత్యయముతోడ వాడబడు 'పంతులు' శబ్దము భిన్నశబ్దములుగాక యొకశబ్దమే యైయున్నది. గాన శామరావుపంత్ అనుటకు మారుగా 'శామరావుపంతులు' అని వాడబడినది.

సమయమునను ఒకయద్భుతమైన యశ్వసైన్యము నిర్మించి యిద్దరు తురకలు ఒకరితో నొకరు పోరాడుచుండ నిద్దరను స్వాహా చేయుదునా యని శివాజీ యోజించుచున్న సమయమునను, ఉత్తరహిందూస్థానములోన నొక్క గొప్పరాజ్యక్రాంతి (Revolution) ప్రాప్తించెను. అది యేది యన:—

ఢిల్లీశుండును, ఔరంగజేబుతండ్రియు నగు షహాజహాన్ బాదుషహాకు నాకస్మికముగా వ్యాధిసంభవించి జీవించియుండుట దుస్తరమయ్యెను. అతనికి నలుగురు కుమారు లుండిరి. పెద్దవాడు దారా. వాడు తండ్రియొద్దనే యుండి రాజ్యకార్యములను జూచుచుండెను. కడమ ముగ్గురిలో నొకడు బంగాళదేశములోను, నొకడు గుజరాతదేశములోను ఒకడగు ఔరంగజేబు దక్షిణములోను నుండిరి. తండ్రిదేహస్థితి తెలిసినతోడనే పెద్ద యన్న రాజ్యమంతయు నాక్రమించుకొనునేమో యని ముగ్గురు తమ్ములును దమతమ సైన్యములతో ఢిల్లీకిబోయిరి. ఇట్లు ఢిల్లీ బోవలసినవా డయినందున ఔరంగజేబు బీజాపూరు యుద్ధము చాలించి నవాబు ఇచ్చెద నన్నధనము తీసికొని యాతనితో సంధిచేసి ఢిల్లీకి బోయి యన్నదమ్ముల జంపి కొంచెము బాగయినతండ్రిని చెరసాలలో నుంచి క్రీ. శ. ౧౬౫౮ వ సంవత్సరమున ఢిల్లీతక్తు నెక్కి బాదుషహా యయ్యెను.

ఇట్లాకస్మిక కారణమువలన నౌరంగజేబు బీజాపూరు నవాబుతో సంధిచేసికొని ఢిల్లీకి వెళ్ళవలసినవా డయినందున వీరిరువురకు బహుకాలమువరకు యుద్ధము జరుగుననియు, వారి కలహమువలన దనకేమో లాభముకలుగుననియు, శివాజీ

తలంచిన తలంపు లన్నియు నిరర్థకంబులయ్యె. ఔరంగజేబు సంధిజేసికొని తిరిగి రాగలడని విన్నతోడనే మిగుల నమ్రతతో, నతనికి విజాపురమునకు శివాజీ యిట్లు వ్రాసి పంపెను.—— 'నావలన తప్పయినది అందునకు క్షమింపుము. మేము బాదుషహా సామంతులము; మీరు చెప్పినపని చేయుటకు సిద్ధముగా నున్నాము.' ఔరంగజేబు ఉత్తరమునకు వెళ్ళునప్పుడు శివాజీ తన రాయబారియగు కృష్ణాజిభాస్కరు అను వానిని నతనియొద్దకు బంపి యిట్లు విన్నవించుకొనెను. 'ఇదివరకు జరిగిన యపరాధమునకై మాకు బశ్చాత్తాపము కలిగినది. ప్రస్తుతము మీకు సాహాయ్యముచేసి యిదివరకు జేసిన యపరాధము లన్నియు లేకుండ జేసికొనదలచి మీకొరకు మేము గుఱ్ఱముల దండునుసిద్ధపరిచి యుంచినాము మీయాజ్ఞ యైనయెడల మీ సహాయార్థమై దాని నుత్తరమునకు బంపెదము. దక్షిణమున నున్న మీ రాజ్యమంతయు మేము కాపాడగలము. కాని ఢిల్లీ బాదషాహి రాజ్యములో మాకు బూర్వమునుండి వచ్చుచున్న దేశముఖీగిరి సంబంధమైన హక్కులు మావి మాకిప్పింపగోరుచున్నాము. మాహక్కులు మా కిచ్చిన మీ సేవచేయుటకు మేము సిద్ధముగానున్నాము. ఇదియుగాక కొంకణప్రాంతమంతయు విజాపురమువారి ప్రభుత్వము క్రింద బాడయిపోయినది. ఆ ప్రాంతము మీరు మా కిచ్చినయెడల మీకు మే మధికలాభము గనబరిచెదము.

ఔరంగజేబునకీ వర్తమానమునందలి యంతరార్థము తెలియకపోలేదు. కాని యుత్తరమునకు స్వకార్యార్థియై వెళ్ళ

వలసినవా డయినందున నిప్పుడు దక్షిణములో బోరాట పెట్టుకొనుట క్షేమకరము కాదని యెంచి యుక్తితో శివాజీ కిట్లు ప్రత్యుత్తరమంపెను:—'నీవు రాయబారిద్వారా పంపిన వార్త తెలిసినది. నీ పూర్వాపరాధము లన్నియు క్షమింపబడియె. ఇకమీద మరల దప్పులు చేయవలదు. మా రాజ్యములో నీకుగల దేశముఖు హక్కులనుగురించి సవిస్తరముగా విన్నవించుటకు మాయొద్దకు సోనదేవపండితుని (ఆబాజీ సోన దేవుడను వానిని) పంపిన మేము దానిని గురించి యోజింపగలము. మీహక్కులుమీకు ప్రాప్తముకాగానే మా సాహాయ్యమునకు నైదువందల గుఱ్ఱపురౌతుల నుత్తరమునకు బంపవలసినది. దక్షిణములోని మా రాజ్యమును గాపాడుచుండునది' ఇట్లు తియ్యనిమాటలతో శివాజీని సమాధానపరిచి యుత్తరమునకుబోయి రాజ్యము సంపాదించినపిదప శివాజీ గర్వమడపవచ్చును. అంతవరకు వీనిని మంచిమాటలచే మనకు ననుకూలునిగానే యుంచుకొనవలెను. అని తలచి ఔరంగజేబు ఉత్తరమునకు బోయెను. ఔరంగజేబు చెప్పినప్రకారము శివాజీ తన హక్కులను గురించి ఔరంగజేబునొద్దకు వకీలును బంపనూలేదు. గుఱ్ఱపుదండును బంపి ఔరంగజేబునకు సాహాయ్యము చేయను లేదు. ఈప్రసంగము జరిగినతరువాత నాలుగు సంవత్సరములవరకు ఈ విఖ్యాత వీర ప్రతివీరులకు మరల బ్రసంగము జరగలేదు.

ఔరంగజేబునకును విజాపురపు నవాబునకును సంధి కలిగి నందున నవాబు తనయొద్దనున్న సైన్యములో నేడువందల

తురుష్క సైనికుల దగ్గించెను. నిరుద్యోగు లయిన యా శూర యవనులు శివాజీ యొద్దకు నుద్యోగమునకై వచ్చిరి. శివాజీ వారి నందరను దగినజీతముల నేర్పరచి తనయొద్ద సైనికులగా నుంచుకొని, వారిపైని రఘునాథబల్లాలు డను మహారాష్ట్ర శూరుని నధికారిగా నేర్పరిచెను. ప్రస్తుతము మన దొరతనము వారు హిందూశిపాయీలపై నింగ్లీషు నధికారుల నుంచినటు లనే శివాజీ తన తురక బంట్లకు మరాట యధికారిని నియమించెను. ఇందువలన నితని దీర్ఘదృష్టి స్పష్టమగుచున్నది. హిందూ సిపాయిలు ఇంగ్లీషువారి సేవ కృతజ్ఞతతో జేసి నటు లనే యా శూరయవనులు శివాజీకి ననేకయుద్ధములలో నమిత సహాయము చేసిరి. ఇందువలన శివాజీయందు తురకలను గూడ సంతోషపెట్టి తనభక్తులను జేసుకొను కౌశల్య ముండె నని చెప్పుటకు సందేహాము లేదు.

ఈ తురకబంట్ల సహాయముచేతను, మరికొందరు సైనికుల బాగుచేసి వారి సాహాయ్యముచేతను శివాజీ కొంకణ ప్రాంతములలో సముద్రపుటొడ్డున నున్న కొన్నిదుర్గములను సంపాదించెను.

కొంకణములో జంజిరా యను సముద్రదుర్గము కలదు. ఆదుర్గాధిపతి యగు సిద్దీఫత్తేఖానునిరాజ్యము కొంకణములోనే యాదుర్గము చుట్టుండెను. ఈఫత్తేఖానుడు సిద్దీయన నీగ్రో (Negro)జాతివాడు. మొదట వీడును వీనియాధిపత్యముక్రింద నున్న జంజిరాప్రాంతమును అహమదనగరరాజ్యముక్రింద నుండెను. ఆరాజ్యము నాశన మొందినతరువాత వాడు విజాపూరు

నవాబునకు సామంతుడయ్యెను. వానియొద్ద సముద్రముపై యుద్ధముచేయుటకు దగినయోడ లనేకము లుండెను. అందుచే సముద్రమువిూద వాని నెదిరించువాడెవ్వఁడు లేడయ్యెగనుక వానిని గెలుచుటకు శివాజీ తన పేష్వా యగుశామరావు పంతును సైన్యములతో బంపెను. కాని శత్రువులరాక ఫత్తే ఖానునకు ద్వరగా దెలిసినందున వాడే ప్రతివ్యూహము పన్ని పేషవాను క్రీ. శ. ౧౬౫౯ లో నోడించెను. ఈ పరాజయము వలన శివాజీకి జాల చింతగలిగి యతడు శామారావుపంతును పనినుండి చాలించి * మోరోత్రిమలపింగళే యను సరదారు నకు పేషవాయను బిరుదు నొసంగెను. ఇతడు రెండవ పేషవా. కొంత సైన్యము వెంటతీసికొని రఘునాథ బల్లాళు డను సరదారు జంజిరా సిద్దిపైకి బోయెను. కాని సిద్దీని వంప

* ఈపేషవా పేరు మోరోపంతు, 'మోరో' అనునది యీ శబ్దముయొక్క హ్రస్వస్వరూపము. ఇతనితండ్రి పేరు త్రిమలపంతు. ఇంటిపేరు పింగళే. యీమూడుకూడి మోరోత్రిమలపింగళే యను పేరాయెను. మహారాష్ట్రిలలో ప్రథమమున దమపేరు పిదప తండ్రిపేరు, తరువాత ఇంటిపేరు వ్రాయు, నాచారముకలదు. ఇతనిఇంటిపేరును గురించి కొంత విచారింపవలసియున్నది. మహారాష్ట్రములోని పింగళేవారును ఆంధ్రదేశమునందలి పింగలివారును ఒకయింటివారేయని తోచెడిని "మోరోత్రిమలపింగళే" నామములోని 'త్రిమలశబ్దము 'తిరుమల' శబ్దమే. ఈపేరు మహారాష్ట్రములో లేదు। తిరుమలయ్య తిరుమలమ్మ, తిరుమలాచార్యులవారు మొదలయిన నామములాంధ్రదేశంబునవాడుకలో నున్నవి. కాన మహారాష్ట్ర 'పింగళే' లు ఆంధ్ర 'పింగలి' వారే దేశాంతరంబునకు బోయినందున ఆదేశాచారముల వే గ్రహించియుందురు. తమ

లేక పోయెను. అందుపై శివాజీ గొప్ప సైన్యమిచ్చి పేష్వా యగు మోరోపంతుపింగళేను సరనోబతు పాలకరును వానకాలము అయినతోడనే జింజిరాకు బంపెను గాని యింతలో విజాపురమునుండి అఫజులఖానను వాడు ప్రచండసైన్యముతో దనమీాదికి వచ్చుచున్నాడని తెలిసికొనిన నా సైన్యముల నన్నింటిని దిరిగి పిలిపించుకొనవలసిన వాడాయెను.

యాచారములను భాషను వదలి పూర్ణముగా మహారాష్ట్రులైన యనేకాంధ్రులు ప్రస్తుతము మహారాష్ట్ర దేశములో గలరు. అట్టిలనే యీపింగళేలు స్వరూపము మారి పింగళివారలై యున్నారు. ఆప్రథంబాన 'పింగళి' యను నింటి పేరు గలవారిద్దరున్నారు. ఒకరు హైదరాబాదులోనున్న పింగళివారు వీరు ప్రఖ్యాతులైన పింగళి సూరన్న వంశ్యులని చెప్పుకొందురు. రెండవవారు నైజాము రాజ్యములోని గోలకొండ (గోలకొండ) నైవునున్న పింగళివారు తాము అమాత్యులమైన మాదన్నగారి సంతతివారమని వీరు చెప్పెదరు. వీరియొద్దగల్గు నెనకాలోనుండి 'పం. శే' ను తెలిసినవారుగా కనుగొనవలసి యున్నది.

ఐదవ ప్రకరణము

★

గురూపదేశము

పైశీర్షిక బడివినతోడనే చదువరులు వీరరస ప్రధానమైన శివాజీచరిత్రమునందు శాంతరసపూరితమగు మతగురువుల వారి సమాచార మేల వచ్చెనని యాశ్చర్యము నొందుదురు. కాని శివాజి చూపిన శౌర్యమునకును, స్వదేశాభిమానమునకును, స్వమతసంరక్షణమునకును ప్రథమప్రేరకుడుగాకపోయినను ముఖ్యప్రేరకుడయిన రామదాసస్వామియొక్క సంపూర్ణచరిత్రము గాకపోయినను శివాజీతో సంబంధించినంతమట్టునకయినను నిచ్చట నియ్యకుండిన నమ్మహానుభావుని యెడల నగౌరవము జూపినవాడనగుదు ననియు, శివాజీచరిత్రము నసంపూర్తిగా వ్రాసినవాడ నగుదుననియు, నిచ్చట సంగ్రహముగా శివాజీరామదాససంబంధమును వర్ణించుచున్నాను.

మతజిజ్ఞాసయు,మతోపదేశంబును, మానవులకు సంసారమునందు విరక్తి గలుగునటుల జేయుననియు, జ్ఞానోపదేశముయొక్క పరమోద్దేశము సర్వసంగపరిత్యాగమే యనియు జన సామాన్యంబు దలచుచుండ గురూపదేశమువలన మరింత శూరుడయ్యెననియు నైహికరాజ్యము సంపాదించుటయందు నధికోత్సాహి యయ్యె ననియు నేను వ్రాయుటచదువరులకు వింతగానుండును. కాని వివిధదేశములచరిత్రములను జక్కగా

నభ్యసించినవారికి, స్వమతాభిమానము, స్వదేశాభిమానముగా బరిణమించు ననినసంగతి వింతగా నుండజాలదు. మతాభిమానమును, మతశ్రద్ధయు బూర్వము దేశాభిమానమునకు ప్రబల పోషకులుగా నుండెను. క్రీ. శ. ౧౬౫౩ నుండి ౧౬౬౦వరకు నింగ్లండుదేశ సంరక్షకుడు (Protector)గా నుండిన క్రాంవేల్ గెలిచినయుద్ధంబులన్నియు మతప్రేరకులగు శూరుల సైన్యంబుల వలననే యని తద్దేశచరిత్ర చదివిన వారికి విశదమే. ఏవానినైనను సైన్యములోనికి జేర్చుకొనుటకు బూర్వ మాతని నమిత మతాభిమానము కలవాడా కాడా యని క్రాంవెల్ ఆలోచించుచుండెను. మతాభిమానులు కానివారల నతడు సైన్యములో జేర్పనేలేదు! కనుకనే సార్థకనామములగు నతని లోహకాయులు (Ironsides) ఎన్నడును బరాభూతు లయినవారు కారు. ఇక రెండవ యుదాహరణము హాలండు దేశములో స్థాపింపబడిన ప్రజాసత్తాత్మక రాజ్య మంతయు ప్రాటెస్టెంటు మతాభిమానముయొక్క ఫలమే యని డచ్ ప్రజాసత్తాత్మక రాజ్యముయొక్క యభ్యుదయము, (Rise of the Dutch Republic) అను చరిత్రరాజము జదివినవారికి దెలిసినవిషయమే. అంతదూరము పోనేల? సాంఖ్యంబును యోగంబును సమన్వయించి సాంఖ్యయోగం బనుశాస్త్రంబు నిర్మించి కర్మ బ్రహ్మ మీమాంసా ప్రతిపాదితంబు లగు కర్మయోగ జ్ఞాన యోగముల నన్వయించి యర్జునునకు కృష్ణునిచే నుపదేశింప బడిన గీతాశాస్త్రంబు గొప్ప వేదాంతగ్రంథంబని హిందువు లందరును బఠించుచున్నారు. కాని వేదాంతశాస్త్రంబు అర్జునిని

కర్తవ్యాచరణంబునకు ప్రేరేపించి యతనిచే స్వధర్మము ననుష్ఠింప జేయలేదా ? ఇట్లు నిజమైన మతంబు మనుజుని సంసార పరాఙ్ముఖుని జేయుట లేదు. కర్తవ్యనిష్ఠునే చేయును. కాన శివాజీ రామదాసచరిత్రము సాంసారికులకును, సన్యాసులకును ననుకరణీయమే.

మహారాష్ట్రదేశములో జన్మించిన భగవద్భక్తులగు సాధువులలో రామదాసొక గొప్పసాధువు. మహారాష్ట్రమున ఏకనాథస్వామి, ముక్తేశ్వరుడు, నాదోపంతులు, ఆనందతనయుడు, వామనస్వామి, తుకారామ్. రామదాసు, మొదలయిన సాధువు లనేకులు జన్మించిరి. వీరిలో గొందరు శివాజీకంటె బూర్వపువారు, మరికొందరు శివాజీసమకాలికులు. వీరిలో తుకారామ్ అనునతడు కోమటికులమువాడు. ఈ సాధువులును వీరి పూర్వపువారును, తరువాతిసాధువులును మహారాష్ట్రమునందు జేసినమహాకార్యంబులు మూడు:—

౧ సంఘసంస్కరణము:—జాతిభేదము లేక భక్తిజ్ఞానవైరాగ్యము లన్నిజాతుల వారికిని నీసాధువులు బోధించిరి. జ్ఞానసంపన్నుండు నీచజాతివాడయినను వానిని బ్రాహ్మణసాధువువలెనే సన్మానించిరి. తుకారాము అను సాధువు వైశ్యుడు; నామదేవు శూద్రుడు; చోఖామేళాయనువాడంత్యజుడు. ఈ సాధువులందరును బ్రాహ్మణసాధువులయిన ఏకనాథ, రామదాసు, మొదలయినవారితో సమానమైన గౌరవమును జెందిరి. నేటివరకును బ్రాహ్మణులచే వందనములను గైకొనుచున్న పాండురంగ భక్తుడగు తుకారాము అభంగము

లనబడు తన పద్యములలో నిప్పటి మన నవనాగరకులవలెనే పాషాణపూజానిషేధము,జాతిభేదనింద మొదలయిన సంగతుల నత్యుత్తమముగా నుపదేశించియున్నాడు. * రామదాసస్వామి భూతప్రేతములయందలి పిచ్చినమ్మకలను ధైర్యముతో ధిక్క-రించి యున్నాడు. ఇట్టి సాధువులు మానవులందరును సమానులనియు, జ్ఞానమే ప్రధానముకాని జన్మముకాదనియు నేర్పిరి.

2. భాషాభివృద్ధి—ఆంధ్రదేశంబున రాజసాహాయ్యముచే భాషాభివృద్ధియయ్యెను గాని, మహారాష్ట్రమున సాధుసాహాయ్యముచే భాష యభివృద్ధిజెందెను. కేవల బ్రాహ్మణులకేకాక, జ్ఞానమన్నిజాతులవారికి నొసంగవలయునని సాధువుల యుద్దేశమైనందున సంస్కృతభాషలో గ్రంథరచన చేసినందున లాభములేదని తలచి వారు మహారాష్ట్రభాషలోనే కావ్యముల రచించిరి. ఇందువలననే మహారాష్ట్రకావ్యము లన్నియు భక్తిరస ప్రధానములు. ఆదిరస ప్రధానకావ్యం బొక్క-టయినను నా భాషలోలేదు. మన యాంధ్ర పురాతనకవులలో నొక్క- బమ్మెర పోతరాజు భగవద్భక్తుడు. మహారాష్ట్రములో బ్రతికవియు భగవద్భక్తుడే. భక్తిప్రేరణచేగాక మరి యన్య ప్రేరణచే గావ్యము చెప్పినవాడు లేడు! ఇట్లు మహారాష్ట్ర

* తెలుగువారిలో తుకారామువంటివాడు వేమన. వేమన పద్యములలో నున్న సంఘసంస్కరణోపదేశమును మన మింతను నెడమగ నుంచుటయు, మహారాష్ట్రసాధువుల సంస్కరణవాక్యములను న్యాయమూర్తి రానడేవంటివారును నభినందించుటయును జూచిన నిప్పటి యాంధ్రులకును, మహారాష్ట్రులకును గల భేదంబును, వారి భాషాభివృద్ధికిని మన భాషావనతికిని గల కారణంబులు తేటపడగలవు.

ములో గవిత చెప్పినందున వీరిని సంస్కృతపండితులు నవ్విరి. తురుష్కరాజులు ప్రతిబంధపెట్టిరి. కాని యీ శూరభగవద్భక్తు లా బాధలకన్నింటికి నోర్చి యుత్తమ నీతిపూరితంబులయిన భవ్యకావ్యంబుల నిర్మించిరి. ఈ సాధువులు నిర్మించిన కావ్యంబులను గురించి న్యాయమూర్తులయిన మహాదేవ గోవిందరానడేగా రిట్లు వ్రాసిరి :— "తురకల మతదురభిమానంబును సంస్కృతపండితుల పరిహాసంబులను లక్ష్యపెట్టక విద్యాప్రీతిచేతను నజ్ఞానులకు నీశ్వరజ్ఞానము సులభముగా లభించునట్లుగ జేయవలయుననిన నిరపేక్ష పరోపకారబుద్ధిచేతను బ్రేరితులై మహారాష్ట్రకవుల పరంపర దేశభాషవాఙ్మయంబును నభివృద్ధిచేసెను. పవిత్రరచన గలిగినట్టియు నున్నత నీత్యుపదేశపూరితంబయినట్టియు, భక్తిమయమయినట్టియు నిట్టి వాఙ్మయంబు భూతలంబుపై నేదేశంబున కయినను భూషణాస్పదంబె" *

*" A succession of Marathi poets, inspired with the love of letters, or with the benevolent and disinterested object of placing the knowledge of God within the reach af the ignorance, cultivated, in spite of the Mahomadan bigotry and the sneers of Sanskrit Pandits, a literature which can well meet the ordinary wants of any people and which for its purity and high line of morality and devotion would do credit to any nation on the surface of the earth.

Justice M. G. RANADE.

ఆరవ ప్రకరణము

అఫజుల్ ఖానుని వధ

శివాజీ విజాపూరు రాజ్యములోని కోటలను స్వాధీన పరచుకొనుచున్నాడనియు, దిన్న తిన్నగా రాజ్యమంతయు దోచుకొనుచున్నాడనియు, దనయొద్ద సైన్యమును, భాండారమును దినదినమును వృద్ధిపరుచుచున్నాడనియు, దండ్రి చేసిన యుపదేశములను లక్ష్యపెట్టక యవనప్రభుత్వమును నాశనము చేయ దలంచినాడనియు శివాజీచర్యలను గురించి వెంటవెంట వచ్చు సమాచారముల వలన విజాపూరు నవాబును అతనిభార్యయు నక్కడి సరదారులును నిశ్చయముగా దెలిసికొనిరి. ఇకమీద శివాజీచర్యలయెడ నుపేక్షాభావముతో నుండిన రాజ్యమునకు మోసము వచ్చునని తలచి నవాబు శివాజీని నోడించుటకయి యొక గొప్ప సైన్యముబంప నిశ్చయించెను. అప్పుడు అఫజుల్ ఖాన్ అను నొక వృద్ధామాత్యుడు శివాజీయన మనకొక లక్ష్యమా? మీయాజ్ఞ యైన యెడల నావొంగరేని బెడరెక్కలు కట్టి యేలినవారి యెదుటకు దేగలను.' అని గర్వవాక్యములను బలికెను. అప్పుడు నవాబుమాటలకు సంతసించి యతనివెంట నైనువేలగుర్రపు రౌతులను, పదువేల కాల్బలమును, మంచి ఫిరంగులను, గావ

సినంత సామగ్రియు నిచ్చి యా యఫ్‌జుల్‌ఖానుని శివాజీ పైకి దండు పంపెను. అతడు వర్షాకాలము ముగియగనే క్రీ. శ. ౧౬౫౯-వ సెప్టెంబరు నెలలో మహావైభవముతో దండయాత్ర వెడలెను. పూనాపట్టణమునకు దిన్నగా బోక యఫ్‌జుల్‌ఖానుడు త్రోవలోనున్న పట్టణములను దోచుకొనసాగెను. తుళజాపూరు, పండరపూరు మొదలయిన హిందూక్షేత్రములను గొల్లగొట్టి, యచ్చటి దేవాలయముల నన్నింటిని బాడుచేసెను.

శివాజీ రాజగడమను కోటలో నుండెను. అఫ్‌జుల్‌ఖానుడు ప్రచండసైన్యముతో వచ్చుచున్నాడని విని శివాజీ రాజగడమునుండి బయలుదేరి ప్రతాపగడమను బలవంతమైన దుర్గమునకు బోయెను. ప్రతాపగడమను కోటకు జుట్టు నరణ్యముండుటవలన నది శత్రువులకు దుస్సాధ్యంబైయుండె. శివాజీ తన సరదారుల నందరను బిలిపించి సభచేసి భయంకర శత్రువును నెదిరించు నుపాయంబుల నిశ్చయించెను. చుట్టుపట్లనుండు సైన్యంబుల నన్నింటిని బోగుచేసెను. జింజిరా మీదికి బంపిన సైన్యంబుల బిలిపించుకొనెను. దుర్గముల నన్నింటిని బాగుచేయించెను. శివాజీ యరణ్యములోని ప్రతాపగడమునకు బోయినాడనివిని యఫ్‌జుల్‌ఖాను పూనాపట్టణమునకు బోవుట మాని ప్రతాపగడమునకు బోవసాగెను. అతడు వాయీయను క్షేత్రమునకు బోయి యక్కడి దేవాలయాదులను, జనులను దోచుకొనెను, శివాజీ చొచ్చియున్న యరణ్యప్రదేశము బహుదుర్ఘటమైనది యని యచ్చట బూర్వము సుబేదారుగా నున్న యఫ్‌జుల్‌ఖానునికి దెలిసియున్నందున, యుద్ధము చేసి శివాజీని

గెలుచుట యసాధ్యంబని యెంచి యాతడు యుక్తిచేతను, మోసముచేతను శత్రుని గెలువ నిశ్చయించెను. ఇట్లు నమ్మించి శివాజీని భంగపరుప దలచి యా యవనవీరుడు దత్తాజీ గోపీనాథుడను *తన రాయబారిని శివాజీ యొద్దకు బంపెను.

అటు ఖానుడు మోసము చేయదలచినటులనే, యిటు శివాజీయు ఖానుని మోసపుచ్చ నిశ్చయించెను. అతడు ఖానున కిట్లు వార్త లంపుచు వచ్చెను. 'మీ వంటి శూరసేనానితో బోరునంత సామర్థ్యంబు మాకు లేదు. నే మనేకాపరాధములజేసినందున నవాబుగారికి నాయెడ మిక్కిలి కోపము కలిగియున్నది. అయినను మీవంటివారు నా యెడల ననుగ్రహము పుట్టునటుల నవాబుతో జెప్పిన యెడల నా యపరాధము లన్నియు వారు క్షమింపగలరు. మీరు నా యందనుగ్రహము కలుగునటుల నవాబుతో జెప్పెడి యెడల నే నీ రాజ్యమంతయు దేవరవారి స్వాధీనము చేయుటకు సిద్ధముగా నున్నాను.' ఇట్టి వార్త లంపుచు దాను జేయవలసిన సన్నాహము చేసుకొనుచుండెను. ఇంతలో ఖానుని యొద్దనుండి మరాటరాయబారి వచ్చినాడని విని శివాజీ వాని నెదుర్కొనుటకై దుర్గము దిగి ఫాడ్ అను గ్రామమునకు వచ్చెను. ఇద్దర కుశల ప్రశ్న లయినతరువాత రాయబారి ఖానుడు నీ కిట్లు చెప్పుమనె నని శివాజీతో నిట్లనియె:-'మీ తండ్రి యైన

* నానాఫడనివీసు కు ననుకాలికుడును, అతనికి ప్రబలప్రతిస్పర్థియు మహారాష్ట్రదేశమునందు జన్మించిన రాజ్యకార్యధురంధరులలో నొక్కండగును నగుసఖారామబాపంతుబోకీలునకు నీదత్తాజిగోపినాథుండు మూలపురుషుడు

శహాజీకిని నాకును అనేక సంవత్సరములనుండి స్నేహ మయి నందున నీ యెడల నాకు స్నేహభావమే కాని, వైరభావము లేదు. నీ కనుకూలముగా సులతానుతో జెప్పి నేను నీవు గెలిచిన కొన్ని యూళ్ళు నీకు జాగీరుగా నిప్పించగలను.' అందుపై శివాజీ యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. 'ఖానుసాహేబుకు నాపై ప్రేమ యున్నదనియు, వారు నాకు నహితమెన్నడును జేయరనియు నాకు దెలియును. ఖానుసాహేబుగారు చెప్పినటుల మాకు జాగీరులు దొరకునెడల నవాబుయొక్క యాజ్ఞలో నుండుటకు నాకు నే యభ్యంతరము లేదు. నేను మొదటి నుండియు నవాబు యొక్క యాజ్ఞాధారక సామంతుడను గనుకనే యనేక రాజద్రోహులగు పాళేగారుల రాజ్యములను నవాబునకై నేను సంపాదించినాడను. ఆ రాజ్యమంతయు నవాబున కియ్యగలను.' మొదటి రోజిట్లు సంభాషణ జరగి యారాయబారి ఒసకు వెళ్ళెను.

రాయబారి వెళ్ళినతరువాత శివాజీ తనమీదికి వచ్చిన మహాసంకటము నెట్లు తప్పించుకొనవలయునో యని విశేష చింతాక్రాంతుండయి యుండెను. అప్పు డాతడు తనయిష్టదేవత యగు భవానిని బ్రార్థింప దొడగె. ప్రార్థింపగా నతని దేహము నందు దేవి ప్రవేశించి 'వత్సా! నీకింత చింతయేల? నీకు నా వరప్రసాదము గలదు. నీ సంకటముల నన్నింటిని దూరము చేయగలదాన, నని పలికెనట * దేవి వచనములు విన్నతోడనే

* శివాజీదేహమునందు దేవి ప్రవేశించి ధైర్యపు మాటలు చెప్పిన సంగతి యన్ని మహారాష్ట్రబఖరీలలోను వ్రాసియున్నది. ఇది శివాజీయొక్క

సరదారులందరను మరింత ధైర్యము గలవారగునిరి. శివాజీయు నధికోత్సాహముతో ఆ రాత్రి హింగప్పను బ్రాహ్మణుడను నైన రాయబారి బసకు బోయెను. అదివరకు రాయబారి యొక్కయు, రాయబారివెంట వచ్చినవారియొక్కయు బరామర్శ బహుశ్రద్ధతో జేయుచుండిరి. కాని రాయబారియొక్క బస యతనివెంట వచ్చిన మనుష్యులు దిగినచోటికి దూరముగా నుండునటుల నేర్పాటు చేసి యుండిరి. ఇట్టి రహస్యస్థలమునకు బోయి రాయబారికి దివ్యానిమాటలు చెప్పి యుక్తిప్రయుక్తిచే అఫ్జుల్ ఖానుని మనసులోనున్న గ్రోహేచ్ఛ యతనివలన దెలిసికొనెను. కుయుక్తిచే మోసపుచ్చి శివాజీని బట్టుకొని పోవలయు ననియు, వీలయినయెడల జంపవలయు ననియు అఫ్జుల్ ఖానునికి నిచ్ఛకలదని యా రాయబారివలన శివాజీ తెలిసికొనెను. అప్పుడు శివాజీ యా రాయబారిమనసు తనకు ననుకూలముగా గరిగింపవలయు నని యాతనితో నిట్లనియె:—

'ఖానుని మనసు నిర్మలముగా లేదు మీరు బ్రాహ్మణులు; మాకు దేవతలు. గోవులు, బ్రాహ్మణులు అవధ్యులు. యవనుల బాధనుండి గో బ్రాహ్మణుల సంరక్షణ చేయుటయు, హిందూమతమునకు బ్రాప్తమైన నుర్దశను నివారించుటయు,

---

యుక్తులలో నొకయుక్తియని తోచెడిని. అప్పటి సైనికు లందరును, సర్దార్లందరును పిచ్చినమ్మకములు లవారగుచు మహాసంకట సమయము లందు వారికి ధైర్యము కలుగుటకై సియులగు భవాని ప్రవేశించి భవిష్యము చెప్పునని తెలుపుచుండెను. ఇట్టి సంగతులను రామదాసస్వామివారును సమ్మతించు చుండిరని తోచెడిని.

హిందూస్వరాజ్యము స్థాపించుటయు మా ముఖ్యోద్దేశములు గనుక మీరీ సత్కార్యమందు నాకు సహాయంబు చేయవలయును. ఈ కార్యమునకై 'హివరే' యను గ్రామము వంశపరంపరగా జాగీరియ్యగలము.' ఇట్లు చెప్పిన మాటలు విని కొంత మతాభిమానమువలనను, గొంత యాశచేతను ఆ రాయబారి మనసు కరగెను; అప్పుడు శివాజీకిని, ఆ రాయబారికిని గొంత సంభాషణ జరిగి రాయబారి యిట్లనియె. 'అఫజుల్ ఖాన్ మహా దుర్మార్గుడును, గపటియు నయినను దనతో బుద్ధివైభవమున సమానుడు లేడని యతనికి మిక్కిలి గర్వము కలదు. కాన నతనిని నమ్మించి భంగపరుప వచ్చును. అతనిని గోట క్రిందికి రమ్మనినను వచ్చును.' ఇట్లాతడు చెప్పగా శివాజీ తనకు విశ్వాసపాత్రుడగు కృష్ణాజీభాస్కరుడను వానిని బిలిపించి ముగ్గురును యోజించి, మోసపుచ్చ వచ్చిన ఖానుని కోటక్రిందికి యుక్తిచే బిలిపించి మోసపుచ్చి పంపవలయునని నిశ్చయించిరి. ఇట్లు నిశ్చయించి వారు తమతమ బసలకు బోయిరి.

రెండవనాడందరు జూచుటకునై శివాజియు; రాయబారియు నొకరినొకరు కలసికొని రాయబారపుమాటలుమాటలాడినటుల నటించిరి. తరువాత రాయబారి యక్కడనుండి వెడలెను. అతని వెంట శివాజీ తన రాయబారియని కృష్ణాజీభాస్కరుని బంపెను. వారిద్దరు వాయీ యను పట్టణములో అఫజల్ ఖానుని కలిసికొనిరి. పంతాజీ గోపీనాథుడు (ఖానుని రాయబారి) ఖానునకు శివాజీని గురించి కొన్ని సంగతులు చెప్పి యిట్లనియె. 'శివాజీ సామర్థ్యమెంత! మన సైన్యమును,

బరాక్రమమును, జూచి యాతఁడు భయపడి పోయినాఁడు. గాన నతనికి నభయ మొసంగిన యెడల నాతఁడు తనంతట దాను మన స్వాధీన మగును. మిమ్మును స్వయముగా వచ్చి చూడ వలయునని యతనికి నిచ్ఛ గలదు. కాని యాతఁడు పిరికియై నందున నమ్మి యిక్కడికి రాఁజాలకున్నాఁడు. మీరే కోట క్రిందికి వెళ్ళిన యెడల నాతఁడు దప్పక తమ దర్శనమునకు రా గలఁడు. ఒకసారి మీ రొకరినొకరు చూచుకొనువరకే యతనికి గొంచెము భయము కలిగి యుండును. ఒకసారి యాతఁడు మిమ్మును జూచి మాటలాడిన యెడల నాతనికి మీ యెడల నమ్మక కలుగును. అందుపై నాతఁడు మన శిబిరములోనికిగూడ రాఁగలఁడు.' అఫజుల్ ఖానునికి దన సామవిత్తేటలను గురించియు, చాకచక్యమును గురించియు మొదటనే యధికగర్వముండెను. అందువలన వకీలు (రాయబారి) చెప్పిన మాటలన్నియు నాతఁడు నమ్మెను. ఇదియుగాక యీ మోసగాఁడు తనమనంబున నిట్లు తలంచెను;—'శివాజీ పంపిన వర్తమానము చూడగా నాతఁడు వచ్చి స్వయముగా నాస్వాధీన మగునట్టుల దోచుచున్నది. తనంతట తానే నాచేతిలో జిక్కినయెడల నొకసారి నమ్మి నాయొద్దకు వచ్చిన యీ పొట్టి మరాఁట సరదారును నేను పోనిత్తునా ? దీర్ఘదేహుఁడను, దీర్ఘబాహుఁడనగు నా కౌఁగిలింతలో జిక్కినయెడల నాతఁడెక్కడికి బోఁగలవాఁడు ?' ఖానుడిట్లు తలంచెనేగాని తాను పంపిన రాయబారియే శివాజీలో గలసియున్నాఁడనిన సంశయము గర్వనిమగ్నుఁడగు నాతనికి గలిగినదేకాదు. ఇట్లు తలంచి ఖానుడు దుర్గముక్రింద శివాజీని

గలిసికొనుటకు సిద్ధుడయ్యెను. మిగుల కష్టముతో దన సైన్య మంతయు జావళియను పర్వతప్రదేశమునకు నెక్కించి యక్కడ మహావైభవముతో విడిసెను. అంతకు బూర్వమే శివాజీ ఖానుని యేనుగులకును, గుఱ్ఱములకును, బంటులకును గావల సిన వస్తువులన్నియు దొరుకునటుల నేర్పాటుచేసి యుండెను. అందుకు ఖానుండెంతయు సంతసించెను.

ఇటు శివాజీ ప్రతాపగడముక్రింద గొన్ని వృక్షములు కొట్టించి గొప్పయంగణముచేసి యందు ఖానుని గలియు టకై యొక్క భవ్యమైన మండపము నిర్మించెను. ఆ మండప మంతయు జిత్రవిచిత్రములైన చక్కని పదార్థములతో నలంక రింపబడెను. సైనికులు, సైన్యాధిపతులు, సరదారులు, మొద లయినవారు వారివారి యధకారముల ప్రకారము గూర్చుండు టకై వేరువేరు స్థలములు నిర్మింపబడియె. ఖాను సైనికులు కొందరు వచ్చి యద్వితీయముగా నలంకృతంబైన యా మండ పము జూచి మిగుల సంతసించి యజమానునియొద్ద శివాజీని మిక్కలి కొనియాడిరి.

ఇట్లు పైకి ఖానుని యనుగ్రహము గోరువానివలె నటిం చుచు, నతనిని మోసపుచ్చుటకు శివాజీ కొన్ని యుక్తులు పన్నెను. చుట్టునున్న యడవిలో నక్కడక్కడ దన సైనికుల నుంచెను. అఫజుల్ ఖానుడు వచ్చుటకు గొన్నిచెట్లు కొట్టి చేసిన త్రోవతప్ప యితరత్రోవ లన్నియు మూసివేయించెను. కొంకణదేశమునుండి వచ్చిన నేతాజిపాలకరుని నతని ప్రచండ సైన్యముతో దుర్గమునకు దూర్పుదిక్కున నునిచి విజయ

సూచకంబగు శృంగధ్వని వినినతోడనే యడవిలోనుండి వెడలి సమీపమున నున్న తురకసైన్యముపై నెకాయెకి పడి నాశము చేయవలసినది యని యాజ్ఞాపించెను. పేష్వాయగు మోరో పంతును బిలిపించి సైన్యముతో నరణ్యములో దాగియుండు నట్టును, కోటపై నెరుఫిరంగులధ్వని యైనతోడనే జావళీ యొద్ద నున్నయవనసైన్యమును జెండాడుమనియుల నియమించెను.

ఇట్టుల శత్రుసైన్యమును నొక్క-సారి చెండాడు నుపాయంబులుచేసియు, రాజ్యకార్యకుశలుండగుటచే శివాజీ తనకే యొకవేళ మోసము సంభవించినయెడల దనసైనికులు చేయవలసినకార్యములను గూడ నిర్ణయించెను. తాను బడినప్పటికి దాను బ్రారంభించిన కార్యమును భంగము కలుగకుండ మహారాష్ట్రరాజ్యము నడుచునట్టుల నేర్పాటుల జేసెను. దుర్గముయొక్క- ప్రతిద్వారమునందును దగినసైనికుల నుంచెను సింహద్వారములో గొప్పగొప్ప సరదార్లను రెండువేల శిబ్బందియు నిలిపెను. పేష్వాను ఇతరసరదారులను బిలిపించి తనతల్లియగు జిజాబాయిని కొమారుడగు సంభాజీని వారికి స్వాధీనపరచి యిట్టులజెప్పెను.—'మే మీజూదము ప్రారంభించినారము. ఇటగునో, యటగునో! శ్రీకృపచే యశంబుగలుగును. ఒకవేళ నాకేమైన మోసముకలుగునేని మీరు ధైర్యము వదలక నేను నియమించిన ప్రకారము శత్రుమథనము చేయవలయును.'

ఖానుని గలియ బోవలసిన దినము వచ్చెను. ఆదినము ప్రొద్దునలేచి శివాజీసుంగళస్నానముచేసి దేవబ్రాహ్మ

ణులకు నమస్కరించి, తల్లియగు జిజాబాయికి నమస్కరించెను. అప్పు డాయమ కుమారుని దీవించి యిట్లనియె. ‘ఈదుష్టుడగు ఖానుడు నీయన్నయగు సంభాజిని మోసపుచ్చి చంపెను’ ఆపగ తీర్చికొనుము. దేవీ భవాని నీకు యశంబు నొసంగును గాక’ ఇట్లావీరమాతవచనంబులు విని యావీరపుత్రుండు పులకాంకితాంగుం డాయెను.

తరువాత శివాజీ కవచమును ధరించి దానిపై నంగీ మొదలయినవి తొడుగుకొనెను. శిరమున శిరస్త్రాణము ధరించి యందుపైని పాగా పెట్టుకొనెను. కుడిచేతిలో నంగీచాటున జిన్న కత్తి దాచికొని యెడమచేతిలో బులిగోళ్ళుదాచి యుంచెను. ఇట్లు కోటదిగి వెళ్ళుటకు సిద్ధుడై శివాజీ ఖానునకిట్లు వర్తమాన మంపెను. “మేమిక్కడనుండి సభాస్థలమునకు బయలుదేరుచున్నాము. మీ రక్కడినుండి బయలుదేరి రావలసినది.”

ఇట్లు వార్త వచ్చినతోడనే ఖానుడు పదునేను వందల గుఱ్ఱపురౌతుల దీసికొని శివాజీని గలసికొన బయలుదేరెను. ఆతడు కోటకొక యరమైలుదూరమున నుండగా నతని రాయబారి యగు పంతాజిగోపీనాథుడు వచ్చి “ఇంత గొప్పసైన్యముతో వెళ్ళినయెడల శివాజీ బెదరగలడు; అతడు భయముచే మిమ్ములను గలసికొనడు. కాన మీ రీసైన్యం బంతయు నిక్కడనేయుంచి యొక సశస్త్రుడైన భటుని వెంటదీసికొని పల్లకిలో గూర్చుండి సభాస్థలంబునకు వెళ్లవలయు నని నా యభిప్రాయంబు” అని చెప్పెను. ఖానునకు దనసామర్థ్యంబునం దపరి

మిత్రమైన విశ్వాసముండెను. తన కత్యంతశక్తి గలదనియు, తన కంటె మోసమునందు గట్టివా రెవరును లేరనియు నతనికిని గర్వముండెను. గాన దాను మోసపుచ్చుటకు మారుగా దన్నే శత్రువు మోసపుచ్చుననిసమాటయే యతనికి దోచినది కాదు. శత్రువు చేతజిక్కుచున్నా డనిన యాశచే నంధుం డయిన యా యవనుడు అపనమ్మకమన్నమాట యెరుంగక స్వరక్షణమునకై సాధారణముగా నందరు చేసికొను నేర్పాటుల నైనను లక్ష్యపెట్టక, తన రాయబారియే శత్రునిచే భేదింపబడియె ననిన సంశయంబయినను లేక యా రాయబారిచెప్పి నటుల నాతడు నడచుకొనుచుండెను

రాయబారి చెప్పినటుల నొక భటునితో అఫజుల్ ఖానుడు సభాస్థలమునకు బోయెను. కాని యదివరకు శివాజీ యక్కడికి రానందున ఖాను డధైర్యపడి శివాజీ యెక్కడ నెక్కడ నని యడుగజొచ్చెను. ఇంతలో గోటక్రిందికి నొక్క బంటుతో దిగుచున్న శివాజీని జూచెను. అతని వెంటనున్న వాడు తానాజిమాలసురే యను శూరవీరాగ్రేసరుడు. ఈ తానాజి నడుమునకున్న రెండు ఖడ్గములు తప్ప శివాజీవెంట నేమియు శస్త్రము లేనటుల ఖానునకు గానిపించెను. శివాజీ సభాస్థలమునకు వచ్చియు ఖానునికి మిక్కిలి భయపడి యతని యొద్దకు వచ్చుటకు సందేహించుచున్నటుల నటించెను. అదియే యొకకారణముగాగైకొని రాయబారి యగుపంతాజి గోపీనాధుడు మీయొద్ద శస్త్రధరుడైయున్న భటునిజూచి శివాజీ మీయొద్దకు వచ్చుటకు సంశయించుచున్నాడని అఫ

జుల్ ఖానునితో జెప్పి యా భటుడు కొంత దూరముగా వెళ్లు నటుల జేసెను. తన యాజానుబాహువుశరీరముముందట శివాజీ యొక్క వామనమూర్తి యొక లెక్కలోనిది కాదని తలంచుచు దనయొద్దకు రా వెరచుచున్న శివాజీయొక్క పిరికితనమునకు నవ్వుచు ఆ యవనుడు తన రాయబారి చెప్పినటులెల్ల నడచు చుండెను. బంటు తొలగినవెంటనే శివాజీ ఖానునియొద్దకు రాదొడంగెను. అఫజుల్ ఖానుడు ప్రత్యుత్థానం బాచరించి రెండు మూడడుగులు ముందునకుబోయి శివాజీని గలిసి కొనెను. ఒకరినొకరు కుశలప్రశ్నలడుగుకొని మిత్రభావమును వెల్లడించుటకై వారొకరినొకరు కౌగిలించుకొనిరి. ఇంతలో అఫజుల్ ఖానుడు దన్ను చేతితో ముందుకుదీసి యెడమ చేతిక్రింద నొత్తిపట్టినాడనియు, నిక కొంచె మాలస్యముచేసిన యెడల ఖానుడు దన్ను బాకుచే బొడుచుననియుచూచి శివాజీ తన యంగచాపల్యముచేత దన శరీరమును వాని కౌగిటనుండి తప్పించుకొని తన చేతిలో దాచికొనిన పులిగోళ్ళు ఖానుని పొట్టలో గ్రుచ్చెను. ఖానుడు వెంటనే పెద్దపెట్టున, మోస మురా మోసము అని యరచెను. తన యొరనుండి కత్తితీసి శివాజీ శిరస్సుపై దెబ్బవేసెను. కాని శిరస్సుపై శిరస్త్రాణ మున్నందున గోధుమగింజంత కాటుపడునంత దెబ్బయే శివాజికి దగిలెను. ఇట్లాదెబ్బ తప్పించుకొని శివాజీ తనకత్తి దూసి ఖానునిభుజముపై దెబ్బతీయగా,నాతని శరీరమునందు గవచము లేనందున నాకత్తి యాయవనుని గర్భమువరకుదిగెను. వెంటనే అఫజుల్ ఖానుడు గతప్రాణుడయ్యెను. ఈ మోసమును గనిపట్టి

ఖానునివెంట నున్న సయ్యద్‌బంకు అను భటుడు శివాజీపైకి దరుముకొని వచ్చెను. కొంతవరకా స్వామిభక్తుడు శివాజీతోను తానాజితోను బోరాడి స్వామి నిమిత్తంబు దేహంబు సమర్పించెను. ఈ భటునితో వీరిద్దరు బోరాడునపుడు పాలకీ మోసికొని వచ్చిన బోయీలు అఫజుల్ ఖానుని ప్రేతమును పల్లకిలో వేసికొని తీసికొనిపోవసాగిరి. కాని దానికి గొందరు మరాట సరదారు లడ్డపడి ఖానుని శిరస్సు గోసికొని కోటపైకి దీసికొని పోయిరి !

ఇన్ని కార్యములు జరగువరకు మూడుజాముల వేళ యయ్యెను. శివాజీ సుఖముగా గోటపైకి బోయినతరువాత సంకేతప్రకారము ఫిరంగులు వేయించిరి. శృంగముల నూదించిరి. ఈ శబ్దముల వినినతోడనే నలుదిక్కు లనుండియు మరాటావీరు లడవినుండి బయలుదేరి ఖానుని సైన్యముపై బడిరి. ఖానుని సైనికులకు గుర్రముల నెక్కుటకు గాని, శస్త్రముల సవరించుకొనుటకు గాని, వ్యవధి చిక్కినదికాదు. అన్ని దిక్కుల నుండి మరాటసైనికులు చెండాడుటవలన భయభ్రాంతులై యవనవీరులు పారిపోవజొచ్చిరి. కోటకు సమీపమునందున్న పదునైదువందల సైన్యమును నేతాజీ పాలకరు డనువీరుడు ఘోరముగా సంహరించెను. కాని 'శస్త్రంబులు మన కప్పగించి శరణుచొచ్చిన శత్రుసైనికుల జంపక రక్షింపవలయును; అనావశ్యముగా రక్తపాతము చేయవలదు' అని శివాజీ వార్తయంపినందున జావళీవైపున నున్న ఖానునిసైన్యమును మోరోపంతు పింగళే యంతగా జెండాడినవాడుకాదు. విజాపురమునుండి

వచ్చిన ప్రచండసైన్యం బిట్లు చెల్లాచెదరైనందున శివాజీకి అసంఖ్యద్రవ్యంబును, యుద్ధసామగ్రియు, నాలుగువేలగుర్రంబులును, అరువది యేనుగులును, వెయ్యి లొట్టిపిట్టలును, ఎడ్లబండ్లతో ననేక ఫిరంగులును దొరకెను.

శత్రుసైనికులలో నందరకును ఆ యరణ్య ప్రదేశంబు క్రొత్తది యగుటచే వారందరును త్రోవలు దొరకక యన్నాహారంబులు లేకయే యరణ్యంబులలో దిరుగుచుండిరి. వారికి నభయదానం బిచ్చి వారిని తనయొద్దకు బిలిపించుకొని యన్న వస్త్రాదు లిచ్చి తనయొద్ద నుండుట కొప్పుకొనిన వాండ్రకు దగినపను లిచ్చి యితరులను వారివారి దేశంబులకు బంపెను. వారిలో ఝుంఝూరరావుఘాటగే యను మరాటాసరదారుం డొక డుండెను. అతనితండ్రియు, శివాజీతండ్రియగు షహాజియు మిత్రులుగా నుండిరి. గాన శివాజీ యతనిని మిగుల గౌరవించెను. విజాపురములోని యుద్యోగము వదలుకొని తనయొద్ద నుండుమని యతనికిశివాజీ యెంతయోచెప్పెను. కాని యాతం డొప్పినవాడు కాడు. అయినను నతనికి దగినట్లు కానుకలిచ్చి శివాజీ యాతని బంపెను.

ఖండోజీ కాకడేయను నొకమరాటసరధారుడు ద్రవ్యలోభముచేత శత్రువులకు వశుడై, శివాజీకి దెలియకుండ అఫజల్ ఖానుని భార్యపుత్రాదులను దొంగత్రోవల దీసికొని పోయి సురక్షితముగా కర్హాడలో జేర్చెను. ఈ సమాచారము శివాజీకి దెలిసినతోడనే వానిని బిలిపించి శిరచ్ఛేదము చేయించెను.

శివాజీ ఇట్టిమహాసంకటమునుండి తప్పించుకొని సుఖముగ దిరిగి వచ్చినాడని సంతసించి జిజాబాయి తన కుమారునికి దృష్టితీసి 'నాయనా! నీయన్నయైన సంభాజినిజంపిన అఫజుల్ ఖానుని పగదీర్చికొంటివి. నేను నిన్ను మరల జూడగలిగితిని; ఇదియే మనకు సువర్ణదినంబు, అని గద్గదస్వరముతో బలికెను. తరువాత శివాజీ విశేషముగా దానధర్మములుచేసెను. తమపరాక్రమము జూపిన సరదారులను బంటులను గౌరవించి కొందరకు బల్లకీలు, కొందరకు ఛత్రచామరములు, కొందరకు సువర్ణ కంకణములు, ఇట్లు వారివారికి తగిన బహుమానంబులొసంగెను. గాయపడిన వీరులకు నౌషధోపచారంబులు చేయించె. యుద్ధములో మృతులైనవారి కుమారుల బిలిపించి వారికి వారితండ్రులయుద్యోగంబు లిచ్చెను. మృతులైనవీరుల కొడుకులు చిన్నవయస్సుగల వాండ్రయినయెడల వాండ్ర భార్యలకు వర్షాశనంబు లేర్పరచెను. ఇట్లు శివాజీ తమసైనికు లందరును సంతసించునటుల జేసి శత్రుసైనికులును బొగడునటుల జేసెను. రాయబారి యగుపంతాజీగోపీనాథ బొకీలునకు హివరే యను గ్రామంబు వంశపరంపరగా బహుమతి యిచ్చెను. (౧౬౫౯)

అఫజుల్ఖానుడు చచ్చిన వృత్తాంతంబును, సైన్యంబులన్నియు ఘోరంబుగా నాశముజెందిన సమాచారంబును నాల్గవరోజు విజాపురంబులో దెలిసెను. ఆవార్తవినినతోడనే యచ్చట వారందరును మిక్కిలి చింతాక్రాంతులైరి. నవాబు నవాబుదల్లియు దుఃఖపరవశులైరి. నవాబు బిడ్డ మూడురోజుల

వరకు భోజనమే చేసినది కాదట! సరదార్లందరు దుఃఖితు లైరి. కాని వారిలో వారికి పరస్పరమత్సరంబులును వైరంబు లును నుస్సంగిన శత్రుపరాభవమునకు నెవ్వరును వెళ్ళ నిశ్చయించినవాడు కాడు.

ఈప్రకరణము ముగించుటకు బూర్వము, అఫజుల్ ఖానుని జంపుటకు శివాజీయుపయోగించిన కుట్రనుగురించికొంత వ్రాయవలసియున్నది. దీనిని గురించి మరాటచరిత్రకారులు శివాజీని స్తుతియించి యున్నారు. యవనచరిత్రకారు లత్యంత నీచముగా దిట్టియున్నారు. గ్రాండ్ డఫ్వంటి యింగ్లీషుచరిత్ర కారుడు ఈకార్యము చెడ్డదనియు లేక మంచిదనియు జెప్పక మూకభావముతో నూరకుండెను. ఇట్లు వివిధజనులు వివిధ రీతులుగా వర్ణించుచున్న కార్యమునుగురించి మనము ఆలోచన చేయునపుడు నిష్పక్షపాతబుద్ధితో నుండవలయును. అట్లుండి విచారించిన యెడల నీతిని మన్నించువా రెవరును నెట్టి మోస మైనను, నెట్టికుట్రయైనను మంచిది యని చెప్పుటకు వీలులేదు. రెండు కాసులు సంపాదించుటకు జేసిన దొంగతనం బయిననేమి జ్ఞానభాండారము సంపాదించుటకు బుస్తకాలయంబును మాయ ముచేయు దొంగతనంబయిననేమి నీతివిశారదుల కొక్కటియే. అటులనే మోసం బెక్కడ గావించినను దోషార్హంబే. ఇట్లు కేవల తత్వనీతిజ్ఞులు (Theoretical moralists) చెప్పెదరు. కాని లౌకిక నీతిజ్ఞులు (Practical moralists)కొన్ని దోష ములను మన్నించెదరు. ఇప్పుడు మన దివాణములందునుసుజ్ఞాని చేయు తప్పిదముకంటె నజ్ఞానిచేయు తప్పిదమునకు దక్కువ

శిక్ష విధించెదరు. ధనవంతు డయినవాడు దొంగతనము చేసిన యెడల నన్నములేక దొంగిలించిన వారికంటె నధిక దండనము విధింపబడునుగదా! భయాంధుడై గాని, క్రోధాంధుడైగాని స్వసంరక్షణ నిమిత్తమై కాని చేసిన యపరాధ మంతగా శిక్షార్హము కాదు. అనగా దేశ కాల పాత్రములను బాగుగా విచారించి యపరాధమునకు శిక్ష విధింపవలయునని యాధునిక న్యాయసిద్ధాంతము. ఈ సిద్ధాంతము ననుసరించి శివాజీ యం దెంత యపరాధముండునో చూచెదము.

౧. శివాజీకాలములోని నీతికల్పన (Moral ideal) ఇప్పటి మన నీతికల్పనవంటిది కాదు. సామాన్యమైన నీతి వేరనియు, రాజనీతి వేరనియు నప్పటి వారి యభిప్రాయమై యుండెను. * శత్రువును మోసముచేతనైనను జంపవచ్చుననియు, నటుల జంపిన దోషంబు లేదనియు వారి యభిప్రాయంబై యుండె. శ్రీరాములవారు చాటున నుండి వాలిని గూలనేసె ననియు, దొడ చూపి శ్రీకృష్ణుడు భీమునిచే దుర్యోధనుని జంపించె ననియు మొదలయిన పౌరాణిక కథలన్నియు జిన్ననాట నుం

---

* ఇప్పటికైనను నాగరకత హెచ్చిన యూరోపు ఖండమునందు గూడ కొందరు రాజనీతియు, లోకనీతియు భిన్నములని వాదించెదరు. మనము చేయదలచిన కార్యంబు మంచిదగునేని దానిసాధించుటకు నెట్టియవినీతికరములయిన మార్గములైన నవలంబింప వచ్చునని జర్మనీరాష్ట్రము యొక్క జగద్విఖ్యాతమంత్రియగు ప్రిన్సు బిస్మార్కు గారి యభిప్రాయమై యుండెనట! ఇక్కాలంబుననే యింత గొప్పవారి కిట్టి యభిప్రాయముండగా నక్కాలంబువారి కిట్టి యభిప్రాయంబుండుట యొక వింత గాదు.

డియు వినుచున్నవారికి సత్కృత్యంబు నెరవేర్చుటకునన్యాయం బైనను జేయవచ్చునని తోచుట యాశ్చర్యంబు కాదు.

౨. శివాజీకాలములో నిట్టిమోసములు తరుచుగా జరుగుచుండెను. బీజాపూరు, గోలకొండ మొదలైన రాజధానులలో నెల్లప్పుడును సరదారు లొకరినొకరు భంగపరిచి చంపుచుండిరి. శత్రువినాశము చేయుటకు నా కాలములో మోస మొక నిర్దోషమైన సాధనమై యుండె.

3. శివాజీ యన్నయైన సంభాజీని మోసముచే అఫజుల్ ఖానుడు చంపెను. అందుచే నాతనిని నెటులనైన జంపవలయు నని శివాజీకి నుండుట సహజము. కోపావేశ పరవశులైన వారును, దుఃఖపూరితులై యున్నవారును జేయుసాహస కార్యంబులు కొంతవరకు క్షంతవ్యంబులు కదా!

౪. అఫ్జుల్ ఖానుడు దండయాత్రకు వచ్చునప్పుడు త్రోవలో నున్న హిందూక్షేత్రములను బాడుచేసెను. అందుచే హిందూమతాభిమాని యైన శివాజీకి నధిక సంతాపంబు గలుగుట వింత కాదు. జనులకు దమ మతమును నిందించినవారి యందే యసూయ కలుగుచుండగా, మతమును బాడుచేసిన వానిని నెట్టులైన జంపవలయు నని యిచ్ఛ గలుగుట యాశ్చర్యంబు కాదు గదా!

౫. అఫజుల్ ఖానుడు గూడ శివాజీని మోసముచేయవలయు నని తలచి యుండెను. ఈ సంగతి రాయబారి వలన శివాజీకి దెలిసినందున నతడును నాత్మసంరక్షణమునకై తన

శత్రువునే మోసపుచ్చ యత్నించెను. ఇట్లు వీరప్రతివీరు లిద్దరును నొండొరుల మోసపుచ్చ యత్నించి వారిలో నధికప్రజ్ఞ గలవాడు కడతేరెను, హీనప్రజ్ఞు డీల్గెను ! ఇందులరహస్యం బింతియ. సత్యం బిట్లుండ మోసమునకై యొక్క శివాజీని దూషించుట న్యాయంబు కాదు. శివాజీని దూషించువారు పైకారణంబుల నన్నింటిని యోజించి తమ యభిప్రాయంబును స్థిరపరుచు కొనవలయును.

ఏడవ ప్రకరణము

★

దండయాత్రలు

అఫజుల్ ఖానుని వధియించిన తరువాత శివాజీ యూరకుండక మరికొన్ని సైన్యములను బోగుచేసికొని జింజిరా పట్టణములో నున్న సిద్దీవానిపైకి దండువెడలుచున్నట్లుల నటించి యెవరికి దెలియకుండ నెకాయకి కోలాపూరు ప్రాంతమున విడిసెను. పన్హాళా యనునొక దుర్గము విజాపూరు రాజులదియై యుండెను. ఆ దుర్గాధిపతి ధనాశచే నా దుర్గమును శివాజీకి నిచ్చివేసెను. శివాజీ తనయొద్దనున్న విశ్వాస పాత్రుడును, తెలివిగలవాడును అయిన అణ్ణాజీదత్తో యను బ్రాహ్మణుని నా దుర్గమునకు నధిపతిగా నేర్పరచెను. ఈ దుర్గమును సంపాదించిన కొలదిరోజులలోనే పావనగడ్, వసంతగడ్ మొదలయిన దుర్గములను సాధించి కృష్ణానది యొడ్డున నున్న గ్రామాదులలో పేష్కష్ (Tribute) వసూలు చేయుచు నక్కడక్కడ దన ఘట్టకుటములను (ఠాణాలను) శివాజీ స్థాపించెను. పన్హాళా మీద నున్న సైన్యములను బంపి సహ్యాద్రిపర్వతపాద ప్రదేశములందును, శిఖరప్రదేశములందును గలదుర్గముల నన్నింటిని సంపాదించెను. ఆ దుర్గములలో, రాంగణా భిళణా దుర్గములు విశేష పరిశ్రమచే సాధింపబడియె. భిళణా యను దుర్గముపేరు మార్చి దానికి విశాలగడమని పేరు పెట్టిరి.

శివాజీ కోలాపూరుప్రాంతమునకు వచ్చి దేశమంతయు గొల్లగొట్టుచున్నాడని విని యచ్చటి యధికారియైన రుస్తుం ఖానుడు కొంత సైన్యము గూర్చుకొని యుద్ధమునకు వచ్చెను. కాని వానియొద్ద మూడు నాలుగువేల సైన్యముకంటె నెక్కువ లేనందున శివాజీ చులకనగా వాని నోడించి వాడు కృష్ణ దాటి పారిపోవునటుల జేసెను. (క్రీ. శ. ౧౬౫౯ డిశంబరు) శివాజీ యూళ్ళు దోచుకొనుచు పేష్కషు వసూలుచేయుచు, విజాపురమువరకు వెళ్ళెను గాని శత్రువులచేత జిక్కక యక్కడ నుండి త్వరగా దిరిగివచ్చెను. శివాజీ తిరిగివచ్చువరకు విశాల గడముపై ఫజ్జాజీదత్తో యనువాడు గొప్ప సైన్యముగూర్చి యుండెను. ఆ సైన్యమును నణగిసికొని శివాజీ సముద్రతీర ప్రాంతములపై దండువెడలెను. రాజాపూరు, దాభోళు మొదలయిన స్థలముల గెలిచి, యచ్చటివారియొద్దనుండి కప్పముల గొని సంపాదించిన ధనమంతయు రాజగడమునకుం బంపెను. (క్రీ. శ. ౧౬౬౦ జనవరి)

ఇట్లు శివాజీ రోజురోజు బలవంతుడై విజాపూరు వారి దుర్గములను స్వాధీనపరచుకొనుటయు, దేశము కొల్ల గొట్టుటయు, సైన్యాధిపతుల నోడించుటయు, రాజధానియైన విజాపూరువరకు దరుముకొని వచ్చుటయు జూచి, విజాపూరు వారందరును భయభ్రాంతులై శివాజీని నెట్లయిన నోడింప వలయు నని నిశ్చయించిరి. వారొక ప్రచండ సైన్యమునుసిద్ధము చేసి సిద్దీజోహార్ అనువానికి సైన్యాధిపత్య మిచ్చిరి. ఈతడు కర్నూలుపట్టణములో నదివరకు సుబేదారుగా నుండి నవాబు

కార్యము లెన్నియో సాధించి ఘనత కెక్కెను. ఈతనికి సవాబక్షీ అనుబిరుదు నొసంగి పదివేల యశ్వసైనికులతోను, పదునాలుగువేల కాల్బలములతోను శివాజీని గెల్చుటకునై పంపిరి. వీనివెంట అఫజుల్ ఖానుని కుమారుడైన మహమ్మదు ఖానుడును శివాజీ తన తండ్రిని జంపిన పగ తీర్చుకొనవలయునని యుద్ధమునకు వెడలెను. విజాపూరువారిట్లు దండువెడలుట చూచి యిదియే సమయ మని యెంచి జంజరాధిపతియైన సిద్దీఫత్తేఖానుడు శివాజీ సంపాదించిన కొంకణముపై దండెత్తెను. వాడీప్రాంతమునకు దేశముఖు వైన సావంత్ అనువాడును శివాజీతో బోర నారంభించెను.

ఇట్లు శత్రువు లందరొక్కసారి తనతో బోరాడ ధైర్యముయొక్క యపరావతార మైన శివాజీ యెంతమాత్రమును జంకక యా శత్రువుల నందరను వేరువేర యెదిరించుటకు దగిన యేర్పాటులు చేసెను. జంజిరాసిద్దీమీదికి రఘునాథబల్లాలుని బంపెను. వాడీసావంతునితో బోరాడుటకు బాజీఫసల్ కర్ సర్ నోబత్ అనువాని నియమించెను. కొంకణప్రాంతమును సంరక్షించుటకు ఆ బాజీసోనదేవుని నాజ్ఞాపించెను. పురందర్, సింహగడ్, ప్రతాపగడ్, మొదలయిన ప్రాంతమును గాపాడుటకై పేష్వయైన మోరోపంతుపింగళేను నియోగించెను. తాను స్వయముగా పన్హాళా దుర్గముమీద నుండి యుద్ధసన్నాహము చేసెను.

శివాజీ పన్హాళాకోటమీద నున్నాడని విని సిద్దీజోహారుడు మొట్టమొదట ఆ కోటనే చుట్టడించెను. ఈ దుర్గము

శత్రువులకు నసాధ్యమని శివాజీ యనుకొని శత్రువులు దుర్గ సమీపమునకు వచ్చువరకు శివాజీ వారిని నడ్డగింపడయ్యె. వారు దుర్గముక్రిందికి వచ్చి విడిసిన తరువాత నేతాజీపాలకరుడు వారి చుట్టు ప్రదేశము దోచుకొని కాల్చి, అక్కడక్కడ ఠాణా లేర్పరచి తురకసైన్యమునకు ధాన్యము, గడ్డి మొదలైనవి దొరక కుండ జేసెను. ఇదియుగాక రాత్రులయందు శత్రుసైన్యమును బాధపెట్టుచుండెను. ఇటు దుర్గములోనుండి మావళీ సైన్యములు క్రిందికి దిగి పర్వతగుహలలో దాగియుండి శిబిరములలో శత్రువులు నిద్రించియున్నప్పుడు వారిశిబిరములను నాశనము చేయుచుండిరి. శత్రువులు లేచి యుద్ధమునకు సిద్ధముకాగానే వారిపై దూరమునుండి బాణములు వేసి గుహలోనికి బారి పోవుచుండిరి, ఇట్లు మరాఠాలు విజాపూరు సైన్యమును లోపలనుండియు, బైటనుండియు బాధపెట్టుచుండిరి. కాని దుర్గము శివాజీ యనుకొనినంతబలవంతమైనది కానందున, సిద్దీ జోహారు కోటను ముట్టడించి వెలుపలనుండి కోటలోనికి నొక్క మనుష్యునిగాని, పదార్థముగాని పోకుండ జేసెను. ఇందుచే లోపలిసమాచారము వెలుపలను, వెలుపలిసమాచారము లోపలను దెలియకుండెను. తుదకు దుర్గములోనే యుండుట తప్పని తెలిసికొని శివాజీ యీ క్రింద వర్ణింపబడిన యుక్తిచే నాకోటలోనుండి వెలువడెను. (క్రీ. శ. ౧౬౬౧)

సందులేకుండ మనము కోటను ముట్టడించి వెలుపలి నుండి శివాజీకి నేసహాయము దొరకకుండ జేసినందున, నాతడు మనచేత నిక చిక్కగలడని విజాపూరు సైన్యములు తలంప

సాగెను. ఇట్టిస్థితిలో నున్నప్పుడే శత్రువులను మోసపుచ్చ వచ్చునని తలచి శివాజీ 'ఈదుర్గము మీస్వాధీనపరిచెదము.' అని సిద్దీజోహారునకు వార్త పంపెను. సంధిని గురించిన మాట లన్నియు మాటలాడుటకు దాను క్రిందికి వచ్చెదననియు, మోసము గలుగ దని యభయము మాత్ర మియ్యవలయు ననియు నేర్పాటు చేసకొని శివాజీయు, సిద్దీజోహారుడును దుర్గముక్రింద గలసిరి. అక్కడ పెక్కు సంగతులను గురించి మాటలాడి 'రేపు మేము ఈ కోట మీస్వాధీనము చేసెదము; కాని కొన్ని సంగతు లింకను మాటలాడవలసి యున్నవి. ఇప్పుడు సాయంకాలమయినందున అందునుగురించి రేపుమాటలాడుదము' అని చెప్పి శివాజీ కోటపైకి బోయెను.

సంధి యైన దని తలచి విజాపూరసైనికు లారాత్రి నిశ్చింతగా నిద్రబోయిరి. మధ్యరాత్రి శివాజీ విశ్వాసపాత్రులైన కొందరు సైనికులతో గోట దిగి శత్రువులను దప్పించుకొని రాంగణా యను దుర్గమునకు బోవుచుండెను. కొంత కాలమువరకు విజాపుర సైనికులకు శివాజీ వెళ్ళిన సంగతియే తెలియలేదు. తెలిసిన తోడనే సిద్దీజోహారుని కుమారుడు వెంట సైన్యములను దీసికొని శివాజీని బట్టుకొన వెడలెను. ప్రొద్దున జాము ప్రొద్దెక్కువరకు శివాజీసైన్యముయొక్క వెనుక పార్శ్వము సైనికులకు గానవచ్చినది కాదు. రాంగణా యను దుర్గమింక మూడు క్రోసు లున్నదనగా శివాజీని విజాపురసైనికులు చూచిరి. శత్రువులు వేగముగా వెనుకనుండి వచ్చుచున్నారని తెలిసినతోడనే శివాజీ బాజీపరభూ అను సేనాధి

పతిని శత్రువుల నెదుర్కొనుట కక్కడ నిలిపి 'నేను కోట మీదికి సైనికులతో జేరువరకు నీ వక్కడనే శత్రువుల నడ్డగించి యుంచవలసినది. నేను కోట మీదికి జేరగానే గుర్తు కొరకు ఫిరంగిశబ్దము అయిదు సారులు చేయబడును. ఆ శబ్దములు వినినతోడనే నీవు నీ సైనికులతో గుట్టలచాటున కోట మీదికి రావలసినది' యని యాజ్ఞాపించి తాను కొంత సేనతో కదలి వెళ్ళెను.

విజాపూరు సైన్యము మహావేగముతో గుట్ట యెక్క సాగెను. బాజీపరభూ నిలిచియున్న స్థలము రెండు కొండల నడుమనున్న యిరుకు త్రోవ యొక్క ముఖద్వారమున నిలిచి కొలది సైనికులును ప్రచండ సైన్యముతో పోరాడుటకు వీలుగా నుండెను. విజాపూరు సైన్యములు ఆ త్రోవను పోవునప్పుడు బాజీపరభూ వారిని బాణములతో నొప్పించి మరలి క్రిందికి పోవునటుల జేసెను. కాని యింతలో విజాపురమువారి కాల్బలము వచ్చి చేరినందున వారు రెండు పర్యాయములు మరాటావారిని నెదిరించి పైకి నెక్కబోయిరి. కాని రెండు పర్యాయములును వారు విజాపూరు సైన్యములను వెనుకకు నెట్టిరి. విజాపూరువారు క్రొత్త సైనికుల దెచ్చి మూడవ సారి పైకి నెక్కుటకు ప్రయత్నము చేసిరి. మరాఠా సైనికులు కొలది మందియు, తురుష్కసైనికు లనేకులును అయినందున నిదివరకు సగముకంటె నెక్కువ మహారాష్ట్రవీరులు వీరశయనము నొందిరి. అయినను ప్రాణములపై నాశవదలి బాజీ పరభూ అసమానధైర్యముతో తురకలను నెదిరించి స్వామి

కార్యమునకై ప్రాణముల సమర్పించెను! ప్రాణములు విడుచుటకు బూర్వము కోటమీదినుండి వచ్చిన ఫిరంగుల ధ్వని విని శివాజీ క్షేమముగా గోటమీదికి జేరినాడని తెలిసికొని సమాధానముతో 'నేను నాకర్తవ్యమును జేసితిని' అని పలికెను! బాజీపరభూ యొక్క ప్రేతము శత్రువుల చేతిలో బడకుండ దద్భటులు మహాప్రయాసతో గొండ మీదికి జేర్చిరి. శివాజీ చరిత్రములోని యీ భాగము చదివినవారికి గ్రీసుదేశముయొక్క చరిత్రములోని థర్మాపొలీ (Thermopylae) యుద్ధము జ్ఞాపకము రాకమానదు. అచ్చట మూడువందల స్పార్టనులు ప్రచండ పారసీకసైన్యముతో బోరాడి తమలో ప్రతివీరుడు హతుడగువరకు శత్రువులను థర్మాపొలీ యను పర్వతద్వారమును చొరనీయరైరి. అటులనే యిచట మహారాష్ట్రవీరుల సంఖ్య స్వల్పమైనను, అసంఖ్యులైన తురకలతో బోరాడి శివాజీ దుర్గము నెక్కువరకు వారిని ద్రోవదాటనీయరైరి. ఇట్టి స్వామిభక్తి పరాయణ శిరోమణి యైన బాజీపరభూ నామము మహారాష్ట్రులందరు మిక్కిలి గౌరవింతురు.

బాజీపరభూ తనసేనలో గతించినందున నాతనికొమారుడైన బాలాజీబాజీ యనువాని బిలిపించి శివాజీ వానికి దండ్రి యధికార మొసంగెను. వానితమ్ము లందరకు నాందోళనాది సన్మానంబుల నొసగి సబనవీసు * అను పనులపై వారిని నియుక్తుల జేసెను.

* సబనవీసు అనగా సైన్యములకు గావలసిన వెచ్చములు మొదలయిన వానిపై నధికారి.

ఇట్లు తురక సైన్యములు శివాజీ యున్న రాంగణాయను పర్వతదుర్గమును ముట్టడించిరి. కాని యప్పుడు వర్షాకాల మైనందున దురుష్కులు కొండక్రింద నుండలేక తిరిగి పన్హాళా దుర్గమునకు బోయిరి; తురకల సైన్యాధిపతియైన సిద్దీజోహారుడు శివాజీ యే దుర్గమునుండి పారిపోయెనో, యీ పన్హాళాదుర్గమును సాధించుట యేలా, లేక శివాజీ యే దుర్గమునకు బారిపోయెనో యీ రాంగణాదుర్గమును సాధింపవలయునా యని యోజించుచు, నేమియు దోపక త్రొక్కులాడుచు నుండెను. శివాజీ నేడో రేపో చేత జిక్కునన్న యాశతో నున్న విజాపూరు నవాబు అతడు తప్పించుకొని పోయినాడని విని మిగుల చింతాక్రాంతు డయ్యెను. శివాజీ యొద్దనుండి లంచము పుచ్చుకొని తన సైన్యాధిపతి యైన సిద్దీజోహారుడే పోనిచ్చెనని యాతనికి సంశయము గలిగెను గాన, నాతడు స్వయముగా సైన్యాధిపత్యమును స్వీకరించెను. ఇట్లు నవాబు తన్ను నవమానించినందున సిద్దీజోహారుడు కోపగించి తన జాగీరు అయిన కర్నూలుకు వెడలిపోయెను. (క్రీ. శ, ౧౬౬౧ జనవరి)

విజాపూరు సులతాను మహాక్రూరముగా మహారాష్ట్రులపైకి దండువెడలి సహ్యాద్రిపర్వతము క్రిందను మీదను నున్నట్టి మహారాష్ట్రుల దుర్గముల నన్నింటిని స్వాధీనపరుచుకొనెను. పన్హాళా, పావనగడము అను దుర్గములను సాధించెను. రాంగణా, విశాలగడము అను దుర్గములు మాత్ర మతనిచేత జిక్కినవి కావు.

ఇట్లు శివాజీచేతిలో బడ్డ తన దుర్గములన్నియు నవాబు మరల సాధించుచుండగా శివాజీ యూరక కూరుచుండిన వాడు కాడు. రాజాపుర మను పట్టణముపై దండెత్తి, దానిని దోచుకొని స్వాధీనపరుచుకొనెను. ఆ పట్టణములో గొందరు ఇంగ్లీషు వర్తకు లుండిరి. వాండ్రు తురకలసైన్యాధిపతి యైన సిద్దీజోహారునకు దుపాకిమందు, గుండు మొదలయిన సాధనముల నిచ్చియుండిరి. ఈ సంగతి శివాజీకి దెలిసినందున నాతడా వర్తకుల జెరబట్టి యొక దుర్గముపై జెరసాలలో నుంచెను. ఆ ప్రాంతమున దళవీ యను స్వతంత్ర సంస్థానాధిపుడుండెను. అతని రాజధాని శృంగారపురము. యుద్ధములో నాతని జంపి శివాజీ యా పట్టణమును సాధించెను. కాని జను లందరు భయపడి పారిపోసాగిరి. అప్పుడు శివాజీ పూర్వపు సంస్థానపు మంత్రిని బిలిపించి పూర్వ మెవ్వరెవ్వ రేయేపని మీాద నుండిరో వారివారిని ఆయాపనులపై నిలిపి లోకులందరకు బూర్వపు హక్కులిచ్చి వారందరు నిర్భయులై యుండునటుల జేసెను.

ఇంతలో గర్ణాటకములోని జమీాదారులు రాజద్రోహులయి తిరుగబడుచున్నారనిన వార్త విజాపురమునకు వచ్చి చేరెను. మొదట శివాజీతో బోరాడవలయునా, లేక కర్ణాటకములోని జమీాదార్లను దండించుటకు బోవలయునా యని విజాపుర రాజసభలో జర్చజరిగెను. ఇంతలో వాడీయను గ్రామము రాజధానిగాగల సావంత్ అను సంస్థానాధీశుడు విజాపూరు నవాబున కిట్లు వర్తమాన మంపెను. మీారు

నాకు సహాయము చేసినయెడల నేను శివాజీని నోడించి కొంకణప్రాంతమంతయు సంపాదించెదను. బాజీ ఫసల్కర్ అను సరదారుని శివాజీ యీ సావంతుతో బోరాడ బంపె నని వెనుక వ్రాసియున్నాను, వారిద్దరికు ననేక పర్యాయములు పోరాటజరిగి యొకసారి వీరును నొకసారి వారును నోడుచు గెలుచుచు వచ్చిరి. ఇట్లిద్దరు సమానులయినందున సావంతుడు విజాపూరు నవాబును బైని వర్ణించినట్లుల సాహాయ్య మడిగెను.

ఇట్లు సావంతుడు శివాజీని గెలిచెద ననినందున నవాబు కొంత సైన్యమాతనికి సాహాయ్యము చేయుటకు నంపి తాను స్వయముగా గర్ణాటక దేశమునకు బోవ నిశ్చయించెను. సావంతునికి సాహాయ్యముగా బంపినవారు బహిలోలుఖానుడును బాజీ ఘోరపడేముధోళ్కరును. వీరిద్దరను నిటు బంపి నవాబు తన ప్రచండసైన్యముతో గర్ణాటకమునకు దరలిపోయెను. ఇట్లు శివాజీ యదృష్టమువలన భయంకరమైన శత్రుసైన్యమంతయు మహారాష్ట్రదేశము వదలివెళ్ళెను.

నవాబు సావంతుని సాహాయ్యమునకు బంపిన యిద్దరు సరదారులలో రెండవవాడగు బాజీఘోరపడేముధోళ్కర్ అనువాడు తురకసేనలోనున్న మహారాష్ట్రవీరుడు; కర్ణాటదేశములో శివాజీ తండ్రియగు శహాజీ యుండగా నాతనిని మోసపుచ్చి చెరబట్టి నవాబునొద్దకు బంపిన మిత్రద్రోహి యీతడే; 'నీవు నా పుత్రుడవేయైన పక్షమున నీతడు చేసిన మోసమునకై పగతీర్చుకొనవలయును' అని శహాజీ శివాజీకి

జెప్పియుండెను. ప్రస్తుత మాతడు శివాజీతో బోరాడుటకై సైన్యములను బోగుచేయునిమిత్తము తనయూరగు ముధోళ్‌కు వెళ్లెను. విశాలగడముపై నున్న శివాజీకి నీ వృత్తాంతము తెలియగానే పగతీర్చికొనుట కిదియే మంచిసమయము' మని యెంచి సైన్యము దీసికొని యెవరికిని దెలియకుండ ముధోళు గ్రామముపై నొక్క పెట్టునబడి బాజీ ఘోరపడేను, ఆతని బంధువుల నందరను జంపి గ్రామ మంతయు గాల్చి విశాల గడమునకు తిరిగి వెళ్లెను. ఇట్లీ సరదారుడు నాశ మొందినందున నవాబు కావసఖాన్ అనువాని సావంతునకు సహాయునిగా బంపెను. బహిలోల్ ఖానుడును, కావసఖానుండును కొలదిదినములలో సహ్యాద్రిపర్వతసంబంధమైన దుర్గముల నన్నింటిని స్వాధీన పరుచుకొనిరి. అక్కడనుండి కొంకణమునకు రాదలంచిరి. ఇంతలో నవాబు వారి నిద్దరను దనకు సహాయము చేయుటకై కర్ణాటదేశమునకు బిలిపించుకొనెను. ఇటుల దాదకు సావంతు డొక్కడే శివాజీతో బోరాడవలసినవాడాయెను. కొలదిరోజులలోనే శివాజీ సావంతుని రాజ్యమంతయు గెలిచెను తరువాత సావంతుడును, శృంగారపురపు రామదళవీ యనినవాడును గోవాకు వెళ్ళి బుడతకీచుల(Portuguese)సాయము వేడిరి. కాని బుడతకీచులు భయపడునటుల వారికి శివాజీ వార్త పంపినందున వారందరు శివాజీతో బోరనొల్లక, సావంతుని రామదళవీ యనువానిని దమరాజ్యములో నుండవలదని వెడలగొట్టిరి. తుదకు నిరాధారు లయి వారిద్దరు శివాజీకి శరణుచొచ్చిరి. అప్పుడు శివాజీ దయార్ద్రహృదయుడై సావం

తుడు దనవంశ మయిన భోసలేవంశమునందే పుట్టిన వాడని తలచి యాతనికి నాతనిరాజ్యమిచ్చి తనసామంతుని జేసికొనెను. సామంతుడును నప్పటినుండి మిగులభక్తితో శివాజీ సేవచేయు చుండెను. రామదళవీ యనువానికి వానిరాజ్య మిచ్చెను. ఈ యిద్దర రాజ్యములలో దన సైన్యము నుంచి వారి రాజ్యములలోని ప్రబలకాయులను శూరులను దన సైన్యములో జేర్చుకొనుచుండెను. ఈప్రకార మిద్దరు ప్రబల శత్రులు శివాజీకి బరమ మిత్రు లయిరి ! వీరి యిద్దర రాజ్యములలో శివాజీ రాయరీ, మాలవణ యను దుర్గములను బాగు చేయించి యధిక దుర్గములుగా జేసెను.

జంజిరామ సధిపతి యైన సిద్దీకులస్థు డగుపత్తేఖానునితో బోరాడ శివాజీ రఘునాధబల్లాలుని బంపె నని వెనుక వ్రాయబడియె. పత్తేఖానునియొద్ద యుద్ధమునకు తగిన గొప్ప యోడ లున్నందున వాడు కొంకణప్రాంతములో సముద్రపు రేవునున్న శివాజీరాజ్యమునకు జాల బాధ గలిగించుచు, రఘునాధబల్లాలుని లక్ష్యపెట్టకపోయెను. కాని శివాజీ మరింత సైన్యము కొంకణప్రాంతమునకు బంపి నందున రఘునాధబల్లాలుడు సిద్దీవాని నోడించి వాని గొప్ప యోడరేవు అగు దండీరాజపురమును స్వాధీనపరచుకొనెను. అందుచే వానికి వానిరాజ్యముయొక్క యితరస్థలములనుండి సాయము చేరుటకు వీలులేక వాడు జంజీరాయను పట్టణములోనే చిక్కుపడెను. మరాఠావారు జంజరాపైని ఫిరంగు లెక్కపెట్టి లోహనాళములను బ్రయోగింప సాగిరి. వారియొద్ద మంచి

ఫిరంగులు లేనందున సిద్దీ కొన్నిరోజులవరకు వారిదెబ్బలకు నోర్చెను గాని, విజాపురమునుండిగాని, యుత్తర స్థలమునుండి గాని తనకు సాయముచేయ నెవ్వరు వచ్చుటజాడ కానక భయ భ్రాంతుడయి శివాజీకి శరణుజొచ్చి 'ఇకమీద మీ రాజ్య మునకు నేను బాధగలగింపను. మీరు నారాజ్యమునకు గలిగింపగూడదని' అని సంధిచేసికొనెను. (శి. శ. ౧౦౯౨)

సిద్దీ (ఫత్తేఖానుడు) పైని వ్రాసినప్రకారము సంధిచేసి నప్పటికి నప్పుడప్పుడు శివాజీయొక్క సముద్రతీరమందలి (కొం కణమందలి) గ్రామములపై బడి కాల్చుచు బేల్చుచు నుండెను. అందుచే శివాజీ యాప్రాంతమున నెప్పుడును అయిదు వేలసైన్యము నిలువయుంచెను. ఇంతియకాక సిద్దీవాని నెదు రించుటకునై తానును సముద్రముపై బోరాడునోడల నిర్మిం చెను. నానావిధములైన మైసవాదల యోడలను గూర్చి వానినన్నింటికి 'కులాబా' యనుగ్రామము ముఖ్యమైన రేవుగా నేర్పాటుచేసెను. సువర్ణదుర్గము విజయదుర్గము అను రేవుల లోను, యుద్ధమునకు దగిన యోడలనుంచెను. ఈ సముద్ర సైన్యమునకంతకు దర్యాసాగరుడనువాని నధికారిగా నియ మించెను. ఈ యోడలలో గావలసిన ఫిరంగులు మొదలయిన సాధనము లన్నియు జక్కగా సిద్ధపరిచి యధికారులు సము ద్రములో విచ్చలవిడిగా దిరుగజొచ్చినందున సిద్దీ పోర్చుగీజు మొదలైన సముద్రయాయులందరు శివాజీని నొక ప్రబల రాజుగా మన్నింపసాగిరి. పోర్చుగీజువారు కొలదిరోజులలోనే యొకరాయబారిని శివాజీయొద్దకు పంపి శివాజీ తమయోడల

జోలికి బోవకుండునటులను, అందు నిమిత్తమై తాము శివాజీకి తుపాకిమందు, ఫిరంగిలకి గావలసిన గోళ్ళములు మొదలయిన యుద్ధసామగ్రి యిచ్చునటులను సంధిచేసికొనిరి.

విజాపూరు సులతాను కర్ణాటదేశమునకు దిగ్విజయార్థమువెళ్ళియుండె నని వెనుక వ్రాయంబడియె. అక్కడ నవాబు రెండుసంవత్సరముల వరకుండి కొందరు బందిపోటువాండ్రను దండించి, కొందరను దండించుటకువీలులేక యెట్టకేలకు బెనన్ని కలహములను నణచి క్రీ. శ. ౧౬౬౨ వ సంవత్సరమున విజాపురమునకు దిరిగివచ్చెను. ఇట్లు నవాబు తిరిగివచ్చువరకు శివాజీ సామంతుని బాల్యాగ్రామాసుని జేసెను. ఘోరపడేను యమసదనమున కంపెను. జావళీపతియైన సర్దీని లోబరిచెను. బుడతకీచులతో సఖ్యముచేసెను. సముద్రసైన్యమునకు నాధిపత్యము వహించెను. శివాజీ యొక్కల శక్తిప్రబలు డయి నందునను, గర్ణాటకమునుండి యాలసి వచ్చిన తనకు నతని నెదిరించు సామర్థ్యము లేనందునను విజాపూరునవాబు శివాజీతండ్రి యగు శహాజీద్వారా శివాజీతో సంధి చేయువలయు నని యెంచెను.

శహాజీరాజు తంజావూరిలో దన చిన్నకుమారుడైన వెంకోజీయొద్దనుండె ననియు, అతడు విజాపూరు నవాబునకు సామంతుడనియు వెనుక వ్రాసిన సంగతి చదువరులకు జ్ఞాపకముండవచ్చును. తంజావూరినుండి శహాజీని బిలిపించి నవాబాతనికి దన మనోరథంబు దెలుపగా బుత్రుని జూడవలయుననిన యిచ్ఛ యతనికి గూడ నున్నందున నందు కాతడు సమ్మ

తించి 'నా కుమారుడు నేను జెప్పినటుల వినడనిన సంగతి మీకు దెలిసినదే అయినను వానికి బోధచేసి చూచెదను' అని చెప్పి తంజావూరుపోయి తన రెండవ భార్యయగు తుకాబాయిని, కుమారుడగు వెంకోజీని వెంటతీసికొని శివాజీని జూడవెడలెను. తాను వచ్చుచున్నానని శహాజీ శివాజీకి వార్త యంపినందున శివాజీ యేనుగులు గుఱ్ఱములు బల్లకీలు మొదలయిన రాజచిహ్నములతో దండ్రికి నెదురేగెను. ఒకరి నొకరు చూచి యనేకసంవత్సరము లయినందున జేజూరియను గ్రామముయొక్క దేవాలయములో నొకరి నొకరు చూచుకొనిరి. అక్కడినుండి శివాజీ యందరను సైన్యము దిగియున్న శిబిరములోనికి దీసికొనిపోయెను. శహాజీ పల్లకీలో గూర్చుండగా శివాజీ యా పల్లకి బట్టుకొని కాలికి నేమియు లేకుండ వినయముతో నడచెను. శిబిరము చేరినతరువాత శహాజి కుమారుని నొద్ద గూర్చుండబెట్టుకొని 'నాయనా శ్రీ భవానిప్రసాదము వలన గలిగినవాడవు. జగద్విఖ్యాతమైన పరాక్రమము జూపితివి. మతరక్షకుడ వనిపించుకొంటివి. మా వంశము పవిత్రమాయె'ననియె. అక్కడ ననేకముగా దానధర్మము బ్రాహ్మణభోజనము మొదలయిన ధర్మకృత్యములను జేసి తండ్రికుమారులందరు పూనాపట్టణమునకు బోయిరి. అక్కడ రెండు నెలలుండిన తరువాత శివాజీ తండ్రిని వెంటబెట్టుకొని రాజగడము, ప్రతాపగడము మొదలైన తన కోటలును అఫ్జుల్‌ఖానుని వధస్థలము, నూతన రాజమందిరములు మొదలైన తన వైభవమంతయు జూపించెను. వారిద్దరు రామదాసస్వామిదర్శనము

చేసికొని పన్హాళా దుర్గముపైని కుటుంబములోని యితర బాంధవుల నాదరను కలిసికొనిరి. అక్కడ గొన్నిరోజులుండి శహాజి తంజావూరికి బయలుదేరి వెళ్లునప్పుడు కుమారుని నేకాంతమునకు బిలిచి 'నీవు స్వరాజ్యము సంపాదించినందులకు నా కెంతయు సంతోషమే. కాని యికమీద నా బొందిలో ప్రాణంబు లుండువరకును నీకును నా యజమానుడైన విజాపూరునవాబునకును స్నేహముండవలయునని నా ఇచ్ఛ; నీవలన నాతనికి నెంతమాత్రము బాధ కలుగకూడదు. నీకాతడు ఈ చేతగాకపోయినను ఆ చేతనయినను (అనగా నేదో యొక మార్గముగా) ఏమైన ముట్టజెప్పకమానడు. ఇంతలకు శివాజీ 'నేను మీయాజ్ఞను మించువాడనుగాను' అని యుత్తరముచెప్పి సులతానునకిచ్చుటకై రత్నములు దుస్తులు గుర్రములు ఏనుగులు మొదలయినవి తండ్రితో బంపెను. శహాజి విజాపురమునకు వచ్చి కుమారుడు పంపిన వస్తువులన్నియు నవాబున కిచ్చి శివాజీకిని, నవాబునకును సంధి కుదిర్చి తంజావూరికి బోయెను. (క్రీ.శ. ౧౬౬౨) క్రీ. శ. ౧౬౪౬ వ సంవత్సరములో దోరణా దుర్గము గొని, శివాజీ మహారాష్ట్ర రాజ్యస్థాపన యను మహా కార్యమునకు దోరణము గట్టి నప్పటినుండియు నేటి (క్రీ. శ. ౧౬౬౨) వరకు బదునారు సంవత్సరము లయ్యెను. ఈ పదునారు సంవత్సరములును శివాజీ విజాపూరు నవాబులతో నవ్యాహతముగా బోరాడుచునే యుండి సాధారణముగా నెల్లప్పుడును గెలుపొందుచు తుదకు నవాబు ప్రార్థన వలననే యాతనితో సంధిచేసికొనెను. ఈ కాలమువరకు గొంకణ

మంతయు బర్వత ప్రదేశము లన్నియు తన స్వాధీన మయ్యెను. ఆయన రాజ్యమునకు నిప్పటికి దక్షిణోత్తరసీమ గోవా కల్యాణములును బూర్వ పశ్చిమసీమ సుపా జింజిరాలును అయియుండెను. అతనియొద్ద నేబదివేల కాల్బలము ఏడువేల గుఱ్ఱపు సైన్యము కూడియుండెను. రాయరీ యను కోట తానుండుటకు దగినది యని తెలిసికొని కొండయొక్క మూల లన్నియు జెక్కించి కొండయంతయు నునుపుగాను, శత్రువు లెక్కుటకు దుస్సాధ్యముగాను, జేయించి కోటపైని గొప్ప రాజభవనములు, మంత్రులకొఱకై మేడలును, సైన్యాదులకునై శిబిరంబులను, దివాణంబులనిమిత్తమై విశాల మందిరంబులును నిర్మించి యచ్చట దా నెల్లప్పుడును నుండుచు నా దుర్గంబును రాజధానిగా జేసెను.

ఎనిమిదవ ప్రకరణము

మొగలులతో యుద్ధము

క్రిందటి ప్రకరణములో వర్ణింపబడినటుల విజాపూరు నవాబుతో బోరాడుట మాని సంధిచేసికొని పిదప శివాజీ ఢిల్లీశ్వరుడైన ఔరంగజేబుతో యుద్ధమునకు బూనుకొనెను. ఔరంగజేబు దక్షిణము (Deccan) నుండి ఢిల్లీకి బోయినప్పుడు నాతనికిని శివాజీకిని, జరిగిన సంధిప్రసంగము వెనుక నొకప్రకరణములో వర్ణింపబడినది. ఒకరితో నొకరు సంధిచేయ నిచ్ఛగలవారుగా బైకి వారప్పుడు (క్రీ. శ. ౧౬౫౮ సం॥లో) నటించుచున్నను, ప్రసంగము వచ్చినప్పుడొకరిని నొకరుసాధింప వలయు నని యిద్దరును దలంచుచుండిరి. క్రీ. శ. ౧౬౫౮ సం॥ నుండి ౧౬౬౧ వరకు దనసార్వభౌమత్వమును స్థిరపరుచుకొను ప్రయత్నములో మునిగియున్నందున ఔరంగజేబును, విజాపూరుసులతానుతోను, జంజిరా హబషీలతోను, ఇంక నితరులతోను బోరాడుచున్నందున శివాజీయు రమారమి నాలుగు సంవత్సరములవరకు నొకరితో నొకరు వైరమును మాని యుండిరి. కాని శివాజీకి దీరికగలుగుటకు నొకసంవత్సరము పూర్వము ఔరంగజేబు తనపనులన్నియు దీర్చుకొని శివాజీ పైని దనకు గల కసి తీర్చుకొనుటకు నిశ్చయించెను. ఎవరికి

దెలియకుండ దన సైన్యము నెకాయకి పంపి కాల్యాణ్, భివండీ యను గ్రామములను దన స్వాధీన పరచుకొనెను. (క్రీ. శ. ౧౬౬౧ మేనెల). విజాపూరువారితో సంధియగువరకు శివాజీ యూరకయుండి ఔరంగజేబుచేయు కార్యములన్నియు సహించుచుండెను. ఇది సమయము కాదని కొన్ని రోజులు వేచియుండి యిట్లు సంధియైన తోడనే మొగలులతో బోరాట సాగించెను. కాల్బలమంతయు మోరోపంతుపింగళేకును, గుర్రపు సైన్యమంతయు నేతాజిపాలకరునకును నిచ్చివారిని మొగలులరాజ్యములోనికి దాడిపంపెను. వా రారాజ్యమునంతను దోచుకొని కొల్లగొట్టసాగిరి. జున్నర్ అనుపట్టణమునకు నుత్తరమున నున్న యనేకదుర్గములను మోరోపంతుపింగళె సాధించెను. నేతాజిపాల్కర్ దేశమునంతను గాల్చుచు బేల్చుచు గొల్లగొట్టుచు నప్పటంబుల గొనుచు ఔరంగబాదుపట్టణము వరకు దనపేరు గర్భనిర్భేద ముగునటుల జేయసాగెను. ఇట్లు సర్వదిశలయందును తానేయై ధనసంఖ్యనము నార్జించి శత్రువులచేత జిక్కక పూణే (పూనా) పట్టణమునకు జేరెను. (౧౬౬౨)

ఇట్లు ఢిల్లీశ్వరునకును, మహారాష్ట్రేశ్వరునకును ఘోరకలహము సంప్రాప్తమగుసమయమున ఔరంగజేబు బాదుషహాకు మేనమామ యైన శాహిస్తేఖాన్ దక్షిణము(Deccan నకు సుబేదారు(Governor) గా నుండెను. అతనికి అమీర్ ఉల్ ఉమారా (సామంతశ్రేష్ఠుడు)అను గొప్పపదవి యుండెను. అతనికి ఔరంగజేబు మీరువెంటనే యీమరాఠావారిని గెలి

నముగా దండించి వారుమరల దలయెత్తకుండ జేసి శివాజీ రాజ్యములోని కోటలన్నియు స్వాధీనపరచుకొనవలసినది. అని యాజ్ఞ పంపెను. వెంటనే శాహిస్తేఖానుడు గొప్ప సైన్యము వెంటదీసుకొని అహమ్మదునగరు పట్టణముమీదినుండి పూనాపట్టణమునకు బోవసాగెను, పూనాకు వెళ్ళుచునాతడు సింగభేదు దేశముఖునైన వాఘవరాంప్రను గొంత సైన్యమిచ్చి సుపే యను గ్రామము సాధించుటకై పంపెను. ఆ గ్రామము సాధించిన తరువాత చుట్టుపట్టు గ్రామము లన్నియు గాపాడుచు శత్రుసైన్యము రాకుండ జూచుచుండవలసినది. యని యాతనికి నాజ్ఞాపించెను. శాహిస్తేఖానుండు పూనాకుబోయి యాపట్టణమును స్వాధీనపరచుకొని యచ్చట విడిసెను. పూనాకు వచ్చుటకు కాత్రజుకనుములు శివాపూరు అను రెండు త్రోవలు; ఆ రెండుత్రోవలలోనుండి శత్రులు రాకుండ గొంత సిబ్బందిని నచ్చట నునిచెను. ఆ ప్రాంతమున నున్న కోటల రహస్యములను కనుగొనుటకునై యనేకచారుల బంపెను. ఖానుడు దండు వచ్చిన సమాచారము తెలిసి శివాజి రాయగడమునుండి బయలుదేరి సింహగడముమీదికి బోయెను.

శాహిస్తేఖానుడు మొట్టమొదట చాకణ్ అను దుర్గమును సాధింప నిశ్చయించెను. ఈ దుర్గము అటు జున్నరుకును పూనాకును నడుమ నున్నందున ఈ రెండు చోటులనున్న మొగలులసైన్యమునకు ఈ దుర్గమువారివలన మిగుల బాధలు కలుగుచుండెను. ఈ దుర్గము క్రీ. శ. ౧౬౪౭ లో శివాజీ ఫిరంగోజి నరసాళా అనువానికిచ్చెను. అప్పటినుండి యిదివరకు

(౧౬ సంవత్సరములు) వాడా దుర్గమునకు నధికారిగా నుండి శివాజీ యాజ్ఞలో నుండెను. శాహిస్తేఖానుడు ప్రచండ సైన్యము తీసికొని దుర్గమును ముట్టడించెను. ఇంత గొప్పసేనను జూచియే భయపడి దుర్గాధిపతి దుర్గమును దనస్వాధీనపరుచు నని ఖాను డనుకొనెను. కాని ఫిరంగోజీనరసాళా మొగలుల సేనకు భయపడక రమారమి రెండు నెలలవరకు శత్రువులతో బోరాడుచుండెను మొగలులు దుర్గమును ముట్టడించిన యేబదియారవ రోజున దుర్గముయొక్క యీశాన్యభాగమందలి బురుజుక్రింద నొకసొరంగముచేసి మొగలు లందులో దుపాకిమందు నింపి యగ్నిముట్టించి కోటగోడను గొంత పడవైచి త్రోవ చేసికొనిరి. సొరంగములోని మందువలన గోటలోని సైనికు లనేకులు హతులైరి. మొగలులు వెంటనే యా త్రోవనుండి లోపలికి బోవజొచ్చిరి. కానిదుర్గాధిపతి మిగిలిన సైనికులను వెంటదీసికొని మొగలులతో ఘోరముగా బోరాడి రాత్రియంతయు శత్రువులను లోనికి జొరనియ్యడయ్యె! ఇకబోరాడిన ప్రయోజనము లేదని తెలిసికొని శివాజీ ప్రాతఃకాలమున దుర్గాధిపతియైన ఫిరంగోజీనరసాళాకుదుర్గము శత్రుస్వాధీనము చేయుమని వార్తపంపగా నాతడు తానచ్చటినుండి వెడలి దుర్గము మొగలులకు నిచ్చివేసెను. ఫిరంగోజి యొక్క యమితపరాక్రమమును, స్వామిభక్తియు జూచి శాహిస్తేఖాను డాతని నెంతయు గొనియాడి ఔరంగజేబుతో జెప్పి గొప్పయుద్యోగ మిప్పించెదనని యాశచూపి యాతనిని దనవైపునకు రమ్మనెను. కాని యాతడందునకు నొప్పుకొనక

తనసైనికులతో శివాజీయొద్దకు బోయెను. శివాజీయు నాయప్రతిమరాజభక్తుని మిగుల గౌరవించి భూపాలగడ మను దుర్గమునకు నధిపతి జేసెను.

చాకణ్ వంటి యొక చిన్నదుర్గము సాధించుటకు ఖానుడు రమారమి వేయిమంది సైనికుల గోలుపోయెను. కాని వాడు మిగుల నధైర్యపడి మరాటవారి కోటలు సాధించుట యాటలు కాదని తలచి వాడాసమాచారము ఔరంగజేబునకు దెలిపి తనకు దోడుగ నధికసైన్యముల నంపుమని కోరెను. అందుపై ఔరంగజేబునకు వచ్చుచుండు గాలస్య మగుచుండిన నంతవరకు శాహిస్తేఖానుడు పూనానగరమునే విడిసియుండెను. ఇటు నేతాజి పాల్కరుడు క్రిందటి సంవత్సరమువలెనే అహమ్మదనగరు, ఔరంగాబాదు మొదలయిన ప్రాంతములను కొల్లగొట్టి యమితధనము ప్రోగుచేసెను. (౧౬౬౩) ఇంతలో యశవంతసింగు ఉత్తరము నుండి వచ్చి చేరినందున శాహిస్తేఖానుడు నేతాజిపాల్కరును నెదిరించుటకై కొంతసైన్యము నంపెను. ఆసైన్యము నేతాజి వెంట దగిలి యాతని సైనికుల ననేకుల జంపి యాతనిని గాయపరిచెను. ఇంతలో వానకాలము ప్రారంభమైనందున మోగలుల సైనికిలు యుద్ధముల మాని విశ్రాంతిలోనికి బోయిరి.

శాహిస్తేఖానుడు పూనాపట్టణమునందు శివాజీకొరకు గట్టబడిన మందిరములోనే మిక్కిలి జాగ్రత్తతో విడిసియుండెను. ఎంతమాత్రమును మోసము జరుగగూడదని యాతడు తన సైన్యములో నదివరకున్న మరాటవారిని దప్ప, నితర మరాటాల నెవరిని సైన్యములో జేర్చుకొనలేదు. గ్రామములో

నే మరాటావారును దనయాజ్ఞ లేక శస్త్రమును ధరింపగూడ దని యాజ్ఞాపించెను. ఇన్ని కట్టుదిట్టము లేర్పరుచుకొని నప్పటికి శివాజి తన యప్రతిమ యుక్తిచే నాతనిని మోసపుచ్చెను! శివాజీ తన యొద్దనున్న యిద్దరు గుమస్తాలను బంపి ఖానుని సైన్యములోని యొక మరాట సిపాయిని వశపరచుకొనెను. వాడు ఖానునితో 'నాయింట నేడు వివాహకార్య మున్నది. కాన మంగళ వాద్యములతో బట్టణములో నూరేగింపు చేయుటకు నాజ్ఞ కావలయునని చెప్పి యట్టి యనుజ్ఞ వడసెను సాయంకాలసమయమున శివాజి కొంత సైన్యముతో సింహగడముదిగి క్రిందికివచ్చెను. అక్కడనుండి బయలుదేరి త్రోవలో నక్కడక్కడ కొందరు సైనికుల నుంచుచు పూనాపట్టణమునకు వచ్చి చేరెను.

తాను జేయవలసినపని చేసి తిరిగి వెళ్ళునప్పుడు శత్రుసైనికులు తన వెంట దరిమికొని రాకుండ నాతడు మొట్టమొదటనే యొకయేర్పాటు చేసియుండెను. సింహగడము త్రోవ కాక మఱియొక త్రోవను దాను దనసైనికులును బోయిరని శత్రువులకు భ్రమ కలుగవలయు నని కాత్రజు పర్వతములకు బోవు దారి వైపున నచ్చటచ్చట వృక్షములకును ఎద్దుల కొమ్ములకును గుడ్డలు కట్టి సిద్ధముగానుంచి యేర్పాటు ప్రకారము శార్ఙ్గధ్వని కాగానే కొలది సైనికు లా గుడ్డలకు నిప్పుముట్టించి శంఖశార్ఙ్గనాదములు చేయుచు దను తమ తావులకు బారిపోవునటుల నేర్పాటు చేసెను. ఇట్లు సిద్ధముచేసి శివాజీ

తనవెంట తానాజి మాలసురే (సాజికరాక్ డాదాజీబాపూజీ దేశపాండే మొదలైన విశ్వాస పాత్రులును రణరంగ భీములును నైన యిరువదియైదుగురు సర్దారులను వెంట దీసికొని తాను వశపరచుకొనిన సిపాయియొక్క యూరేగింపులోని పెండ్లివారివలె నటించుచు గ్రామములోనికి జొరెను.

అర్ధరాత్రివేళ గ్రామ మంతయు నిద్రపోగా, శివాజీయు నాతనిసరదార్లును పూనాపట్టణములోని దొంగత్రోవలన్నియు నెరిగినవా రగుటచే శాహిస్తేఖాను యేర్పరచిన కావలివారి నందరను దప్పించుకొని ఖానుడున్న మందిరముయొక్క యావరణములోనికి జేరిరి. అక్కడ నొక గవాక్షముద్వారా పై యంతస్థు పైకి నెక్కిరి. కాని యింతలో గొంచెము శబ్దమైనందున స్త్రీలు మేల్కొని యేమో మోసమున్నదని భీతినొంది ఖానుడు నిద్రించుచున్న గదిలోనికిబోయి యాతని లేపిరి. ఇక దానుదప్పక చచ్చెదననితలచి ఖానుడొక గవాక్షములోనుండి క్రిందికి దుమికి పారిపోయెను. కాని యాతడు దుముకు సమయమున శివాజీవెంటనున్న వారిలోని యొకడాతని కత్తితో వేయగా ఖానుని చేతిగ్రేలొకటి తెగెను. గ్రేలుపోయినను ఖానుడు ప్రాణము దక్కించుకొనెను. కాని యింకొక గదిలో నున్న యాతనికుమారుడు శివాజీ చేతిలోబడి మృతు డయ్యెను. శిబిరములో నంతట శివాజీ వచ్చెనన్న కలకలధ్వని పుట్టి సైనికు లందరు భయభ్రాంతులైరి. ఇంతలో సంకేతానుసారము కాత్రజు గుట్టలవైపునుండి గుడ్డలముట్టించిన వెలుతురును

*కొమ్ముల మ్రోతయు రాగా మొగలులు శివాజీ యటుపోవుచున్నాడనుకొని సింహగడముత్రోవ విడిచి యటువైపులకే పోవసాగిరి. కాని కొంతదూరము వెళ్ళిన పిదప శివాజీచేసిన మోసము వారికి గోచరమయ్యెను.

ఇటు శివాజీతనయుక్తిచేతను, సాహసముచేతను శత్రువులను బూర్తిగా బరాభవించి తనసైన్యముతో సింహగడమునకు వెళ్ళెను. (౧౬౬౩ ఏప్రిల్)

ప్రాతఃకాలమున మొగలులసైన్యము మహాకోపముతో శంఖభేరీరవములు చేయుచు సింహగడముపైకి నెత్తివచ్చెను. శివాజీ యాసైన్యముల వెంటనే యెదిరింపక వాని నన్నింటిని బూర్తిగా దుర్గముక్రిందికి రానిచ్చెను. తురకసైన్యములు ఫిరంగి దెబ్బ తగులునంత సమీపమునకు వచ్చినతోడనే యొక్కసారి ఆసైన్యములపై ఫిరంగులవర్షము కురియింపసాగెను. సహింపలేని యాదెబ్బలకు శత్రువుల ఏనుగులు పీనుగులయ్యె. పతాకలుక్రిందగూలె. సైనికులు భయభ్రాంతులై చెల్లాచెదరైరి. ఇంతలో నచ్చటదాగియున్న కడతాజిగుజర్ నేతాజి పాల్కర్ ఈ మరాటా వీరులు తమసైన్యములతో మొగలులపై బడి యిదివరకే భయభ్రాంత మయిన యాతురకసైన్యమును బూర్తిగా నోడించి పారద్రోలిరి. ఇట్లు మరాఠా వారిచే మొగలులు సంపూర్తిగా బరాభూతు లయిరి.

---

* హ్యానిబాల్ అనుకార్థేజ్ సైన్యాధీశ్వరు డిటులనే యెద్దుల కొమ్ములకు గుడ్డలుకట్టిముట్టించి రోమన్ జనులను మోసపుచ్చెనని రోమకచరిత్రమందున్నది.

జరిగినపరాభవమువలనను, పుత్రవధవలనను శాహిస్తే ఖాను డత్యంతవిషాదహృదయుం డయ్యె. యశవంతసింగుని యొక్క పరాకువలన నింత పుట్టెనని యాతని నిందింపసాగె. 'సైన్యములో నైక్యభావము నాజ్ఞాధారకతయు లేవు; యశ వంతసింగు శివాజీకి వశుడయియున్నాడు.' అని ఔరంగజేబు నకు వ్రాసి పంపెను. ఔరంగజేబు అప్పుడు గొప్పదుర్గ్గమునుండి లేచి స్థానాంతరము చేయవలయు ననెడి యుద్దేశముతో గాశ్మీ రమునకు వెళ్ళుటకు సిద్ధముగా నుండెను. ఇంతలో దక్షిణము నుండి యీవార్తపోగానే యాతడు శాహిస్తేఖానునిమాటలు నమ్మక యాతడే చేతగానివాడని తలచి యాతని బంగాళా సుబేదారుగా మార్చి యాతనికి బదులుగా దనపుత్రుడైన సుల్తాన్ మోఆజీమ్ అనువాని దక్షిణమునకు సుబేదారుగా బంపెను. శాహిస్తేఖానుడు వెడలిపోయినతరువాత యశ వంతసింగు సైన్యములను దీసికొని ఔరంగాబాదులో విడిసి యుండెను.

ఇట్లు శివాజీ కల్యాణపట్టణమునొద్ద నొకటియు ధుండీ రాజపురమునొద్ద నొకటియు, నిట్లు రెండు ప్రచండసైన్యముల బోగుచేసెను. ఒకసైన్యముతో పోర్చుగీజ్ వారి వసయీపైని దండెత్తెద ననియు, రెండవసైన్యముతో జంజిరాసిద్దీని సాధించెద ననియు వదంతులు శివాజీ శత్రువులను మోసపుచ్చుటకునై ప్రచురింప జేసెను, కాని గుజరాతు దేశములోని పట్టణము లలో నత్యంతధనముగలది యైన సురత్ (Surat) పట్టణముపై దండెత్తి పోవుట శివాజీయొక్క రహస్యోద్దేశమై యుండెను.

బహిర్ జీ నాయక్ అనువాని ముందు బంపి యాపట్టణము కొల్లగొట్టు నుపాయంబు లన్నియు బూర్తిగా విచారించి యుంచెను. కావలసిన సిద్ధత యంతయు నైన పిదప నాసిక పట్టణమునకు దేవదర్శనార్థమనియు, పేష్వాయైన మోరోపంతు పింగళేగారు ఆయనవైపుల గ్రొత్తగా సంపాదించిన దుర్గములను జూడవలయుననియు మిష పెట్టుకొని శివాజి నాసికకు బోయెను. లోకులందరు శివాజీ నాసికక్షేత్రములో నున్నాడను కొనుచుండ నాతడు అకస్మాత్ నాలుగువేల గుఱ్ఱములతో సూరతు పట్టణముపై బడెను. ఆరురోజులవరకు నా పట్టణము యథేష్టముగా గొల్లగొట్టి శివాజి అచ్చటి సుబేదారునకు వర్తమాన మంపి యాతడు వచ్చువరకే యక్కడ సంపాదించిన యపార ధనమంతయు రాయగడము చేర్చెను ఈ తడవ శివాజీకి గోట్లకొలది ధనము దొరకినది యని చరిత్రకారులు వ్రాసి యున్నారు, ఆ కాలమున సూరతు పట్టణములో డచ్ వారి యొక్కయు, ఇంగ్లీషువారియొక్కయు దుకాణము లుండెను. కాని శివాజీ వానిజోలికి బోయినవాడు కాడు. (౬ వ జాన్యువరి ౧౬౬౪

సూరతు పట్టణమునుండి తిరిగి వచ్చినతోడనే శివాజీ తనతండ్రియైన శహాజీయొక్క మృత్యువార్త వినెను. శహాజీ వేటాడుచున్నప్పుడు గుఱ్ఱముమీదినుండి పడి బసవపట్టణములో మృతుడయ్యెను. తండ్రిమరణమునకు దుఃఖించి లక్షలకొలది ధనము ఖర్చుచేసి యాతనియుత్తరక్రియలు మహావైభవముతో సింహగడములో జేసెను. శహాజీ మరణానంతరము శివాజీ

‘రాజా’ యనుబిరుదు తాను వైకొనెను. తనపేరిట నాణెములు పోయసాగెను.

క్రిందటి రెండు సంవత్సరములవలె నీ సంవత్సరమును నేతాజి పాల్కరుడు వర్షాకాలమునకు బూర్వము మొగలుల రాజ్యము కాల్చ బెల్పం గొండాగె గాని, వాని నెదుర్కొను వారు మొగలులలో నెవ్వరు లేరైరి. అటుల సముద్రము మీదను మరాటావారిశౌర్య మసహ్య మయ్యె. మక్కా-యాత్రకు బోవు ననేక తురుష్కులతో నిండియున్న మొగలుల యోడలన్నియు బట్టుకొని నా యాత్రికులయొద్దనుండి యప్పనంబులు తీసికొని గాని, వారిని మరాటావారు విడువరైరి. ఆగష్టు (౧౬౬౪) నెలలో శివాజీ స్వయముగా దాడిమిపోయి అహమ్మదునగరమును దోచుకొని ఔరంగబాదువరకు దేశము నంతను జీకాకుపరచెను. శివాజీ మొగలులతో బోరాడుచున్నందున దాము బోగొట్టుకొనిన కొంకణప్రాంతము మరల సంపాదించుకొనుట కదియే మంచి సమయమని తలంచి చేసిన సంధికి విరుద్ధముగా విజాపూరు నవాబు కొంకణముపైకి సైన్యముల బంపెను. గాని శివాజీ సవ్యసాచిత్వమును వహించి యెచ్చట జూచినను దానెయై యుద్ధము శత్రువులను జర్జరితుల జేసెను. శివాజీ మనుష్యుడొకడా, లేక పదిమందా! యని శత్రువులకు భయముకలుగునటుల బ్రవర్తించె. నెవరికిదెలియకుండ నొక్కసారి కొంకణమునకు వచ్చి విజాపూరు సైన్యముల నెదిరించి వాని నోడించెను. ఆయుద్ధమున నారువేల సైనికులు నిహతులైరి. ఆ యుద్ధసమయమున వేంగుర్లే యను గ్రామ నివా

సులు శివాజీని నెదిరించినందున నాతండా గ్రామమును గాల్చి వేసెను. ఇంతపని చేసి వెంటనే యాశూరుండు సింహగడము నకు మొగలుల నెదిరించుటకునై వచ్చెను గాని, ఇప్పుడు మొగలులు తమరాజ్యములోనేయుండి యగ్రేసరులై యుద్ధము నకు రాకపోయిరి.

ఇట్లు మొగలులు ప్రస్తుతము నిద్రించియున్నారని చూచి శివాజీ కొంతసైన్యము విజాపూరువారి రాజ్యములోనికి బంపి కొంతభాగము కొల్లగొట్టించెను. తానుస్వయముగా మొగ లుల సైన్యముపై సర్వాస్త్రములు పడెదననిన వదంతి యొకటి పుట్టించి యెవ్వరికి సంశయమురాకుండ సముద్రములో బడవల నన్నింటిని బోగుచేసుకొని సముద్రప్రయాణము చేసి యొక్క- సారి బసనూర్ (బారసిలోర) పట్టణముపై బడెను. సురత్ పట్టణమువలెనే యాపట్టణమును కొల్లగొట్టి యసంఖ్యధనము సంపాదించి శివాజీ గోకర్ణమునకు బోయెను. అక్కడ గొంత దానధర్మముచేసి చుట్టుపట్లనున్న గొప్పపట్టణముల గొల్ల గొట్టెను. కార్వార్ పట్టణమువారు శివాజీని నెదిరించిరి; కాని తుదకు వారును కప్పమియ్యవలసినవారైరి. ఆపట్టణములో ఇంగ్లీషువారి దుకాణముండెను. వారు శివాజీకి వేయిరూపాయి లప్పన మిచ్చిరి. (౧౬౬౫గిఫిబ్రేవరి) అక్కడినుండి భూమార్గమున సైన్యమునుబంపి తాను జలమార్గమున రాయగడమునకు బయలుదేరెను. కాని యెదురుగాలియైనందున నోడలు మరల గ్రిందికివచ్చి యాయాసపడి కొంతనష్టము బొందెను. సముద్ర ప్రయాణమువలన లాభములేదని తలచి యాతరువాత శివాజీ

యెన్నడును స్వయముగా సముద్రప్రయాణము చేసినవాడు కాడు.

శివాజీ సముద్రయానమునకు బోయినప్పుడు ఔరంగజేబు యశవంతసింగును, తన కుమారుడయిన సుల్తాన్ మొఆజిమ్ అను వానిని (వీరిద్దరును దక్షిణములోని సైన్యాధిపతులు) తనయొద్దకు బిలిపించుకొని వారికి బదులుగా జయపూరురాజయిన జయసింగును దిలేర్ ఖాన్ పఠాన్ అను తురుష్కుని దక్షిణమునకు శివాజీపైకి బంపెను.

రాజాజయసింగును, దిలేర్ ఖానుడును నర్మదానది దాటి శివాజీ సముద్ర ప్రవాసములో నున్నప్పుడు తమ సైన్యములతో దక్షిణమునకు వచ్చి చేరిరి. జయసింగు ఏప్రిల్ నెలలో పూనా పట్టణములో విడిసెను. అతడెంతమాత్రమును నాలస్యము చేయక వెంటనే పురందరదుర్గమును ముట్టడించి యాముట్టడి పనిని దిలేర్ ఖానుని కప్పజెప్పి తాను స్వయముగా సింహగడమును ముట్టడించి విడిసెను; కొంత సైన్యమును రాయగడము వైపునకును బంపెను. శివాజీ నేతాజీపాల్కరుని రాజ్యములో నుంచిపోయెను; గాని, వాడు శత్రువులతో బోరాడక యితదేశములు కొల్లగొట్టుటకై పోయెను. కడతాజీ యను గుర్రపురాతుల యధిపతి యొక్కడుండెను గాని, మోగలుల ప్రచండసైన్యము నెదుర్కొను నంతబలంబు వాని యొద్ద లేదయ్యె. కాన మొగలులు సైన్యము లక్ష్యములేక మరాటా వారి కోటలను నుద్దండతతో నాక్రమింప జొచ్చెను.

ఇట్లు పరసైన్యము లన్నియు దనరాజ్యములో విచ్చల
విడిగా దిరుగుచున్న సమయమున శివాజీ సముద్రయానమున
నుండి తిరిగివచ్చెను. వెంటనే రాయగడమునకు బోయి తన
సరదార్లందరను బిలిపించి పెద్దసభ చేసి మొగలుల నెదు
ర్కొనుమార్గంబెయ్యది యని యాలోచింపదొడగిరి. కాని
శత్రుసైన్యమమిత మైనందునను, జయసింగుఅసమానపరాక్రమ
వంతుడైనందునను, నాతని నెదిరించు నుపాయంబేమియు నెవ్వ
రికి దోపదయ్యె. ఆలోచన లనేకములు చేసిరి; కాని యొక్క
టియు గానసాగుమార్గము లేకపోయెను. అప్పుడు సమయ
జ్ఞుడైన శివాజీ జయసింగునితో యుద్ధముచేసిన లాభము లేదని
తెలిసికొని సంధిచేయుటయే హితమని నిశ్చయించెను.

పురందరుదుర్గమును ముట్టడించిన దిలేర్ ఖాన్ అవి
శ్రాంతముగా దుర్గమును స్వాధీనపరచుకొను ప్రయత్నంబు
చేయుచుండెను. కాని, వీనిప్రయత్నంబు లన్నియు దుర్గాధిపతి
యగు మురార్ బాజీదేశపాండే యనువాడు నిష్ఫలముచేయు
చుండెను. మొగలు లేదిక్కునుండి పైనెక్క ప్రయత్నించి
నను, నాదిక్కునుండివారిపై బాణపరంపరలు గురిపించి వారిని
వెడలగొట్టుచుండెను. ఆదుర్గములోనున్న రెండువేలవీరులు
శత్రువులతో ఘోరముగా బోరుచుండిరి. తుదకు దిలేర్ ఖాన్
కొందరు మారాటావీరులను వెనుకకు నెట్టి దుర్గము
యొక్క యొకబురుజుక్రింది సొరంగముచేయ జొచ్చెను. మరాట
వీరులు పెట్టుబాధ కెట్టులైన నోర్చుకొని యాసొరంగము పూర్తి
చేసి యందు మందునింపి నిప్పుముట్టించి కొంతభాగము కూల్చి

మొగలుల సైన్యములు లోపలికి చొరబడెను. చొరబడు సమయమున మొగలులు కొంత తొందరపాటుపడి యవ్యవస్థితులయినందున, నిదియే సమయమని తలచి మరాటావీరులు పైనుండి ఫిరంగిదెబ్బలతో శత్రువులను జెదరగొట్టిరి. వాండ్రు పారిపోవునప్పుడు వారి వెంటదగిలి దుర్గాధిశుడు రెండువేల మొగలు సైనికుల నరకెను. కడమ సైనికులందరు పారిపోయిరి. దిలేర్ ఖానుడు ఏనుగుమీద గూర్చుండి యుద్ధమంతయు జూచుచుండెను. తన సైనికులు పారిపోవుట చూచి వారి నందర మరల బోగుచేసికొని పంబిన కోపముతో దుర్గాధిపతి యైన మురార్ బాజీ పోరాడుచున్న చోటికి బోయెను. గాని మరాటా (మావళా) వీరులు విజృంభించి పోరాడునప్పుడెట్టి శత్రువులనైన లక్ష్యపెట్టువారు కారు. ఇట్లుభయ సైన్యములు ఘోరముగా బోరుచుండ దిలేర్ ఖానుడు సూటిగా బాణమువేసి దుర్గాధిపుడైన మురార్ బాజీని పడవైచెను. తమ నాయకుడు పడుట చూచి మావళేవీరులు భీతిజెంది, పై కోటమీదికి బోయిరి. మొగలులు మరల గ్రిందిబురుజును నాక్రమించుకొనిరి. కాని పైనుండి వచ్చు ఫిరంగిగుండుల కోర్వలేక యా బురుజును గూడ వారు మరల విడువ వలసినవారైరి.

ఇట్లు పురందరు దుర్గము ఉత్తరదిక్కునుండి సాధించుట యసాధ్యమని తలచి, దిలేర్ ఖానుడు పురందరమునకు నీశాన్యమున నున్న వజీర్ గడమను కోటను ముట్టడించి సాధించెను. కోటమీద ఫిరంగులుంచి యక్కడినుండి పురందరముయొక్క పై కోటమీద గుండ్లు వేయజొచ్చెను. కాని యప్పుడు వర్షా

కాలము వచ్చినందునను, మొగలులయొద్ద యుద్ధసామగ్రి పూర్తిగా లేనందునను, ఆ గుండ్లవలన పురందరు కోటలోని వారి కేమియు హాని కలిగినదికాదు. అయినను పురందరులోని వీరులందరు హతాశులైనందున, బోరాడినందున లాభములేదని తలచి వారు దుర్గమే శత్రుస్వాధీనముచేయుటకు సిద్ధపడిరి. కాని, తాను వర్తమాన మంపువరకును దుర్గము వదలవలదని శివాజీ యాజ్ఞాపించినందున ఆయాజ్ఞకు లోబడవలసిన వారైరి.

ఇక బురందరుకోట శత్రువుల చేతిలో బడకుండ నుండనేరదు. అది శత్రువులచేత జిక్కినేని కడమ దుర్గము లన్నియు సులభముగా జిక్కును. ఇక మొగలులతో ద్వరగా సంధిచేయుటయే మేలు. కోటలన్నియు శత్రువుల చేతిలో జిక్కినతరువాత సంధికి నొడబడుట మేలుకాదు అని తలచి, శివాజీ సంధిమాటలు మాటలాడుటకై జయసింగు నొద్దకు రఘునాథభట్ పండితరావ్ అనువాని బంపెను. జయసింగు డా రాయబారిని మిగుల గౌరవించి యాతడు చెప్పు మాటలన్నియు శ్రద్ధతో వినెను. శివాజీ మనలను మోసపుచ్చవలయునని యీ యుక్తి చేసెనేమో యని మొట్టమొదట జయసింగుడు తలంచెను గాని, రాయబారి ప్రమాణపూర్వకముగా నిజస్థితి దెలిపిన తరువాత జయసింగుడు సంధికి నిష్టపడి శివాజీకి నిట్లు వర్తమాన మంపెను. 'ఔరంగజేబు బాదుషహా' సార్వభౌముడు; బలవంతుడు; అతనితో సఖ్యము చేయుట నీకు మంచిది; ఆతనితో గలహించి నీవు బ్రతుకనేరవు. నేను హిందూరాజును; నీవును గొప్పవంశములోని

వాడవు. నీవు హిందూమత సంస్థాపన చేయుచున్నా వది నాకు సమ్మతమే. నీవు ఢిల్లీశ్వరుని శరణు చొచ్చిన నాతడు నిన్ను క్షమించు నట్లును, నీకు గొంత జాగీరు ఇచ్చునట్లును నేను జేయగలను' ఇట్లు శివాజీకి రాయబారివలన జయసింగు మనోభీష్టము తెలియగా, నాతడు జయసింగును జూచి స్వయముగా మాటలాడుటకు సింహగడమునొద్దకు వచ్చెను. జయసింగుడు స్వయముగా శివాజీకి నెదురుగాబోయి యాతనిని సాగనించుకొని గౌరవించి తనకు కుడివైపున గూర్చుండ బెట్టుకొని మిక్కిలి ప్రేమతో సంధిమాటలు ముచ్చటించెను. తరువాత శివాజీవెంట దన మేనమామ యైన సుభానసింగును నిచ్చి పురందరులో నున్న దిలేరుఖానుని యొద్దకు బంపెను. ఆ ఖానుడును శివాజీవేడిన సంధికి నొప్పుకొనెను'. వారందరు గూడి సింహగడమునకు దిరిగి వచ్చిరి. ఇట్లు కొన్ని రోజు లాలోచనలు జరిగి తుదకు రాజా జయసింగు ఔరంగజేబున కు తరము వ్రాసి, తనకును శివాజీకిని జరిగిన యొడంబడిక లాత నికి దెలుపవలయు ననియు, ఆతని యొద్దనుండి జవాబు వచ్చిన తరువాత సంధి స్థిరపరుప బడు ననియు నిర్ణయించిరి. ఆ యొడం బడిక లెవ్వియన:—"ఢిల్లీశ్వరుని రాజ్యములోనివియై శివాజీచే నాక్రమింప బడినవియు, నాతనిచే నూతనముగా నిర్మింపబడి నవియు నయిన ముప్పదిరెండు దుర్గములలో పురందరు, సింహ గడము, మరి పదునెనిమిది దుర్గములు గలసి ౨౦ దుర్గములను, వాని చుట్టుపట్టుల నున్న ప్రదేశమును శివాజీ జయసింగునకు స్వాధీన పరుప వలయును. కడమ పండ్రెండు దుర్గములును,

వానిచుట్టు నున్న లక్ష హోనుల ప్రాంతమును, యిదివరకు నాతడు ప్రభుత్వము చేయుచున్న యితర ప్రాంతమును, శివాజీ తనకొరకై యుంచుకొని, యది బాదుషాహావలన నియ్యబడిన జాగీరుగా నెంచవలసినది. శివాజీ కుమారుడైన యెనిమిదియేండ్ల సంభాజికి బాదుషహావలన నైదువేల గుర్రపుసవార్ల మనసబు దొరకవలయును. ప్రస్తుతము శివాజీ బాదుషాహ కిచ్చుచున్న దుర్గములకు మారుగాను, యిదివరకాతనికి అహమ్మదునగరము రాజ్యములో నున్న దేశముఖు హక్కులకుగాను, విజాపూరు రాజ్యములో చౌథ్ (నాలుగవవంతు; సర్ దేశ్ ముఖు హక్కులు బాదుషా శివాజీ కియ్యవలెను. ఈ హక్కుక్రింద వచ్చుధనము స్వయముగా శివాజీ వసూలు చేసికొనవచ్చును. ఈ హక్కు లిచ్చినందులకు ఔరంగజేబుకు శివాజీ పేష్కషు క్రింద ౪౦ లక్షల హోనులు, సంవత్సరమునకు మూడులక్షల చొప్పున జెల్లింపవలయును. పని పడ్డప్పుడు సైన్యముల బంపి బాదుషహాకు సాయము చేయవలయును."

పైని వర్ణింపబడిన యొడంబడికలన్నియు నొప్పుకొని ఔరంగజేబు శివాజీ కొక పెద్దయుత్తరము పంపెను. అందుపై వీరికిని వారికిని స్నేహభావము కుదిరి సంధియయ్యెను. అంతట జయసింగు, విజాపూరునవాబు ఢిల్లీశ్వరుని ధిక్కరించి కరభారమియ్యనందున నాతనిపైకి దండెత్తివెడలెను. ఈయుద్ధమునందు శివాజీ రెండువేల యశ్వబలముతోను, ఎనిమిదివేల కాల్బలముతోను, జయసింగునికి సాయముచేయుచుండెను. మరాటా వారిసాయమువలన జయసింగు డనేకగ్రామములను సాధించెను.

తొమ్మిదవ ప్రకరణము

★

ఢిల్లీ ప్రయాణము

విజాపూరువారితో బోరాడునప్పుడు తన సైన్యములకు శివాజీ సహాయము చేసినాడనియు, దనకొరకు ననేక దుర్గముల సాధించినాడనియు విని ఔరంగజేబు సంతసించి, తన సంతోషమును వెల్లడిచేయుటకై ప్రశంసించుచు శివాజీ కొక యుత్తరము వ్రాసి యాతనితో గొన్ని కానుకలును బంపెను. తరువాత గొన్నిరోజులకు మరియొక జాబు పంపి యందు "నీవొకసారి ఢిల్లీకివచ్చి నన్నుజూచి పోవలసినది. నీవిక్కడికి వచ్చినయెడల నిన్ను గొప్పసర్దారును జేసి గొప్పరాజకీయ కార్యములపై నియుక్తునిజేసెదను -" అని వ్రాసెను. - ఈయుత్తరము శివాజీ జయసింగునకు జూపి యాతనియభిప్రాయ మడుగగా వెళ్ళవలసినదియే యని యాతడు సలహాచెప్పెను. అందుపై దానురాగలనని బాదుషాకు జెప్పుటకై తన వకీలగు రఘునాథబల్లాళకొండే యనువాని ముందుగా ఢిల్లీకి బంపెను. ఆతడు ఢిల్లీకిబోయి, అక్కడి రాజకీయస్థితి యంతయు అచ్చట సరదార్ల ప్రవర్తనము, మొదలయిన సంగతులన్నియు రహస్యముగా గనుగొని తనకు దెలియజేయవలయు నని యేర్పాటుచేసెను. తాను ఢిల్లీకి బోయినప్పుడు తన రాజ్యము

యొక్క పరిపాలన చక్కగా జరగవలయునని రాజ్యతంత్రము లన్నియు మోరోపంతుపింగళే 'ఆబాజిసోనదేవుడు, అణ్ణాజీదత్తో అను ముగ్గురు సరదారుల చేతికిచ్చి, వారియాజ్ఞను దన యాజ్ఞగా జూచుచుండవలయునని యందరు సేవకులకు నాజ్ఞాపించెను. బయలుదేరుటకు బూర్వము శివాజీ స్వయముగా దన దుర్గముల నన్నింటిని బరీక్షించి చూచెను.

తనవెంట నైదునూర్గు రశ్వసైనికులను, వేయిమంది మావళేవీరులను దీసికొని తన కుమారుడయిన సంభాజీతో గూడ శివాజీ క్రీ. శ. ౧౬౬౬వ సంవత్సరపు మార్చినెలలో ఢిల్లీకి బయలుదేరెను. నర్మదానది దాటి మధురా బృందావన క్షేత్రములను దర్శించి వారందరు ఢిల్లీ చేరిరి. జయసింగు కుమారుడగు రామసింగును, మరికొందరు చిన్న సరదార్లుతప్ప నెవరును శివాజీకి నెదురుగా వచ్చినవారు కారు. ఉత్తరములు వ్రాసి నన్ను బిలిపించి గొప్పవారి నెవరిని నాకు నెదురుగా బంపక పోయెనని శివాజీకి గొంత మనస్తాపముగలిగెను. తరువాత పేరోలగమున ఔరంగజేబును జూడబోయినప్పుడును దగిన సన్మానంబు జరగదయ్యె. ఔరంగజేబు నిండిన సభలో గొలువుండగా శివాజీ వెళ్లి జోహారుచేసి తాను దెచ్చిన కానుక లొసంగగా 'ఎప్పుడువచ్చితి' రని యడిగి తన కుడివైపున నిలువబడి యున్న రాజపుత్రులలో నిలువబడుమని కనుసంజ్ఞ చేసెను. ఢిల్లీశ్వరుడు తన్ను గొప్పసరదార్లలో గూర్చుండబెట్టి గౌరవించు నని తలచి వెళ్ళినశివాజీ యటులగాక తన్ను నిలువబెట్టినందులకు నెంతయు గోపించి ఔరంగజేబు మనస్సునకు

దగులునట్టి మాటలు కొన్ని యనెను. తరువాత శివాజీ తాను దిగిన బసకు బోగా, రేపటినుండి నీవు పేరోలగమునకు రానక్కరలేదు. ఏమి మాటలాడవలసియున్నను రాయబారి ద్వారా మాటలాడవచ్చును. అని ఔరంగజేబు శివాజీకివార్త పంపెను. అందుపై శివాజీ తాను ఢిల్లీకివచ్చి మోసపోయితి నని తెలిసికొని యికముందు బాదుషా యేమి చేయదలచి నాడో తెలిసికొనుటకై యాతనియొద్దకు దన వకీలును బంపి 'మీరు రమ్మని జాబు లంపినందున మేమిక్కడికి వచ్చినారము మేము మాచేతనైనంత మీసేవ చేసినారము అందులకు మీరు చౌథ్ (నాలుగవభాగము) సర్దేశముఖ్ హక్కులనుగురించి మాకు సనదులీయ వలసినది. దక్షిణములోని గోలకొండ విజాపూరు రాజ్యమును సాధించుటకు మీకు మేమెంతయైనా సాహాయ్యము చేయగలవారము. అయినను ఆ సాహాయ్యము మీకక్కరలేని యెడల మాదేశమునకు బోవుటకు మాకు సెలవిప్పింప వలసినది. ఇచ్చటినీళ్ళు మాకును మాపరిజనంబులకును గిట్టవు గాన మాకు వెళ్ళుటకు సెలవిప్పింప వలసినది' అని విన్నవించుకొనెను. అందులకు దగిన ప్రత్యుత్తరం బియ్యక ఔరంగజేబు ఊరికొత్వాలగు ఫౌలాద్ ఖానుని బిలిచి 'శివాజీ దిగిన బసకుజుట్టును పహారాలుంచి, ఆత డెక్కడికి వెళ్ళినను నాతనివెంట మన బంట్రౌతుల నుంచుచు నాత డెక్కడికిని బారిపోకుండ జూచుచుండవలయు' నని యాజ్ఞాపించెను. ఇట్లు తన్ను కైదుచేసినందున దన్ను నౌరంగజేబు ఏవేళ నేమిచేయునో యని చింతించుచు నామహాసంకటములో

నుండి బయటు బడుటకు నుపాయంబు యోజించుచుండెను. కొన్నిరోజులయిన తరువాత మాదేశమునకు బోవుటకు నాకు సెలవిచ్చుటకు వీలులేదేని మాసైనికులకైనను సెలవిప్పించు నది. ఇక్కడి నీరు పడక వాండ్రలో ననేకులు రోగగ్రస్తులై యున్నారు' అని శివాజీ రామసింగుద్వారా ఔరంగజేబుతో విన్నవించెను. సైన్యము లన్నియు వెడలిపోయిన తరువాత శివాజీయొక్కడే తనచేత జిక్కుననిన యాశచే స్వదేశమునకు వెళ్లుటకు శివాజీ సైన్యములన్నింటికి ఔరంగజేబు ఆజ్ఞ ఇచ్చెను. వెంటనే శివాజీ సైన్యములన్నింటిని నింటికిబంపి యత్యంత విశ్వాసపాత్రులయిన కొలది సేవకులను మాత్రము తనయొద్ద నుంచుకొనెను. ఇట్లు సైన్యములన్నింటిని బంపి తాముకొలది మందియున్నందున నక్కడనుండి యెట్లయినను దప్పించుకొని పోగలననిన ధైర్యము శివాజీకి గలిగెను.

చెరలోనుండి తప్పించుకుని పోవుటకు శివాజీ పన్నిన యుక్తి యత్యద్భుతంబు. అందువలన నతనికల్పనాకౌశలంబును, నద్భుతసాహసంబును వ్యక్తమగును. ఢిల్లీపట్టణములో నున్న సామంతరాజులయొక్కయు, సరదారులయొక్కయు, గొప్ప రాజకీయోద్యోగములలో నున్నవారియొక్కయు స్నేహభావములు శివాజీ క్రొత్తగా సంపాదించుకొను చుండెను. వారి యందరయింటికి ఫలాదులును మిఠాయి మొదలయిన ద్రవ్యములును బుట్టలలోనింపి బహుమతిగా బంపుచుండెను. ఆ బుట్టలలో నేమి యుండునో యని మొట్టమొదట పహరామీది సంరక్షకభటు లాబుట్టలను విప్పించి చూచుచుండిరి. కాని

యట్టి బుట్టలు రోజు ననేకము వచ్చుచు బోవుచు నున్నందున భటులు నిశ్శంకులై పరీక్షింపకయె బుట్టలను బోనిచ్చుచుండిరి. అంతట శివాజీ తనయొద్ద నున్న విశ్వాసపాత్రు లగు సేవకుల నందరను నొక్కొక నెపముచే దనయొద్దనుండి వెడలగొట్టెను. వారు మారువేసములు వేసికొని యీ పట్టణములోనే శివాజీరాకకు నెదురుచూచు చుండిరి. ఇంత సిద్ధతయైన పిదప దనకు శరీరము నెమ్మదిగా లేదని నటించుచు గొన్ని రోజులు శివాజీ యిల్లు వెడలకుండెను. ఒక్కరోజు సాయంకాలము శివాజీయు, సంభాజియు నొక్కొక బుట్టలో గూర్చుండి మిఠాయి బుట్టలను నెపమున పహరాలోనుండి తప్పించుకొని పోయిరి.

తాము వెళ్ళినతోడనే యీ సంగతి యచ్చటి భటులకు దెలిసినయెడల భటులు తమ్ము వెంబడింతు రని తలచి యటుల గాక పారిపోవుటకు దమకు వీలు చిక్కవలయునని శిబిరము వెడలునపుడు శివాజీ యొకయుక్తి పన్ని పోయెను. తాను శయనించు మంచముపై దనయొద్ద నున్న యొక సేవకుని బరుండబెట్టి తాను గప్పుకొను శాలువ యాతనికి గప్పి యొక కుఱ్ఱవానిని వానికి పాదములొత్తుచుండునటుల నియమించెను. శివాజీ పారిపోయిన కొంతకాలమునకు నొక సంరక్షకభటుడు వచ్చి శివాజీకి నేడు శరీర మెట్లున్నది యని యడుగగా నాకుఱ్ఱవాడు 'నేడు యజమానులవారికి శిరోబాధ యత్యధికముగా నున్నది గాన మీ రెవ్వరును నిక్కడికి వచ్చి బాధ పెట్టవలదు' అని చెప్పెను. అందుపై ఆ రాత్రి యంతయు

నచ్చటి కెవ్వరు వచ్చినవారు కారు. తెల్లవారిన తరువాత నాసేవకుడు యజమానునికి మందు తెచ్చెద ననియు, నాకుర్ర వాడు మరియొక నెపముననను వెలువడిరి. ఇట్లు శివాజీ కొంత తనచాతుర్యమువలనను, కొంత మొగలుల తెలివితక్కువ వల నను ఔరంగజేబు వలలోనుండి తప్పించుకొనెను.

రెండవరోజు రెండుజాములవరకును వేచి యుండి శిబి రములో నెవ్వరున్న జాడ కానక, బటులు శిబిరములోనికి జొచ్చి చూడగా శివాజీ తమ్ము మోసపుచ్చి పారిపోయినా డని వారికిదెలిసెను. ఆ వార్త వారు కొత్వాలునకు దెలుపగా వాడు భయపడుచు నాసంగతి బాదుషహాతో జెప్పెను. అందుపై నాతడు కొత్వాలునిపై మిగుల గోపించి యాతని మనసబుతీసివేసి శివాజీని వెదుకుటకయి గ్రామమునందంతటను చారులను బంపెను. కాని శివాజీ కానరానందున నాతని బట్టి కొనుటకు చాలూకాదారుల కందరకు నుత్తర్వులంపెను.

శివాజీ డిల్లీనుండి వెలువడినతరువాత బైరాగివేషము వేసికొని వచ్చినత్రోవనే మరల తనదేశమునకుం బోయిన యెడల బాదుషహాయొక్క మనుష్యులు తన్ను పట్టుకొని యెదరేమో యని తలచి కాశి, గయ, ప్రయాగ మొదలయిన క్షేత్రములమీదినుండి వెళ్ళ నిశ్చయించెను. మొట్టమొదట మధురాపట్టణమునకు బోయి చిన్నవాడైన తనకుమారుడు తనవెంట నిడుముల పడజాల డని యచ్చట మోరోపంతు పింగళేయొక్క బావమరది నుండగా, నాతనియొద్ద సంభాజి నుంచి, తీర్థయాత్రలు సేవించుకొనుచు నెవ్వరిచేత బడకుండ

బయలుదేరిన తొమ్మిదినెలలకు శివాజీ రాయగడకోట జేరెను. (౧౬౬౬; డిసెంబరు) సురక్షితముగా జేరినందులకు శివాజీ గొప్పయుత్సవము చేసెను; శర్కర పంచిపెట్టిరి; ఫిరంగులు కాల్చిరి. తాను జేరిన తరువాత మనుష్యులను బంపి శివాజీ తన కుమారుని బిలిపించుకొనెను.

శివాజీ ఢిల్లీకి బోయివచ్చునప్పటికి దక్షిణమున శివాజీకి ననుకూలము లయిన సంగతు లనేకము జరిగెను. శివాజీ వెళ్ళిన తరువాత జయసింగొక్కడే విజాపూరు నవాబుతో బోరాడుచుండెను. విజాపూరువారికి సహాయముగా గోలకొండ వారును సైన్యములు పంపిరి. వర్షములు తక్కువైనందున మొగలుల సైన్యమునకు జాలినంత నీరు లేకపోయెను. జయసింగునకు సహాయముచేయుటకు ఔరంగజేబు సైన్యము లేమియు బంపినవాడు కాడు. ఇందువలన శత్రువులు జయసింగును మిగుల బాధపెట్టసాగిరి. తాను హిందువు అయినందున దన సైన్యములన్నియు నశించిన ఔరంగజేబున కెంతమాత్రమును జింత కలుగనేరదని తలచి, జయసింగు విజాపూరివారితో బోరాటమాని అహమ్మదునగరము చేరెను. తాను ఢిల్లీశ్వరునికొరకై సాధించిన కోటల నన్నిటిని రక్షించునంత సైన్యము జయసింగునొద్ద లేనందున, నాతడు కొన్ని గొప్ప కోటలపై మాత్రము తన సైనికులనుంచి కడమ కోటల నన్నింటిని శత్రువులకు బనికిరాకుండ జెరచివేసెను. ఇంతలో శివాజీ ఢిల్లీనుండి పారిపోగా జయసింగు కుమారుడైన రామసింగు సాహాయ్యమువలన నాతడు పారిపోయినాడని

సంశయించి ఔరంగజేబు రామసింగును రాజసభకు రావల
దని నియమించి, ఆతనితండ్రియైన జయసింగును దక్షిణము సుబే
దారినుండి తొలగించి మరల దనకుమారుడైన మొఅజిమ్
అను వానిని, యశవంతసింగును దక్షిణమునకు బంపెను. తన
యోగ్యత ఔరంగజేబు కనుగొనకపోయెనే యనిన చింతచేత
జయసింగు ఉత్తరహిందూదేశమునకు బోవుచు త్రోవలో
మృతిజెందెను. జయసింగు మృతిజెందినపిదప దిలేర్‌ఖానుని
గూడ ఔరంగజేబు దక్షిణమునుండి మార్చి మాళవాకు
బంపెను. (౧౬౬౮)

ఇట్లు ఘనతవహించిన యిద్దరు సేనాధిపతుల బనినుండి
తొలగించి ఔరంగజేబు వారి స్థానమందిద్దరు సామాన్యు
లయిన సరదారుల నియమించినందున శివాజీకి లాభమయ్యెను.
ఇప్పుడు వచ్చిన యశవంతసింగు జోధపురపురాజు. ఈతడు
వయస్సునందు కొంత పెద్దవాడును, సంభావిత ప్రవర్తనగల
వాడును అయియుండెను. శివాజీ ఢిల్లీలో నున్నప్పుడీతనితో
స్నేహము చేసి యితని లోభస్వభావమును గనుగొని
యుండెను. ఈరాజు హిందూధర్మమునం దత్యంతాభిమానము
గలవాడై జిజియాయను హిందువులపైనున్న పన్నును గురించి
యొక పెద్ద యుత్తరము ఔరంగజేబునకు వ్రాసియుండెను.
ఈయుత్తరము శివాజీ ప్రేరణచేతనే వ్రాసెనని కొందరు చెప్పె
దరు. ప్రస్తుతము దక్షిణమునకు సుబేదారుగావచ్చిన సుల్తాన్
మొఅజిమ్ అనువాడు ఔరంగజేబునకు రెండవకుమారుడు.
సుస్వభావముగలవాడు. ఆతడు శౌర్యౌదార్యములను గురించి

విశేషవిఖ్యాతిజెందె. తండ్రివలె నెవ్వరిని నమ్మకయుండువాడు కాడు. కాని వానియందు విలాసలోలుపత, అమితవ్యయము, పరీక్షింపక యందరను నమ్ముట, అను మూడు దుర్గుణంబులుండెను.

వీరిరువురు వచ్చుటకు బూర్వమే మోరోపంతుపింగళే జయసింగుచే విడువబడిన కోటలన్నింటిని నాక్రమించి, మరల బాగుగా గట్టించి తన సైన్యములను వానియందుంచెను. శివాజీ ఢిల్లీనుండి వచ్చువరకే యీమంత్రిశిఖామణి కల్యాణప్రాంతమంతయు మొగలులయొద్దనుండిసాధించియుండెను. కాని క్రొత్తగావచ్చిన యిద్దరు సేనాధిపతుల స్వభావము శివాజీ యెరిగియున్నందున ప్రస్తుతము పరాక్రమముకంటె ధనమువలననే యధికలాభ మగు నని నిశ్చయించెను. రాజపుత్రునకు, యశవంతసింగునకును గావలసినంత ధనంబొసంగి వారిని శివాజీ వశపరచుకొనెను. శివాజీ 'మాకును బాదుషహాకును సంధి కుదుర్పవలసినది. బాదుషహా మావలన సేవ తీసికొనినవాడు కాడు. అయినను వారిసేవ చేయవలయునని మాకు నిచ్ఛ కలదు'యని రాజపుత్రునికొకయర్జీ పంపుకొనెను. ఆతండు తన యనుకూలాభిప్రాయముతో ఆ యర్జీ బాదుషహాయొద్దకు బంపగా, నాతనికి నుత్తరమున విశేషావశ్యకములైన పనులున్నందున నాతడు శివాజితో నిప్పుడు పోరుపెట్టుకొనుట మంచిదికాదని తలచి, యాతని విన్నపమును స్వీకరించి యాతనికి "రాజా" యనుబిరుదొసంగి పూనా, చాకణ్, సుపే మొదలైనప్రాంతము లాతనివి యాతనికిచ్చివేసెను. సంభాజీకి ౫౦౦౦ గుఱ్ఱపురౌతుల మన్సబుదారి ఇచ్చెను. అహమ్మదునగరురాజ్య

ములో శివాజీకి గల హక్కునకు మారుగా నాతనికి వర్హాడు (Berars) ప్రాంతము జాగీరుగా నిచ్చెను. పూర్వమొప్పుకొనినటుల విజాపూరురాజ్యములోని చౌథ్, దేశముఖిహక్కులును శివాజీకి నొసంగె. శివాజీ మనస్సులోనున్న కోపము పోవుటకై ఔరంగజేబు తన కుమారునిద్వారా శివాజీ కిట్లు వ్రాసెను. 'మిమ్ములను చాల గౌరవించి మీ హక్కులను గురించి మీకు సనదులు వ్రాసియిచ్చి, మహాకార్యములు చేయ మిమ్ము నియమించి, మీకు శలవియ్యవలయునని మేము తలచియుంటిమిగాని, మీరు మాకు జెప్పకయే వెడలిపోయితిరి. ఐనను చింత లేదు. ఇద్దరము స్నేహభావముతో నుండవచ్చును.'

మొగలులకును విజాపురమువారికిని జరుగుచున్న యుద్ధమువలనఉభయులకును నెంతమాత్రము లాభము లేనందున వారిద్దరును విసవి ౧౬౬౮ సంవత్సరములో సంధిచేసికొనిరి. వీరికి దోడై తన్ను ఆ రాజ్యములోని దనచౌథ్, సర్ దేశముఖి హక్కులను రాబట్టుకొననియ్యరేమోయని భయపడి, శివాజీ రాజపుత్రుని, యశవంతసంగును జూచి వారికి గొంతద్రవ్యమిచ్చి వారిని వశపరచుకొని తనహక్కు వసూలుచేయుటకు విజాపూరు రాజ్యముపైకి దండెత్తిపోయెను. అందులకు విజాపూరువారు భయపడి శివాజీకి ప్రతిసంవత్సరము మూడు లక్షల రూపాయలిచ్చునటుల నొప్పుకొని యాతనితో సంధి చేసికొనిరి. విజాపూరు నవాబువలెనే గోలుకొండనవాబుగూడ శివాజీ తనరాజ్యముపైకి దండురాకుండుటకై యాతనికి సంవత్సరమునకు నైదులక్షలిచ్చునటుల నొప్పుకొనెను. (౧౬౬౮)

ధీనపరుచుకొనవలసినది. ఇట్లుచేయనియెడల నీవు మా నిగ్రమునకు ప్రాత్రుడవయ్యెదవు'. సుల్తాన్ మొఆజిమ్ తండ్రియగు ఔరంగజేబునివలె మోసగాడు కానందున ఈయాజ్ఞయతనికి రుచించినదికాదు. ఢిల్లీలో జరుగు వృత్తాంతమున్నియు దెలుపు చారులు రాజపుత్రుని (మొఆజీమ్) యొద్దన్నందున పైనివర్ణించినయాజ్ఞ వచ్చి చేరకమునుపే యిట్టియుత్తరువులు వచ్చుచున్నవని యాతనికి దెలిసెను. సంధియమముల ననుసరించి తనకు సాయముచేయుటకై తనయొద్దనున్న మహారాష్ట్ర సైన్యాధిపతుల రహస్యముగా బిలిచి మొఆజిమ్ వారితో నిట్లని చెప్పెను. 'మిమ్ము్మను జెరబట్టుమని బాదుషహాగారి యుత్తరువులు వచ్చుచున్నవి. అవి రేపో మాపో వచ్చిచేరగలవు. ఉత్తరువులు వచ్చిన తరువాత మేము మిమ్ము విడుచుటకు వీలులేదు. కాన నీలోగా మీరు ఏదోయొకసాకు చెప్పి మీ మీ నిలయములకు బొండు.' ఈవార్త వినగానే సర్ నోబత్, పండితరాయ యను మరాఠావీరు లేవియో సాకులు కల్పించుకొని తమ సైన్యములతో మొగలుల శిబిరములు వెడలిరి. వారు వెడలిన తరువాత రెండుమూడు దినములకు ఢిల్లీనుండి యుత్తరువులు వచ్చెను. రాగానే రాజపుత్రుడు తన సైన్యములతో మరాటావారి సైన్యముల వెంటబడి నట్టుల నటించె! గాని యింతలో వారు సురక్షితముగా పూనాపట్టణముచేరిరి.

క్రీ. శ. ౧౬౬౭ - ౧౬౬౯ ఈ రెండు సంవత్సరములు శివాజీ యుద్ధము లేవియు జేయక యేవైపులను దాడి వెడలక

యున్నందున జను లందరు శివాజీయొక్క పరాక్రమమున కిదియే సీమయనియు, నిక మీద మొగలులతో బోరా డుట దుర్లభ మని తలచి శివాజీ తన పర్వతప్రదేశము వెడలి రాడనియు వింత వింతలుగా ననుకొనసాగిరి. కాని యీకల్పన లన్నియు నసత్యము లని చూపు ప్రసంగ మిప్పుడు వచ్చెను. ఇట్టి ప్రసంగము సంధిని పాటింపక మిత్రద్రోహము చేసిన ఔరంగజేబు వల్లనే కలిగినందున శివాజీ యొక్క * భవాని ఖడ్గము మిగుల ప్రకాశింపజొచ్చె.

శివాజియొక్క రాజ్యములోని సింహగడము, రాయగడము అను రెండు ముఖ్యదుర్గములు జియసింగుడు జయించి నప్పటినుండియు మొగలుల స్వాధీనములోనే యుండెను. అందుచే చాకణ్ దుర్గమునుండి పూనాకు వచ్చునప్పుడు శివాజీకి మిక్కిలి యిబ్బంది కలుగుచుండెను. అందుచే వానిని సాధింపవలె నని యెంచి శివాజీ యొకరోజు గొప్పసభ చేసి తన సరదార్లను నందరును బిలిపించి 'సింహగడ మెవ్వరు గెల్చెదరు?' అని యడుగగా తానాజీమాలసురే యనుశూరా గ్రేసరుడు 'నేను సింహగడమును సాధించెదను' అని ప్రతిజ్ఞ చేసెను. అప్పుడాతనికి తాంబూలవస్త్రాభరణంబులును వేయి మావళీభటులను నిచ్చి శివాజీ యుద్ధమునకు బంపెను. సిద్ధమైన తన కుమారుని వివాహము మానుకొని యా తానాజి యను నప్రతిమస్వామిభక్తుడు 'నేను బ్రతికివచ్చిన నేనే వివాహముచేయ గలను. నేను యుద్ధములో హతుడ నగుదు

* శివాజీచేతిలోని ఖడ్గమునకు 'భవాని' యని నామము.

నేని మీరే నాకొమారుని వివాహము చేయవలయును' అని శివాజీతో విన్నవించి మాఘబహుళనవమి (ఫిబ్రేవరి) రోజున బయలుదేరెను.

సింహగడ మతిభయంకరమైన పర్వతశిఖరముపైనున్న దుర్గము. దాని సాధించుట సాధారణముగా నసాధ్య మనియె చెప్పవచ్చును. పర్వతము గగనచుంబితముగా నత్యంతౌన్నత్యము కలదియై దాని పూర్వపశ్చిమదిక్కుల ప్రచండమైన పురందరపర్వత మున్నది. దక్షిణోత్తరదిశలందు నరిమైలు ఉన్నతము గల శిలలు పెట్టిన నున్నటిగోడవలె నున్నవి. ఇది యెక్కి పైకి బోయిన నలుబదియంగుళములు ఎత్తుగల కృష్ణశిలామయమైన ప్రచండప్రదేశము కలదు. దానిచుట్టు రాతితో గోడపెట్టబడి త్రికోణాకృతిగా దుర్గము నిర్మింపబడినది. కోణకోణమునకు గొప్ప బురుజులు కలవు. దుర్గము యొక్కచుట్టు పరిధి కొల్చిచూచిన గ్రోసు మించి యుండును. దాని బాహ్యస్వరూపమత్యంత భయంకరమై దుర్గద్వారము తప్ప వేరుమార్గమే లేనటుల గానిపించును. దుర్గముపై నుండి చూచిన దూర్పున నిర్మలజలపూరితమై విశాలముగా బారుచున్న 'నీరా' నదియు నుత్తరమున గురుక్షేత్రంబును బోలిన బయలును, నెదుట మహారాష్ట్రదేశంబునకు నాయుక రత్నంబునుం బోని పూనాపట్టణంబును నైరృతదిశను సాటి సామంతుం డని చెప్పదగు రాయగడదుర్గమును గానిపించుచుండును. సింహగడమిట్లు శత్రువుల కభేద్యమై యుండె. దుర్గము మీద నున్న శిబ్బందియు ప్రబలమైనదియే. ఉదే

ఖాన్ అను పేరువడసిన రాజపుత్రవీరు డచ్చటిసైన్యములకు నాయకుఁడై యుండెను. రాజపుత్రులు యుద్ధమున బ్రాణములనైన ద్యజించెదరు గాని, కాలు వెనుక తీయ రనినమాట సర్వవిదితము. ఇట్లు సర్వవిధముల నసాధ్యమైన దుర్గమును సాధ్యముచేయ నాతానాజీమాలసురే యనువీరుఁడు బహుళ నవమినాఁటి రాత్రి చీకటిలో బయలుదేరెను,

పైని వర్ణింపబడిన సంగతు లన్నియు తానాజీమాలసురేకు దెలిసియున్నను, దుర్గము శత్రువుల కసాధ్య మని నమ్మిక కలవారు గనుక దుర్గమువిూఁద భటు లందరు నజాగ్రతతో నున్నారన్నసంగతి యాతఁడు కనిపెట్టెను. కాన రాత్రివేళ నెవ్వరికి దెలియకుండ నెన్నియో కష్టముల కోర్చి యెట్టులైన గోండప్రాకి యాకస్మికముగా గోటవారిని నెదిరించిన గోటస్వాధీనము కాగల దని తలచి యాతఁడు నవమి రాత్రి కోటకు నైరృతమున దనసైనికు లందరును గూర్చికొని పైకి నెక్కఁబ్రయత్నించెను. ఈ దిక్కునుండి యెక్కుట బహుదుర్ఘట మైనందున నిచ్చటినుండి శత్రువు లెన్నఁడును రారని తలచి కోటమీఁది వారావైపున నంతగా గాపుదల చేయరైరి. కనుక అచ్చటినుండి వేయిజనముతో నెంతయు గష్టమున కోర్చి కొంతపైకి వచ్చి యచ్చట సైన్యమును నైదైదు వందల భటులుగా రెండుభాగములు చేసి యొకభాగమునకు దనతమ్ముఁడైన సూర్యాజీని నధిపతిని జేసి వారిని నక్కడనే యుండ నియమించి, తాను నైదువందల భటులతో బైకి నెక్కెద ననియు, దనకు సాయంబు గావలసినయెడల గ్రింది

వారు పైకి రావలసిన దనియు జెప్పెను. ఒక వీరుడు మిక్కిలి కష్టముతో బైకి బ్రాకి యక్కడ నుండి యొకగొప్పమోకు క్రిందికి దిగవిడిచెను. దానిని బట్టికొని తానాజియు దత్సైన్యంబులును బైకెక్కసాగిరి. ఎక్కినవారు కోటసీమలోనికి వెళ్ళి చప్పుడుచేయక చీకటిలో గ్రిందబరుండియుండిరి. మూడు వందల సైనికులు పైకి నెక్కినతరువాత నేదియో పదార్థము క్రిందబడి ధ్వనియైనందున గోటమీద సైనికులలో నొక్కడది యేమి యైనది కనుగొనుటకు వచ్చి శత్రువులచే హతుడయ్యెను. అది చూచి రాజపుత్రవీరు లందరును నడుములు బిగించి యుద్ధసన్నద్ధులైరి. ఈ సంగతి చూచి తానాజీ మిగిలిన సైన్యము వచ్చుటకు బూర్వమే తన వెంట నున్న మున్నూరు సైన్యముతోనే కోటను సాధింప నెంచి మొట్టమొదట దానే శత్రువులపై బడెను. ఉభయసైన్యములును ఘోరముగా బోరాడ దొడగె. మరాటా సైన్యము పూర్తిగా బైకి రాక పోయినను, వారు వారికంటె నెన్నియో రెట్లధికముగా నున్న రాజపుత్ర సైన్యముతో సమానముగా బోరాడుచుండిరి. ప్రాణములపైనాశ విడిచి మరాటాలు పోరాడుచున్నందున త్వరలోనే కోట మరాటావారి చేతబడునని యందరకు దోపసాగె. కాని యింతలో దానాజీ గాయపడి కీర్తిశేషుడయ్యె.* సైన్యాధిపుని గతియిట్టులగుట చూచి మరాటావీరు లందరు భయమంది నలుదిక్కులకు బారంజొచ్చిరి. కాని

* క్విబెల్ యుద్ధములో జనరల్ ఊల్ఫు ఈ ప్రకారమే రాత్రిదొంగతనముగా బైకెక్కి యుద్ధము జయించి యుద్ధములో బడెను.

యింతలో గ్రిందనున్న సైనికు లందరును దీసికొని సూర్యాజీ (తానాజీ తమ్ముడు) పైకి వచ్చి చేరెను. తనయన్న పడుటచే సైనికులు భీతులై పారిపోవుచున్నారని చూచి వారికి "నోడకుడోడకుడి" అని ధైర్యముచెప్పి యెలుంగెత్తి యిట్లనియె; 'రణ హేతుల నిట్లిచ్చుట విడచి పోవుట మీకుధర్మమే! వారి పవిత్రదేహముల దారకెలు మాదిగెలచే నీడ్పింపరే! మీ రెచ్చటికి బారిపోయెదరు? నేను పైకివచ్చినతోడనే మోకు లన్నియు దెగగోయించినాడను. ఇకశత్రువుల నెదిరించి శివాజీమహారాజునొక్కయు, మీయొక్కయు గీర్తి రక్షించుకొనుటకంటె నొండుమార్గంబు లేదు.' సూర్యాజిచే నుచ్చరింప బడిన యీమాటలు విని కొంతధైర్యము తెచ్చుకొని సైనికులు తిరిగి శత్రువులతో ఘోరముగా బోరసాగిరి. రెండు గడియలవరకు రామరావణయుద్ధమయ్యె. రాజపుత్రసైన్యం బులు విరిగె. రమారమి యేనూర్గురు రాజపుత్రసైనికులును వారి నాయకుడైన ఉదేభానుడును బడిరి. అసంఖ్యాజనము పారిపోవుసమయంబున గాలుజారి కొండక్రిందబడి హతమయ్యె. అనేకు లక్కడక్కడ రాలక్రింద దాగియుండి ప్రాతఃకాల మైన తరువాత శరణుజొచ్చిరి. మరాటావీరులలో మున్నూరుగురు సైనికులు హతులైరి. కోటస్వాధీనమైనవెంటనే పూర్వ సంకేతానుసారముగా నొక పెద్దమంటపెట్టి జయవార్త కొరకు రాయగడములో సింహగడము వైపుననే దృష్టి చాచి చూచుచున్న శివాజీకి నావార్త తెలిపిరి. (౧౬౭౦)

గెలిచినారమనిసంతోషముతో రెండవరోజు మరాఠా సైన్యము జయఘోషచేయుచు రాయగడమునకు వచ్చెను. కాని శివాజీ యాసైన్యములలో దనసేనానాయకుని గాన డయ్యె. తానాజి యెక్కడనున్నాడని యడుగగా నాతడు వీరమరణము జెందె ననియు, నాతని ప్రేతమును సూర్యాజి పల్లకిలో వేసికొని వచ్చుచున్నాడనియు దెలిసెను. తానాజి పడె ననినతోడనే దుర్గమును సాధించిన సంతోష మంతయు బోయి మిక్కిలి దుఃఖముతో జయించి వచ్చిన వీరులను జూచి 'సింహగడములోని సింహముపోయి కేవలగడము మనచేత జిక్కినదిసుమా!' యని పలికెను. తనకుగుడిచేయివలెనున్న తానాజి మృతిచెందినందులకు శివాజీమిక్కిలి దుఃఖించె. అఫ్జుల్ఖానుని వధసమయమందును, ఢిల్లీప్రయాణసమయ మందును తానాజి శివాజీవెంటనే యుండియెన్నియో కష్టముల కోర్చి స్వామిసేవ చేసెను. అందుచే నాతని మరణమువలన శివాజీకి నమితదుఃఖము కలుగుటయాశ్చర్యముకాదు. సూర్యా జిని బిలిచి "శౌర్యమునన్ అన్న పేరు నిలిపితి" వని కొనియాడి యాతడు గెలిచిన దుర్గమునకు నాతని నధిపతిజేసెను. సింహ గడము సాధించిన నెలరోజులకు పురందరదుర్గంబును మరా టాల స్వాధీనమయ్యెను. ఈకోటనుసాధించినవాడు సూర్యా జియే (౧౬౭౦ మార్చి)

కొంకణములో మోరోపంతుపింగళే పేష్వామా హులీ యనుకోటను ముట్టడించెను కోటలోనివారు హోరాహోరిగా బోరాడి వేయిమంది మరాటావీరుల బడవైచి

వారిని భారదరిమిరి. పేష్వామరల దనసైన్యములగూర్చికొని కోటమీదికివచ్చి మరల దరుమబడియె. అయినను పేష్వా యాకోటను ముట్టడించి రెండు నెలలవరకు విడిసి యున్నందు నను దుర్గములోనివారి కెక్కడినుండియు సాయము రానందున గోటలోనివారు కోట పేష్వాల కిచ్చివేసి వెడలిపోవలసిన వారైరి. తరువాత పేష్వా కరనాళా యనుదుర్గమును సాధిం చెను. ఇట్లు జూన్ నెల ఆఖరువరకు కొంకణములోని కళ్యాణ ప్రాంత మంతయు మరాటావారికి లోబడియె.

జంజిరాయను దుర్గమును సాధింపవలయునని ౧౬౬౧వ సంవత్సరమునుండి శివాజీ యాలోచన చేయుచుండెను. ప్రతిసంవత్సరము నాదుర్గమును ముట్టడించి కోటలోని శిద్ది వాడు నేడు శరణువచ్చును, రేపు శరణువచ్చు ననుకొనుచునే కాలము గడిపెను. గాని, శిద్ది స్వాధీనము కాడయ్యె. ౧౬౭౦ వ సంవత్సరములో శివాజీ సిద్దిని నెట్లయిన సాధింప వలయునని యాతనిపయి గొప్పసైన్య మంపెను. నీవు మమ్ము శరణు జొచ్చిన నీకిదియిచ్చెద మది యిచ్చెద మని యాశయు జూపెను. తుదకు దుర్గాధిపతియైన ఫత్తేఖానుడు మరాటాలకు దుర్గమిచ్చివేయుటకు సిద్ధపడెను కానియాతనిచేతిక్రిందముగ్గురు సైన్యాధిపతులీమాటకు నొప్పుకొనక, దుర్గము శత్రువులకిచ్చి వేయు నేమో యను భయముచేత ఫత్తేఖానుని జెరబట్టి, మరి యొకని నధిపతిగా నేర్పరుచుకొని ఔరంగజేబు కిట్లు వర్త మాన మంపిరి. 'జంజిరా మీకు నిచ్చివేసెదము. ఇదివరకు విజాపూరివారి చేతి క్రింద సామంతులుగా నున్నటుల నింక

మీద మీయొద్ద సామంతులుగా నుండుదుము. మా సముద్ర సైన్యమును మీసేనలోనే యుంచుకొనవలసినది. 'ఔరంగజేబు వారిమాటలు అంగీకరించి యాదుర్గమును స్వాధీనపరుచు కొనెను. ఇట్లు మరాటీవారెంతయత్నము చేసినను జంజిరా వారి స్వాధీనము కాక మొగలులస్వాధీన మయ్యెను. ఇటువలనే శివాజీ జన్మస్థానమైన శివనేరదుర్గము సాధించుటకు నెంతయో ప్రయత్నము చేసియు మరాటావారు విఫలమనోరథులు గావలసిన వారైరి.

క్రీ. శ. ౧౬౭౦ వ అక్టోబరు నెలలో శివాజీ ధనముచే విర్రవీగియున్న సూరత్ పట్టణము రెండవసారి దోచికొనెను. పదునైదువేల మహారాష్ట్రవీరులతో శివాజీ సూరత్ పట్టణమునకు వెళ్ళునప్పటికి నచ్చట నెదిరించుటకు వేయిభటు లయినను లేకయుండిరి. అందుచే మరాటాదండు భయమువిడచి నెమ్మదిగా మూడు దినములవరకు బట్టణమును గొల్లగొట్టెను. అచ్చటనున్న ఐరోపీయ వర్తకులలో నింగ్లీషు వర్తకులు మాత్రము స్వసంరక్షణము చేసికొనిరి. డచ్చివారివర్తక శాల దూరముగా నున్నందున మరాటావారు వారిజోలికి బోరయిరి ఫరాసులనబడు ఫ్రెంచివారు మరాటావారికి త్రోవయిచ్చి కొత్తగా మక్కానుండి వచ్చి యాపట్టణములో విడిసియున్న కాస్కరుపట్టణపు పదభ్రష్టుడైన యొకరాజువిడిదికి బోనిచ్చినందున వారి వర్తకశాల బందిపోటు వారి పాలు కాదయ్యె. ఆ పట్టణములో శివాజీకి సమితధనము దొరకె ననిచదువరులు గ్రహించియే యుందురు.

బర్హాణపురమునుండి తనమీఁదికి నొక్క ప్రచండమైన మొగలసైన్యము వచ్చుచున్నదని మూఁడవరోజు శివాజీకి దెలిసినందున నాతఁడు తనసైన్యములను దీసికొని తనరాజ్యమునకు బయలుదేరెను. బయలుదేరునప్పు డాతఁడు సూరత్ పట్టణవాసుల కిట్లు వర్తమాన మంపెను. 'మీరు ప్రతిసంవత్సరము పండ్రెండులక్షలరూపాయలు కప్పము కట్టుచుండవలసినది. లేనియెడల మేము ప్రతిసంవత్సర మెప్పు డో యొకసారి మీపట్టణ మిట్లులనేకొల్లగొట్టుచుండెదము' శివాజీ దొరకిన సొత్తంతయు దీసికొని కంచనమంచన మనబడు పర్వతము మీఁదినుండి పోవుచుండఁగా, దాఊద్ ఖాన్ అను మొగలసరదారుడైదువేల సైన్యముతో దనవెనుక వచ్చుచున్నాఁడనియు, గొంకణదేశములోనికి దిగునప్పుడు నాసికపట్టణమునొద్ద దగులు కనములయొద్ద మరియొక మొగలుల గొప్పసైన్యమువిడిసియున్నదనియు వినెను. సూరత్ పట్టణములో సంపాదించిన యపారధన మీ యుభయ సైన్యముల చేతిలోబడకుండ దప్పించుకొనుట కేద్ది యుపాయం బని యోచించి శివాజీ తనసైన్యమును నాలుగయిదు భాగములుగ విభజించి యొకభాగమున శత్రువులగొప్పసైన్యముతో బోరాడుచు, వీలుకానప్పుడు పారిపోవుచు శత్రువులకు బని కల్పించుచుండునట్లును, మరిరెండు భాగములిటునుండి కొంతసేపు, నటునుండి కొంతసేపు శత్రువులపై బడునటుల నటించుచు శత్రుసైన్యములను నిటునటు తొలగించుచుండునటులను, ఇంకొకభాగము ధనమంతయు దీసికొని యెవరికి దెలియ

కుండ దాటునట్లును నియమించెను. ఇట్లు తన యసామాన్య ప్రజ్ఞచేత ధనమంతయు ముందు తనదేశము చేరునట్లు చేసి శివాజీ వెనుక చిక్కిన సైన్యములతో వచ్చుచుండగా, మోగల సరదారుడగు దావూద్ ఖాన్ అతనిని సమీపించెను. కాని శివాజీ అకస్మాత్తుగా వెనుకకు దిరిగి శత్రుసైన్యములపై పిడుగు పడునట్లుల బడిన తోడనే యాతడు వెనుకకు బారవల సినవాడాయెను. తరువాత శివాజీ తన సైన్యముల నన్నిటిని గూర్చికొని కొంతదూరముపోయి తనతో పోరాడుటకై నిలిచియున్న మోగలుల సైన్యముపై బడెను. ఉభయసైన్య ములు ఘోరముగా పోరాడె. తుదకు మోగలులకే యప జయము ప్రాప్తించె. ఈ యుద్ధలో మాహూర్ పట్టణమునకు దేశముఖయైన రాయగాబీణ్ అను శూరవనిత మోగలుల పక్షావలంబనము చేసి శివాజీతో పోరాడెను. తుదకు నాబిడ శరణుచొచ్చినందున నామెను సన్మానించి శివాజీ యామె గ్రామమునకు బంపెను.

శివాజీ స్వస్థానమునకు వచ్చిచేరిన తరువాత ప్రతాప రావుగుజర్ అనువానికి బదివేలగుర్రంబులను, పేష్వాయైన మోరోపంతు పింగళేకు నిరువదివేల కాల్బలమును నిచ్చివారిని నుత్తరమునకు బంపెను. మొదటసముద్రతీరమున నున్న భడోచ్ పట్టణమును దోపవలయునని వారి యభిప్రాయమై యుండెను. సముద్రముమీదనుండియు బట్టణమునకు భీతికలుగ జేయవలయునని శివాజీ తన నూట యరువదియోడలను ఆపట్టణము వైపునకు బంపెను. కాని కొన్నిదినములకు నేహా

తువుచేతనో గాని వారియుద్దేశము మాని శివాజీ తనయోడ లను మరల బిలిపించుకొనెను. ఓడలు తిరిగి వచ్చువప్పుడుదమ ణిఅను రేవులో గొన్ని పోర్చుగీజువారి యోడలుండెను. ఆయోడలనుబట్టి మరాటాయోడలవారు దీసికొనివచ్చిరి. కాని దీనికి బదులుగా పోర్చుగీజువారు మరాటావారి కొన్ని యోడ లను బట్టుకొని పోయిరి.(౧౬౭౧)

భడోచ్ పట్టణమువైపున నున్న సైన్యములను బిలిపించి శివాజీ వానిని * ఖానదేశమునకు బంపెను. అటుమోగలుల సైన్యములు లేనందున ప్రతాపరావుగుజర్ దేశమంతయు గొల్లగొట్టుచు ప్రతిపట్టణమునుండి యప్పనంబులు గొనుచు విశేషముగా ధనార్జనము చేసెను. ప్రతిగ్రామపు పటేల్ కరణ ములయొద్దనుండి మేము మోగలులకిచ్చు కరభారములో నాల్గవ వంతు శివాజీకి నియ్యగలవారమని వ్రాయించుకొనెను. ఈనాల్గవ వంతిచ్చినవారికి దాను రసీదిచ్చెద ననియు, ఎవరి యొద్ద రశీదుండునో వారిని మరాటావారు బాధ పెట్టరనియు గ్రామస్థులతో జెప్పుచు వచ్చెను. మోగలుల రాజ్యములో మరాటావారు చౌథ్ అనుపన్ను వసూలుచేయుటకు బ్రారం భించిన కాల మిదియె. అటు మోరోపంతు పేష్వాగారు ఆవధా, పట్టా, సాలేర్ మొదలయిన దుర్గములను సాధించిరి. (౧౬౭౧ జాన్యు అరి)

ఇట్లు దక్షిణమున శివాజీ మోగలులరాజ్యమును గొల్ల కొట్టుట విని ఔరంగజేబు తనకుమారు డయినమోఆజిమ్ అను

* బొంబాయి రాజధానిలోని కొంతభాగము.

నాడును యశవంతసింగును శివాజీతో గలసి యున్నారని సంశయించి యశవంతసింగును నుత్తరమునకు బిలిపించుకొని మోహాబత్ ఖాన్ అనువానిని నలుబదివేల సైన్యముతో దక్షిణమునకు బంపెను. మోహాబత్ ఖానుడు రాజపుత్రుని లక్ష్య పెట్టక స్వతంత్రించి మరాఠావారితో యుద్ధములు చేయ సాగెను. (౧౬౭౧)వర్షాకాలము వచ్చువరకు నాతడు రెండు దుర్గములను సాధించెను. పూర్వమువలెనే దిలేర్ ఖానుడు సైన్యములో రెండవ యధికారియైయుండెను. ఇతడు తన సైన్యములను రెండు భాగములుగా విభజించి యొక్క సైన్యముతో చాకణ్ దుర్గమును, మఱియొక సైన్యముతో సాలేర్ దుర్గమును ముట్టడించెను. సాలేరీ దుర్గమునకు ఖానదేశముయొక్క ద్వారమని పేరు. ఆసంవత్సరమునందు నీదుర్గములో మరాఠావారు వలయునంత సామాగ్రి సంగ్రహించి యుంచిరి. ఆదుర్గమునకు సమీపమునందుంపబడిన రెండువేల గుఱ్ఱములను దురుష్కులొక్కసారి నాశము చేసిరి. ఈసమాచారము తెలిసినతోడనే శివాజీ సాలేర్ దుర్గ సంరక్షణార్థమై యిరువదివేలగుఱ్ఱపు శిబ్బందినిచ్చి ప్రతాపరావుగుజర్ను, పేష్వామోరోపంతుపింగళేనుబంపెను. మరాఠాగుఱ్ఱము తమమీదికి దండు వచ్చుచున్నదని విని వారిని త్రోవలోనే నెదిరించుటకై తనసైన్యమంతయు నిచ్చి యిఖలాసఖానుని బంపెను. ప్రతాపరావు మరాటసైన్యమునకు మొనగాడై నడచుచున్నందున దూరకల రాక చూచి వారిని మోసపుచ్చ దలంచి శత్రువులు పైబడినప్పుడు పారిపోయినటుల నటింప వలసినదని తన సైన్యములకు

చెప్పియుంచెను. యఖలాసఖానుడు యుద్ధము ప్రారంభిం
చినవెంటనే మరాటావీరులు పారజూచిరి. తురకలు వారివెంట
దగిలి తరుమునప్పుడు దట్టముగా నుండక యక్కడక్కడొ
క్కొక్కరుగా నిల్చిరి. అదిచూచి పారిపోవు మరాటాసైనికులు
మరలి శత్రువులపైబడి చెండాడసాగిరి. అటు ప్రతాపరావు
సైన్యము, ఇటు పేష్వాలసైన్యము చెండాడగా తురకల
సైన్యములుతాళలేక పారజొచ్చెను. మొగలసైన్యాధిపతులు
పారిపోవుసైనికులను బోగుచేసి మరలమరల మరాటావారితో
పోరాడ యత్నించిరి. కాని మరాటావారి శౌర్యమునకు
దాళలేక చెదరిరి. మొగలుల సేనానాయకులలో నిరువది
యిద్దరు హతులైరి. కొందరు గాయపడి మరాటావారిచేత
జిక్కిరి. మరాటావారి సరిదారులనేకులు నిహతులైరి. నిహతు
లైనవారిలో సురేరావ్ అనువాడు విశేషవిఖ్యాతుడై యుం
డెను. ఈతడు శివాజీకి బాల్యస్నేహితుడు. శివాజీచే నియ
మింపబడిన పనులు చక్కగా నెరవేర్చుచున్నందున పంచ
హాజారీయను పదవి జెందియుండెను. గాయపడినవారును, నిహతు
లైనవారును గూడి ఐదువందల మరాటావీరు లీయుద్ధమునకు
బలియైరి. ఈయుద్ధము బహుఘోరముగా జరిగినదని చెప్పె
దరు. యుద్ధస్థలమందు క్రోసెడుదూరమువరకు ధూళియెగిరి
యెదుటిభటుండు శత్రుడైనది, మిత్రుడైనది, వీరులకు దెలియ
కుండె. రక్తము వరదలుగా బారినది. ఈ యుద్ధాంతమున
మరాటావారికినూటయిరువది యేనుగులును, ఆరువేలయొంటె
లును, ఆరువేల గుఱ్ఱంబులును దొరకెను. ఇదిగాక నాణెము

లును. రత్నములును, విలువగల బట్టలును అనేకముగా దొరకెను.

గాయపడి మరాటావారిచేత జిక్కిన తురకసరదారులను శివాజీయొద్దకు దీసికొనిపోగా, నాతడు వారిని గౌరవించి వారికి నౌషధోపచారములు చేయించి బాగయిన పిదప వారిని వారివారిదేశములకు బంపివేసెను. వారిలో నిష్టమున్న కొందరను దనసైన్యములో నుంచుకొనెను.

చాటులేని రణాంగణముమీఁద శత్రువులను నెదిరించి వారిని మరాటావారు పరాజయుపరచుట మొదటనీయుద్ధము నందేయని చరిత్రకారులు చెప్పెదరు. ఈయుద్ధమెప్పటినుండియు మరాటావారి శౌర్యవిఖ్యాతి దిగంతవిశ్రాంతమయ్యెను.

మరాటావారి వలన దనసైన్యమున కిట్లు పరాభవము కలుగుట విని, ఔరంగజేబు బాదషహా తనకుమారుడయిన మొఆజీమును, మెహబత్‌ఖానుని దక్షిణము నుండి ఢిల్లీకి బిలిపించుకొని, గుజరాత్ దేశపు సుబేదారుడగు ఖాన్‌జహాన్ బహద్దర్ అనువానిని దక్షిణమునకు సుబేదారునిగా బంపెను. కాని వానిచేతిక్రింద బూర్వపు దిలేర్‌ఖానునే రెండవ యధికారిగా నుంచెను. తనయొద్ద సైన్యము విశేషముగా లేనందున శత్రువుల రాజ్యములోనికి వెళ్ళి పోరాడుట మంచిదికాదనియు, శత్రువులు మన రాజ్యములోనికి రాకుండ గాపాడుకొనిన జాలుననియు దలచి, సుబేదారుడు, మరాటావారు కొంకణము నుండి పయికి వచ్చు కనుమలన్నియు, మరి యితర త్రోవ లన్నియు సంరక్షించుటకు దనభటులను నియమించెను. ఇటుల

జేసిన లాభము లేదనియు, వారి దుర్గములను సాధించినగాని శత్రువులు లొంగరనియు, దిలేరుఖానుం డెంతచెప్పినను సుబేదారుడు వినడయ్యె. ఇటు మరాటావారు కనుమలనుండి ఖానదేశమునకు వెళ్ళగా, ఔరంగాబాదు మొదలయిన ప్రదేశములకు దాడివెళ్ళి, గ్రామములు కొల్లగొట్టసాగిరి. వారినెదిరించుటకై అనేక దిక్కులనుండి అనేక స్వల్పసైన్యములను సుబేదారు డంపెను. కాని మరాటావారి యుద్దేశము తురకలతో బోరాడుటకాక తురకలరాజ్యమును గొల్లగొట్టి వీలయినంత ధనము తీసికొని పోవుటయే యైనందున, వారెప్పుడు శత్రువులతో బోరాట తప్పించుకొని పెక్కుసారులు పారిపోవుచుండిరి. కాని తమచేత జిక్కిన ధనము మాత్రము శత్రువుల చేతిలో నెన్నడును దొరకనిచ్చిన వారు కారు. ఇంతలో వర్షాకాలము నారంభ మయినందున సుబేదారుడు యుద్ధముమాని భీమానదీ తీరమునం దున్న యొక గ్రామములో నాలుగునెలలు విడియవలసిన వాడాయెను. అతడక్కడ నొక దుర్గమునిర్మించి, దానికి దన పేరిట బహాదుర్‌గడమని పేరుపెట్టెను. అప్పటినుండి నలుబది సంవత్సరముల వరకును మొగలుల సైన్యమునకు బహాదుర్‌గడమే ముఖ్యమైన విడిదియై యుండెను.

౧౬౭౭లో శివాజీ గోలకొండపై దాడివెడలి యచ్చటి సుల్తాను నొద్దనుండి యనేక ధనంబప్పనంబుగా గొనియె. అటు శివాజీ వెళ్లుట చూచి ఔరంగజేబు జింజీసిద్ది ఈ యిద్దరుకూడి పడవ లనేకములు పోగుచేసుకొని సముద్రము మీదినుండి కొంకణదేశముపైకి వచ్చి, శివాజీరాజ్యములోని యనేక గ్రామ

ములనుగాల్చి కొల్లగొట్టిరి. ధుండీరాజపురములోనున్న శివాజీ యొక్క సముద్రసైన్యమంతయు నాశముచేసిరి. ఈయుద్ధములో రాఘోభల్లాలుడను నొక వృద్ధమరాటవీరుడు పడెను.

విజాపూరునవాబు కాలముచేసి యచ్చటిమంత్రుల పరస్పరకలహములవలన నరాజకమైనందున సమయ మిదియే యని తలచి, శివాజీ సైన్యమును విశాలగడముపై జేర్చి, యందు గొందరను పన్హాళా దుర్గముపైకి బంపి దానిని సాధించెను. కొందరకు అణ్ణాజీదత్తోయను సేనానాయకునిగా నిచ్చి, హుబ్బళీ పట్టణముపైకి బంపెను. మరాటావారా పట్టణమును దోచుకొని సూరత్ పట్టణములో దొరికిన ధనముకంటె నధిక ధనమును సంపాదించిరి. అచ్చట ఇంగ్లీషు, ఫ్రెంచి, డచ్, మొదలైన పాశ్చాత్యుల దుకాణములుండెను. వారందరయొద్ద నుండియు మరాటావారు ధనము గైకొనిరి. ఇంగ్లీషువారి దుకాణములలో ౭౮౯౮ వరహాలు మరాటావారికి దొరకెను. (౧౬౭౩ మార్చి)

ఇట్లు విజాపూరువారితో యుద్ధము పెట్టుకొన్నందున నిటు మొగలులతో, నటువిజాపూరివారితో నొక్కసారిపోరాడుట మిగులకష్టమునితలచి శివాజీ మొగలులతో 'మేము మీరాజ్యముజోలికి రాము; మీరు మారాజ్యముజోలికి రావలదు' అని సంధిచేసికొనెను.

మరల సముద్రసైన్యము గూర్చుకొని కార్వార్, అంకోలా మొదలైన సముద్ర తీరమునందున్న విజాపూరువారి గ్రామములపైకి నాసైన్యమును బంపెను. ఆ ప్రాంతములోని

దేశముఖ దేశపాండ్యాలను వశపరచుకొని వారు విజాపూరు వారిపై దిరుగబడునటుల జేసెను. తురకఠాణేదార్లనందరను వెడలగొట్టింపసాగెను. ఈయాగమంతయు జూచి పేదనూరు ఠాణా యధికారి భయపడి శివాజీకి వశుడై ప్రతిసంవత్సరము కప్పము కట్టుటకు నొప్పుకొనెను.

౧౬౭౩ లోనే పరళి. సాతారా, చందనవందన్. పాండవగడ్, నాందగిరీ, తాలోరా మొదలైన శత్రుదుర్గములను శివాజీ సాధించెను. ఇట్లు శివాజీ విజాపూరివారి దేశములోని కోటలను ఎదురులేక జయించుట చూచి విజాపూరువారు భయపడి అబ్దుల్ కరీమ్, బహిలోల్ఖాన్ అను వానిని పంద్రెండువేల సైన్యముతో బన్హాళా కోటవైపునకు బంపిరి. ఆప్రాంతమునందు మహారాష్ట్రులచే స్వాధీనపరుచుకొనబడిన కొన్నిదుర్గములను వాడు మరల సాధించెను. ఈ సంగతి తెలియగానే శివాజీ గొప్పసైన్యమిచ్చి ప్రతాపరావు సర్నోబత్ అనువానిని వారిమీదికి బంపెను. ప్రతాపరావు విజాపూరు రాజ్యములోనికి జొరబడి విజాపూరువరకు పట్టణములను గాల్చి పేల్చి దోచుకొనసాగెను. ఆతని నెదిరించుటకై విజాపూరు సైన్యములు తిరిగి వచ్చుచుండగా ఉంబరాణి యొద్ద నుభయ సైన్యములు కలసి రెండు జాములవరకు హూహూరా హోరిగా పోరాడెను మరాటావారు తురకసైన్యములను నలుదిక్కులనుండి చుట్టుకొని వారికి త్రాగుటకు నీళ్ళుదొరకకుండ జేసిరి. ఇంతలో ప్రొద్దుగుంకె. అప్పుడు తురుష్కులు నిరుపాయులై మేమిక మీరాజ్యములోనికి రాము. మమ్ము

ఇప్పుడు పోనియ్యవలసినది అని వేసుకొనిరి. ప్రతాపరావు సదయాచిత్తుడైనందున శత్రుప్రార్థన నంగీకరించి వారిని బోనిచ్చెను. శత్రువులిట్లు చేతజిక్కినప్పుడు వారినింతసులభముగా విడిచిపెట్టినందులకు శివాజీ ప్రతాపరావుని నిష్ఠురములాడగా నాతడు కోపగించి దూరముగా విదర్భదేశమునకు దాడి వెడలి పోయెను.

ప్రతాపరావు దూరదేశమునకు వెడలిపోవుట చూచి బిజాపూరు సైన్యము పన్హాళా దుర్గమును సాధించుటకై తిరిగి వచ్చెను. శివాజీకీ వర్తమానము తెలిసెను గాని ప్రతాపరావు దూరదేశమున నుండినందునను, వేరు సైన్యమొద్దలేనందునను నాతడు తురుష్క సైన్యమును నెదిరింపలేక పోయెను. ఇంతలో సి వృత్తాంత మెట్టులనో తెలిసి ప్రతాపరావు పన్హాళా దుర్గమునకు వచ్చి తురుష్కుల నెదిరించెను. అప్పుడు శివాజీ యాతనికిట్లు వర్తమాన మంపెను. 'వెనుక నీ సైన్యములు మీ చేత జిక్కినప్పుడు వీరిని నాశముచేయక వదలినందులకు వీరిప్పుడు మరలమరల మనలను బాధపెట్ట వచ్చినారు. ఇక నైనను వీరినందరను నశింపజేయక నాకు ముఖము చూపనక్కరలేదు.' యుద్ధముచేయుటకు సిద్ధముగా నున్నప్పుడిట్టివార్త వచ్చినందున ప్రతాపరావు రోషద్వేషాంధుడై తగిన వ్యూహము నేర్పాటు చేసికొనక, తగినకాలము నపేక్షింపక యొక్కసారి శత్రుసైన్యముపైబడెను. అట్లువ్యవస్థగా యుద్ధమునకు వెడలినందున నాతడు ఘోరముగా బోరాడినను రణరంగమున దోడి భటులతో దెగవలసిన వాడాయెను. సేనాధిపతి తెగినతోడనే

ఇతరభటులు వారికి బుద్ధిచెప్పిరి. ఇట్లు మరాటాబలములు విరిగి పారుచుండ నక్కడికి కొంతదూరమున నున్న హంసాజిమోహితే యను పంచహజారీ సరదారుడు దేవుని వలె నడ్డపడి మరాటాలకు 'ఓడకుడి ఓడకుడి' అని ధైర్యమిచ్చి అది వరకు మరాటాలను దరుముకొని వచ్చుచున్నట్టి చెదరియున్న తురుష్క సైన్యముపైబడి చెండాడెను. అది చూచి పారిపోవుచున్న మరాటా వీరులును తిరిగి తురుష్కులతో యుద్ధము చేయసాగిరి. అందువలన మరాటాలను దరుముచు వచ్చిన తురుష్కులు మరాటాలచే దరుమబడినవారైరి! ఈ యుద్ధము జేసరిగ్రామమునొద్ద జరిగెను. ఈయుద్ధవార్త తెలియగా ప్రతాపరావు తెగుటకు శివాజీ మిగుల జింతించి యాతని కుటుంబము రక్షించుభారము తానువహించి యతని కొమార్తెను దన రెండవ కుమారుడైన రాజారామునకు వివాహము జేసికొనెను. పరాజయమును జయముగా మార్చినహంసాజిమోహితే యను వీరునికి అంబీరావు అను బిరుదునొసంగి మృతిజెందిన ప్రతాపరావుయొక్క సర్‌నోబత్ అను నధికారము నిచ్చెను. అటులనే సంతాజి ఘోరపడే ధనాజిజాధవ్ అను వీరు లీయుద్ధమునందు మిగుల శౌర్యమును జూపిరిగాన, వారిని జుమ్లాదారుఅను నధికారమునుండి తీసి యంతకు పైయధికార మగుసరదారుల వర్గములో జేర్చెను. (౧౬౭౪ ఫిబ్రేవరి)

పంచదశ ప్రకరణము

రాజ్యాభిషేకమహోత్సవము.

ఎవ్వడైనను రాజ్యాభిషేకవిధి జరుగదేని 'రాజ' పదమున కర్హుడు కానేరడనియు, ఆ విధి జరుగువరకు నాతడొక పాళెగారు లేక జమీందారుతో సమానుడనియు హిందూధర్మశాస్త్రముయొక్క యభిప్రాయమైయున్నది. పూర్వపు మూర్ధాభిషిక్తులైన రాజులవలెనే శివాజీ రాజ్యమునందు న్యాయవిచారణయు, అష్టప్రధానులును, చతురంగసేనయు, జలస్థల పర్వత దుర్గంబులును మొదలైన యన్ని రాజ్యాంగము లుండెను. గోలకొండ, విజాపూరువారు లొంగి యప్పనంబు లిచ్చుచుండిరి. ఢిల్లీశ్వరునితో సాటిదొరవలె బోరుచుండె. తన పేరిటి నాణెములును దేశములో జెల్లుచుండె. ఇట్లు రాజలక్షణము లన్నియు నుండి ముఖ్యమైన మూర్ధాభిషేకము లేకపోవుట యశాస్త్రీయమని యెంచి శివాజీ యభిషేకవిధియు, సింహాసనారూఢవిధియు సశాస్త్రీయముగా జేయదలచె. ఒక గొప్ప సభచేసి తన సరదారు లందరను రావించి, వారికి దన మనోభీష్టము తెలియ జెప్పె. వారందరును నందులకు సంతసించి సమ్మతించిరి. రామదాస స్వాములవారును ననుజ్ఞ యిచ్చిరి.

గొప్ప విద్వాంసులను, పండితులను బంపించి రాజ్యాభిషేకవిధి యెట్టిదియో యని చర్చింపజొచ్చిరి. ఒకరొకవిధముగాను, మరియొకరు మరియొకవిధముగాను జెప్పసాగిరి. హిందూ రాజ్యము, సింహాసనము, ఛత్రచామరములు, అభిషేకవిధి మొదలైన సంగతులన్నియు నిదివరకే నాలుగువందల సంవత్సరములు పూర్వము లోపించినందున దాని గురించిన శాస్త్రములును లోపించియుండె. అందుచే నప్పటి పండితులకు రాజ్యాభిషేకంబన బునఃసృష్టియయ్యె. అప్పుడచ్చటి పండితులుచెప్పగా నాలుగు వేదంబులును షట్శాస్త్రంబులును బూర్తిగా జూచిన గాగాభట్టను బ్రాహ్మణుని గాశినుండి మరికొందరు పండితులతో బిలిపించిరి. వారందరును నొకసభచేసి శాస్త్రోక్తముగా రాజ్యాభిషేకవిధి యంతయు నిర్ణయించిరి. అభిషేకముహూర్తము ఆనందనామ సంవత్సర జ్యేష్ట శుద్ధ త్రయోదశీ గురువారమునాడేర్పరచిరి. (౧౬౭౪ జూన్ ౬)

సిద్ధతయంతయు నైన పిదప బ్రాహ్మణులకు నొక సంశయము కలిగెను. మూర్ధాభిషేకము క్షత్రియులకేగాని యితరులకు లేదు. శివాజీ క్షత్రియవంశ సంజాతుడని నిశ్చయముగా దెలిసినగాని యభిషేకము చేయుటకు వీలులేదని వృద్ధ గాగాభట్టులవారు స్పష్టముగాజెప్పిరి. అప్పుడు శివాజీ ఉదయపురమునకు జారుల బంపి యచ్చటి వంశవృక్షములను దెప్పించి యచ్చటి రాజపుత్రులును దానును నొక్క వంశమువార మని నిర్ణయించి గాగాభట్టును మెప్పించెను. ఇట్టిసంశయము తీరిన తరువాత మరియొక సంశయము కలిగెను. శివాజీ కప్పటికి

ఇద్దరు పుత్రులు గలిగి నలుబదియేడు సంవత్సరముల వయస్సుండెను. బ్రాహ్మణునకు బదునారు సంవత్సరములవరకును, క్షత్రియులకు నిరువదినాలుగేండ్లవరకును ఉపనయనము కాని యెడల వారు వర్ణభ్రష్టులై వ్రాత్యులన బడుదురు. అందుచే నుపనయన మదివరకు లేని శివాజీ ధర్మశాస్త్రానుసారము వ్రాత్యుడయ్యెను. వ్రాత్యునకు మూర్ధాభిషేక మెక్కడిది ? అప్పుడు పండితులు శాస్త్రములను వెదకి శివాజీచేత వ్రాత్యస్తోమయజ్ఞమును చేయించి, యాతని వ్రాత్యత్వదోషమును బాపి యాతనికినలుబదియేడవయేట మౌంజిబంధనముచేసిరి. జ్యేష్ఠ శుద్ధమందు చవితికి నుపనయనమైన పిదప, షష్ఠినాటివరకుపట బంధనవిధి పూర్తియై ముఖ్యయజ్ఞమునకు ప్రారంభమాయెను. ఆయజ్ఞ మేడుదినములవరకు జరిగెను. నిత్యము నేబదివేల బ్రాహ్మణులకు అన్నదానము జరుగుచుండెను. శివాజీయు ఋత్విజులును మాత్రము ఘృతము, పయస్సు,ఫలములుభక్షించుచు నేడుదినములవరకు వ్రతస్థులయి యుండిరి.

శుద్ధత్రయోదశి రోజున శివాజీ మంగళస్నానము లాచరించి భవానీదేవి, తల్లి, కులగురువు, ఋత్విజులు మొదలయిన వారికందరకు నమస్కరించి యనుజ్ఞాతుడయి యభిషేకము జేయించుకొనుటకు సుముహూర్తమున సింహాసన మెక్కెను. భార్యలిద్దరు బటబంధన మాచరించి పట్టమహిషులుగా నభిషిక్తలగుటకు శివాజీ యొద్దకు వచ్చి కూర్చుండిరి. కొమాళ్ళిద్దరును వచ్చి మరియొకప్రక్క గూర్చుండిరి. ఎనిమిది దిక్కులను అష్టప్రధానులు నొక్కరు ఛత్రమును, నొక్కరుచామర

మును, నొక్కరు సువర్ణకలశమును, నొక్కరు రౌప్యకలశమును బట్టుకొని సింహాసనమునకు జుట్టు నిలచియుండిరి. వైదికబృంద మంతయు వేదఘోష చేయుచు మంత్రోదకములను రాజుపై జల్లుచునిలచిరి. మంగళ వాద్యములు, భేరీ మృదంగములు నృత్యగానములు, వందిమాగధజయశబ్దంబులు, ఫిరంగిమ్రోతలు మొదలయిన వానితో నలుదిక్కులు ఘూర్ణిల్లె. అప్పుడు మూర్ధాభిషిక్తుడయినరాజు తులాపురుష దానముచేసి పదునారువేల వరహాలు బ్రాహ్మణులకు బంచి పెట్టెను. గాగాభట్టునకు లక్షరూపాయలు దక్షిణయొసంగె. ఋత్విజునకొక్కొక్కనికి నయిదువేల రూపాయలు సంభావనగా నిచ్చెను. ఇతర విద్వాంసుల వారివారి యోగ్యతానుసారము గౌరవించె. తన మంత్రులకు నితర సేవకులకు నేనుంగులు, గుర్రంబులు' పల్లకులు, బంగారుకంటెలు బహుమతిగానొసంగె. రాజ్యాభిషేక సమయమున శివాజీ తనయష్ట ప్రధానులకు నదివరకున్న తురుష్కనామములను దీసి, సంస్కృత నామములుగా మార్చెను. పూర్వము సర్నోబత్, న్యాయాధీశుడు అను పేరుగల అధికారు లిద్దరుండిరి. వారిని నొక్కరొక్కరిగా మార్చెను.

అష్టప్రధానుల వార్షిక వేతనములను వృద్ధిచేసెను.

అధికారి పేరు.	అధికారముయొక్క పూర్వపు పేరు.	క్రొత్తగా బెట్టబడిన పేరు	వేతనము హోనులు.
౧ మోరోపంత్ పింగళే	పేష్వా	ముఖ్యప్రధాన	౧౫౦౦౦
౨ రామచంద్రపంత్	ముజుందార్	పంత్ అమాత్య	౧౨౦౦౦
3 అణ్ణాజిదత్తో	సురనీస్	పంత్ సచీవు	౧౦౦౦౦
౪ దత్తాజిపంత్	వాకనీస్	మంత్రి	౧౦౦౦౦

౫ హంబీరరావుమోహితే	సర్ నోబత్	సేనాపతి	౧౦౦౦౦
౬ జనార్దనపంత్	డబీర్	సుమంత్	౧౦౦౦౦
౭ బాలాజిపంత్	న్యాయాధీశుఁడు	న్యాయాధీశుఁడు	౧౦౦౦౦
౮ రఘునాథపంత్	న్యాయశాస్త్రి	పండితరావు	౧౦౦౦౦

రాజ్యాభిషేక మయినప్పటినుండియు, శివాజీ రాజ్యాభిషేక శకమని తనపేరిట క్రొత్తశకమును ప్రారంభించెను. అన్ని వ్యవహారము లందును దన్ను 'క్షత్రియ కులావతంస శ్రీరాజా శివచ్ఛత్రపతి' అని సంబోధించవలయు నని యాజ్ఞాపించెను. ఈ రాజ్యాభిషేక మహోత్సవసమయమునకు గోలకొండ నవాబు తనమంత్రులను బంపి ధనకనకవస్తువాహనంబు లనేకములు శివాజీకి గానుకయిచ్చెను. ఇతర మాండలిక రాజులును, పాళెగాండ్రును, ఇంగ్లీషు, పోర్చుగీజు మొదలయిన పరదేశీయ వర్తకులును, ఈ మహోత్సవ సమయమున శివాజీకి ననేక కట్నంబు లిచ్చిరి. ఇంగ్లీషువారు శివాజీతో సంధిచేయుటకయి పంపిన హెన్‌రిఆక్సెండేర్ అనుదూత ఈయుత్సవసమయమున రాయుగడము మీద నేయుండెను. ఇంగ్లీషు వారెట్లు శివాజీతో సంధిచేయదలచిరో, యటులనే శివాజీయు ఇంగ్లీషువారితో సంధి చేయ నొప్పుకొనెను. రాజాపూరుపట్టణము ౧౬౬౧లో శివాజీ దోచినప్పుడు ఇంగ్లీషువారి యొద్దనుండి పదివేల హొనుల వెలగలవస్తువులు తీసికొనెను. ఆ ధనము త్రిప్పియిమ్మని ఇంగ్లీషు వారడుగుచుండిరి. మీరు నాకు జంజిరా సాధించుటకు సహాయముచేసిన, మీధనము మీకిచ్చెదనని చెప్పుచుండెను. అప్పు డింగ్లీషువారు కేవల వర్తకు లయినందున యుద్ధములు చేయ

నొల్లక, మాకుయుద్ధములతో ప్రయోజనము లేదని తప్పించు కొనుచుండిరి. ఇట్లుభయులకును గొన్నిరోజులు సంధివిషయక చర్చ జరిగి రాజ్యాభిషేకమునకు గొన్నిరోజుల పూర్వము వారికిట్లు సంధికలిగెను:—

౧. రాజాపురములోని ఇంగ్లీషువారి దుకాణములో దీసి కొనిన సొత్తంతయు శివాజీ ఇంగ్లీషువారికి త్రిప్పి యియ్యవల యును. రాజాపురము, దాభోళ్, కల్యాణ్, పట్టణములో వర్త కమునకయి ఇంగ్లీషువారి దుకాణము లుంచుకొన వచ్చును.

౨. శివాజీ రాజ్యములో నిష్టము వచ్చినచోట, నిష్టము వచ్చినధరలకు ఇంగ్లీషువర్తకులు సరకు లమ్ముకొనవచ్చును.

3. ఇంగ్లీషువారు శివాజీకి నూటికి రెండు రూపాయల చొప్పున పన్నునియ్యవలయును.

౪. ఉభయుల నాణెములు ఉభయుల రాజ్యములలో జెల్లవలయును.

౫. ఇంగ్లీషువారియోడలు పగిలి రేవునకువచ్చిన యెడల నందలి సరకులను నపహరించక ఇంగ్లీషువారికి త్రిప్పి యియ్యవలయును.

రాజ్యాభిషేకమైన పదునైదు దినములకు శివాజీ తల్లి యైన జిజాబాయి పరలోకగత యయ్యెను. కనులార గొమా రుని పట్టాభిషేకముజూచి యావీరమాత సంతోషముతో దేహమును త్యజించె. ధన్యాత్ములగు వీరమాతలలో నీమె యొక్కత యనుటకు సందేహము లేదు.

—]:[—

పదునాఱవ ప్రకరణము

కర్ణాటద్రావిడ దేశములపై దాడివెడలుట

మోగలులు మరాఠావారితో జేసినసంధికి విరుద్ధముగా శివాజీయొక్క రాజ్యములోని కొన్ని గ్రామములు కొల్లగొట్టినందున మోగలులతో బోరాడుటకు శివాజీకి సంభవించెను. ముఖ్య ప్రధానియైన మోరోపంత్ పింగళే మోగలుల రెండు దుర్గములను సాధించెను. శివాజీ జన్మభూమియయిన శివనేరిదుర్గము సాధింప యత్నించెను. గాని విఫలప్రయత్నుడయ్యె. హంబీర్‌రావు సూరత్ పట్టణమునొద్దనున్న కనుమల ద్వారా ఉత్తరదేశమునకు వెళ్ళి తన గుర్రపురౌతులను పలు దిక్కులకుపంపి బరహాణపురము వరకు దేశమును కొల్లగొట్టెను. భడోచ్ పరగణాలోనికి జొరబడి అక్కడివారిచే నప్పనంబులు గొనియె. మరాటావారు నర్మదానదిదాటి యుత్తర హిందూదేశమునకు దాడివెడలిన ప్రథమప్రసంగమిదియె. మోగలులు హంబీరరావు సైన్యమును తరుముకొని వచ్చిరి. గాని మరాటావారు వారిచేత జిక్కక నర్మదానది దాటి తమ దేశమునకు సంపాదించిన ధన మంతయు గొనిపోయిరి. ఇందులకు బదులుగా మోగలులు శివాజీయొక్క కళ్యాణ ప్రాంతమును గొల్లగొట్టిరి. (౧౬౭౫)

శివాజీకి గొంకణదేశములోనున్న రెండు రాజ్యములకు నడుమ 'పొండ' అను మొగలుల దుర్గ మొకటి యుండెను. ఆ దుర్గమును సాధించుట యత్యావశ్యక మైనందున మరాటా వారు మూడు సంవత్సరముల వరకు దానిని సాధింప యత్నించిరి. సూరతు పట్టణములో నున్న ఫ్రెంచివారి యొద్దనుండి యందు కొరకు శివాజీ కొన్ని ఫిరంగులును, మందు గుండును గొనెను. గాని ఫిరంగిదెబ్బ లక్ష్యమునకు సూటిగా దగుల నందున గుండ్లు దుర్గముపై బడవయ్యె. అప్పుడు శివాజీ స్వయముగా దాడివెడలి దుర్గసమీపమున నున్నదేశము గెలిచి, దుర్గమును నలుదిక్కుల జుట్టుకొని యుద్ధము జేసెను. దుర్గము యొక్క యొక బురుజుకు సొరంగముచేసి యందు దుపాకిమందు నింపి నిప్పుముట్టించి దానిని పడవైచి త్రోవచేసికొని లోపలికి బోయెను. మూడు సంవత్సరముల వరకును శౌర్యముతో బోరాడి తుదకు విధిలేక దుర్గములోనివారెల్లరు దుర్గమును శత్రు స్వాధీనము చేసిరి. ఇట్లు దుర్గమును సాధించి శత్రురాజ్యమును దోచుకొని యపరిమిత ధనముతో శివాజీ రాయగడమును చేరెను. (౧౬౭౫)

పన్హాళా దుర్గము నొద్ద నున్న తన రాజ్యమునకు విజాపూరివారివలన మిగుల నష్టము కలుగుచున్నందున, నలువైపుల శివాజీ వర్ధనగడము, భూషణగడము, సదాశివగడము, మచ్ఛందరగడము అను నాలుగుదుర్గముల నిర్మించెను. ఈదుర్గనిర్మాణ సమయమున శివాజీకి గొప్పవ్యాధి సంభవించెను. అనేకమాసముల వరకును శివాజీ వ్యాధిగ్రస్తుడై సాతారా దుర్గములోనే

యుండెను. ఇట్టి వ్యాధిలో నుండిన కాలముననే శివాజీ దక్షిణ దిగ్విజయమునకు గావలసిన సిద్ధత యంతయు జేసెను.

శివాజీ తండ్రియైన శహాజీకి తంజావూరులో జాగీరున్న సంగతి చదువరులకు జ్ఞాపక ముండవచ్చును. నారోపంతు హానుమంతే యను బ్రాహ్మణుడు శహాజియొద్ద మంత్రిగానుండి యీజాగీరు పని చూచుచుండె. ఆతడు ౧౬౭౩ లో గతింపగా, నాతనికుమారు డైన రఘునాథనారాయణ అనువాడు మంత్రిత్వమును వహించె. ఈతడు వైదిక లౌకిక వ్యవహారము లందు ప్రవీణుడు. శహాజీ మరణానంతరము ఆతనిద్వితీయభార్య పుత్రుడైన వెంకాజీయనునాత డా జాగీరునకు నధిపతి యయ్యెను. గాని శివాజీవలె నాతనితమ్ముడైన వెంకాజీ తెలివి తేటలు గలవాడు కానందునను, నీచులమాటలు విని ప్రమత్తుడై యుండువాడైనందునను మంత్రియైన రఘునాథ నారాయణునకును నాతనికిని మనస్పర్థ కలిగెను. మంత్రి చెప్పిన మంచి యాలోచనలు వినక, రాజాతని నవమానపరచు చున్నందున నవమానమును సహింపలేని బ్రాహ్మణతేజస్సు గల యా మంత్రి రాజుపై బగసాధింప నిశ్చయించెను. కాని చుట్టు పట్టుననున్న పాళేగారుల నాశ్రయించి వారిచే దనదొరను భంగపరిపించిన నది స్వామిద్రోహ మగునని యెంచి, తనరాజు నకు నన్నయైన శివాజీని నాశ్రయించి యాతనిచే దమ్మునికి బుద్ధిచెప్పింప వలయుననినిశ్చయించెను. తనవంటి సరదారుడు శివాజీవంటి మహారాజును జూడబోవునప్పుడు రిక్తహస్తములతో వెళ్ళగూడదని తలచి, జింజీమొదలైన కొన్నిదుర్గముల

యధిపతులతో శివాజీకి బోరాటగలుగు కారణంబుల గొన్ని టని యోచించుకొని గోలకొండకు బోయె అప్పుడక్కడ నాంధ్ర దేశంబున దమ యుజ్జ్వలకీర్తి శాశ్వతముగా నిలిపిన వారును, ఇంగ్లీషు, ఫ్రెంచి మొదలయిన పరదేశస్థు లప్పుపం బులతో దమ్ము నాశ్రయించు నంత యోగ్యత గలవారును, అశ్వినేయులవలె నెల్లప్పుడును దంటగా నామ ముచ్చరింప బడు సద్వితీయానుకరణీయులను నన్నదమ్ములను నగు అక్కన్న మాదన్నగార్లు ముఖ్యమంత్రిత్వమును వహించియుండిరి.

గోలకొండనవాబు ౧౬౭౨ లో గతింపగా, నాతని యల్లుడైన అబూహుసేన్ * అనువాడు నవాబయ్యెను. పూర్వ వయస్సునందీతడు సత్ప్రవర్తన దప్పిన వాడయినను, రాజ్యము వచ్చినప్పటినుండియు జన్మాంతర మైత్రి నటుల సజ్జను డయ్యెను. తనయొద్దనున్న వారి గుణమును పరీక్షించుటయందు నీతడు ప్రజ్ఞానిధి యైనందున, దుర్మార్గప్రవర్తనగలవానిని తొల గించి బుద్ధియందు బృహస్పతిబోలిన అక్కన్నమాదన్నగార్లకు మంత్రిత్వమిచ్చె. సాధారణముగా నుభయులపేర్లు వాడుకలో నున్నను, మాదన్న పంతులవారే ముఖ్యప్రధాని యై యుండె. ఆయనమాట 'తానీషా' జవదాట డయ్యె;

తంజావూరునుండి బయలుదేరి గోలకొండకువచ్చి రఘునాథనారాయణ అను మంత్రిపుంగవుడు మాదన్నగారిని

* ఈతనికే 'తాన్‌షహా'అని నామాంతరము. 'తానీషా' అని ఆంధ్ర దేశమున వాడుక.

చూచి, తన యప్రతిమపాండిత్యమును, అసమాన రాజ్యతంత్ర చాతుర్యమునుజూపి యాతనిని వశపరచుకొనియె. శివాజీయు, గోలకొండ నవాబును గలసి దాడివెడలిన గర్ణాట ద్రావిడ దేశములలోని విజాపూరువారి రాజ్యమంతయు సాధింపవచ్చు నని యక్కన్నగారికి నమ్మికపుట్టునటుల జెప్పి యాతనిచేత నవాబునకు జెప్పించె. అందులకు సమ్మతించి నవాబు రఘు నాథనారాయణుని తనసభకురావించి గౌరవించి కర్ణాటముపై శివాజీతో దాడివెడలుటకు దన కిష్టమున్నది యని తెలిపెను. ఇట్లు రఘునాథనారాయణుడు యుద్ధముచేసి రాజ్యము గెలిచె దవురమ్మని శివాజీని పిలుచుటయేగాక, గోలకొండ సైన్యముల నీకు సహాయమిచ్చెద పట్టు మనుచు శివాజీయొద్దకు వచ్చెను. అందులచేనాతని యసామాన్యప్రజ్ఞకు మెచ్చి శివాజీ గూంతుసు రాయగడమునకు రాగానే యాతనికి దన యమాత్యుని పని యిచ్చెను.

కర్ణాటద్రావిడదేశములపై దాడి వెడలుటకు గారణ మెద్దియని వెల్లడిచేయవలయునో యని యాలోచింపగా, తండ్రి యైన శహాజీయొక్క జాగీరంతయు నాతని ద్వితీయపుత్త్రుడగు వెంకాజీ యనుభవించుచున్నాడనియు, జ్యేష్ఠపుత్త్రుడైన శివాజీకి నేమియు, నిచ్చుట లేదనియు, నందునకు శివాజీ తన సగముభాగము తమ్ముని యొద్దనుండి తీసికొనుటకు దంజా వూరుకు పోవుచున్నాడను మిషపెట్టుకొని, దాడికి బయలు దేరవచ్చు ననియు నిర్ణయించిరి.

తాను దూరదేశమునకు బోయినప్పుడు మోగలులు తన రాజ్యముమీదికి యుద్ధమునకు వచ్చెద రేమో యని తలచి శివాజీ మోగలసేనాధిపతిని వశపరచుకొని తాను ఢిల్లీశ్వరునికి సామంతునిగా నుండుదు ననియు, గొంత కప్పము కట్టెద ననియు వర్తమాన మాతనిద్వారా ఔరంగజేబున కంపి, మోగలులతో గొంతస్నేహభావము కుదుర్చుకొనెను. జింజిరాకు నధిపతియైన సిద్దీవాడు తన కొంకణప్రాంతముకు బాధ కలుగచేయకుండ నక్కడనొక గొప్పసైన్య ముంచెను. ఢిల్లీకి బయన మయినప్పుడు చేసినటుల నిప్పుడును రాజ్యమంతయు ముఖ్యప్రధానియైన మోరోపంతుపింగళేగారి స్వాధీనము చేసెను.

ఇట్లు స్వరాజ్యసంరక్షణమునకు గావలసిన కట్టుదిట్టములన్నియు నేర్పరచి, ముప్పదివేల యశ్వసైనికులను, నేబదివేల కాల్బలములను దీసికొని దాడివెడలెను. తానువచ్చుచున్న సమాచారము గోలకొండ నవాబయిన తానీషాకు దెల్పుటకై చారుల బంపెను. 'గోలకొండ రాజ్యములోని ప్రజలకు నేమాత్రము బాధ కలుగజేయగూడ దనియు, సైనికులకు గావలసిన వస్తువు లన్నియు డబ్బుపెట్టి కొనవలసిన దనియు నాజ్ఞాపించెను. గోలకొండసమీపమునకు రాగానే మాదన్నగారెదురుగావచ్చి శివాజీని తీసికొనిపోయి నవాబుదర్శనము చేయించిరి. నవాబునకును శివాజీకిని మైత్రిగలిగి శివాజీనెల రోజులవరకును గోలకొండలోనే యుండెను. ఢిల్లీపతియు విజాపూరునవాబునుగూడి మనలనిద్దరును నాశముచేయ యత్నించు

చున్నారనియు,మనమిద్దరముసఖ్యముతో నుండిస్వసంరక్షణము చేసికొనవలయు ననియు, శివాజీ నవాబునకు జెప్పగా వారికిద్దరకు నిట్లు ఒడంబడికలు జరగెను. ద్రావిడకర్ణాటకదేశయుద్ధము నకై శివాజీ తన సొంతసైన్యమును, నవాబుయొక్క ఫిరంగులను దీసికొని పోవలయును. మొగలులు గోలకొండమీదికి గాని, శివాజీరాజ్యము మీదికిగాని దండెత్తివచ్చినయెడల వారిని నవాబు యెదిరింపవలయును. క్రొత్తగా శివాజీ సంపాదించు రాజ్యములో సగభాగము గోలకొండ నవాబునకు నియ్యవల యును. వీలయినప్పుడు విజాపురము తురక దివానును దొల గించి అక్కన్నగారికి ఆ దివానుగిరి యిప్పింపవలయును. ఇట్లొ డంబడిక లేర్పరచుకొని శివాజీ కర్ణాట ద్రావిడదేశములపై దండు వెడలెను. (౧౬౭౭ మార్చి)

గోలకొండ బయలుదేరి కడప, కర్నూల్ మొదలయిన ప్రదేశములలో నప్పనంబులు గొనుచు నివృత్తిసంగమక్షేత్ర మున స్నానముచేసి, తనసైన్యములన్నింటిని జంజి మార్గమున తిన్నతిన్నగా బోవుచుండు మని యాజ్ఞాపించి, తాను కొలది సేవకుల వెంటదీసికొని శ్రీశైలమునకుబోయి మల్లిఖార్జునుని సేవించెను. ఆ రమ్యమైన పర్వతప్రదేశములను జూచి యచ్చ టనే జన్మమంతయునుండి తపస్సు చేసుకొనవలయు నని శివా జీకి దలంపు గలిగెను. అచ్చటి భవానీదేవికి దనశిరః కమలము సమర్పించి ముక్తిని జెందవలయు నని నిశ్చయించె నట! కాని, శరీరమందు దేవిప్రవేశించి నీవీపని చేయవలదు. నీవు చేయ వలసిన కార్యములనేకములున్నవి. నీవు యుద్ధమునకు వెళ్ళుము.

అని యజ్ఞాపించెనట! ఆత డచ్చటనుండి బయలుదేరి చెన్న పట్టణము మీదుగా జింజీకి బోయి యాదుర్గము సాధించి, యచ్చట రామజీనలగె అనువానిని హవాల్‌దారుగా నేర్పచెను. తరువాత ఆప్రాంతములోని దుర్గములు, కోటలు, ఠాణాలు మొదలయిన వన్నియు గెలిచి, యచ్చట దన సుబేదారునుంచె. మహారాష్ట్రదేశము నందలి దుర్గములను గాపాడుటకు జేసిన నియమముల నిచ్చటి దుర్గముల రక్షణార్థమై యేర్పరచెను. తన దేశములోని జమాబందిపద్ధతుల ననుసరించియే క్రొత్తరాజ్యము లోని భూమి యమరకము గురించి కట్టుదిట్టము లేర్పరిచెను.

ద్రావిడదేశములోని తమరాజ్యము మారాటావారి చేతిలో బడుచున్నదని చూచి, విజాపూరువారు గొప్పసైన్యమును శివాజీమీదికి బంపిరి. శివాజీ యాసైన్యమును నోడించి సైన్యాధిపతిని ననేక ధనధాన్యవస్తువాహనములతో జెరబట్టెను. శివాజీవెంటనున్న సరహరిబల్లాలుడను నొక సేనాని వేలూరు పట్టణమును ముట్టడించి, సమీపమందున్న రెండుగుట్టలమీదికి ఫిరంగుల నెక్కించి అచ్చటినుండి పట్టణముమీదికి నగ్నిగోళముల జల్లుచు గొన్నిరోజులకు బట్టణంబును సాధించెను.

శివాజీ తండ్రియగు శహాజీకి దాసీపుత్రుడగు సంతాజీ రాగా నాతని గౌరవించి యాతనియందు దనతండ్రి గుణంబులనేకము లున్నవని చూచి, శివాజీ యాతని జింజీకి నధికారిగా నియమించెను. తరువాత శివాజీ తన సాపత్నసోదరుడైన వెంకోజీకి నిట్లు వర్తమానమంపెను. 'మనతండ్రిగారు గతించి పదుమూడు సంవత్సరములు అయినవి. పూర్వార్జితమైన తంజా

వూరు మొదలయిన జాగీర్లును, నగలు నాణెములను నీవే యనుభవించుచున్నావు. మాసగపాలుమాకియ్యవయితివి. ప్రస్తుతము మేమిటువైపులకు వచ్చియున్నాము గాన, మాభాగము మాకియ్యవలసినది. తిరువేదియొద్ద వచ్చి మమ్మును గలిసికొనవలసినది.”

శివాజీ తనరాజ్యములోని సగభాగము తీసుకొనుటకు వచ్చినాడని వెంకోజీకిని యిదివరకే తెలిసినందున నాతడు యుద్ధమునకు సిద్ధముగా నుండెను. గాని, యాతనికి సహాయముగా వచ్చెద ననిన పాళేగారులు కొందరు శివాజీకి లోబడినందున వెంకోజి యన్నను జూడబోవలసినవాడయ్యెను. వచ్చిన తన తమ్ముని శివాజీ గౌరవించి కొన్ని రోజులుతనయొద్ద నుంచుకొనెను. వెంకోజి పైకి సత్రమభావమును జూపినను భాగ మిచ్చుటకు సమ్మతింపడయ్యె. తమ్ముని జెరబెట్టి యర్ధరాజ్యము తీసికొనవలయునని శివాజీ యోజించెను. కాని తాను పిలువగా నమ్మివచ్చినవానిని మోసపుచ్చగూడ దని తలపు ఆతనిని పోనిచ్చెను. పోయినపిదప నొక దూతను నాతనియొద్దకు బంపి గృహకల్లోలము పెంచినందున లాభములేదు. గాన ధర్మమును స్మరించి పితృధనముయొక్క యరపాలు మాకిమ్ము. ఈ చిన్నజాగీరు నారాజ్యములో నూరవవంతయినను లేదు. అయినను పూర్వార్జితమునైన భూమిని బోగొట్టుకొనుట తెలివిమాలినతనము అనబడును’ అని వారపంపెను. కాని, వెంకోజి యందులకు సమ్మతింపడయ్యె. త్రివేదినుండి శివాజీ వేలూరు మీదుగా మహారాజగడము, కర్ణాటకగడము అనుదుర్గముల

మీదికి బోయి వానిని సాధించి, కోలార్, బాలాపురము మొద లయిన ప్రాంతములలోని పాళెగారులను వశపరచుకొని ఆర్నికి వెళ్ళెను వేదోభాస్కర్ అను బ్రాహ్మణ సరదారు డచ్చటి గూర్గమునకు అధిపతిగా నుండెను. ఆతడు మిక్కిలి తెలివి తేటలు గలవాడు. శివాజీ తండ్రియగు శహాజిచే నీ సరదారు డచ్చట నిలుపబడియె. ఆతడు శివాజీకి శరణురాగా నాతని నధికార మాతనికే యొసంగబడియె. ఆతని నిద్దరు కుమారులకు శివాజీ తనయొద్ద నుద్యోగముల నిచ్చె. ఇట్లు శివాజీ తనతండ్రి యైన శహాజిచే సంపాదింపబడిన జాగీరులోని కోలార్, బసివ కోట, బెంగుళూరు, బాలాపురము, సేరా, మొదలయిన ప్రాం తములను గెలిచి విజాపూరువారి రాజ్యములో నప్పనంబులు గైకొనుచు గరభారమియ్యని గ్రామములను గాల్పబేల్ప దొడంగె (౧౬౭౭ డిశంబరు)

శివాజీ యటు కర్ణాటకదేశమునకు వెళ్ళినాడని చూచి యిదియె సమయమని యెంచి మొగలులును విజాపూరు వారును గూడి గోలకొండమీదికి దండువెడలిరి. ముందిట్లగు నని దీర్ఘాలోచనవలన గనుగొనినవా డగుటచే మాదన్న గారదివరకే శత్రువులను నెదరించుటకు సిద్ధముగా నుండిరి. అందుచే శత్రువునకు వస్తుసామగ్రి దొరకకుండజేసి యెన్నియో బాధలు పెట్టి శత్రువులను బారగొట్టిరి.

విజాపురసైన్యములోని కొందరు సైనికులకు ముట్టవల సిన జీతము ముట్టనందున వారు అలిగి మోరోబంత్ పింగళే యొద్దకువచ్చి మరాటావారిసైన్యములో జీతమునకుండిరి.

గోలకొండమీదికి మొగలులు దండెత్తివచ్చినారన్న వృత్తాంతము విని, శివాజీ ద్రావిడదేశమునుండి బయలుదేర నిశ్చయించె. క్రొత్తగా సంపాదించిన జింజీరాజ్యమంతయు దనతమ్ముడయిన సంతాజీ (శహాజీదాసీపుత్రుడు) కిని, రఘునాథనారాయణునికిని నప్పజెప్పి వారికి సహాయముగా గొప్ప సైన్యముతో హంబీరరావును బ్రాంతమంతయు శాంతిపొందు వరకు నిచ్చి మిగిలిన సైన్యములతో దాను స్వదేశమునకు రాజొచ్చెను. బళ్లారిలో మలబా ఈదేసా-ఈణ్ అను దేశముఖ శివాజీతో ఘోరముగా బోరాడి యిరువదియేడు దినముల వరకును దుర్గములోనికి మరాటావారిని రానియ్యడయ్యె! తుదకు మరాటావారు దుర్గమును సాధించిరి. తరువాత కోపల్ బహదుర్ బెండా అను పట్టణముల గెలిచిరి. ఈ ప్రాంతముల కన్నిటికిని జనార్దనపంత్ అనువానిని నధిపునిగా నేర్పరిచి శివాజీ తురగళపట్టణములో విడిసియుండగా, కర్ణాటక ద్రవిడ దేశములలోని తన సైన్యాధిపతులతో దనతమ్ముడైన వెంకోజీ యుద్ధముచేసి, పరాజితు డయ్యెననిన వార్త శివాజీకి దెలిసె. అప్పుడాతడు తన తమ్మునకిట్లు వార్తపంపెను. 'మీరు మాకు పితృధనములోని పాలియ్యనందున మీ రాజ్యములోని కొంత భాగము మేము గెలువవలసివచ్చెను. మీరు మాసైనికులతో బోరాడితిరి గనుక, మా సైనికులును మీతో బోరాడవలసిన వారైరి. మీరు దుష్టులమాటలు విని సన్మార్గమును వదిలి దుర్మార్గమున బోవుట మంచిదికాదు. మీకును మాకును జరిగిన యుద్ధములో బడిన తురకలను గురించి నాకేమియు

జింత లేదు. కాని, ప్రతాపజీరాజా, భీమాజీరాజా శివాజీపంత్ డబీర్ మొదలయిన మా శూర మరాటావీరులు పడినందులకు మే మెంతయు జింతిలుచున్నాము. ఇట్లు చేయక యీరు మేము కలసి మెలసి యుండిన నుభయులకు క్షేమమే. మేము చెప్పి నటుల మీరు విని కర్ణాటకములోని రాజ్యమంతయు మాకిచ్చి వేసిన యెడల మరల నింత రాజ్యము మీకు పన్హాళా మొద్ద నివ్వగలవారము. మీకిష్టమున్న యెడల గుతుపుశాహి (గోలకొండ) రాజ్యములో మూడులక్షల హూనుల రాజ్యమిప్పింప గలము.' ఈ వార్తయందిన తరువాత వెంకోజీ తెలివి తెచ్చుకొని తా నపరాధము చేసినను సమర్థుఁడయ్యును దనయన్న తన్ను నన్యాయముచేయక కొంతరాజ్య మిచ్చెదనని యనుచున్నందులకు సంతసించి, సంధిచేసుకొనుట కిదియే మంచి సమయమని తలచి, రఘునాథనారాయణుని ద్వారా తంజాపూరును, శహాజీ జాగీరును దనస్వాధీనములోనే యుండు నట్లును దాను బ్రతిసంవత్సరము శివాజీకి జాగీరులో వచ్చు నాదాయములో సగమిచ్చునట్లును శహాజీ సంపాదించిన చర రూపకమయిన యాస్తియంతయు నుభయులు పంచుకొను నట్లును నొప్పుకొని శివాజీతో సంధిచేసికొనెను.

విజాపూరు సైన్యము శివాజీ రాజ్యములోని భాగమైన పన్హాళాప్రాంతములోనికి జొచ్చి, గ్రామములను గొల్లగొట్టెను, ఈ వార్త స్వదేశమునకు దిరిగివచ్చుచున్న శివాజీకి దెలియగా. నాతఁడు నిరోశికాటకర్ అను నాతనికి సైన్యమిచ్చి శత్రువుల మీదికి బంపెను. వాడు శత్రువుల నోడించి వారు దోచుకొని

పోవుచున్న ధన మంతయు దెచ్చి శివాజీకి సమర్పించెను. శివాజీ యా ధనమెవ్వరిదియైనది కనుగొని, యెవ్వరి ధనము వారికి నిప్పించి తన న్యాయప్రియత్వమును వెల్లడి పరిచెను.

బల్లారి ప్రాంతమునకు జనార్దనపంత్ అను వానిని సధికారిగా నేర్పరచినట్లు వెనుక వ్రాసియున్నాను. ఆ జనార్దన పంతులు మీదికి విజాపురసరదారు లిద్దరు దాడెత్తివచ్చు చున్నారని శివాజీకి దెలిసినందున, దనసేనలో గొంతభాగము జనార్దనుని సాయమునకు బంపెను. మిగిలిన సైన్యములతో దాను బయలుదేరి పదునెనిమిది నెలలకు దిరిగి రాయగడము చేరెను. అటు జనార్దనపంతును, హంబీరరావును గూడి విజా-పూరు సరదారుల నోడించి వారిని జెరబట్టిరి. మరాటావారికి నెకుపూర్ణ గుర్రంబులు, నైన శస్త్రములును దొరకె. తరువాత జనార్దనపంతు చుట్టుపట్టున నున్న పాళెగారుల నందరను గెలిచి శివాజీ సామంతుల మని వారిచే నొప్పించెను. మరాటావారిని నెదిరించు శక్తిలేక విజాపూరు వారూరకుండిరి.

శివాజీ దక్షిణ దిగ్విజయము చేసి రాగానే మాదన్న గారు రాయగడమునకు దూతలద్వారా వస్త్రభూషణ రత్న మాణిక్యాదులు కానుక లంపిరి.

తాను క్రొత్తగా సంపాదించు రాజ్యములో సగపాలు గోలకొండ నవాబున కిచ్చెదనని శివాజీ సంధిచేయు నప్పు డొప్పుకొనెనని చదువరులకు జ్ఞాపక ముండవచ్చును. శివాజీ కర్ణాట దేశములో సంపాదించిన క్రొత్తరాజ్యములోని యర్థ భాగము ఆ సంధి ననుసరించి గోలకొండ నవాబునకు నిచ్చి

నటుల గానరాదు. ఇందులకు గారణమేమో తెలియదు. మరి యే విధముననో నవాబును, మాదన్న గారిని సమాధాన పఱచి యుండును. అట్లు సమాధాన పరుపనియెడల నవాబును మాదన్న గారును శివాజీతో నాతని మరణము వరకును సఖ్యముతో నుండుట సంభవింపదు. ఈసంగతి యాలోచింపక యింగ్లీషు చరిత్రకారులు శివాజీ నవాబును నన్యాయముగా మోసపుచ్చెనని వ్రాసియున్నారు. కాని, వారి వ్రాత లెంత మాత్రము నమ్మదగినవి కావు.

పదునాలుగవ ప్రకరణము

అస్తమయము

ఔరంగజేబు విజాపురమువారితో మైత్రి చేసి చేసి తుదకు వారిరాజ్యమును నపహరింపవలయు ననెడు దుర్బుద్ధి కలవాడై శత్రుభావమును వహించి దిలేర్ ఖానుననెడు సైన్యాధిపతిని విజాపురము మీాదికి బంపెను. విజాపుర రాజ్యమునకు మంత్రియైన మసావుద్ ఖానునకు ఈ వృత్తాంతము తెలిసినందున నేమియు జేయుటకు దోపక, యాతడు శివాజీయొద్దకు దూతను బంపి సహాయము వేడెను. అందులకు శివాజీ యిట్లు ప్రత్యుత్తర మంపెను. 'మేము మొగలులతో ప్రత్యేకముగా బోరాడిగాని, లేక వారిరాజ్యములో గ్రామాదులను గొల్లకొట్టిగాని, వారు మీాతో యుద్ధముచేయుట మాని తిరిగి వచ్చునటుల జేసి మీాకు సహాయము చేయుదుము, మీారు భయపడవలదు.'

వెంటనే శివాజీ పన్హాళా యొద్ద గొప్ప సైన్యమును కూర్చుకొని విజాపురమునకు బయలుదేరెను. గాని కొంత దూరము పోయిన తరువాత మొగలుల ప్రచండసైన్యముతో దన చిన్నసైన్యము నిలిచి పోరాడ జాలదని తలచి, జాలనా బాద్ చాత్ నా మొదలయిన గ్రామాదులను దోచుకొని

బోయిన మొగలులు విజాపూరు ముట్టడి విడిచి స్వరాజ్య రక్షణార్థమై వచ్చెదరని యెంచి, శివాజీ యటు తిరిగెను. భీమానదిదాటి గోదావరినది వరకు మొగలుల రాజ్యమంతయు గొల్లగొట్ట సాగెను. ఈ వార్త మొగలుల సేనాధిపతి యగు దిలేరుఖానునకు దెలిసినను నాతడు విజాపూర్ ముట్టడి విడిచి రాడయ్యె. అందుపై శివాజీ గోదావరీనది దాటి జార్నాకు బోయి యా పట్టణ సమీపమందున్న ఔరంగబాదులో బాదుషాకొమారుడయిన మొఆజీం ఉన్నప్పటికి భయము లేక యా పట్టణమును మూడు దినములు వరకును దోచుకొనెను. పట్టణములోని ధనము గలస్థలములన్నియు ద్రవ్వించి యపార సంపత్తిని వడసెను. ఆ ధనమంతయు దీసికొని పోవుచుండగా మొఆజీం పదివేల సైన్యమును మరాఠా వారి మీదికి బంపెను. సంగమనెర్ వద్ద నుభయ సైన్యములకు ఘోర యుద్ధంబు జరిగె. సంతాజీ ఘోరపడె అను సేనాని తొందరపడి మొగలుల మీదికి నకాలముననే పోయినందున పరాజితుడై వెనకకు రావలసిన వాడాయెను. తన సైన్యములు వెనుకకు వచ్చుట చూచి శివాజీ 'యోడకుడి ఓడకుడి' అని పలుకుచు తనయొద్ద నున్న సైనికులను వెంట దీసికొని వెనుక నుండి ముందు వచ్చి మొఆజీం వచ్చుచున్న కనుమయొక్క ద్వారము నొద్ద గొప్ప సైన్యముతో వేచియుండెను శత్రు సైన్య మెచ్చుట జూచినను చిన్న చిన్న గుంపులు గుంపులు గూడి యధికము గాజొచ్చెను. ఇక శత్రువుల చేతినుండి తప్పించుకొనుట యెటులనని శివాజీ విచారించుచుండగా

నా పర్వత ప్రదేశములు బాగుగ నెరింగిన యొక మార్గదర్శి మరాటా సైన్యములను మారు త్రోవం దీసికొనిపోయి శత్రువులకు తెలియకుండ పటాయను దుర్గమునకు జేర్చెను. చేత జిక్కిన పులి దప్పించుకొనిపోయెను గదా యని హతాశులై మొగలులు ఔరంగబాదునకు మరలి పోయిరి. అంత శివాజీ మోరోపంతు పేష్వాను బిలిపించి పటాసమీపమున నున్న యితర దుర్గములను సాధింపు మని చెప్పగా నాతడు నిరువదియారు క్రొత్తదుర్గములను సంపాదించెను.

శివాజీ పటా దుర్గముమీద నుండగా విజాపూర్ మంత్రి యగు మసాఉద్ ఖానుని యొద్దనుండి ఇట్లు వర్తమానము వచ్చెను. 'మా పట్టణ మింకను దిలేరుఖానుడు ముట్టడించి యున్నాడు. పంతము వేసికొని ముట్టడి లేపడయ్యె. ఇప్పుడు మీరన్యవిచారము చేయక వచ్చి మమ్ము గాపాడవలయును'. ఈ వార్త యందినతోడనే శివాజీ విజాపురమునకు బయలు దేరెను. కాని త్రోవలో నాతనికి దన కుమారుడైన సంభాజీ పారిపోయి మొగలుల సైన్యములోనికి వెళ్ళి దిలేర్ ఖానుని నాశ్రయించియున్నాడనిన దుఃఖవార్త తెలిసినందున, నాతడు సైన్యమిచ్చి హంబీరరావును విజాపురమునకు బంపి తాను బన్హాళా దుర్గమునకు పోయెను.

శివాజీకి నిద్దరు భార్యల వలన నిద్దరు పుత్రులు పుట్టిరి. పెద్దభార్యయగు సయీబాయివలన సంభాజీ; చిన్నభార్యయగు సోయెరాబాయి వలన రాజారాము. వీరిద్దరు తాను స్థాపించిన మహారాష్ట్రమును గాపాడి, గోబ్రాహ్మణ సంరక్షణము చేసి

హిందూమతమును స్థాపింపవలయునని యిచ్ఛగలవాడై శివాజీ తన కుమారులను సద్విద్యగరప యత్నించెను. వ్రాతయు చదువును మల్లవిద్యయు, నశ్వారోహణంబును బాణ సంధాన ప్రకారంబులును, శస్త్రయుద్ధంబును వారికి నేర్పెను. ఉత్తమ వృద్ధసేవకుల యొక్కయు, శ్రేష్ఠ పండితుల యొక్కయు సహవాసములో వారిని నుంచెను. సజ్జన సహవాసమే చేయవలయును. నీచులను, దుష్టులను దుర్వ్యసనము గలవారిని నొద్ద జేరనియ్యగూడదు. వాండ్రవలన గులమును రాజ్యంబును నాశము జెందునని బోధించుచు, రావణ దుర్యోధనాదికుల కథలను గుమారులకు జెప్పుచుండెను. వారికి వ్యవహారము తెలియవలయునని వారిని దనవెంట బేరోలగమునకు దీసికొని పోవుచుండెను. కాని, ఈ పరిశ్రమయంతయు పెద్దకుమారుడైన సంభాజీయందు నిరర్థకంబయ్యె. ఈరాజపుత్రుడు పుట్టినప్పటి నుండియు క్రూరుడు మూర్ఖుడును అయియుండె. ఈతడు రెండుసంవత్సరముల వయస్సు గలవాడై యున్నప్పుడితని తల్లి ౧౬౫౯ లో మృతి జెందినందున, జిన్ననాటినుండియు నొకరి యాజ్ఞలో నుండక తుదకు దండ్రినిగూడ నతిక్రమింప జొచ్చె. ఒకనాడు రాజభవనమందు పేరంటమునకు ననేక స్త్రీలు రాగా సంభాజీ యొక బ్రాహ్మణ వనితను బలాత్కారముగా స్పర్శించెను. బ్రాహ్మణులను దేవతలవలెను, పరస్త్రీని తల్లివలెను జూచినట్టి శివాజీకి ఈ వార్త తెలియగా నాతడు మిక్కిలి కోపగించి 'పూర్వజన్మమున నేమిపాపము చేసినందు

ననో యిట్టిపుత్రుఁడు గలిగెను; పుత్రుఁడైననేమి కఠినముగా శిక్షించెద' నని పలికెను.

తండ్రి తన్ను గఠినముగా శిక్షించు నని యెంచి సంభాజి కొందఱు సేవకులను వెంటదీసికొని మొగలుల సైన్యాధిపతి యైన దిలేరుఖానుని యొద్దకు వెడలిపోయెను. తమశత్రువైన శివాజీయొక్క కుమారుఁడు తండ్రితోఁ బోరాడి తనయొద్దకు వచ్చినందులకు దిలేరుఖాన్ సంతసించి సంభాజిని గౌరవించి యాతనికి గొప్ప వేతనమేర్పరచి తనయొద్దనుంచుకొనెను. సంభాజిని మరాటావారికి రాజుగా నేర్పరచి మరాటా వారిలో వారికి నంతఃకలహములు కలుగునటుల జేసి శివాజీ నోడింపవలయు నని యా దిలేర్ ఖాను తలచి, సంభాజికి మరాటావారి రాజని పేరుబెట్టి, కొంతసైన్య మిచ్చి సంభాజిని మరాటావారిదుర్గ మగు భూపాలగడము గెల్చుటకు బంపి యీ వార్త నౌరంగజేబునకు దెలిపెను. సంభాజి భూపాలగడమును ముట్టడించి యుద్ధము చేయ సాగను పోరాటకు వచ్చిన సంభాజి తమరాజునకు బెద్దకొడుకైన సందున నాతనితోఁ బోరాడి యాతని నొప్పించిన శివాజికి నేమి కోపము వచ్చునో యని తలచి దుర్గముమీఁదివారు దుర్గమును విడిచివెళ్ళిరి. రెండవదినము సంభాజి దుర్గముమీఁదికి నెక్కి యక్కడ నున్న కొలఁది జనంబుల బట్టి కొందరకాళ్ళును, గొందరచేతులును నరకించెను. ఇట్లు దుర్గము స్వాధీనమైన తరువాత గూడ దన క్రూరత్వమును జూపి సంభాజి దిలేరుఖానుని యొద్దకు బోయెను. అటు శివాజీ పన్హాళాగడము చేరి యొకదూతను దన

పుత్రునియొద్దకు బంపి యిట్లు చెప్పించెను. నేనుజన్మ మంతయు గష్టపడి సంపాదించిన రాజ్యమంతయు మీకొరకు గాక మఱి యెవరికొరకు! మాకు దినదినము వార్ధక్యము వచ్చు చున్నది. ఈరాజ్యమంతయు బాలించు భారము మీది. అటుల జేయక శత్రువులలో గలసి మనరాజ్యము శత్రువుల కియ్యవచ్చునా! మొగలులను విడచి వచ్చినయెడల మీఖర్చు నిమిత్తము మీరడిగిన తాలూకా యియ్యగలము,”

అటు విజాపురమువారికి సహాయముచేయుటకు హంబీర రావు వెళ్లుచుండగా నాతనిని మొగల సరదారుడగు రణ మస్తఖాన్ తొమ్మిదివేల గుఱ్ఱపురాతులతో నెదిరించెను. మరాటా వారిచే బరాభూతులై మొగలులు నలుదిక్కులకు బారిరి.అంత హంబీరరావు దిలేర్ ఖానుని సైన్యములకు నెచ్చట నుండియు వస్తుసామగ్రి చేరకుండ జేసెను. అందుచే మొగలుల శిబిరములో రూపాయికి నరసేరు ధాన్యమైనను దొరకక పోయెను. గుఱ్ఱములు ఏనుంగులు మేతలేక చావజొచ్చెను. అయినను దిలేర్ ఖానుడు ముట్టడిలేవడయ్యె. తుదకుధాన్యపు గింజ యొకటియు లేదనితెలిసి దిలేర్ ఖానుడు ముట్టడిలేపి దేశము దోచుకొనుటకు గర్ణాటమునకు వెళ్ళెను. కాని కర్నా టకములో శివాజీ యుంచివచ్చిన జనార్దన్ పంతు దిలేర్ ఖానుని పరాభవింపగా నాతడు తననివాసస్థలమునకు బోవలసిన వాడాయెను. (౧౬౭౯)

మారాటావారికి దక్షిణమున నెక్కడజూచిన నక్కడ జయము కలిగినటుల నుత్తరమునను గలిగెను. ఖానదేశములో మోరోపంతు పేష్వా అనేక దుర్గములను సాధించెను.

తండ్రిచే బంపబడిన చారుడుచెప్పిన మాటలవలన బుద్ధితెచ్చుకొని, సంభాజి మోగలుల శిబిరమునుండి గుప్తముగా వెడలి తండ్రియొద్దకు వచ్చెను. వచ్చిన కుమారునకు శివాజీ యెన్నియో బుద్ధులుచెప్పి యాతని నెక్కడికి బోనియ్యకుండ పన్హాళాదుర్గముపై భద్రముగా నునిచి తాను రాయగడమునకు వెళ్ళెను. (౧౬౭౯)

మోగలులు విజాపురమును ముట్టడించినప్పుడు శివాజీ చేసిన సాహాయ్యమునకై మసాఉద్‌ఖాన్ శివాజీకి కోసల ప్రాంతమును బల్లారిప్రాంతమును నిచ్చివేసెను. మఱియు ద్రవిడదేశములోని తంజావూరు ప్రాంతమునకును శహాజి సంపాదించిన జాగీరునకును స్వామిత్వము శివాజీ నిచ్చెను. శివాజీకిని విజాపురమువారికిని నప్పుడు గొప్ప సఖ్యముజరగి శివాజీ విజాపురమునకు వెళ్ళినప్పుడు మసావుద్‌ఖాన్ స్వయముగా నెదురు వచ్చి యొంతయు గౌరవించెను, (౧౬౭౮)

తంజావూరు ప్రాంతముయొక్క స్వామిత్వము శివాజీకి గలిగినందున నాతనితమ్ముడగు తంజావూరు రాజయిన వెంకోజీ శివాజీకి సామంతుడయ్యెను. ఇట్లగుట వెంకోజీకి నిష్టము కానందున నాతనికి హృద్రోగము గలిగెను. ఇదియు గాక శివాజీని వెంకోజీమీఁదికి దీసికొని వచ్చిన రఘునాథ నారాయణుడు శివాజీచే నచ్చట నధికారిగా నియమింపబడినందున

నాతనికి వెంకోజికిని నెప్పుడును నేదియో కలహము కలుగు చుండె. ఈ కలహము శివాజీయొద్దకుబోగా నాతనికి రఘునాధనారాయణుని మాటలే నిజమని తోచుచుండె. అందుచే వెంకోజీకి తాను పేరికి రాజునని తోచి యౌదాసీన్యము గలిగెను. ఆతడు రాజ్యకార్యములను జూడక ఉదాసీనవృత్తి గలవాడైయుండె. ఈ వార్త తెలిసి శివాజీ తన తమ్మునికి బోధప్రదంబయిన యీ క్రిందియుత్తరంబు బంపె;-

"వ్రాయుటకు గారణమేమనగా బహుకాలమునుండి మీయొద్దనుండి యుత్తరము వచ్చినదికాదు. అందుచే మాకెంతయు జింతగానున్నది. రఘునాధపంతువ్రాసిన యుత్తరము వలన మీరౌదాసీన్యవృత్తిని వహించినట్టు తెలిసినది. మీ కేపదార్థమును గురించి యిచ్ఛలేదట; శరీర సంరక్షణము చేసికొనరట; మీ సైన్యమును నూరక కూర్చుండ బెట్టినారట; మీరు రాజ్యకార్యము లేమియుజూచుటలేదట ; బైరాగి వేషము ధరించి యే పుణ్యక్షేత్ర మందైన గాలక్షేపము చేయవలయు నని తలంచుచున్నారట ! ఈ వార్త విన్నప్పటినుండి మాకేమియు దోచుటలేదు. మన తండ్రియైన శహాజీ రాజుగారి యుదాహరణము మీ కనుల యెదుట నుండగా మీరిట్లు చేయుట యాశ్చర్యముగానున్నది. ఎన్ని సంకటములు వచ్చినను ధైర్యము వదలక పరాక్రమము చూపి వారఖండకీర్తిని సంపాదించినారు. ఈ సంగతులు మీకు దెలిసినవే. మేము వేరుగా జెప్పనక్కరలేదు. తండ్రిగారి సహవాసము మీకు నధికముగా లభించినందున వారి బుద్ధివైభవము మీరు పలుమారు

చూచియున్నారు. మే మెన్నియో సంకటములు గడచి యీ
హిందూరాజ్యమును స్థాపించిన సంగతి మీకు దెలిసినదే. ఇన్ని
సంగతులు మీకనుకూలముగనుండగా, సంసారమును త్యజించి
సన్యాసి యగుటయు, మంత్రులకే రాజ్యమంతయు నప్పగించి
ధనమంతయు వారి నపహరింప నిచ్చుటయు, రాజ్యమును శరీ
రమును గృశింప జేయుటయు మీవంటి సుజ్ఞులకు దగునా?
ఇదెట్టి తెలివి? మేము మీకు దండ్రికి మారుగానుండి మీ సం
రక్షణ జేయుటకు సిద్ధముగా నున్నాము. మా వలన మీకు
గీడు కలుగునని యెంత మాత్రము శంకింపవలదు. ఇక మీ
రౌదాసీన్యమును బరిత్యజింపుము. బైరాగివేషము ధరింపవలదు.
సాంసారికకృత్యములను జరుపుచు నానందముగా గాలక్షేపము
జేయవలయును. పండుగలు మొదలయిన మహోత్సవము
లన్నియు బూర్వమువలెనే జరుపవలయును. రాజకార్యములను
స్వయముగా జూచుచు, సైన్యములను యుద్ధమునకు సిద్ధముగా
నుంచి, మంత్రి మొదలయిన యందరు సరదారులవలన వారి
వారి పనులను చేయించుచుండవలయును. తండ్రిగారి వలె
ప్రతిష్ట సంపాదింపవలయును. మీ కీర్తిని మేమెంతయు సంత
సింప గలవారము. రఘునాథపంతు మీకు సమీపమునందే
యున్నారు. వారు మీకు గ్రొత్తవారు కారు. మీకు తోప
నప్పుడు వారు మంచి సలహా చెప్పగలరు. నన్ను జూచినటుల
వారిని జూడవలయును. ఇంతకు మీకు జెప్పవలసినది యేమ
నగా — సోమరితనమును విడిచి సైన్యమువలన దగిన పనుల
గొనవలయును. ఇది పరాక్రమములు చూపవలసిన వయస్సు.

ముసలితనమున సన్యాసి కావచ్చును. కాన ధైర్యము నవలంబించి, నడుముకట్టి పరాక్రమము చూపి, మాకు సంతోషము కలుగ జేయుడి. సుజ్ఞుల కథకము వ్రాయనక్కఱలేదు."

పై యుత్తరము వ్రాసిన కొన్నిరోజులకు, రాయగడము మీద నుండగా శివాజీకి మోకాటిమీద గడ్డ పుట్టి మిగుల బాధ కలుగజేసెను. ఏడు దినములవరకు జ్వరము విడిచినది కాదు. అప్పుడు తాను బ్రదుకనని తోచి, శివాజీ తన మంత్రుల నందరను బిలిచి యొద్ద గూర్చుండ బెట్టుకొని యిట్లు ముచ్చటించెను.

"మేము శ్రీ భవానికృపచేత హిందూసామ్రాజ్యమును స్థాపింపగలిగితిమి. యవనులవలన గోబ్రాహ్మణులకు గలుగు బాధను దొలగించితిమి. ఇన్నిరోజులు శ్రీ భవాని మాసేవ నంగీకరించెను. ఇక నాకు నాయుర్మర్యాద పూర్తి యైనది. మామనస్సులోని కోరిక లన్నియు బూర్తియైనవి. గాని యొక చింతమాత్రముతీరినదికాదు. మేము పోయినతరువాత మారాజ్య మెవ్వరు రక్షింపగలరు! పెద్దకుమారుడు దుష్టుడు; రెండవ కుమారుడు చిన్నవాడు. మేము పోయినతరువాత విజాపురము, జింజి మొదలయిన నవాబులు తల లెత్తగలరు. ఔరంగజేబు దక్షిణమునందలి రాజ్యము లన్నియు గెలుచుటకు యత్నించును. అయినను ముందు జరుగబోవుసంగతుల కిప్పుడు చింతించిన నేమిఫలము! ఇన్నిరోజులు రక్షించినభవానియే యికముందు రక్షింపగలదు. మీరందరు నేకభావముతో నుండి స్వరాజ్యమును, స్వమతమును రక్షింపుడి. శ్రీభవాని

మీకు జయము గలుగజేయును." ఇట్లుజెప్పి పరాక్రమతేజో రాశియగు శివభానుబింబము ఆదివారము అయిన ఏప్రిల్ (౧౬౮౦) తేదీని రెండుజాముల కస్తమించెను!

పృథ్వీతలమందు జన్మించిన ప్రతిభాపరాక్రమశాలు లని పేరొందిన, కీర్తిశేషులయిన మహానుభావులలో శివాజీయొక్కడని చెప్పుటకు సందేహములేదు. అత్యంత హీనదశయందుండిన మావళేలను, మరాటీవారికి శౌర్యధైర్యంబులు బుట్టించి, వారి సాహాయ్యంబున మహారాష్ట్రరాజ్యంబను క్రొత్తరాజ్యంబు నిర్మించె. ఇటు విజాపుర, గోలకొండ నవాబులను, అటు ఢిల్లీశ్వరుండైన ఔరంగజేబును (దయ్యంబులవలె) నదివర కున్న హిందూరాజ్యంబులనే మ్రింగవలయు నని యత్నించుచుండ; వారిని ముసరి నడుమనే క్రొత్తరాజ్యంబు నిర్మించె! తన సైన్యంబులోడి పారగాజూచి తానుస్వయముగా ముందువచ్చి పారెడువారికి ధైర్యమిచ్చి యపజయమును జయముగా మార్చె. తనబలంబును నెదుటిబలంబునుజూచి, తగు రీతిగా మెలంగుటయందు ధీనిధి యనిపించుకొనియె. ఎంత గొప్పయాపద వచ్చినను నధైర్యపడకదానినిమించినయుక్తిని విచారించితప్పించుకొనియె. దళము నడుపుటయందును, వ్యూహము పన్నుటయందును, శత్రువులను మోసపుచ్చుటయందును జయము ప్రాప్తించినపుడు శత్రువులను దరుముటయందును, బరాభవము గలిగినప్పుడు తనసైన్యమునకు నధికనష్టము లేకుండ తొలగించి తీసికొనిపోవుటయందును, నసమానప్రజ్ఞ కలవా

డని ఖ్యాతివడసె ! అట్టి శివాజీ యద్వితీయశూరరత్నంబనుటకు సందియంబు లేదు.

శివాజీయొక్క మరణవార్త వినగానే, యాతని జన్మశత్రువైన ఔరంగజేబిట్లనియెనట ! 'శివాజీ గొప్పసేనానాయకు డనుటకు సందేహము లేదు. మేము దక్షిణములో రాజ్యములన్నియు ముంచుచుండగా నాతం డొక్కడుమాత్ర మసామాన్యసాహసంబు జూపి క్రొత్తరాజ్యంబును స్థాపించెను. నేటికి బందొమ్మిది సంవత్సరములనుండి మా సైన్యము లాతనితో బోరాడుచుండినను నాతని రాజ్యము దినదిన మభివృద్ధియే యగుచు వచ్చెను'

అలెగ్జాండరు, సీజరు, నెపోలియన్ మొదలైన సేనానాయకులకంటె శివాజీ యధికుడని చెప్పుటకు సందేహము లేదు. అలెగ్జాండరు మొదలయినవారు శివాజీకంటె నధిక సైన్యములను నడిపిరి అధిక ప్రదేశములను జయించిరి, కాని వాండ్రు సేనానాయకత్వము వహించువరకు దేశములను జయించుటకు గావలసిన సాధనములన్నియు సిద్ధముగా నమర్చియుండెను. శివాజీయో క్రొత్తగా నన్నిసాధనములను సమకూర్చుకొని యుద్ధమునకు బయలుదేరెను. కూటికి గుడ్డకు లేని మావళేలాతని సైనికులు, మహారాష్ట్రుల స్వాతంత్ర్య మదివరకు నెన్నియో వందల సంవత్సరముల క్రిందట నడుగంటి తురకల సేవచేయుటకొరకే తమ్ము నీశ్వరుడు సృజియించెనని వారనుకొనుచుండిరి. శివాజీయొక్క సొంతతండ్రియు నాతనికి ననుకూలుడు కాడయ్యె ! ఇట్లు పరిస్థితి యంతయు బ్రతికూలముగా

నున్నను, దన ధైర్యసాహసప్రతిభలచే నూతన మరాటరాష్ట్రంబును సృజియించిన శివాజీ నసమాన సేనాని యనుటకు సందియంబు లేదు.

స్వదేశాభిమానంబును, స్వమతాభిమానంబును పరస్త్రీలయెడ మాతృభావము మొదలయిన యుత్కృష్ట సద్గుణంబులు శివాజీయందు వాసము చేయుచుండెను.

ఇక బరదేశస్థులైన చరిత్రకారులు శివాజీ యందున్నవనిన దుర్గుణములను గురించి కొలదిగా వ్రాసి ముగించెదము. మోసము మూఢదైవిక విశ్వాసము నను రెండు దోషములు ముఖ్యముగా, శివాజీయందారోపింపబడును. మోసము చేయుట దోషమని చెప్పుటకు సందేహము లేదు. కాని మోసగాండ్రను మోసపుచ్చుట దోషమైనది, దోషముకానిది యిది మిద్ధమని నీతిశాస్త్రజ్ఞులు నిర్ణయించియుండలేదు. ఇది యొకప్పుడైనను నిర్ణయింపబడునని చెప్పుటకు వీలులేదు. ఏలయన నిట్టిచర్చ యెప్పుడు వచ్చినప్పటికి గొందరొక యభిప్రాయంబును సమర్థించుటయు, మరికొందరు తద్విరుద్ధాభిప్రాయంబు సమర్థించుటయు దటస్థించును. ఊరు దోచుకొనుటకు బోవుచున్న దొంగలగుంపునకో నసత్యమాడి తప్పుత్రోవజూపి వారిని రక్షకభటులకు నప్పగించుట నీతియో, యనీతియో యెవరు గట్టిగా జెప్పగలరు? జనక్షేమంబే ముఖ్యముగా దలచువారు దీనిని నీతియనియే చెప్పుదురు. జనక్షయకరంబైనను రూత్యసత్యంబె పరమంబని యెంచువారిది యనీతియని వాదిం

తురు. రాక్షసాధ్యక్షుండును, వర్ణనీయదాతయు నగు బలిచక్రవ ర్తి యిట్లు చెప్పెను.—

క. మేరువు తలక్రిందైనను,
పారావారంబు లింకబారిన లోలో
ధారుణి రజమై పోయిన
దారాఖ్యము బద్ధమైన దప్పక యిత్తున్'

నీతివిశారదుండును, రాజకార్యకుశలుండును నైన కృష్ణుడిట్లనియె—

'ఆ. ప్రాణహాని వచ్చు పట్టున సర్వధ
నాపహారవేళ యందు నడపు
సత్య మనృతమం డ్రసత్యంబు సూనృత
మని పరిగ్రహింతు రార్యజనులు.'

హిందూదేశములోని యిఙ్గ్లీషురాజ్యములకు గూటస్థుడని చెప్పదగు క్లైవుదొరగారిట్లు వ్రాసియున్నారు.—

'ఒట్టుసత్యంబులను లక్ష్యపెట్టని దుర్మార్గులతో వ్యవహరించునప్పుడు మనముమాత్రము ఒట్టు సత్యములచేత మనలను బంధించుకొని వాండ్రకున్నదియున్నటుల బూసగ్రుచ్చినటుల జెప్పుచుండుటయు, వాండ్రుమాత్ర మొకమాటయైనను మనకు జెప్పక, చేసెదమనిన పనులలో నొక్కటియు జేయకుండినను మనము మాత్రము వాండ్ర కిచ్చెద మనిన వరంబు లన్నియు నిచ్చుట యిట్టి ప్రవర్తనముచే నేనెప్పుడును శత్రువునుజయింపనేరను.'

మెకాలే దొరవారు రాజకీయ వ్యవహారము నందేమి, సామాన్య వ్యవహారమునందేమి సత్యమే ప్రధానము అని శాసించిరి.

ఇట్టి లోకులు, పండితోత్తములు భిన్నరుచులై యున్నవారు. సత్యవాదులతో నసత్యమాడవలయునని యెవ్వరును చెప్పరు. అసత్యవాదులతో నసత్య మాడవచ్చుననియు, మోసగాండ్రను మోసపుచ్చవచ్చుననియు కొందరు సిద్ధాంతీకరించెదరు. శివాజీ శత్రువులందరును నసత్య ప్రవీణులును, మోసగాండ్రునునై యుండిరి. జయసింగు, తానీషా, విజాపురపు మసాఉద్‌ఖాన్ మొదలైన కొలది తురుష్కులు మాత్రము శివాజీతో నిష్కపటముగా బవర్తించుచుండిరి. వారితో మరల శివాజీ కపటము లేకయే వర్తించుచుండెను. అఫ్జల్‌ఖాన్ ఔరంగజేబు మొదలైన వాండ్రందరును మోసగాండ్రు. వాండ్రతో నటులనే ప్రవర్తించెను. శివాజీయొక్క ప్రవర్తనంబులోని రహస్యం బిదియె.

ఇక మూఢ దైవిక విశ్వాసమును గురించి విచారించెదము. శరీరమునందు భవానీదేవి ప్రవేశించి భవిష్యత్తును జెప్పు నన్న సంగతులయందు శివాజీకి నమ్మక మున్నమాట నిజమే. కాని, పురాతన కాలపువారిని మనము వారి ధర్మ మతములకై నిందించుట న్యాయముకాదు. మనము నమ్మజాలని సంగతులింకొకడు నమ్మినంతమాత్రముచేత నాతడు నిందకు బాత్రుడు కాడు. వేరువేరు పరిస్థితులలో నుండువారి నమ్మకములు వేరువేరుగా నుండవచ్చును. ముత్యాలమ్మ పోలేరమ్మ మొద

లయిన క్షుద్రదేవతల బూజించువాండ్రు శివకేశవుల బూజించువారికి బిచ్చివారుగా గాన్పించుచున్నారు. శైవ వైష్ణవమతంబులు, ఏకేశ్వరుల మను బ్రాహ్మసామాజికులకు విచిత్రంబుగ నుండు. బ్రాహ్మసామాజికు లవాఙ్మానసగోచరుండగు సృష్టి మోక్షయాదికారణంబునందు దయాదాక్షిణ్యము మొదలైన మానవగుణంబు లారోపించి తమచెవుల కింపైనవాద్యములు మందిరములో వాయించుచు నాటకములోని సూత్రధారునివలె గానముచేసి ప్రార్థనచేయుట యస్వాభావిక మనియు విగ్రహాధానముకంటె పెద్ద విగ్రహారాధన మనియు స్పెన్సరీయ (Herber. Spencer) యజ్ఞేయవాదులు(Agnostics)చెప్పానారు. ఒక్కొకరిమతంబు ఒకొకరికి నసమ్మతంబు లగుట స్వాభావికంబు ఇంతమాత్రముచే నొకరినొకరు నిందింపగూడదు. మైసమ్మను బూజచేయువారిలో సజ్జనులు లేరా? ఇంతయేల? నాస్తికులలోను సజ్జనులు లేరా? బ్రాడ్లావంటి మహాత్ముం డరుదు గదా! కాన, నందరకును మతద్వేషాభావంబు (Religious Tolerance) ఉండవలయును. కాన మతవిశ్వాసములను గురించి శివాజీని దూషించుటకు మనకు నధికారము లేదు.

సమాప్తము.

Printed for K. Vinayaka Rao, T. P. No. E-46, Copies 1000,
at Abhyudaya Press, [redacted] Bezwada.